వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 13 సంచిక : 5 హైదరాబాద్ 166 మే 2015 పేజీలు : 68 రు. 20

- ఆలేరు, శేషాచలం ఎన్‌కౌంటర్ హత్యలు: రెండు రాష్ట్రాల్లోనూ ఒకటే 'పోలీసు రాజ్యం'
- అమ్మకానికి ఆంధ్రప్రదేశ్ రెండో అంకం
- జీవించే హక్కును హరిస్తున్న భూసేకరణ
- ఊరటనివ్వని పదవ పిఆర్‌సి
- హాషింపురా తీర్పు - మరోసారి హత్యాకాండ
- యెమెన్‌పై సామ్రాజ్యవాద యుద్ధక్రీడ

కాకతీయ విశ్వవిద్యాలయం

స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ లర్నింగ్ & కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్

విద్యారణ్యపురి, వరంగల్-506 009 ఫోన్:0870-2438877, 2438899, 2461492

దూరవిద్య BA/B.Com (Gen&Computers) కోర్సులకు ప్రవేశార్హత పరీక్ష - 2015

ప్రవేశార్హత పరీక్ష తేది:31-05-2015 (ఆదివారం): సమయం : ఉ॥ 11:00 గం॥ల నుండి మ॥ 1:00 గం॥ల వరకు

ఏ విద్యార్హతలు లేకున్నను, తేది 30-06-2015 నాటికి 18 సం॥లు నిండి ప్రవేశార్హత పరీక్షలో ఉత్తీర్ణులైనవారు బిఏ/బికాం (జనరల్ & కంప్యూటర్స్) 2015-16 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి అర్హులు. 2012 నుండి 2014 వరకు గతంలో నిర్వహించిన అర్హత పరీక్షలలో ఉత్తీర్ణులైన వారు లేదా ఇంటర్మీడియేట్, తత్సమాన కోర్సు పాసైనవారు ప్రవేశార్హత పరీక్ష వ్రాయకుండానే నేరుగా ప్రవేశం పొందవచ్చును.

దరఖాస్తు ఫారమును మరియు అన్ని వివరాలకు ప్రాస్పెక్టస్‌ను వెబ్‌సైట్ www.sdlceku.co.in నుండి డౌన్‌లోడ్ చేసుకోగలరు లేదా అధ్యయన కేంద్రాల నుండి పొందగలరు.

మొదటిపద్ధతి : దరఖాస్తు ఫారం డైరెక్టుగా అధ్యయన కేంద్రం నుండి పొంది పూర్తి చేయవచ్చును.

రెండవ పద్ధతి : దరఖాస్తు ఫారంను Website (www.sdlceku.co.in) నుండి Download చేసుకొని పూర్తి చేయవచ్చును.

దరఖాస్తు ఫారాల విక్రయం మరియు డౌన్‌లోడ్ ప్రారంభం: 13-4-2015

పూర్తి చేసిన దరఖాస్తు ఫారాల స్వీకరణకు చివరి తేది : 15-5-2015

పై విధంగా పూర్తిచేసిన దరఖాస్తు ఫారముతోపాటు రూ॥200/- డి.డి.ని "రిజిస్ట్రార్, SDLCE కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ పేరిట వరంగల్‌లో చెల్లింపు పద్ధతిపై SBH/SBI/Andhra Bankలలోతీసి మరియు ఎస్సీ / ఎస్టీ అయినచో తత్సంబంధిత సర్టిఫికెట్ జిరాక్స్ కాపీ జతచేసి ఏ అధ్యయన కేంద్రంలో పరీక్ష రాయదల్చుకొన్నరో ఆ అధ్యయన కేంద్రంలోగాని, కేంద్ర కార్యాలయంలో స్వయంగా అందజేసి వెంటనే Hall Ticket పొందగలరు. అధ్యయన కేంద్రాల లిస్టు ప్రాస్పెక్టస్‌లో పొందుపరచబడింది. కేంద్ర కార్యాలయానికి ప్రతి ఆదివారం & ప్రతినెల రెండవ శనివారం సెలవుదినములు.

Note : ఏ కేంద్రంలో పరీక్ష వ్రాసినప్పటికీ SDLCEలోని ఏ కేంద్రంలోనైనా అడ్మిషన్ పొందవచ్చును.

No.479/DP/SDLCE/KU/15, Date:10-04-2015

ప్రొఫెసర్ సిహెచ్. దినేష్‌కుమార్, డైరెక్టర్

ISSN 2231-6892

166

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

ఏప్రిల్ 2015
సంపుటి : 13
సంచిక : 5

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ఎస్.తిరుపతి; నల్గొండ – జి. వెంకటేశ్వర్లు; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎం. రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్.

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; ప్రకాశం – కర్ణ హేమసుందర రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **డక్కన్ ప్రెస్ / చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 20	రు. 20
సంవత్సరం	రు. 240	రు. 200
మూడు సంవత్సరాలు	రు. 600	రు. 540
ఐదు సంవత్సరాలు	రు. 1000	రు. 900
పది సంవత్సరాలు	రు. 2000	రు. 1700

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపేవారు మాత్రమే బ్యాంక్ స్లిప్‌లపై 'veekshanam' అని రాసి వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

వీక్షణం చేస్తున్న కృషి పదికాలాల పాటు కొనసాగాలనే ఆకాంక్షతో మూలనిధికి 2015 ఏప్రిల్ నెలలో వచ్చిన విరాళాలు - డి. సుబ్రమణ్యం, గుడ్‌గావ్- రు. 5,000; పి. అరుణాచలం, హైదరాబాద్ - రు.1000; వకుళాభరణం రామకృష్ణ, హైదరాబాద్ - రు. 1,000; జె. ఎల్. రెడ్డి, ఢిల్లీ - రు. 20,000 దాతలందరికి కృతజ్ఞతలు. - సం.

వీక్షణం మార్చ్ సంచికలో బైరెడ్డి సతీష్ రాసిన 'కమ్యూనిస్టులకు అధికారం ఇచ్చిన గ్రీస్' వ్యాసంలోని విషయాలు తప్పు అని త్రిపురనేని హనుమాన్ చౌదరి ఏప్రిల్ సంచికలో ఉత్తరం రాశారు. ఈ ఉత్తరంలోని సమాచారం ఎక్కడ సేకరించారోగాని తప్పులు, అబద్ధాలు రాశారు. సిరిజా కూటమిలో ఫాసిస్టు గోల్డెన్ డాన్ భాగస్వామి కాదు. అధికారంలోకి వచ్చాక సిరిజా గోల్డెన్‌డాన్ మద్దతుదారులతో ఘర్షణ పడుతూనే ఉంది. సిరిజా కూటమి ప్రధానంగా వామపక్ష సంస్థల, గ్రీన్ పార్టీల కూటమి. సిరిజా ప్రభుత్వంలో ఐక్య సంఘటన ఏర్పరిచింది ఇండిపెండెంట్ గ్రీన్ పార్టీతో. ఇండిపెండెంట్ గ్రీన్ జాతీయవాద పార్టీ, సిరిజా కాదు.

- నరేంద్రమోహన్,
ఆస్ట్రేలియా

వీక్షణం ఏప్రిల్ సంచికలో కేంద్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు 2015-16 కి ప్రవేశపెట్టిన బడ్జెట్ పై సంపాదకీయం, ఎ, నర్సింహారెడ్డి, వి. హనుమంతరావు, ఎన్. వేణుగోపాల్, డా. శ్రీనివాస్ చొప్పర, చిమ్మె జాన్ బర్నబాస్‌ల విశ్లేషణ వ్యాసాలు బాగున్నాయి. మొత్తం మీద కేంద్ర, రాష్ట్ర పాలకులు పేద ప్రజల సంక్షేమానికి ఉపయోగపడే పథకాలు, సబ్సిడీలపై కోతలు విధించి కార్పొరేట్ల సేవలో తరిస్తున్నారనే సారాంశం అర్థమయింది. బడ్జెట్ విషయాలను వివరించే, ప్రణాళికా వ్యయం, ప్రణాళికేతర వ్యయం, సుంకాలు, రాయితీలు, ప్రత్యక్ష పన్నులు, పరోక్ష పన్నులు, పెరుగుదల రేటు వంటి ఆర్థిక భాష పదజాలం కఠినంగా ఉంది. వీటిని కొన్ని ఉదాహరణలతో సులభంగా అర్థమయ్యే విధంగా వివరిస్తే బాగుంటుంది. అలాగే అనేక సందర్భాల్లో చైనా ఆర్థికంగా మనకంటే అభివృద్ధిలో ముందుంది అనే విషయాన్ని ఆర్థిక విశ్లేషకులు ఉదహరించారు. ఇదే విషయాన్ని ఏ కారణాల వల్ల చైనా మనకంటే ముందుందో కొంత వివరణాత్మకంగా కొన్ని పేజీలు ఎక్కువైనా సరే వివరిస్తూ రాస్తే బాగుంటుంది.

- పి. రవిందర్‌రెడ్డి,
భువనగిరి

నేను, 'హిజ్రా' వ్యాసంలో, ముగ్గురు డాక్టర్ల పేర్లు చెప్పి, ఆ పేర్ల చివర 'గారు' అనే గౌరవ సూచికలు వాడాను. వాటిని మీరు తీసేశారు. పత్రికల వారు, 'గారు' అనే మాట, అచ్చు తప్పుల వల్ల 'గాడు'గా పడే ప్రమాదం జరగవచ్చని, 'గారు'ని తీసేస్తున్నారు. అంత చిన్న మాటని అచ్చు తప్పు లేకుండా చూడలేరా? కొన్ని సందర్భాల్లో 'గారు' లేకపోతే బాగుంటుందా? అయినా నేను, కంపోజైన వ్యాసాన్ని, అచ్చు తప్పులన్నీ చూసిన తర్వాత పంపించాను. ఇదేగాక ఇంకో మార్పు చేశారు. 'ఇంగ్లీషు' అని నేను రాసిన పదాన్ని 'ఇంగ్లిషు' అని మార్చారు. ఈ మధ్య పత్రికల్లో ఇలాగే చేస్తున్నారు. ఇంగ్లీషు వాళ్లు ఆ మాటని ఎలా పలుకుతారో అలాగే చెయ్యాలను కుంటున్నారు. అలాగైతే, వాళ్లు దాన్ని 'ఇంగ్లిష్' అంటారు గానీ, 'ఇంగ్లిషు' అనరు. A అనీ, B అనీ, 2 భాషల్ని తీసుకుందాం. A భాష పదాల్ని, B భాషలో పలకాలంటే, B భాష పద్ధతులే పాటించాలి. అలాగే, B భాష పదాల్ని A భాషలోకి మార్చినప్పుడు కూడా! 'సైకిల్'ని తెలుగులో 'సైకిలు' అంటాం. 'రైల్'ని 'రైలు' అంటాం. 'రోడ్'ని 'రోడ్డు' అంటాం. ఇంగ్లీషు మాట హల్లు శబ్దంతో ముగిస్తే, అదే మాట తెలుగులో అచ్చు శబ్దంతో ముగుస్తుంది. అలాగే, ఒక భాషలో ఒక అక్షరానికి దీర్ఘం లేకపోతే, తెలుగు ఉచ్చారణలో దీర్ఘం పలుకుతాం. A భాషని, B భాషలోకి మార్చేటప్పుడు, B భాషలోని ఉచ్చారణ పద్ధతులే అనుసరించాలి. ఎందుకంటే, Bలో అలాగే పలుకుతారు కాబట్టి. A భాష, Bలో కూడా A ఉచ్చారణతో ఉండదు; ఉండనక్కరలేదు. రష్యా భాషలో 'తొల్‌స్తోయ్' అని పలికే, రాసే పదాన్ని, తెలుగులో 'టాలుస్టాయి' అంటాం, అలాగే రాస్తాం. 'ఇంగ్లీషు' అనే దాన్ని, అనేక దేశాల ఇంగ్లీషులుగా చదువుతాం. అమెరికా ఇంగ్లీషు, కెనడా ఇంగ్లీషు, బ్రిటీషు ఇంగ్లీషు, ఆస్ట్రేలియా ఇంగ్లీషు - ఇలా ఆ భాషలో ఉచ్చారణ అనేక రకాలుగా ఉంటుందని చదువుతాము. చివరి మాట! రచయితలు వాడిన పదాల్లో తప్పులు ఉంటే తప్పకుండా మీరు మార్చాలీ, మార్చవచ్చు. కానీ, 'ఇంగ్లీషు' అని రాయడం తప్పుకాదు. ఇదే రైటు. ఇదే తెలుగు నియమం. ఇలాంటి విషయాల్లో, రచయితలకీ, పత్రికలకూ తేడాలు ఉండవచ్చు. రచయితలు వాడిన పదాలని అలాగే ఉండనివ్వడం న్యాయం!

- రంగనాయకమ్మ
హైదరాబాద్

వీక్షణం పత్రిక ఫిబ్రవరి, మార్చ్, ఏప్రిల్ నెలల్లో ప్రచురించిన రంగనాయకమ్మ వ్యాసంలోని మూడు భాగాలను చదివాను. నాలుగో భాగం చదవడానికి నాకే కారణమూ కన్పించలేదు. రంగనాయకమ్మ తన వ్యాసం ద్వారా ఎంత బాధ్యతారహితంగా, అతి నిస్సహాయ స్థితిలో ఉన్న కమ్యూనిటీ మీద హోమో ఫోబియాను, నిందతో కూడిన ముద్రనూ కొనసాగించి వ్యాపింపచేస్తోందో చూసి చాలా విచారం కలిగింది. వ్యాసమంతా ఆమె సాధారణ సంభాషణల ఆధారంగా రాసిందే తప్ప సరైన ఆధారాలను ఇవ్వలేదు. మనం ఏ అసహన సందర్భానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామో ఆ అసహన దుర్గంధ వాతావరణంలో ఆమె రాసిన వ్యాసంలో మరింత అసహనంతో నిండిన వీధిగుంపుల ధోరణే ప్రముఖంగా ఉంది. ఆమె ప్రముఖ రచయిత్రి, అందరూ భయపడే రచయిత్రి కావడంతో ఆమె వాదనల ఫలితంగా సెక్సువల్ మైనారిటీలు మరింత అభద్రతకు గురయ్యే అవకాశం ఉంది. అయినప్పటికీ ఆమె రచనల వల్ల కలిగిన ఆశ్చర్యం కంటే ఆ రచనను అచ్చు వేయాలనుకున్న మీ సంపాదక నిర్ణయం కలిగించిన 'షాక్' ఎక్కువని చెప్పాలి.

సెక్సువల్ మైనారిటీల హక్కులు ఇప్పుడు అంతర్జాతీయంగా కోర్టుల, అంతర్జాతీయ ఒప్పందాల, రాజ్యాంగాల అంగీకారాన్ని పొందాయి. దక్షిణాఫ్రికా రాజ్యాంగంలోని సెక్షన్ 9(3) ఇలా చెపుతుంది. 'జాతి, లింగం, సెక్సు, గర్భధారణ, వివాహస్థాయి, సాంఘిక మూలాలు, రంగు, సెక్సువల్ ఓరియంటేషన్, వయసు, వైకల్యం, మతం, విశ్వాసం, సంస్కృతి, భాష, పుట్టుక వీటిలో ఏ ఒకటిగానీ లేదా ఎక్కువ కారణాల వల్లగానీ, ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగా గానీ రాజ్యం అన్యాయంగా వివక్ష చూపరాదు' భారతదేశపు రాజ్యాంగ వివరణ కూడా ఈ దృక్పథాన్నే చెపుతుంది. సెక్సువల్ మైనారిటీల జీవించే హక్కు, స్వేచ్ఛ, గౌరవం, సమానత్వం, వివక్షారాహిత్య హక్కుల రూపకల్పన జరుగుతున్న సందర్భంలో, రంగనాయకమ్మ వ్యాసం అసహన ద్వేషాలతో నిండి ఉన్నదనీ, ఒక కమ్యూనిటీని నిందాపూరితమైన ముద్రలకు గురిచేస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లంఘిస్తున్నదనే ఒకే ఒక్క కారణంతో ఈ వ్యాసాన్ని ప్రచురించకూడదనే సంపాదక నిర్ణయం తీసుకోలేకపోవడం నన్ను బాధించింది. నిస్సహాయ స్థితిలో ఉన్న కమ్యూనిటీకి చెందిన తన జీవితం అందులోని కష్టాల గురించి అత్యంత సాహసంతో మాట్లాడిన ఒక రచయితకు వ్యతిరేకంగా చేసిన నిర్హేతుకమైన దాడి రంగనాయకమ్మ వ్యాసం.

రంగనాయకమ్మకు ఆమెవైన అభిప్రాయాలుండవచ్చు. కానీ వీక్షణం స్టీరియోటైపులను ప్రచారం చేసే వ్యాసాలను ప్రచురిస్తుందా? ముస్లింలు అబద్ధీకులనీ, టెర్రరిస్టులనీ ముద్రలు వేస్తూ లేదా అంటరానితనాన్ని హేతుబద్ధమని సమర్థిస్తూ ఆధిపత్య కులం వాళ్లు రాస్తే దానిని వీక్షణం ప్రచురిస్తుందా? నిజంగా అదీ ఇదీ ఒకటే. ఇది అసహనపు సంప్రదాయ వాదపు వీధి గుంపుల భాష.

అభ్యుదయ పత్రిక అయిన వీక్షణం సెక్సువల్ మైనారిటీల పక్షం వహించి ఏ మూల్యం చెల్లించైనా రాజ్యాంగ నైతికతను ఎత్తి చూపాలనుకోకపోవడం చాలా నిరాశను కలిగిస్తుంది.

- కల్పన కన్నబిరాన్
హైదరాబాద్

(ఏప్రిల్ సంచికలో 'జర్మనీతో శాంతి సంధి కోసం లెనిన్ చేసిన పోరాటం' వ్యాస రచయిత పరిచయం సామాజిక కార్యకర్త అని పొరపాటుగా అచ్చయింది, దీన్ని 'రిటైర్డ్ లెక్చరర్'గా చదువుకోగలరని మనవి. పొరపాటుకు చింతిస్తున్నాం. - సం)

రెండు రాష్ట్రాల్లోనూ ఒకటే పోలీసు రాజ్యం

ప్రజాస్వామిక ఆకాంక్షలను, విప్లవోద్యమాన్ని, తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలను అణచివేయడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పోలీసు రాజ్యంగా మారి, కనీస చట్టబద్ధ హక్కులను కూడ కాలరాచి పోలీసు రాజ్యంగా కుఖ్యాతి పొందింది. ఆ రాష్ట్రం రద్దయిపోయినా, అదే పోలీసు రాజ్యం అంశ రెండు రాష్ట్రాలలోను కొనసాగుతున్నట్టున్నది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావాలనే సంకీర్ణమైన ప్రజా ఆకాంక్షలో రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక కోణాలతో పాటు వికేంద్రీకృత పాలన, ప్రజలకు మరింత చేరువైన పాలన అనే ప్రజాస్వామిక అంశం కూడ ఉండింది. అది విజయం సాధించిన తర్వాత చూస్తే, ఏర్పడిన కొత్త రాష్ట్రంలో పాలన మరింత కేంద్రీకృతమవుతున్నట్టు, ఏదో ఒకమేరకు ప్రజలకు జవాబుదారీగా ఉండవలసిన రాజకీయవాదుల చేతుల నుంచి కూడ జారిపోయి పోలీసు రాజ్యంగా మారుతున్నట్టు కనబడుతున్నది. ఏ స్వయంనిర్ణయాధికారం కోసం తెలంగాణ ప్రజలు దశాబ్దాలపాటు పోరాడారో, అది తెలంగాణ ప్రజలకు దక్కిందో లేదో తెలియదు గాని, పోలీసుల అధికారం మాత్రం మరింత బలోపేతమైనట్టుంది. ఇక ఎట్లాగూ పాత ఆంధ్రప్రదేశ్ ఐదు దశాబ్దాలుగా పోలీసు రాజ్యంగానే, ప్రజలకు ఎటువంటి ప్రాథమిక హక్కులు ఇవ్వకుండానే సాగింది. ప్రత్యర్థులను, భిన్న రాజకీయ విశ్వాసాలు గలవాళ్లను, సామాజిక న్యాయం ప్రశ్నలు సంధించినవాళ్లను హత్యలు చేసింది. ఎన్‌కౌంటర్ కట్టుకథలు అల్లింది. చట్టబద్ధ పాలనను పాతిపెట్టింది. రాష్ట్ర విభజన తర్వాత కొత్త ఆంధ్రప్రదేశ్ లో ఆ వారసత్వం మరింత దుర్మార్గంగా అమలవుతున్నది.

2014 జూన్ 2 రాష్ట్ర విభజన నాటి నుంచి ఈ ఏప్రిల్ 7 వరకు రెండు రాష్ట్రాల్లోను జరిగిన చిన్నాచితకా పౌరహక్కుల ఉల్లంఘనలు ఒక ఎత్తు కాగా, ఆ రోజున కూడబలుక్కున్నట్టుగా రెండు రాష్ట్ర ప్రభుత్వాలూ, రెండు రాష్ట్రాల పోలీసు బలగాలూ సాగించిన పాశవికమైన హత్యాకాండలు చట్టబద్ధ పాలనను గౌరవించే పౌర సమాజం తలదించుకోవలసిన ఘటనలు.

తెలంగాణలో విచారణలో ఉన్న ఖైదీలను, న్యాయవ్యవస్థ రక్షణలో ఉన్న వ్యక్తులను, జైలు నుంచి న్యాయస్థానానికి తీసుకువస్తూ దారిలో కాల్చిచంపారు. అల్లిన కట్టుకథ నమ్మశక్యంగా ఉండాలన్న కనీస ఇంగిత జ్ఞానాన్ని కూడ ప్రదర్శించలేదు. చేతులకు బేడీలు, ఆ బేడీలు వాహనంలో సీటుకు కట్టివేసి ఉండడం ఫొటోల్లో స్పష్టంగా కనబడుతున్నప్పటికీ, మృతులు తుపాకి లాక్కొని పోలీసుల మీద కాల్పులు జరపడానికి ప్రయత్నించగా, ఆత్మరక్షణ కోసం జరిపిన ఎదురుకాల్పుల్లో వారు చనిపోయారని కథ అల్లారు. పోలీసులు సంవత్సరాలుగా ఉద్దేశ పూర్వకంగా ప్రచారం చేసిన ముద్ర తప్ప, ఆ ఖైదీలు నేరం చేసిన ఆధారాలు లేవు. ఇప్పటివరకూ జరిగిన విచారణ వారి నిర్దోషిత్వాన్ని నిరూపిస్తున్నది. కొన్ని వారాల్లో విచారణ పూర్తయి వారి మీద కేసు కొట్టుడుపోయే సమయంలో ఈ హత్యాకాండ జరిగింది. ముస్లిం యువకుల మీద దేశవ్యాప్తంగా సంఘపరివార్ ఎలా విషప్రచారం చేస్తున్నదో, ఆ భావజాలానికి అన్ని రాజకీయ పక్షాల్లో, అధికారవర్గాల్లో, ప్రత్యేకించి పోలీసుల్లో అనుయాయులు ఎలా ఉన్నారో అందరికీ తెలుసు. నిజంగా ఆ ఐదుగురూ నేరస్తులే అయినా, భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన జీవన స్వేచ్ఛ ప్రకారం 'చట్టం నెలకొల్పిన విచారణా పద్ధతిని అనుసరించి' మినహా మరొకరకంగా వారి ప్రాణాలు తీయడానికి వీలులేదు. కాని మృతుల మీద చేస్తూవచ్చిన అబద్ధ ప్రచారాల వల్ల వారిని చంపినా సమాజం నుంచి ప్రశ్నలు రావని పాలకులు, పోలీసులు భావించారు.

ఇక ఆంధ్రప్రదేశ్‌లో శేషాచలం అడవుల్లో ఎర్రచందనం అక్రమ రవాణాదారుల పేరుతో కూలీలను చంపడం మరింత పెద్ద కట్టుకథ. మృతులు రాళ్లతో, గొడ్డళ్లతో, తుప్పుపట్టిన రెండు నాటు తుపాకులతో తమ మీద దాడికి దిగితే సకల ఆయుధాలు ఉన్న పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపారట. రెండు చోట్ల ఇరవై మంది చనిపోయాట. అబద్ధం ఆడినా నమ్మించేటట్టుగా ఉండాలనే కనీస ఆలోచన లేకుండా, ఏమి చెప్పినా నమ్ముతారనే మితిమీరిన అహంకారంతో అల్లిన కథ ఇది. మృతులలో కొందరిని ముందురోజు నగరిలో బస్సు దింపి అరెస్టు చేశారని ఆధారాలున్నాయి. మృతుల పక్కన చూపిన, వారు కొట్టినట్టుగా చెపుతున్న ఎర్రచందనం దుంగలు అంతకు ముందే ఫారెస్టు కార్యాలయం లో ఉన్నాయని వాటి మీద ముద్రలు చెపుతున్నాయి. రెండు చోట్లా మృతదేహాలు పడి ఉన్న తీరు అసలక్కడ కాల్పులు జరిగినట్టు లేదు. నిజానికి ఆ కూలీలను నియమించిన నిచ్చెనమెట్ల వ్యవస్థలో పైన ఉన్నవారు రాజకీయ, అధికారవర్గాలలోనే ఉన్నారు.

ఈ రెండు అమానుష హత్యాకాండలూ రెండు రాష్ట్రాల్లోనూ గత పదినెలలుగా జరుగుతున్న పౌరహక్కుల ఉల్లంఘనకు, పోలీసు రాజ్యానికి కొనసాగింపే తప్ప కొత్తవి కావు. తెలంగాణలో, శరణార్థులుగా ఉన్న ఆదివాసులను బలవంతంగా ఖాళీ చేయించడం, సభలకు, సమావేశాలకు అనుమతి నిరాకరించడం, విద్యార్థుల మీద, నిరుద్యోగ యువకుల మీద, రైతుల మీద లాఠీఛార్జిలు, పాత అక్రమ కేసుల ఎత్తివేతలో అసాధారణమైన జాప్యం, కేసు కొట్టివేసి, లేదా బెయిల్ మీద విడుదలైన ఖైదీలను జైలు ముందరే మళ్లీ అరెస్టు చేయడం, నిరంతర సోదాలు, నిఘా వంటి అనేక విధాలుగా ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం రోజుల్లో కన్న ఎక్కువగా పోలీసుల కోర్కెలు తీరుతున్నాయి. పాత ప్రభుత్వ నిషేధాలు యథాతథంగా ఉన్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లో, బూటకపు ఎన్‌కౌంటర్‌తో ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసింది. సభలు అనుమతించక పోవడం మాత్రమే కాదు, సభ గురించి పత్రికా సమావేశం ఏర్పాటు చేసిన నిర్వాహకులను ముందే అరెస్టు చేశారు. దేశదేశాల పెట్టుబడిదారులను ఆహ్వానిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి 'మా రాష్ట్రంలో ఉద్యమాలు ఉండవు' అన్నారంటే ప్రశ్నించేవారి గొంతు నొక్కుతాం అని హామీ ఇచ్చారన్నమాట.

ఒక్క మాటలో చెప్పాలంటే, రెండు రాష్ట్రాల్లోనూ గతంలో కన్న ఎక్కువగా పోలీసు రాజ్యం అమలవుతున్నది. పోలీసులు తమకు విచారణాతీత, శిక్షాతీత నిరంకుశ అధికారం ఉన్నదని నమ్మే దుస్థితి రాకూడదు, పాలకులు వారికి ఆ నమ్మకాన్ని ఇవ్వగూడదు. ఇప్పుడు తెలంగాణలో హత్యకు గురైనవారు ముస్లింలు గనుక మత దురభిప్రాయాలతో మౌనం సాగుతున్నది. ఆంధ్రప్రదేశ్ లో హత్యకు గురైనవారు పేదలు గనుక వర్గ దురభిప్రాయాలతో మౌనం సాగుతున్నది. ఇవాళ ఏదో ఒక కారణంతో పోలీసు హింసను ఆమోదించి, మౌనంగా ఉంటే పోలీసు రాజ్యం అంతిమంగా ఎక్కడికి చేరుతుందో చరిత్రలో హిట్లర్ ఫాసిజం చూపింది. చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకుంటామా లేదా, కనీస ప్రజాస్వామిక పాలన కోసం గొంతెత్తుతామా లేదా అనేదే ఇవాళ రెండు రాష్ట్రాల బుద్ధిజీవుల ముందు సవాల్. వీ

'చావచంపి చెవులు మూసి భూమి లాక్కుంటాం'

రాష్ట్రాల్లో, గ్రామాల్లో, పొలాల్లో, అడవుల్లో మాత్రమే కాదు, రాజధాని దాకా సాగివచ్చి కూడ కోట్లాది మంది రైతులు తమ భూమి లాక్కోవద్దని నినదిస్తున్నా నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు, దేశదేశాల సంపన్నులకు భూమిని కట్టబెట్టే పవిత్ర కర్తవ్యం నుంచి పక్కకు పోదలచుకోలేదు. గత ఇరవై సంవత్సరాలలో వ్యవసాయ, సామాజిక సంక్షోభంలో మూడు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నా, ప్రతీకాత్మకంగా ఢిల్లీ నడిబొడ్డున రైతు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వ నేతల కళ్లు చెమర్చడం లేదు, తమ యజమానులకు తాము అందించ దలచుకున్న సేవలు ఆలస్యం అవుతున్నాయనే విచారపడుతున్నారు. అట్లని అధికార పక్షాన్ని మాత్రమే విమర్శిస్తే కూడ సరిపోదు. ఈ ఆత్మహత్యల తిలాపాపంలో తలా పిడికెడు భాగస్వామ్యం ఉంది. ఒకే అభివృద్ధి నమూనాతో రైతుల భూమి లాక్కునే పథకాలు అల్లిన, అల్లుతున్న, రైతులను ఉరికంబాలు ఎక్కించిన, ఎక్కిస్తున్న రాజకీయ పక్షాలన్నీ భూసేకరణనూ, రైతుల ఆత్మహత్యలనూ రాజకీయక్రీడగా మార్చాయి. తమ ముఠా తగాదాల ఆరోపణల, ప్రత్యారోపణలతో అసలు సమస్యను పక్కదారి పట్టిస్తున్నాయి. ఒకరు దేశాభివృద్ధి గురించి ఆలోచిస్తుంటే, మరొకరు రాజకీయ వివాదం చేస్తున్నట్టు, ఒకరు చట్టం తేదలచుకుంటే మరొకరు అడ్డుపడుతున్నట్టు, ఒకరు ఆత్మహత్యలు ఆపే దీర్ఘకాలిక పథకం ఆలోచిస్తుంటే మరొకరు అప్పటికప్పుడు ఆత్మహత్యకు పురికొల్పుతున్నట్టు ప్రతి రాజకీయపక్షమూ రసవత్తరమైన అబద్ధపు నాటకంలో తన వంతు పాత్ర పోషిస్తున్నది.

ఇంతకూ సమస్య చట్టమా, ఆర్డినెన్సా, ఆత్మహత్యా, పురికొల్పడమా, అభివృద్ధా, రాజకీయమా అనేంత చిన్నదీ, సరళమైనదీ కాదు. అది ఈ దేశ రాజకీయార్థిక పాలనా విధానపు సమస్య, సామాజిక వ్యవస్థ ఎటువైపు మారబోతున్నదనే సమస్య. అట్టడుగు మనిషికీ శ్రమకూ ఎంత గౌరవం దక్కుతున్నదనే సాంస్కృతిక సమస్య. ఈ దేశపు ఆహారభద్రత ఏమవుతుందనే సాంకేతిక సమస్య. దేశదేశాల పెట్టుబడిదారులకు మన నేలను అప్పగించడం మరే కొత్త వలసకు దారి తీస్తుందనే చారిత్రక సమస్య.

ఒకే వనరును, భూమిని వేరువేరు అవసరాల కోసం వాడవలసి ఉన్నప్పుడు, ఆ అవసరాల మధ్య ఎంపిక ఎలా జరుగుతుందనేది అధికారంలో ఉన్నవారి ఇష్టాయిష్టాలకు వదిలే విషయం కాదు. ఏదో ఒక కారణంతో, కొన్ని సంవత్సరాల కొరకు అధికారం చేపట్టినవారు, తాము అధికారం కోల్పోయేలోపల ఆ వనరును తమ ఇష్టం వచ్చినట్టుగా తమ ఇష్టం వచ్చినవరికి కట్టబెట్టాలని వెంపరలాడడం వల్ల, అందులోనూ భూమి అనే వనరుకు ఎక్కువ గిరాకీ ఉండడం వల్ల ఇవాళ దేశంలో భూసేకరణ ఇంత వివాదాస్పదమవుతున్నది. ఆ భూమి మీద, వ్యవసాయం మీద ఆధారపడిన జనాభా ఇవాళ్టికీ దేశంలో అసంఖ్యాకంగా ఉండడం వల్ల వారి జీవనోపాధికి, భవిష్యత్తుకు ముప్పు ఏర్పడుతుందని ఆందోళన కలుగుతున్నది. ప్రజాప్రయోజనం పేరు మీద అడ్డదిడ్డంగా పరిశ్రమలకు, వ్యాపారాలకు, సేవలకు, ప్రభుత్వ సంస్థలకు, 'అభివృద్ధి' పథకాలకు, గనులకు, విద్యుదుత్పత్తి కేంద్రాలకు, నీటిపారుదల పథకాలకు, రహదారులకు, విమానాశ్రయాలకు, నౌకాశ్రయాలకు లక్షల ఎకరాలను అప్పగిస్తున్నారు. అసలు ఆ పథకాలు అవసరమేనా, అవి వ్యక్తిగత ప్రయోజనాన్ని తీరుస్తాయా, సామాజిక ప్రయోజనాన్ని తీరుస్తాయా అనే చర్చే ఉండడం లేదు. అలా ఆ భూమే జీవనాధారంగా ఉన్న కుటుంబాల నుంచి, రైతుల నుంచి భూమి లాక్కుని సంపన్నులకు ఇస్తే, ఆ నిర్వాసిత ప్రజల భవిష్యత్తు ఏమవుతుందనేది అసలు ప్రశ్న.

ఈ దేశ ప్రజల గురించి ఎంతమాత్రం ఆలోచన లేని, తమ వలస ప్రయోజనాలు తప్ప మరేదీ పట్టని బ్రిటిష్ పాలకులు రైలు మార్గాలకు, కాలువలకు, పరిశ్రమలకు, గిడ్డంగులకు అవసరమైతే ప్రజల భూములను ప్రభుత్వం ఆక్రమించుకోవచ్చునంటూ *1894* భూసేకరణ చట్టం తెచ్చారు. క్రమక్రమంగా అది ప్రభుత్వ అవసరాలకు మాత్రమే కాక, ప్రైవేట్ అవసరాలకు ప్రభుత్వం సమకూర్చడంగా మారిపోయింది. ప్రభుత్వం దానికి 'సామాజిక ప్రయోజనం' అనే మేలిముసుగు అద్దడం కూడ మొదలయింది. వలస పాలనను ఎదిరించిన జాతీయోద్యమం *1947* తర్వాత అదే చట్టాన్ని సారం మార్చకుండా చిన్నచిన్న రూపపరమైన మార్పులతో కొనసాగిస్తూ వచ్చింది. వలస పాలన నాటి భూసేకరణ అవసరాలకు, 'స్వతంత్ర' పాలన అనబడేదానిలో భూసేకరణ అవసరాలకు సారాంశంలో తేడా ఉండాలనేది మరిచిపోయింది.

అలా *1947* తర్వాత భూసేకరణలో, *2000* నాటికే దాదాపు రెండు కోట్ల ఎకరాల అడవి, కోటీ డెబ్బై లక్షల ఎకరాల ఊరుమ్మడి భూములతో సహా దాదాపు ఆరున్నర కోట్ల ఎకరాల భూమి రైతుల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు వ్యాపార సంస్థలకు చేరింది. తర్వాత గడిచిన పదిహేను సంవత్సరాలలో కనీసం మరొక యాభై లక్షల ఎకరాల భూమి చేతులు మారి ఉంటుంది. ఈ వ్యవహారంలో కనీసం ఆరు కోట్ల మంది నిర్వాసితులై ఉంటారని, అందులో *75* శాతం మందికి పునరావాసం, సరైన నష్టపరిహారం దక్కలేదని ప్రభుత్వ లెక్కలే చెపుతున్నాయి.

ఈ నేపథ్యంలో భూసేకరణ, పునరావాసం, పునఃస్థిరీకరణలలో న్యాయ బద్ధమైన నష్టపరిహారం, పారదర్శకత హక్కు చట్టం (రైట్ టు ఫేర్ కాంపెన్సేషన్ అండ్ ట్రాన్స్పరెన్సీ ఇన్ లాండ్ అక్విజిషన్, రిహాబిలిటేషన్ అండ్ రిసెటిల్మెంట్ యాక్ట్) అని యుపిఎ ప్రభుత్వం *2013*లో తెచ్చిన చట్టంలో ఉన్న ఒకటి రెండు ప్రజానుకూల అంశాలను తొలగించి, మరింత కఠినమైన సవరణలతో మరొక చట్టాన్ని ప్రవేశ పెట్టడానికి ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారానికి వచ్చినప్పటినుంచీ ప్రయత్నిస్తున్నది. రాజ్యసభలో ఓడిపోయి, లోకసభలో బలం చాలక, ఆర్డినెన్సు తెచ్చి, మళ్లీ లోకసభలో చట్టం ప్రవేశపెట్టి, భూమి కావలసిన పెద్దల కోసం నానా పాట్లు పడుతున్నది. బహుశా గట్టెక్కి కొత్త చట్టం అమలులోకి కూడ రావచ్చు.

కాని భూమి మీద ప్రజలున్నారు గదా, వారి జీవనోపాధి ఉంది గదా, వారు ఎప్పుడో ఒకప్పుడు ఇంకానా ఇకపై చెల్లదు అంటారు గదా, పాలకులు అప్పుడేం చేస్తారు? ఇప్పటికే భూమి సమస్య, భూసేకరణ వివాదాలు ఎంత తీవ్రంగా ఉన్నాయంటే, ఈ సమస్య మీదనే *2013–14*లో దేశంలోని *664* జిల్లాల్లో *165* జిల్లాల్లో *250*కి పైగా వివాదాలు, ఘర్షణలు, ఉద్యమాలు జరిగాయి. ఆ ఘర్షణలు సంఘటితమైతే ఈ నాటకానికి తెర పడక తప్పదు. వీ


యెమెన్‌లో ఏం జరుగుతున్నది?

1978 నుండి యెమెన్‌ను నిరంకుశంగా పాలిస్తున్న అల్ అబ్దుల్లా సలేహ్ నియంతృత్వానికి, కుటుంబ పాలనకు, అవినీతికి వ్యతిరేకంగా 2011 లోనే ప్రజలు నిరసన గళమెత్తారు. నియంతృత్వం సరికాదని బాధ్యతాయుత ప్రభుత్వం కోసం వీధులలోకి వచ్చి పోరాడిన ఫలితంగా 2012లో సలేహ్ అధ్యక్ష పదవి నుంచి వైదొలగక తప్పలేదు. సలేహ్ ప్రభుత్వంలో ఉపాధ్యక్షులుగా ఉన్న అబిద్ రబ్ మన్సూర్ హదీ అధ్యక్షుడయ్యాడు. అల్‌కాయిదా తీవ్రవాదుల అణచివేత కోసమంటూ అమెరికా దళాలు యెమెన్ చేరుకున్నాయి. పశ్చిమాసియాలో ఒక్కో దేశాన్ని కబళిస్తున్న అమెరికా ఇప్పుడు యెమెన్‌పై కన్ను వేయడంతో సంక్షోభం మరింత తీవ్రమైంది. ప్రజాతంత్ర వ్యవస్థ కొరకు ఉమ్మడిగా అన్ని గిరిజన జాతులు మత భేదాలకు అతీతంగా పోరాడవల్సిన సమయంలో యెమెన్ అంతర్యుద్ధానికి, అశాంతికి దారితీయడం ఒక చారిత్రక విషాదం. ఆధిపత్యం కోసం వివిధ శక్తుల సాయుధ పోరుతో యెమెన్ సంక్షోభంలో చిక్కుకుపోయి నెత్తుటేర్లకు నిలయమైంది. ఆనాడు 'మల్లెల విప్లవాన్ని' పీక నులమడంలో కీలకపాత్ర పోషించిన శక్తులే ఇప్పుడు యెమెన్‌లో నెత్తురుటేర్లు పారిస్తున్నాయి. ఉత్తర యెమెన్‌లో షియా మైనారిటీ తెగ జైదీలకు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు గత ఫిబ్రవరిలో యెమెన్ రాజధాని నగరం సనాను చేజిక్కించుకోవడంతో అధ్యక్షుడు హదీ అక్కడి నుంచి పరారై రియాద్‌లో ప్రత్యక్షమయ్యాడు. అరబ్బు దేశాల అండతో తానే అధ్యక్షుడినంటున్నాడు. ఈ అంతర్యుద్ధానికి, అక్కడున్న సామాజిక, ఆర్థిక అసమానతలే ఆజ్యం పోస్తున్నాయి. ఉత్తర యెమెన్‌కు ఇచ్చే ఇంధన సబ్సిడీలకు కోత పెట్టబోతున్నట్టు గత ఆగస్టులో అధ్యక్షుడు హదీ ప్రకటించాకే హౌతీ తిరుగుబాటుదారుల విజృంభణ పెరిగింది. అది చివరకు ఉధృతమై అతని పదవీ భ్రష్టత్వానికి దారితీసింది. సంపద పంపిణీలో, వనరుల వినియోగంలో సాగుతున్న వివక్షపై యెమెన్‌లో తీవ్ర అసంతృప్తి ఉంది. సౌదీ సౌజన్యంతో స్థానిక తెగల నాయకులను లోబర్చుకుని ఈ అసంతృప్తిని తుంచేద్దామని అమెరికా చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. యెమెన్‌లో ఇరాన్ అనుకూల షియా ప్రభుత్వం ఏర్పడడం సౌదీ కూటమికిససేమిరా గిట్టదు. ఉత్తర యెమెన్‌ను దిగ్బంధించిన హౌతీ మిలిటెంట్లు ఆయుధాలను అప్పగించేంత వరకూ యుద్ధ విమానాలతో బాంబులు కురిపించాలని అరబ్ లీగ్ తన శిఖరాగ్ర సదస్సులో నిర్ణయించుకుంది. హౌతీలకు ఇరాన్ సైనికంగా మద్దతు ఇస్తోందని సౌదీ కూటమి దేశాలు ఆరోపిస్తున్నా, ఇరాన్ నేరుగా యెమెన్‌లో జోక్యం చేసుకోగల స్థితిలో లేదు. గిరిజన తెగల మధ్య ఎప్పటి నుంచో అధిపత్య పోరు సాగుతున్నది. వీటికి తోడు ఉత్తర యెమెన్‌లోనూ, దక్షిణ యెమెన్‌లోను వేర్పాటు వాద ఉద్యమాలు సాగుతున్నాయి. అబ్దుల్లా సలేహ్ హౌతీ తిరుగుబాటుదారులకు అండగా ఉంటే సౌదీ సైనిక బలగాలు అల్‌కాయిదా తిరుగుబాటుదారులతో జతకడుతున్నాయి. యెమెన్ సంక్షోభ పరిష్కారానికి కావల్సింది అంతర్గత రాజకీయ పరిష్కారమే కానీ, వెలుపలి నుంచి మిలటరీ దాడులు కాదు. ఈ చిన్న దేశం మీద ఈజిప్ట్, బహ్రెయిన్, కువైట్, కతార్, జోర్డాన్, సూడాన్‌లతో కూటమి కట్టి సౌదీ మార్చ్ 26 నుంచి బాంబులు కురిపిస్తున్నది. ఈ దాడుల్లో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ కూటమికి అమెరికా తన సంపూర్ణ సహకారం ప్రకటించి ఆ నిప్పును మరింత ఎగదోస్తున్నది. ప్రజాస్వామ్య ఆకాంక్షలను చిదిమేస్తున్న ఈ పోరుకు యెమెన్ ప్రజలే సత్వరం సరైన రాజకీయ పరిష్కారం కనుగొనాలి.


– ఎ. నర్సింహారెడ్డి



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎన్‌కౌంటర్ ఆపరేషన్‌పై అరుణ్ ఫెరీరా కార్టూన్



❖ **కె.వి.ఆర్. సామాజిక వ్యాసాలు** – కె.వి.ఆర్., శారదాంబ స్మారక కమిటీ – 748 పేజీలు, 1/8 డెమీ, రు. 300, ప్రతులకు : డా. ఎస్. రామకృష్ణ శాంతి నర్సింగ్ హోం. నిర్మలా కాన్వెంట్ ఎదురుగా పటమట, విజయవాడ – 520 010, ఫోన్ : 98490 83137



❖ **అడవిలో వెన్నెల** – కథలు – బి.ఎస్. రాములు – విశాల సాహిత్య అకాడమి ప్రచురణ – 404 పేజీలు, 1/8 డెమీ, రు. 295, ప్రతులకు :విశాల సాహిత్య అకాడమి, 201, సులేఖ గోల్డెన్ టవర్స్ 2-2-186/53/5, రామకృష్ణనగర్ బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్ – 500 013; ఫోన్ : 08331 966987




❖ **శ్రీశ్రీ జనరంజని** – కూర్పు : సింగంపల్లి అశోక్‌కుమార్ – శ్రీశ్రీ సాహిత్య నిధి ప్రచురణ – 32 పేజీలు, 1/8 డెమీ, రు. 50




❖ **సెబాస్ రావిశాస్త్రీ! –** శ్రీశ్రీ – కూర్పు: సింగంపల్లి అశోక్‌కుమార్ – శ్రీశ్రీ సాహిత్య నిధి ప్రచురణ – 31 పేజీలు, 1/8 డెమీ, రు. 30


పై రెండు పుస్తకాల ప్రతులకు : శ్రీశ్రీ సాహిత్య నిధి, ఎస్‌టి మారుతినగర్, విజయవాడ –520004; ఫోన్ : 9246277375; email: srisri_sahityanidhi@yahoo.com,



❖ **పోరు బాటలో ఉప్పెన పాట –** ఉప్పెన – అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రచురణ – 152 పేజీలు, 1/8 డెమీ, రు. 40, ప్రతులకు : సిపిఐ (ఎం–ఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయం, ఇ.నెం. 53-4-40/1, రామనర్సయ్య భవన్, ఎల్‌ఐసి కాలనీ ఎదురుగా, క్రీస్తురాజపురం, విజయవాడ – 8; సిపిఐ (ఎం–ఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయం, మార్క్స్ భవన్, 658, విద్యానగర్, 7వ లైన్, హైదరాబాద్ – 500 044




❖ **నీవున్నావు నీ పాటా ఉంది** (కానూరి సంస్మరణలో పాటా, కవిత) – అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రచురణ – 72 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు : సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, మార్క్స్ భవన్, 658, విద్యానగర్, 7వ లైన్ హైదరాబాద్ –44, ఫోన్ : 040-27607884




❖ **రంది –** తెలంగాణ కత 2013 – సంపాదకులు: సంగిశెట్టి శ్రీనివాస్, స్కైబాబ – సింగిడి తెలంగాణ రచయితల సంఘం ప్రచురణ – 200 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు : ప్రముఖ పొయ్యిల దుకాన్లు, సంగిశెట్టి శ్రీనివాస్, ఇంటి.నెం. 13-6-434/బి/38, హిమగిరి ఎవెన్యూ, ఫ్లాట్ నెం. 305, మెహదీపట్నం రింగ్ రోడ్, హైదరాబాద్ – 500 008, ఫోన్ : 9849220321




❖ **రజనీగంధ –** కవిత్వం – పాపినేని శివశంకర్ – 108 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు : శ్రీశ్రీ ప్రింటర్స్ 28-10-26/1, మసీద్ స్ట్రీట్, అరండల్‌పేట్, కారల్ మార్క్స్ రోడ్, విజయవాడ – 520 002; విశాలాంధ్ర బుక్ హౌస్; నవోదయ బుక్‌హౌస్




❖ **చెరగని సంతకం** – కవిత్వం – గోపగాని రవీందర్ – శ్రీ ప్రచురణ – 109 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: గోపగాని రమణశ్రీ, 9-76/2, ఫకీర్‌గుట్ట, ఉట్నూర్, ఆదిలాబాద్ – 504311; సెల్: 8897070552



❖ **ద్రవాధునికత** – డా. పాపినేని శివశంకర్, నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ – 102 పేజీలు, 1/8 డెమీ, రు. 70, ప్రతులకు : నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్టు) హైదరాబాద్ – 500068; email :navachethanaph@gmail.com




❖ **ముడిమనిషి** – మరికొన్ని కథలు (1974-79) అరుణతార కథలు – సంకలనం: పరుచూరి సుబ్బయ్య – చరిత ప్రచురణ – 96 పేజీలు, 1/8 క్రౌన్, రు. 30



❖ **చేపలు** – మరికొన్ని కథలు (1979-82) అరుణతార కథలు – సంకలనం: పరుచూరి సుబ్బయ్య – చరిత ప్రచురణ – 96 పేజీలు, 1/8 క్రౌన్, రు. 30


పై రెండు పుస్తకాల ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్; మైత్రి బుక్‌హౌస్, విజయవాడ




❖ **ది ప్రిజన్స్ వి మేక్: సైలెన్సింగ్ డెమోక్రసీ – క్రిమినలైజింగ్ డిస్సెంట్** – కమిటీ ఫర్ ది డిఫెన్స్ అండ్ రిలీజ్ ఆఫ్ డా. జి.ఎన్. సాయిబాబా – 52 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు: జి. హరగోపాల్ (చెయిర్ పర్సన్), ఇ.నెం. 1-8-284/ఒయు/263, ఒయు కాలనీ, షేక్‌పేట్, హైదరాబాద్ – 500006



❖ **స్టోలిపిన్ అభివృద్ధి నిరోధక కాలంలో...** – విప్లవ రచయితల సంఘం ప్రచురణ – 31 పేజీలు, 1/8 డెమీ, రు. 15, ప్రతులకు : డి.వి. రామక్రిష్ణారావు, ఎంఐజి-14, ఎపిఐఐసి కాలనీ, కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి, హైదరాబాద్ – 500 040; అన్ని ప్రముఖ పుస్తక షాపుల్లో



❖ **తెలుగు భాష – కొన్ని సంగతులు** – వి. చెంచయ్య – విప్లవ రచయితల సంఘం ప్రచురణ – 40 పేజీలు, 1/8 డెమీ, రు. 15, ప్రతులకు : వి. చెంచయ్య, 'సాహితీ నిలయం', 10-40-15ఎ/1, జనతాపేట నార్త్, కావలి – 524 201; ఫోన్: 08626-242277; సెల్: 94406 38035; email:chenchaiah.sahitinilayam@gmail.com;



❖ **ఒక మాట – ఒక సంభాషణ** – షహీదా కవిత్వం – విప్లవ రచయితల సంఘం ప్రచురణ – 144 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు : పాణి, 50-348, ఎల్ 19, బి-2, అరోరా నగర్, బి క్యాంప్, కర్నూల్ – 2; అన్ని ప్రముఖ పుస్తక షాపుల్లో

విచారణలో ఉన్న ఖైదీల హత్యాకాండ

తమ అదుపులో నిరాయుధంగా, సంకెళ్లతో ఉన్న ఖైదీలను అమానుషంగా కాల్చిచంపి, ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లిన తెలంగాణ పోలీసు దుర్మార్గం గురించి సివిల్ లిబర్టీస్ మానిటరింగ్ కమిటీ నిజనిర్ధారణ నివేదిక

వరంగల్ జిల్లా జనగామ, నల్లగొండ జిల్లా ఆలేరుల మధ్య ఏప్రిల్ 7న ఎన్‌కౌంటర్ జరిగిందని, తాము వరంగల్ జైలు నుంచి విచారణ కోసం హైదరాబాద్ తీసుకువస్తున్న ఐదుగురు విచారణలో ఉన్న ఖైదీలు ఆ ఎన్‌కౌంటర్‌లో మరణించారని పోలీసులు ప్రకటించారు. ఈ ఘటనపై నిజానిజాలు విచారించడానికి సివిల్ లిబర్టీస్ మానిటరింగ్ కమిటీ నియమించిన నిజనిర్ధారణ బృందం ఏప్రిల్ 12 – 14 మధ్య ఘటనా స్థలాన్ని సందర్శించింది. సంబంధిత పోలీసు అధికారులను, మృతుల కుటుంబ సభ్యులను, స్థానిక ప్రజలను కలిసి వాస్తవాలు సేకరించింది. లతీఫ్ మహమ్మద్ ఖాన్, న్యాయవాదులు డి సురేష్ కుమార్, మందాకిని, గ్రీష్మ, మహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్, ఏశాల శ్రీనివాస్, కనీజ్ ఫాతిమా, చరణ్ కెఎస్‌లు ఈ నిజనిర్ధారణ బృందం సభ్యులు.

ఘటన వివరాలు

వికార్ అహ్మద్, సయ్యద్ అమ్జద్, మహమ్మద్ జకీర్, డా. మహమ్మద్ హనీఫ్, ఇజార్ ఖాన్ అనే ఐదుగురు విచారణలో ఉన్న ఖైదీలను వరంగల్ సెంట్రల్ జైలు నుంచి తీసుకొస్తున్న ఎస్కార్ట్ పోలీసులు కాల్చి చంపిన స్థలాన్ని నిజనిర్ధారణ బృందం సందర్శించింది. అది వరంగల్ – హైదరాబాద్ రహదారి మీద ఆలేరు పోలీసు స్టేషన్ పరిధిలోని టంగుటూరు గ్రామ సరిహద్దులలో కందిగడ్డ తండాకు వెళ్లే దారికి పక్కన జరిగింది. అక్కడ రోడ్డు మీద 388, 389 అని అటవీశాఖ నంబర్లు వేసిన రెండు చెట్ల మధ్య పోలీసులు బస్సు ఆపారు. ఘటనా స్థలంలో నెత్తుటి మరకలు, పగిలిన బస్సు అద్దాల ముక్కలు ఉన్నాయి. పోలీసులు రెండు వైపులా రోడ్లు మూసేశారని, ఘటన జరిగిన తర్వాత కొన్ని గంటలకు మాత్రమే తాము అక్కడికి వెళ్లగలిగామని స్థానికులు చెప్పారు.

పోలీసుల కథనం ప్రకారం, ఏప్రిల్ 7, 2015 ఉదయం 7.55 సమయంలో ఆర్ఎస్ఐ ఉదయభాస్కర్, పదహారు మంది జవాన్ల ఎస్కార్ట్ బృందం వరంగల్ సెంట్రల్ జైలుకు మినీ బస్సులో వెళ్లి, హైదరాబాద్ నాంపల్లిలోని ఏడవ అసిస్టెంట్ ఎంఎస్‌జె కోర్టులో హాజరుపరచవలసిన ఐదుగురు ఖైదీలను తీసుకుని బయల్దేరింది. దారిలో దాదాపు 10.05 సమయంలో, ఎస్కార్ట్ వాహనం టంగుటూరు గ్రామ పరిసరాల్లో ఉన్నప్పుడు మూత్ర విసర్జన కోసం బస్సు ఆపమని వికార్ అడిగాడు. మూత్ర విసర్జన తర్వాత బస్సులోకి ఎక్కుతుండగా, వికార్ నాయకత్వంలో ఖైదీలందరూ పోలీసు బృందం మీద విరుచుకుపడి, ఒక ఇన్సాస్ రైఫిల్ లాక్కున్నారు. 'మార్ సాలేకు, చోడ్నా నహీ' అని అరుస్తూ వికార్ ఆర్ఎస్ఐ ఉదయభాస్కర్ మీద, ఇతర జవాన్ల మీద కాల్పులు ప్రారంభించాడు. ఆత్మరక్షణార్థం పోలీసు బృందం జరిపిన కాల్పుల్లో ఐదుగురు ఖైదీలు మరణించారు.

మాకు తెలిసిన వివరాల ప్రకారం, ఏప్రిల్ 7న రహదారిని రెండు వైపులా రెండు కిమీ దూరం నుంచే మూసేశారు. ఐదుగురు ఖైదీలకూ చేతులకు బేడీలున్నాయి. వారిని ఇనుప గొలుసులతో సీట్లకు కట్టేసి ఉన్నారు. ఎన్‌కౌంటర్ గురించిన ఫొటోలు, వీడియోలు అన్నిట్లోనూ ఈ బేడీలు, గొలుసులు కనబడుతున్నాయి. కాల్చిచంపిన తర్వాతనే ఇన్సాస్ రైఫిల్‌ను మృతుడి చేతుల్లో పెట్టారని స్పష్టంగా కనబడుతున్నది. రైఫిళ్లు లాక్ అయి ఉన్నాయి. ఒక్క నెత్తుటి మరక కూడ లేకుండా శుభ్రంగా ఉన్నాయి. మొత్తం సంఘటనలో ఒక్కరంటే ఒక్క పోలీసు అధికారి కూడ గాయపడలేదు. బస్సు అద్దాలు పగలగొట్టి ఎదురుకాల్పులు జరిగాయని అనిపించడానికి ప్రయత్నించారు. ఎన్‌కౌంటర్ జరిగిందని చెపుతున్న స్థలం నిర్మానుష్యమైన చిట్టడివి గనుక ఖైదీ మూత్ర విసర్జన కోసం అటువంటి స్థలంలో ఎస్కార్ట్ పోలీసులు బస్సు ఆపుతారనడం అనూహ్యం. మొత్తం మీద పోలీసుల కథనం నమ్మశక్యం కాకుండా ఉంది.

మృతుల కుటుంబ సభ్యుల ద్వారా తెలిసిన వివరాలు

వికార్ అహ్మద్ తండ్రి మహమ్మద్ అహ్మద్ సివిల్ ఇంజనీరుగా గల్ఫ్ దేశాల్లో చాల సంవత్సరాలు పని చేశారు. ప్రస్తుతం పదవీవిరమణ చేసి మలక్‌పేటలో సొంత ఇంట్లో ఉంటున్నారు. ఆయనకు ఐదుగురు పిల్లలు, ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు. వికార్ చిన్నకొడుకు. కుటుంబంలో అందరూ విద్యావంతులు, జీవితంలో స్థిరపడినవారు. పెద్ద కొడుకు కూడ సివిల్ ఇంజనీరే. వికార్ బికాం చదువుకున్నాడు, 34 సంవత్సరాల వయసు. ప్రశాంతంగా ఉండేవాడు. నెమ్మదిగా మాట్లాడేవాడు. గాఢమైన మతవిశ్వాసాలు ఉండేవి. తన సమాజం గురించి ఆలోచిస్తుండేవాడు. డిజెఎస్ (దరస్గా జిహాద్ ఓ షహదాత్ – 1983 నుంచి హైదరాబాద్ లో పనిచేస్తున్న ముస్లిం ధార్మిక, సేవా సంస్థ) నిర్వహించే డిసెంబర్ 6 నిరసన ప్రదర్శనల్లో చురుగ్గా పాల్గొనేవాడు. తండ్రీ, అన్నా గల్ఫ్‌లో పనిచేసేవారు గనుక ఇంటి పనులు చూసుకుంటూ, చదువుకుంటూ వికార్ హైదరాబాద్ లోనే ఉండేవాడు.

మక్కా మసీదు పేలుళ్లు జరిగేవరకూ అంతా సజావుగానే ఉండేదని, ఆ తర్వాతనే తమ జీవితాల్లో ప్రతిదీ మారిపోయిందని వికార్ తండ్రి అన్నారు. ఆ పేలుళ్ల కేసులో మరికొందరు యువకులతో పాటు వికార్

పేరును కూడ అనుమానితుడిగా చేర్చారు. పోలీసులు ఆ జాబితాలోని యువకులను అరెస్టు చేస్తూ చిత్రహింసలకు గురిచేయడం ప్రారంభించడంతో ఆ భయానికి వికార్ బైట తిరగడం మానేశాడు. ఒకరోజు హఠాత్తుగా మాయమైపోయాడు. ఆ తర్వాత 2008 మేలో పత్రికల ద్వారానే వికార్ పేరు మళ్లీ వినబడింది. పోలీసులు వికార్ పేరును డిజెఎస్‌తో జోడిస్తూ, మక్కా మసీదు దగ్గర అమాయకుల మీద పోలీసులు జరిపిన కాల్పులకు ప్రతీకారంగా పోలీసు పికెట్ మీద జరిగిన దాడులతో తన పేరు అంటగట్టారు. ఆ తర్వాత మోడీని హత్య చేయడానికి జరిగిన కుట్ర కేసులో అహ్మదాబాద్ పోలీసులు కూడ తన కొడుకు పేరు జోడించారని మహమ్మద్ అహ్మద్‌కు తెలిసింది. తన కొడుకుకు ఏదైనా నేరంలో భాగం ఉందని తనకు తెలియదని ఆయన అన్నారు. హైదరాబాదులో నమోదైన కేసులలో విచారణ దాదాపు 90 శాతం పూర్తయిందని, అప్పటివరకు ఒక్క నేరారోపణ కూడ రుజువు కాలేదని, ఇంకో రెండు నెలల్లో విచారణ పూర్తయిపోయి, తన కొడుకు నిర్దోషిగా బైటికి వచ్చి ఉండేవాడనుకున్నామని ఆయన అన్నారు.

అలాగే తాను తన కొడుకును జైలులో కలిసినప్పుడల్లా, తనను వరంగల్ జైలు నుంచి కోర్టుకు తీసుకుపోతూ వస్తూ ఉన్నప్పుడు పోలీసులు పెడుతున్న చిత్రహింసల గురించి చెపుతుండేవాడని ఆయన అన్నారు. ఈ విషయంలో తన కొడుకు ప్రాణాలు కాపాడమని, వరంగల్ జైలు నుంచి హైదరాబాదు జైలుకు బదిలీ చేయమని ప్రభుత్వాన్ని ఆదేశించమని కోరుతూ వికార్ తండ్రి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఒక విజ్ఞాపన దాఖలు చేసుకున్నారు. కేసు విచారణ ఏప్రిల్ 1 నుంచి 10 వరకు జరుగుతుందని కోర్టు నిర్ణయించింది. తన ప్రాణానికి ముప్పు ఉందని, ఎస్కార్ట్ పోలీసులు తన మీద దుర్భాషలాడుతున్నారని, రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని, కొడుతున్నారని ఏప్రిల్ 6న వికార్ న్యాయమూర్తికి ఫిర్యాదు చేశాడని, తనను హైదరాబాదుకు బదిలీ చేయమని విజ్ఞప్తి చేశాడని ఆయన చెప్పారు. ఈ విజ్ఞప్తిని ఆమోదించిన న్యాయమూర్తి ఏప్రిల్ 7న దాన్ని విచారిస్తామని అన్నారు.

'కాని ఆ ఏప్రిల్ 7న నా కొడుకు న్యాయస్థానానికే చేరలేకపోయాడు. తన ప్రాణానికి ముప్పు ఉందని తాను అన్నమాట వాస్తవమైంది. మరొకపక్క తనను తీసుకొస్తారని మేం కోర్టులో ఎదురుచూస్తూ ఉన్నాం. వస్తాడు వస్తాడు అని చూస్తుండగా, పోలీసుల చేతుల్లో చచ్చిపోయాడనే దుర్వార్త వచ్చింది' అని వికార్ తండ్రి విచారంగా చెప్పారు. పోలీసులు అల్లినది కట్టుకథ అంటూ ఆయన, 'ఏప్రిల్ 1 నుంచీ కూడ ప్రతిరోజూ పోలీసులు వరంగల్ జైలులో ఉదయం 10, 11 గంటలకు బయలు దేరేవారు. కాని ప్రత్యేకంగా ఏప్రిల్ 7న మాత్రం వరంగల్ సెంట్రల్ జైలు నుంచి ఉదయం 8కే బయలుదేరారు. నా కొడుకును దురుద్దేశ పూర్వకంగా చంపడమే పోలీసుల లక్ష్యం అనడానికి ఇదే రుజువు' అన్నారు.

విచారణ పూర్తి కావస్తున్న సమయంలో, తనకు న్యాయం జరుగుతుందని న్యాయవ్యవస్థ మీద పూర్తి నమ్మకం ఉన్న వ్యక్తి తుపాకి లాక్కోవడానికి ఎందుకు ప్రయత్నిస్తాడని అహ్మద్ ప్రశ్నించారు. కుడిచెయ్యికి బేడీ ఉండి, అది సీటుకు కట్టేసి ఉన్నప్పుడు తుపాకీ లాక్కునే అవకాశమే లేదని ఆయనన్నారు. తన కొడుకు న్యాయవ్యవస్థ అదుపులో ఉన్నాడని, అతను సురక్షితంగా కోర్టుకు చేరేలా చూసే బాధ్యత పూర్తిగా న్యాయవ్యవస్థదేనని ఆయన అన్నారు. కనీసం ఇప్పుడైనా తన కొడుకుకు న్యాయం జరిగేలా చూసే బాధ్యత న్యాయవ్యవస్థ తీసుకోవాలని ఆయన కోరారు.

మృతులలో ఒకరైన డా. మహమ్మద్ హనీఫ్ భార్య ఇష్రత్ బాను తన భర్త వైద్యుడని, హైదరాబాదులోని వారాసిగూడలో సొంత క్లినిక్ నడుపుతుండేవారని చెప్పారు. వారికి ఒక కూతురు, ఇద్దరు కొడుకులు. 2010 జూలై 11 ఉదయం 11 గంటల సమయంలో కొంతమంది మామూలు దుస్తుల పోలీసులు ఆయన క్లినిక్‌లో జొరబడి, ఆయన ముఖం మీద నల్ల గుడ్డ కప్పి, టాటా సుమోలో ఎత్తుకుపోయారు. ఆ సమయంలో ఆయన రోగులను పరీక్షిస్తున్నారు. అక్కడ నేల తుడుస్తున్న పనిమనిషి ఆయనను అలా ఎత్తుకుపోవడం చూసిన వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేసింది. కుటుంబ సభ్యులు ఆయన కోసం అన్ని పోలీసు స్టేషన్లూ వెతికారు. ఒక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీస్ కమిషనర్‌కూ, హోం మంత్రికీ, రాష్ట్ర మానవ హక్కుల సంఘానికీ ఫిర్యాదు చేశారు. మూడు రోజుల తర్వాత, అంటే జూలై 14న ఆయనను పోలీసులు నాంపల్లి క్రిమినల్ కోర్టులో హాజరు పరిచారు. ఆయనను కలవడానికి కుటుంబ సభ్యులు చెర్లపల్లి జైలుకు వెళ్లినప్పుడు ఆయన నడవలేని స్థితిలో ఉన్నాడు. తనను విపరీతంగా చిత్రహింసలు పెట్టారనీ, తనచేత మూత్రం తాగించారని, పాదాల మడిమెల మీద కొట్టారనీ ఆయన వారికి చెప్పాడు. ఆయన మీద దేశద్రోహ కార్యకలాపాలకు పాల్పడ్డాడనీ, వికార్ అహ్మద్‌కు ఆశ్రయం ఇచ్చాడనీ నేరారోపణలు చేశారు.

తమకు వికార్ ఎవరో తెలియదని ఇష్రత్ బాను చెప్పారు. తన భర్త ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 దాకా క్లినిక్‌లో ఉండేవాడని, భోజనానికి వచ్చి పిల్లలతో సమయం గడిపి, మళ్లీ సాయంత్రం 6 నుంచి 10,11 దాకా రోగులను చూస్తూ క్లినిక్‌లోనే ఉండేవాడని చెప్పారు. ఆయన దగ్గరికి వచ్చే రోగుల్లో ఎక్కువమంది ముస్లిమేతరులే. ఆయన ఎప్పుడూ ఊరేగింపుల్లో, సభల్లో పాల్గొనేవాడు కాదు. చివరికి డిసెంబర్ 6న కూడ క్లినిక్ తెరిచి రోగులను చూస్తుండే వాడు. నిరసన దినం పాటించకుండా క్లినిక్ తెరవడం ఏమిటని ఎవరైనా అడిగితే, 'ప్రపంచానికంతా నిరసన దినం. కాని నా రోగుల సంగతో? నేను క్లినిక్‌కు వెళ్లి వాళ్లకు ఇంజెక్షన్ ఇవ్వకపోతే వాళ్లు అన్నం కూడ తినలేరు. వాళ్లు డయాబెటిక్ రోగులు' అనేవాడు. 'జనాల ఆరోగ్యాల గురించి అంత జాగ్రత్త తీసుకునే మనిషిని మోడీని చంపడానికి కుట్ర చేశాడని ముద్ర వేసి 2012లో జైల్లో తోశారు. అంతకు ముందు 2002 గుజరాత్ మారణకాండ జరిగినప్పుడు అహ్మదాబాద్ షా ఆలం శరణార్థి శిబిరంలో వైద్యశాలలో ఆయన పనిచేశాడు' అని చెప్పారామె.

హనీఫ్‌ను అహ్మదాబాద్ నుంచి 2015 మార్చ్ 9న హైదరాబాద్ చెర్లపల్లి జైలుకు తీసుకొచ్చారనీ, మార్చ్ 11న వరంగల్ సెంట్రల్ జైలులో అత్యున్నత భద్రతా సెల్ కు మార్చారనీ ఆమె చెప్పారు. విచారణ కోసం కోర్టు ఏప్రిల్ 1 నుంచి 10 తేదీలు నిర్ణయించిందనీ, ఆ రోజుల్లో వారిని ప్రతిరోజూ వరంగల్ నుంచి హైదరాబాదుకు తీసుకువచ్చి తీసుకుపోయే వారనీ, ప్రతిరోజూ ప్రయాణ సమయంలో వారిని చిత్రహింసలకు

గురిచేస్తుండేవారనీ ఆమె చెప్పారు. ఏప్రిల్ 6న కలిసినప్పుడు, ఎస్కార్ట్ పోలీసుల ప్రవర్తన వల్ల ప్రాణాలకు ముప్పు ఉన్నట్టు సందేహం కలుగుతున్నదని డా. హనీఫ్ చెప్పాడని ఆమె అన్నారు. తమ ప్రాణాలకు ముప్పు ఉందని వాళ్లు ఇప్పటికే న్యాయమూర్తికి చెప్పి ఉన్నందువల్ల, న్యాయమూర్తి కూడ అర్థం చేసుకుని ఉన్నందువల్ల తన భర్తను చెర్లపల్లి జైలుకు మారుస్తారని తాను చాల ఆశలు పెట్టుకున్నానని ఆమె చెప్పారు. ఏప్రిల్ 7న తన భర్తను పోలీసులు కాల్చి చంపారని వార్తా ఛానళ్ల ద్వారా తెలుసుకున్నాననీ, ఆ తర్వాత తమ న్యాయవాది చెప్పాడనీ ఆమె ఏడుస్తూ చెప్పింది. మృతదేహాన్ని తీసుకు రావడానికి వెళ్తున్నప్పుడు సరిగ్గా తన భర్తను కాల్చిచంపిన స్థలాన్ని కనీసం కిటికీలోనుంచి అయినా చూద్దామనుకున్నానని, కాని అక్కడ అడ్డంగా వ్యాన్ పెట్టి తమ డ్రైవర్‌ను వేగంగా వెళ్లిపొమ్మని తరిమేశారని ఆమె చెప్పారు. తాము మృతదేహం కోసం ఆస్పత్రికి వెళ్లేటప్పటికే ఆస్పత్రి అధికారులు తమ అనుమతి లేకుండానే శవపరీక్ష జరిపేశారని, పోలీసులు బలవంతంగా ఏవో కాగితాల మీద తన సంతకాలు తీసుకుని మృతదేహం ఇచ్చి, వెంటనే వెళ్లిపొమ్మని తొందరపెట్టారని, ప్రచార సాధనాల విలేఖరులు తనతో మాట్లాడడానికి ప్రయత్నిస్తే పోలీసులు వారిని అడ్డుకున్నారని ఆమె చెప్పారు. మొత్తానికి ఏదో ఒక విధంగా మృతదేహాన్ని హైదరాబాదు తీసుకువచ్చి అంత్యక్రియల ఏర్పాట్లు చేశానని ఆమె అన్నారు. మృతదేహం మీద ఎనిమిది బుల్లెట్ గుర్తులు ఉన్నాయని, ఒక బుల్లెట్ నుదుటి మీద ఒక పక్కనుంచి మరొక పక్కకు వెళ్లిన గుర్తు ఉందని, ఒక కాలు ఎముక విరిగి ఉందని, మెడమీద, వీపు మీద దెబ్బల గుర్తులున్నాయని, వీపు మీద చర్మం చిట్లిపోయి ఉందని, చంపడానికి ముందు తన భర్తను విపరీతంగా చిత్రహింసలు పెట్టినట్టున్నారని ఆమె అన్నారు. ఆయనను బస్సులోనే కాల్చి చంపారా, లేక బైట కాల్చి చంపి తీసుకొచ్చి బస్సులో పడేశారా అని ఆమె అనుమానిస్తున్నారు. వికార్ ఒకసారి కోర్టులో జడ్జితో 'నామీద నేరారోపణలున్నాయి. కాని మిగిలిన యువకులకు నాతో ఏ సంబంధమూ లేదు. దయచేసి వారిని వదిలేయండి' అని కూడ అన్నాడని ఆమె గుర్తు చేసుకున్నారు. ఇష్రత్ బాను బంధువులైన స్త్రీలు తాము కూడ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నామనీ, ఇప్పుడు హోం మంత్రిగా ఉన్న ముషీరాబాద్ తెరాస అభ్యర్థి నాయిని నర్సింహారెడ్డికి వోటు వేశామనీ, మరి ఇప్పుడాయన మౌనంగా ఎందుకున్నాడనీ ప్రశ్నించారు.

ఈ కేసులోనే విచారణలో ఉన్న మరొక ఖైదీ మహమ్మద్ జకీర్ చంచల్ గూడ జైలులో ఉండేవాడు. ఆయనను ఏప్రిల్ 6న వరంగల్ జైలుకు మార్చారు, మర్నాడు ఎస్కార్ట్ పోలీసులు ఆయనను కాల్చి చంపారు. ఆయనను హైదరాబాదు జైలు నుంచి వరంగల్ జైలుకు మార్చిన విషయం కూడ ఆయన కుటుంబానికి తెలియదు. ఆ నిరుపేద కుటుంబం ఏమీ మాట్లాడలేనంత దిగ్భ్రాంతిలో ఉంది.

చార్మినార్ సమీపంలోని మక్కామసీదులో 2007 మే 18న శుక్రవారం ప్రార్థన సందర్భంగా బాంబుపేలుళ్ల రూపంలో జరిగిన తీవ్రవాద దాడి విషయం ప్రస్తావించుకోవడం ఇక్కడ అవసరం. ఆ పేలుళ్లలో ఐదుగురు మరణించారు, వందలాది మంది గాయపడ్డారు. అయితే బాంబుపేలుళ్ల వెంటనే పోలీసు కాల్పుల రూపంలో మరొక తీవ్రవాద దాడి కూడ జరిగింది. ప్రార్థనల కోసం వచ్చినవారిమీద, పేలుళ్ల సంగతి తెలిసి తమ బంధువుల ఆచూకీ ఆందోళనతో వచ్చిన వారి మీద, సహాయ చర్యలలో పాల్గొనడానికి వచ్చినవారిమీద జరిగిన ఆ విచక్షణారహితమైన కాల్పుల్లో ఎంతో మంది మరణించారు, మరెంతో మంది గాయపడ్డారు. పేలుళ్లు జరిగిన వెంటనే కొందరు పోలీసు అధికారులు, ప్రధాన స్రవంతి ప్రచారసాధనాలతో కలిసి, ఆ పేలుళ్లు ముస్లింల పనేనని ప్రచారం ప్రారంభించారు. ఆ రకంగా ముస్లిం సమాజం మీద బాంబుల భయోత్పాతం, పోలీసుల భయోత్పాతం, ప్రచారసాధనాల భయోత్పాతం కలిసి సాగాయి. ముస్లింలు ఆగ్రహానికీ దిగ్భ్రాంతికీ గురయ్యారు. ముస్లింల రాజకీయ మత నాయకత్వాలు ఈ సంక్షోభ సమయంలో తమ బాధ్యత నిర్వర్తించడంలో విఫలమయ్యాయి. ముస్లిం నాయకత్వపు మౌనాన్ని ఆసరాగా తీసుకుని, పోలీసులు ముస్లిం యువకుల మీద తమ దాడి ఎక్కుపెట్టారు. ఆ సంక్షోభ సమయంలో సివిల్ లిబర్టీస్ మానిటరింగ్ కమిటీ మొత్తం ఘటనల మీద నిజనిర్ధారణ నిర్వహించింది, వాస్తవాలు బైటపెట్టింది. ముస్లిం యువకులను అరెస్టు చేయడం ద్వారా ముస్లిం సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేసి, వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీయడానికి పోలీసులు సాగిస్తున్న పెద్ద కుట్రకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించింది. ఆ ఉద్యమ ఫలితంగానే ముస్లిం యువకులను న్యాయస్థానం నిర్దోషులుగా విడిచిపెట్టింది. అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ ముద్దాయిలందరికీ క్షమాపణలు చెప్పి, నష్టపరిహారం ఇచ్చి, సత్ప్రవర్తనా ధ్రువపత్రాలు ఇచ్చింది.

అది అప్పటికి ముగిసిపోయినట్టు కనిపించింది గాని నిజంగా ముగియలేదు. మక్కా మసీదు బాంబు పేలుళ్లు జరిగిన రోజున ప్రతి సంవత్సరమూ నగరంలో ఏమి జరిగినా దానితో వికార్ పేరు ముడిపెట్టడం మొదలయింది. ఆయన ఆ ఆరోపణలను ఎప్పుడూ అంగీకరించలేదు. తనకు వ్యతిరేకంగా జరుగుతున్న పెద్ద కుట్రలో ఇది భాగమని ఆయన కోర్టులో ఎప్పుడూ చెప్పేవాడు. ఆ కుట్రే చివరికి ఆయన ప్రాణాలు తీసింది.

పోలీసుల పాత్ర

ఈ వ్యవహారంలో పోలీసుల పాత్ర అమానుషంగా, తీవ్రంగా అభ్యంతరకరంగా ఉంది. ముస్లిం యువకుల మీద అభూతకల్పనలతో కథలు సృష్టించడం, వారిని తీవ్రవాదులుగా చిత్రించడం హైదరాబాద్ పోలీసులకు అలవాటుగా మారింది. అలా కథలు సృష్టించి, వారిని లక్ష్యంగా చేసుకుని, పెద్దఎత్తున ముస్లిం యువకులను అరెస్టు చేయడం 1980ల నుంచీ జరుగుతున్నది. ఈ అలవాటుకు కొత్త నిదర్శనంగా వికార్ చాలకాలంగా పోలీసుల లక్ష్యంగా ఉన్నాడు. ఆయనతో మరికొంత మంది యువకుల పేర్లను జోడించి అందరినీ కలిపి చంపేశారు. వికార్ గురించిన ఆ కాల్పనిక చిత్రాన్ని పోలీసులు సృష్టించగా, ప్రచార సాధనాలు ఆ చిత్రమే ప్రజల మనసుల్లో స్థిరంగా నిలిచిపోవడానికి సహకరించాయి. దీనితోపాటు, ప్రజల మీద పోలీసు కాల్పులకు, పేలుళ్ల కేసులో ముస్లిం యువకులను అరెస్టుచేసి చిత్రహింసలు పెట్టినందుకు తాను ప్రతీకారం తీర్చుకుంటున్నానని వికార్ తమకు చెప్పాడనే కట్టుకథను కూడ పోలీసులు ప్రచారంలో పెట్టారు.

ఐదుగురు ఖైదీలనూ ఎస్కార్ట్ పోలీసులు కాల్చిచంపగానే ఆలేరు పోలీసులు మృతుల మీద సెక్షన్ 307 కింద హత్యాప్రయత్న నేరం (క్రైమ్ నం. 35/2015) నమోదు చేశారు గాని చంపిన పోలీసులమీద సెక్షన్ 302 కింద హత్యానేరం కేసు నమోదు చేయడానికి నిరాకరించారు. మృతుల కుటుంబ సభ్యులు ఎస్కార్ట్ పోలీసుల మీద హత్యానేరం కేసు నమోదు చేయమని కోరుతూ ఆలేరు పోలీసు స్టేషన్ ను అభ్యర్థించినప్పుడు కూడ వారు ఏవో సాకులు చెపుతూ ఆ కేసు మాత్రం నమోదు చేయలేదు. చట్టప్రకారం, ఒక కేసు పెట్టదగిన నేరంలో ఎవరైనా కేసు పెట్టమని ఫిర్యాదు చేస్తే పోలీసులు తప్పనిసరిగా ఎఫ్ఐఆర్ నమోదు చేయవలసి ఉంటుంది. అటువంటి కేసు పెట్టమని నిజనిర్ధారణ బృందం అడిగినప్పుడు కూడ ఆలేరు పోలీసులు నిరాకరించారు. ఆలేరు పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ పి. రాఘవేందర్ గతంలో హైదరాబాదులో మొఘల్‌పురా పోలీసు స్టేషన్‌లోనూ, స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లోనూ పని చేశారు. ఆలేరు పోలీస్ స్టేషన్‌కు ఆరు నెలల కిందనే వచ్చారు.

అంటే పోలీసులు చట్టప్రకారం పనిచేయడం లేదు. మొత్తంగా తెలంగాణ ప్రభుత్వ పోలీసులందరూ హంతక పోలీసులను సమర్థిస్తూ, వారి మీద చర్య తీసుకోకుండా తెలంగాణ ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తున్నారు.

రాజకీయ వర్గాల పాత్ర

ముస్లింలను అరెస్టు చేసినా, నిర్బంధంలో ఉంచినా, కస్టడీలో కొట్టిచంపినా, ఎన్‌కౌంటర్ల పేరుతో హత్య చేసినా పట్టించుకోకుండా ఉండడం రాజకీయ వర్గాలకు నిత్యకృత్యమయింది. ఈ విషయాల మీద మాట్లాడితే తమ హిందూ వోట్ బ్యాంక్ తరిగిపోతుందనీ, పాలకపక్షంతో తమ సంబంధాలు చెడిపోతాయనీ రాజకీయ నాయకులు అనుకుంటున్నారు. అందువల్ల ఇటువంటి విషయాల్లో చాల జాగ్రత్తగా అడుగులు వేస్తారు. రాజకీయవాదుల ఈ వివక్షావైఖరి ఐదుగురు ముస్లిం ఖైదీలను కాల్చిచంపిన ప్రస్తుత హత్యాకాండ ఘటనలో కూడ మరొకసారి స్పష్టంగా బైట పడింది. తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావు, ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ ఇప్పటివరకూ ఈ ఘటన మీద స్పందించలేదు. రాష్ట్రం పోలీసు రాజ్యంగా మారిపోయి, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఇద్దరూ పోలీసు అధికారులకు లొంగిపోయినట్టు కనబడుతున్నది. ఈ ఘటన మీద విచారణ జరపడానికి ప్రత్యేక విచారణ బృందాన్ని (ఎస్ఐటి) నియమించిన ప్రభుత్వ ఉత్తర్వులలోనే మృతులను 'తీవ్రవాద శక్తులు' అని వర్ణించడం చూస్తే ఈ బృందం హాస్యాస్పద మైనదని అర్థమవుతుంది. విచారణ ఎంత నిజాయితీగా జరుపుతారో దాన్ని బట్టే తెలుస్తున్నది.

ప్రతిపక్ష కాంగ్రెస్ కూడ ఈ విషయంలో మౌనంగా ఉండడం మేలని అనుకున్నట్టుంది. కాంగ్రెస్ ఎందుకు మౌనం వహించిందని మా కమిటీ, దిగ్విజయ్ సింగ్‌ను అడిగినప్పుడు, రాష్ట్ర కాంగ్రెస్‌కు తాము మార్గదర్శకాలు ఇచ్చామని ఆయన అన్నారు. కాని ఎన్‌కౌంటర్‌ను ఖండిస్తే తాము హిందూ వోట్లు కోల్పోతామని అనుకుంటున్నట్టు కాంగ్రెస్ సీనియర్ నాయకుల ద్వారా తెలిసింది. ఎంఐఎం, దాని మిత్రపక్షమైన ఎంయుఎఫ్‌లు జాగ్రత్తగా మాట్లాడుతున్నాయి. వాటి గొంతు శక్తిమంతంగా, నిలదీస్తున్నట్టుగా లేదు. వాళ్లు కెసిఆర్‌కు లొంగి ఉన్నారని, ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేంత బలంగా గొంతెత్తడం లేదని ప్రజలు భావిస్తున్నారు.

ప్రచారసాధనాల పాత్ర

నిజనిర్ధారణ సంఘం కలిసినవాళ్లందరూ కూడ ప్రచార సాధనాల మీద ఆగ్రహం ప్రకటించారు. తమ టిఆర్‌పి రేటింగ్ పెంచుకునేందుకు, హిందూ ప్రేక్షకులను ఆకర్షించేందుకు ప్రచార సాధనాలు మతోన్మాదాన్ని వాడుకుంటున్నాయని వారు అన్నారు. ప్రచార సాధనాలు విచారణను తమ చేతుల్లోకి ఎలా తీసుకుంటాయనీ, కోర్టు విచారణ పూర్తి కాకముందే ఒక వ్యక్తిని తీవ్రవాది అని ఎలా ప్రకటిస్తాయనీ మృతుల కుటుంబ సభ్యులు, సాధారణ ముస్లిం ప్రజలు, మేధావులు, విద్యార్థులు అందరూ ప్రశ్నించారు. ఒక ముస్లిం పేరు రాగానే తీవ్రవాది అని ముద్ర వేయడం, రాజ్యం, పోలీసులు, ప్రచార సాధనాలు ఆ 'తీవ్రవాది'ని లక్ష్యంగా చేసుకోవడం జరుగుతున్నదని వారు అన్నారు. ప్రత్యేకించి తెలుగు టివి ఛానళ్లు రోజంతా ప్రత్యేక కథనాలు సృష్టించి, తామే విచారణ జరిపాయి. ఈ మీడియా ప్రచారం వల్లనే తమ బిడ్డలను కోల్పోయామని మృతుల కుటుంబ సభ్యులు అన్నారు. వికార్ తండ్రిని ఇంటర్వ్యూ చేయడానికి టివి9 వచ్చినప్పుడు, మా ముందే ఆయన వారితో మాట్లాడడానికి నిరాకరించారు. 'టివి 9 నా కొడుకు జీవితాన్ని నాశనం చేసింది. నేను జీవితాంతం ఆ ఛానల్‌ను క్షమించలేను' అన్నారు.

న్యాయవ్యవస్థ పాత్ర

నిజనిర్ధారణలో భాగంగా మా కమిటీ మృతుల న్యాయవాదులను కూడ కలిసింది. ప్రతి సందర్భంలోనూ తమ కక్షిదార్ల ప్రాణాలకు ప్రమాదం ఉందని తాము న్యాయమూర్తులకు ఫిర్యాదు చేశామని, కాని న్యాయమూర్తులు తగినంత తీవ్రంగా పట్టించుకోలేదని న్యాయవాదులు అన్నారు. తన కొడుకు ప్రాణాలను రక్షించడానికి వరంగల్ జైలు నుంచి హైదరాబాదు జైలుకు మార్చమని వికార్ తండ్రి ప్రధాన న్యాయమూర్తిని అభ్యర్థించారు. కాని ప్రధాన న్యాయమూర్తి ఆ అభ్యర్థనను పక్కనపెట్టారు. చివరికి ఏప్రిల్ 6న స్వయగా వికార్ తనను వరంగల్ నుంచి హైదరాబాద్ జైలుకు మార్చమని, తన ప్రాణానికి ముప్పు ఉందని, దారిలో తనను ఎస్కార్ట్ పోలీసు బృందం చంపవచ్చునని న్యాయమూర్తికి లిఖితపూర్వక ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మీద ఏప్రిల్ 7న విచారణ జరుపుతానని న్యాయమూర్తి అన్నారు. ఈ ఫిర్యాదులను, అభ్యర్థనలను న్యాయస్థానాలు మొదటనే తీవ్రంగా తీసుకుని ఉంటే తమ బిడ్డల ప్రాణాలు దక్కేవని కుటుంబ సభ్యులు అన్నారు. మృతులందరూ న్యాయస్థానపు రక్షణలో ఉన్నవారు గదా, వారిని పోలీసులు చంపివేస్తే న్యాయస్థానాలు మౌనంగా ఉండడం, విచారణకు ఆదేశించకపోవడం సబబేనా అని కుటుంబ సభ్యులు అడిగారు.

నిర్ధారణలు

1. ఆలేరు ఘటనా స్థలం చట్టవ్యతిరేక హత్య జరపడానికి అనువైన స్థలంగా ఉంది. ఎన్‌కౌంటర్ అనేది స్పష్టమైన కట్టుకథ అయినా తమను ఎవరూ ఏమీ చేయలేరన్నంత శిక్షాతీత, విచారణాతీత స్థితిలో పోలీసులు ఉన్నారని ఈ ఘటన చూపుతున్నది.

2. ఈ హత్యల వెనుక ఒక పథకం, కుట్ర ఉన్నాయని, పద్ధతి ప్రకారం హత్యాకాండ జరిగిందమని అనిపిస్తుంది.
3. తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు ఈ కుట్రకు పథకం రచించారు, అమలు చేయడానికి ప్రభుత్వాధినేత ఆమోదం ఉంది.
4. సాధారణంగా వరంగల్ నుంచి ఉదయం 11కు మొదలయ్యే ప్రయాణాన్ని ఆరోజు, హత్యాకాండను త్వరగా ముగించడానికే ఉదయం 8కే మొదలుపెట్టారు
5. వరంగల్ రిజర్వ్ సబ్ ఇనస్పెక్టర్ ఎస్కార్ట్ బృందం నాయకుడు ఉదయ భాస్కర్ ఆలేరు పోలీసు స్టేషన్‌లో నమోదు చేసిన వాంగ్మూలం, ఫిర్యాదు లోపభూయిష్టంగా ఉన్నాయి. అది సినిమా ఫక్కీలో రాసిన కట్టుకథ అని స్పష్టంగా తెలుస్తోంది.
6. మృతులకు ప్రాణహాని ప్రమాదం ఉందని కుటుంబ సభ్యులు మొదటి నుంచీ అనుమానిస్తున్నారు. చివరికి ఖైదీలు కూడ తమకు ప్రమాదం ఉందని మౌఖికంగానూ, లిఖితంగానూ ఎన్నోసార్లు చెప్పారు.
7. ఈ యువకులందరినీ మక్కా మసీదు పోలీసు కాల్పులకు ప్రతీకారంగా పోలీసుల మీద దాడిచేశారనే ఆరోపణలపై 2010లో హైదరాబాదులో అరెస్టు చేశారు. మోడీని చంపడానికి కుట్ర చేశారనే గుజరాత్ కేసులో కూడ వీరిని ఇరికించారు. ముస్లిం యువకులను ఇలా కుట్ర, దేశద్రోహం కేసుల్లో ఇరికించడం, ఆ తర్వాత ఎన్‌కౌంటర్ పేరు మీద కాల్చి చంపడం మామూలై పోయింది.
8. వీరందరినీ అరెస్టు తర్వాత, జైలు నుంచి కోర్టుకు ప్రయాణంలో కూడ చిత్రహింసలకు గురిచేశారని కుటుంబ సభ్యులు చెపుతున్నారు.
9. శవపరీక్షలు జాతీయ మానవహక్కుల సంఘం నిర్దేశకాలకు అనుగుణంగా జరగలేదు. కుటుంబ సభ్యులు చెపుతున్నదాని ప్రకారం మృతదేహాల మీద చాల చిత్రహింసల గుర్తులున్నాయి. వాటిని తుడిచిపెట్టేందుకే శవపరీక్షలు త్వరగా చేయాలని ఆస్పత్రి అధికారుల మీద ఒత్తిడి తెచ్చారు.
10. విచారణలో ఉన్న ఖైదీలను చంపడంలో, శవపరీక్షలు జరపడంలో వివిధ ప్రభుత్వ శాఖలు కుమ్మక్కు అయ్యాయి.
11. ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా 2007లో మొదలైన తీవ్రవాద కార్యక్రమం ఇంకా కొనసాగుతున్నది. రాజ్యతీవ్రవాదం, హిందూత్వ తీవ్రవాదం, మీడియా తీవ్రవాదం మూడూ కలిసి ముస్లిం సమాజాన్ని లక్ష్యంగా చేసుకున్నాయి.
12. ముస్లిం యువకులను ఎన్‌కౌంటర్ పేరుమీద హత్య చేయడంలో రాజకీయపార్టీల వివక్షాపూరిత వైఖరి తేటతెల్లమవుతున్నది. శేషాచలం ఎన్‌కౌంటర్ హత్యలను ఖండిస్తున్న రాజకీయ పార్టీలు కూడ ఆలేరు బూటకపు ఎన్‌కౌంటర్ విషయంలో మాట్లాడడానికి సంకోచిస్తున్నాయి.
13. పోలీసుల పాత్ర పూర్తిగా అమానుషంగా ఉంది. పౌరసమాజాన్ని తప్పుదారి పట్టించేలా ఉంది. తాము ఇప్పటికే సెక్షన్ 307 కింద కేసు నమోదు చేశామని చెపుతున్న ఆలేరు ఎస్ ఎచ్ ఒ విచారణను పక్కదారి పట్టిస్తున్నారు.
14. ముస్లిం యువకుల మీద తీవ్రవాదుల ముద్ర వేసి ఎన్‌కౌంటర్ పేరు మీద చంపడం భారత పోలీసులకు మామూలైంది. ప్రత్యేకంగా హైదరాబాద్ పోలీసులు ఈ విషయంలో ప్రత్యేక నైపుణ్యంతో, సమర్థంగా పనిచేస్తున్నట్టున్నారు.
15. ఈ పరిస్థితిని గ్రహించడంలో ముస్లిం నాయకత్వం విఫలమైంది. ముస్లింల మీద ఈ అత్యాచారాలు, దుర్మార్గాలు తెలంగాణ ఏర్పాటువల్లనే జరుగుతున్నాయని ప్రకటించి సమాజం పట్ల తమ బాధ్యత నుంచి పక్కకు తప్పుకోదలచుకున్నారు.
16. ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావు ఈ దుర్మార్గ హత్యల పట్ల మౌనం వహించడం చూస్తే ఈ ఉద్దేశపూర్వక హత్యాకాండ ఆయనకు తెలిసే జరిగినట్టు అనిపిస్తున్నది. మోడీ ప్రభుత్వానికి దగ్గరై తన కుటుంబ సభ్యులకు మోడీ మంత్రివర్గంలో స్థానం సంపాదించడానికే ఆయన ప్రయత్నిస్తున్నట్టు అనిపిస్తున్నది. అందువల్లనే ఈ ఐదుగురు యువకుల మీద మోదీ హత్య కుట్ర ఆరోపణలు కూడ చేస్తున్నారు.
17. ప్రభుత్వ దృష్టే మతోన్మాదంతో ఉన్నదనడానికి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేక విచారణ బృందాన్ని నియమిస్తూ విడుదల చేసిన ఉత్తర్వులో 'తీవ్రవాద శక్తులు' అని వాడడమే రుజువు.
18. మీడియా బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తున్నదని, మీడియాను నడుపుతున్నవారు కనీస జర్నలిస్టు విలువలను పాటించడం లేదని సమాజంలోని సంస్కారవంతులందరూ అంటున్నారు. మృతుల మీద మీడియా సంస్థలన్నీ తీవ్రవాదులు అని ముద్రవేస్తున్నాయి. చనిపోయినవారు మాట్లాడలేరు గనుక, ఆత్మరక్షణ చేసుకోలేరు గనుక ఇది అత్యంత అమానుషమైన చర్య. ఇలా మీడియా జరిపిన విచారణ వల్లనే ఈ ఐదుగురు ముస్లిం యువకుల ప్రాణాలు పోయాయని ప్రజలు భావిస్తున్నారు. తమ బిడ్డల ప్రాణాలు పోవడానికి మీడియానే బాధ్యత వహించాలని కుటుంబ సభ్యులు అంటున్నారు.
19. ఈ ఐదుగురు యువకులు హత్యాసమయానికి న్యాయవ్యవస్థ రక్షణలో ఉన్నారు. ఒక వ్యక్తి న్యాయవ్యవస్థ రక్షణలో ఉన్నప్పుడు వారి ప్రాణాలను పరిరక్షించడం న్యాయవ్యవస్థ బాధ్యత. కాని వారు జడ్జితో ఎన్నో సార్లు మొరపెట్టుకున్నప్పటికీ, చివరికి ప్రధాన న్యాయమూర్తికి కూడ లిఖిత అభ్యర్థన పెట్టుకున్నప్పటికీ న్యాయవ్యవస్థ వారి ప్రాణాలను కాపాడడంలో విఫలమయింది. హత్యల తర్వాత పోలీసు అధికారుల మీద ఎటువంటి కేసు నమోదు చేయాలో కూడ సుప్రీంకోర్టు నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకపోవడం తీవ్రమైన లోపం.
20. ఎస్కార్ట్ పోలీసు బృందం చంపేసిన ఐదుగురు ఖైదీల మీద ఆలేరు పోలీసులు సెక్షన్ 307 కింద హత్యాప్రయత్న నేరం కేసు నమోదు చేశారు. కాని చంపిన పోలీసుల మీద మాత్రం సెక్షన్ 302 కింద హత్యానేరం కేసు నమోదు చేయడం లేదు. మృతుల మీద కేసు పెడితే వాళ్లు తమ వాదన ఎలా వినిపించుకోగలరని సాధారణ ప్రజలు అడుగుతున్నారు.

(సంక్షిప్తానువాదం. పూర్తిపాఠం కోసం
http://www.countercurrents.org/clmc190415.htm చూడండి) వీ

ఎరుపెక్కిన శేషాచలం అడవులు

కూటి కోసం పనిచేసే కూలీలను చంపి అసలైన నేరస్తులను శిక్ష నుంచి తప్పిస్తున్న ప్రభుత్వ అధికార వర్గాల చర్యలను ఎత్తిచూపుతూ, నేరస్తులతో పాలకవర్గాలు మిలాఖతు అయిన తీరును వివరిస్తున్నారు ఎం.కె. కుమార్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత గ్రామం నారావారి పల్లెకు కేవలం పది కిలోమీటర్ల దూరంలోని శేషాచల అటవీ ప్రాంతం, ఎర్ర కూలీల రక్తంతో మరోసారి ఎరుపెక్కింది. తిరుమల కొండకు వెళ్లే మరో మెట్లదారైన శ్రీవారిమెట్టు మార్గానికి రెండు కిలోమీటర్ల దూరంలో రెండు వేర్వేరు ప్రాంతాలలో 20 మంది ఎర్రచందనం కూలీలను పోలీసులు కాల్చి చంపారు. సుమారు 450 మంది కూలీలు, కొంతమంది స్మగ్లర్లతో కలసి మారణాయుధాలతో పోలీసులపై దాడులు చేశారని, ఆత్మరక్షణార్థం కాల్పులు జరపవలసి వచ్చిందని పోలీసు అధికారులు ఎన్‌కౌంటర్ కథ చెప్పారు.

పోలీసుల కథనం

పోలీసుల కథనం మేరకు 2015 ఏప్రిల్ 6న రాత్రి ఏడు గంటలకు స్మగ్లర్లు పెద్దఎత్తున ఎర్రకూలీలను అడవుల్లోకి పంపించారనే సమాచారం టాస్క్‌ఫోర్స్‌కు చేరింది. ఈ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్సు సిబ్బంది ఒక్కో బృందంలో 15 మంది చొప్పున (12మంది పోలీసులు, ముగ్గురు అటవీ సిబ్బంది) రెండు బృందాలుగా విడివడి కూంబింగ్ చేపట్టారు. 2015 ఏప్రిల్ 7న ఉదయం ఐదు గంటల ప్రాంతంలో ఈ బృందాలకు వందల సంఖ్యలో ఎర్రకూలీలు తారసపడి, వీరిపై మారణాయుధాలతో దాడులకు దిగారు. లొంగిపోవాలని పోలీసులు హెచ్చరించినా వారు వినకపోవడంతో, విధిలేని పరిస్థితుల్లో ఆత్మరక్షణార్థం పోలీసులు కాల్పులు జరిపారు. సచ్చినోడిబండ ప్రాంతంలో 11 మంది, ఈతగుంట సమీపం లోని చీకటీగల కోనలో తొమ్మిది మంది మృతి చెందారు. మిగిలిన 430 మంది ఎర్రకూలీలు దుంగలతో పారిపోగా, తొమ్మిది మంది పోలీసులకు గాయాలయ్యాయి. ఘటనా స్థలంలో మూడు గొడ్డళ్లను, రెండు నాటు తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎన్‌కౌంటర్లో పాల్గొన్న పోలీసులపై కూలీలు రాళ్లు విసురుతున్న సమయంలో గతంలో వారు అటవీ సిబ్బందిని చంపిన దృశ్యాలను తలచుకుని విపరీతంగా భయపడినట్టు మీడియాకు చెప్పారు.

అనుమానాలు

టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంఖ్యను తాజాగా ప్రభుత్వం 450 మందికి పెంచి, ఒక ఐజి స్థాయి అధికారిని వారి పర్యవేక్షణకు వేసింది. ప్రస్తుతం 50 మంది టాస్క్‌ఫోర్సు సిబ్బందికి ఎకె 47 లాంటి అత్యాధునిక ఆయుధాలతో పాటు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు, నైట్‌విజన్ గ్లాసులు ఉన్నాయి. అడవుల్లోని కీలక ప్రాంతాలైన 15 చోట్ల అమర్చిన సిసి కెమెరాలు ఉన్నాయి. సిసి కెమెరాలు సైతం వందల సంఖ్యలో ఎర్రచందనం కూలీలు శేషాచలం అటవీ ప్రాంతంలోకి ప్రవేశించారని చెపుతున్నాయి. ఈ నేపథ్యంలో కేవలం 15 మంది బృందంతోనే పోలీసులు కూంబింగ్‌కు ఎందుకు వెళ్లారు? మరింత సిబ్బందిని తీసుకెళ్లడానికి ప్రయత్నించలేదు ఎందుకు? గతంలోను (డిసెంబరు 13, 2013) ఇద్దరు అటవీ సిబ్బంది డేవిడ్, శ్రీధరరావులను ఎర్ర కూలీలు చంపేసిన నేపథ్యంలో అనవసర రిస్కును పోలీసులు ఎందుకు తీసుకున్నారు? సిసి కెమెరాలను పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు సైతం అదనపు సిబ్బందిని వారికి తోడుగా ఎందుకు పంపించలేక పోయారు? సంఘటన జరిగిన రెండు ప్రాంతాలు వాహనాలు వెళ్లే మట్టిరోడ్డుకు కూతవేటు దూరంలో ఉన్నాయి. ఈ రెండు ప్రాంతాలు దాదాపు చదునుగా ఉన్నాయి. మోకాళ్లను మించని తుప్పలు తప్పితే అక్కడ కనీసపు ఎత్తులో చెట్లు లేవు. ముఖ్యంగా చుట్టు పక్కల మూడు కిలోమీటర్ల దూరం వరకు ఒక్క ఎర్రచందనం చెట్టు కూడా లేదు.

పోలీసులు తారసపడినపుడు సుమారు 30 నుండి 45 కిలోల బరువు ఉన్న ఎర్రచందనం దుంగలను కూలీలు మోస్తున్నట్టు పోలీసులు చెప్పారు. ఆ దుంగలను మోస్తూ, పోలీసులు తారసపడిన వెంటనే పోలీసులపై రాళ్లు వేశారని చెప్పారు. ఆ ప్రదేశంలో అసలు రాళ్లు లేవు. రాళ్లగుట్టలు అంతకన్నా లేవు. మరికొందరు గొడ్డళ్లతో దాడి చేశారని, గొడ్డళ్లు విసిరారని చెపుతున్నారు. ఆ రెండు చేయడానికి వారి దగ్గర మూడు గొడ్డళ్లే ఉన్నాయి. పోలీసులు కాల్పులు జరిపిన వెంటనే నిజానికి వివేకం ఉన్న ఎంతటి యోధుడైనా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగెత్తుతాడు. ఇవి చేయకపోగా వీరావేశంతో రొమ్ముని ఎదురొడ్డి ఎర్ర కూలీలందరు దమ్ముంటే కాల్చమన్నట్టు పోలీసుల తూటాలకు ఎదురెళ్తారా? రెండు ప్రాంతాల్లోను కేవలం 10 నుంచి 16 మీటర్ల దూరంలోనే కూలీల మృతదేహాలు పడి ఉన్నాయి. వారి శవాలను ఒక క్రమపద్ధతిలో పేర్చినట్టు, వారి పక్కనే దుంగలు సైతం ఉంచబడ్డాయి. ప్రతి దుంగపై తీవ్రమైన మమకారం ఉన్నట్టు చనిపోయిన కూలీలు కాలో, చేయో వేసుకుని పడిపోయారు. చాలా దుంగలు సంవత్సరం క్రితం నాటివి. అవి బాగా ఆరి, శుభ్రంగా చెక్కి ఉన్నాయి. ఎనిమిది గంటల ముందర అడవుల్లోకి వచ్చిన కూలీలు అంత వేగంగా చెట్లను కొట్టి, దుంగలకు డ్రెస్సింగ్ చేయలేరు.

ఎర్రచందనం దుంగ నుంచి ఐదు రోజుల వరకు ఎర్ర నీరు బయటకు కొంచెం కొంచెం వస్తూనే ఉంటుంది. ఆశ్చర్యంగా కొన్ని దుంగలకు పెయింట్లు, క్రైం నెంబర్లు వేసున్నాయి. సాధారణంగా పోలీసులు రికవరీ చేసిన దుంగలకు పెయింటింగ్‌లు, క్రైం నెంబర్లు వేస్తుంటారు. అవే ఇక్కడ ప్రత్యక్షం అయినాయి. పారిపోయినా సుమారు 430 మంది దుంగలతో ఎంత దూరం పారిపోగలరు? అడవి చుట్టూరా పోలీసులు పెద్దఎత్తున మోహరించిన సందర్భంలో వీరు పారిపోవడం అసాధ్యం. ఇంతవరకు ఒక్కకూలీ, ఒక్క దుంగ పట్టుబడలేదు. పోలీసులు అడవిలోనే క్యాంపు నిర్వహిస్తున్నారు. క్యాంపు నుండి సంఘటన ప్రాంతం కేవలం

మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ముందు రోజు రాత్రి ఎనిమిది గంటలకే కూంబింగ్ చేపట్టిన పోలీసులు మరుసటి రోజు ఉదయం ఐదు గంటలకు కేవలం మూడు కిలోమీటర్లే ప్రయాణించడం మరో వింత. కనీసం ఒక్కర్ని ప్రాణాలతో పట్టుకోకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. తొమ్మిది మంది పోలీసులకు గాయాలు అయ్యాయని చెపుతున్నారు. వారంతా ఎన్‌కౌంటరు మరుసటి రోజు ఎలాంటి అలసట లేకుండా విధులను సైతం నిర్వర్తించారు. చుట్టు పక్కల గ్రామాల్లోని ప్రజలు ఘటన జరిగిన ముందురోజు అడవిలో కాల్పుల శబ్దం విన్నామని పత్రికలకు చెప్పడం అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది.

గతంలో ఫోరెన్సిక్ డాక్టర్లు పేర్కొన్న ప్రకారం దూరం నుండి కాల్పులు జరిపినట్లైతే తూటాలు వ్యక్తి శరీరానికి చేరేనాటికి వేగం నియంత్రించబడి శరీరంలోనే ఉండిపోతాయి. 10 నుండి 15 మీటర్ల దూరం నుండి కాల్చినట్లైతే తూటాలు శరీరం గుండా అతి వేగంగా దూసుకునిపోయి మరోవైపు నుండి కింద పడిపోతాయి. చాలామంది కూలీల శరీరాల్లో తూటాలు లభ్యంకాలేదు. అంటే వారిని చాలా దగ్గర నుండి కాల్చినట్టు అర్థమవుతోంది. ఆశ్చర్యంగా తూటాలు సంఘటనా స్థలంలో లభ్యం కాలేదు. సుమారు గంట నుండి గంటన్నర పాటు కాల్పులు జరిపినట్టు పోలీసులు చెపితే అక్కడ కిందపడిన తూటాలు చాలా కనిపించాలి. కాని ఆ విధంగా జరగలేదు. సంఘటనా ప్రాంతంలో తుప్పలు, చిన్న చిన్న చెట్లు చెక్కు చెదరకుండా అలాగే ఉన్నాయి. అక్కడ గంటపాటు యుద్ధం జరిగిందనడానికి ఆధారాల్లేవు. అది దాదాపు మైదాన ప్రాంతం కావడంతో కనీస సంఖ్యలో రాళ్లు కూడా లేవు. రక్తపు మరకలు అసలే లేవు. రెండు టాస్క్‌ఫోర్స్ బృందాలకు ఒకేసారి కూలీలు తారసపడడం, వారిపై కాల్పులు జరిపి రెండు ఎన్‌కౌంటర్లను ఒకేసారి ముగించడం జరిగింది. ఎక్కువ మంది కూలీల శరీరాల్లో తూటాలు ఛాతీ, కడుపు, తల భాగాల్లో తగిలున్నాయి. పోలీసుల ఆత్మరక్షణార్థం కాల్పులు జరిపితే మోకాలి కింది భాగంలోనే కాల్చాలి. వారిని చంపాలనే ఉద్దేశంతోనే కాల్చినట్టుగా తూటాల గాయాలున్నాయి. రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్షను అనుభవిస్తున్న టి.వి.భాస్కర్ నాయుడే ఈ ఎర్ర కూలీలను తన అనుచరుల ద్వారా పంపించాడని పోలీసులు ప్రకటించారు. జైలు గోడల మధ్య ఉన్న భాస్కర్‌నాయుడు జైలు అధికారులకు తెలియకుండా ఎలా స్మగ్లింగ్ చేస్తున్నాడనేది శేష ప్రశ్న. దుర్ఘటన ఉదయం ఆరు గంటలకు ముగిసి పోయినప్పటికీ, ధర్నా చేసిన పిదప మధ్యాహ్నం 12 గంటలపైనే మీడియా వారిని అనుమతించారు.

మృతుల బంధువుల ఆరోపణలు

మృతుడు పళని సోదరి లక్ష్మి, మరో మృతుడు మునుస్వామి తల్లి పద్మ మీడియా సమక్షంలోనే పోలీసులపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. తిరువణ్ణామలై జిల్లా, మురుగంబాడి గ్రామం, వేటగిరి పాలెంకి చెందిన ఎనిమిది మంది కూలీ నిమిత్తం తిరుపతికి వస్తున్న క్రమంలో వీరిని అనుమానంతో 2015 ఏప్రిల్ 6న సాయంత్రం నగరి - పుత్తూరు మధ్యలో బస్సులోనే పోలీసులు అరెస్టు చేశారని, ఒకరిని (శేఖర్) మాత్రం అరెస్టు చేయకపోవడంతో, అతను తన గ్రామంలోని పెద్దలకు చెప్పడంతో వారు లాయర్లతో మాట్లాడి తమ వారిని విడిపించే నిమిత్తం తిరుపతికి ప్రయాణమవుతున్న సందర్భంలో వారి మరణ వార్త వినాల్సొచ్చిందని వాపోయారు. ఈ విషయాన్ని పడవేడు పుదూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ మూర్తి ధృవీకరించాడు.

మంత్రుల బాధ్యతారహిత ప్రకటనలు

కేంద్రమంత్రి వెంకయ్యానాయుడు, రాష్ట్ర అటవీశాఖమంత్రి, చిత్తూరు జిల్లాకే చెందిన బి. గోపాలక్రిష్ణారెడ్డి, హోంమంత్రి చినరాజప్ప తమిళ కూలీలకు ఆంధ్ర అడవుల్లో పనేంటని, వారు ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడడానికే వచ్చారని వాదిస్తున్నారు. మూడునెలల ముందరే టాస్క్‌ఫోర్స్ ఐజి కాంతారావు తమిళనాడు ప్రభుత్వానికి లేఖ పంపుతూ, శేషాచల అటవీ ప్రాంతం నిషిద్ధ ప్రాంతమని, అందులో తమిళ కూలీలు ప్రవేశించకుండా చూసుకోవాలని హెచ్చరించినట్టు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం శేషాచల అటవీ ప్రాంతం నిషిద్ధ ప్రాంతంగా ఇంత వరకు ప్రకటించ లేదు. ఆ విధంగా ప్రకటిస్తే, సుమారు 4,756 చదరపు కిలో మీటర్ల పరిధిలో విస్తరించిన శేషాచలం అటవీ ప్రాంతంలోని గ్రామాలు, చివరకి వెంకన్న ఆలయానికి ప్రజలెవరూ రాలేరు. మరోవైపు అడవిలో 144 సెక్షన్ ఉందని, కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులివ్వాలని ప్రభుత్వానికి లేఖ రాసినట్టు పోలీసు అధికారులు సెలవిస్తున్నారు. విశాలమైన శేషాచల అటవీ ప్రాంతాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న లక్ష మంది ప్రజల జీవించే హక్కు కాలరాయబడుతుంది. ఇప్పటికే అడవిలోకి వెళ్లే ధైర్యం చాలక పరిసర గ్రామాల ప్రజలు పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు లకు వలసపోతున్నారు. సీమ నుండి నాలుగు లక్షల మంది కర్నాటక రాష్ట్రానికి వలస వెళ్లినట్టు ప్రభుత్వ గణాంకాలే చెపుతున్నాయి. బాధ్యతారహితంగా మాట్లాడకుండా ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించు కోవడానికి సిబిఐ విచారణకి ప్రయత్నిస్తేనే ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం ఉంటుంది.

హక్కుల సంఘాల వాదనలు

జాతీయ మానవహక్కుల సంఘం ఈ సంఘటనను సుమోటోగా స్వీకరించింది. సంఘటనపై సిబిఐ దర్యాప్తు, ఎన్‌కౌంటర్లో పాల్గొన్న పోలీసులపై హత్యానేరం కింద కేసు నమోదు కోరుతూ పౌరహక్కుల సంఘం హైకోర్టును ఆశ్రయించగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయాలని తీర్పు వెలువడింది. తమిళనాడు హైకోర్టులోను మృతుల బంధువులు రీ పోస్ట్‌మార్టం నిర్వహించాలని దరఖాస్తు చేసుకున్నారు. సుప్రీంకోర్టులోను ఈ ఎన్‌కౌంటర్ ఏకపక్ష కాల్పులని, ఇవి ప్రభుత్వ హత్యలని వాజ్యం దాఖలైంది. మృతుల శరీరాలు బాగా కమిలి ఉండడం, 11 మంది శరీరాలపై వట్టి కట్‌డ్రాయర్లు మాత్రమే ఉండడం, వారి దేహాలపై చిత్రహింసలకు గురిచేసినట్టు గాయాలు ఉండడం, అతి దగ్గర నుండి కాల్చినట్టు తూటాల గాయాలు ఉండడం, సాక్ష్యం లేకుండా దొరికిన అందర్నీ కాల్చి చంపడం లాంటి పలు అనుమానాల రీత్యా వారు దీన్ని బూటకపు ఎన్‌కౌంటరుగా పేర్కొంటూ, సిబిఐ చేత దర్యాప్తు చేయించాలని వాదిస్తున్నారు.

తమిళుల ఆవేదన

మరోవైపు మొత్తం 450 మంది మీద ఎఫ్ఐఆర్ నమోదు కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. 20 మంది చనిపోగా, మిగిలినవారు పారిపోయారని చెపుతూ, ప్రతి తమిళ కూలీని ఈ కేసులో ఇరికించడానికి, మరికొంత మంది కూలీల ప్రాణాలు తీయడానికి ప్రభుత్వం ఎత్తుగడ వేస్తుందని వారు నిరసనలకు పాల్పడుతున్నారు. పొరుగు రాష్ట్రంలోకి తమిళ కూలీలు అడుగు పెట్టడానికే భయపడే విధంగా ఆంధ్ర ప్రభుత్వం 20 మంది కూలీలను అన్యాయంగా చంపేసిందని వారు ఆందోళన చెందుతున్నారు. వారి ఆందోళనలను

తగ్గించే దిశగా, వారి అనుమానాలను నివృత్తి చేసే దిశగా ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విస్మయాన్ని కలిగిస్తుంది. చెన్నైలో ఆంధ్రులు భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టున్నారు. మరోవైపు ఆస్తులు కొనుగోలు చేసున్నారు. వీటికి రాబోయే ప్రమాదాన్ని ప్రభుత్వం గుర్తించినట్టులేదు.

ఆపరేషన్ క్లీన్ శేషాచలం

చంపడం ద్వారానే స్మగ్లింగ్‌ను అరికట్టవచ్చని ప్రభుత్వం బలంగా నమ్ముతోంది. నాలుగు లేయర్లుగా స్మగ్లింగ్ జరుగుతున్న నేపథ్యంలో కింది లేయర్లోని చెట్టు కొట్టి, డ్రస్సింగ్ చేసి, రోడ్డు మీదకు దుంగలను తరలిస్తూ ముఖ్యమైన భూమికను వహిస్తున్న కూలీలను చంపడం ద్వారా స్మగ్లింగ్‌ను అరికట్టాలని అనుకుంటోంది. ప్రధానమైన స్మగ్లర్లు అన్ని పార్టీల్లోను ఉండడం, వారే అసెంబ్లీలో కూర్చొని స్మగ్లింగ్‌ను ఆపాలని అరవడం ప్రజలందరూ చూస్తున్నదే. ఎన్నికల్లో ఎర్రచందనం స్మగ్లింగ్ ధనాన్ని పెద్దఎత్తున గుమ్మరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వారి జోలికెళ్లే సాహసం చేయలేదు. ఈ హత్యలను రాజకీయ హత్యలుగా పరిగణించాల్సి ఉంది. ప్రతిపక్ష పార్టీలు ఆదాయ వనరుల కోసం ఎర్రచందనం స్మగ్లింగ్‌పైనే ఆధారపడుతున్నట్టు పసిగట్టిన ప్రభుత్వం వారికి చెక్ పెట్టడానికి ఇప్పటికే గంగిరెడ్డిని ఫోకస్ చేసి, ఆ సామాజిక వర్గాన్ని భయాందోళనలకు గురిచేసి, వారిని నయానో, భయానో తమ పార్టీలోకి రప్పించడానికి, లేదా రాజకీయాలకు దూరంగా ఉండడానికి పావులు కదుపుతోంది. తద్వారా రాయలసీమలో తెదేపాను శక్తివంతమైన పార్టీగా నిలపాలని ప్రయత్నిస్తున్నారు. ఈ రాజకీయ ఎత్తుగడలకు తమిళకూలీలు పావులుగా ఉపయోగపడడమే ఇక్కడ అత్యంత విషాదం.

ఎన్‌కౌంటర్ల పరంపర

2011లో మొదలైన ఎన్‌కౌంటర్ల పరంపర మొత్తం ఎనిమిది ఎన్‌కౌంటర్లతో 31 మంది కూలీలతో కొనసాగుతోంది. చనిపోయిన వారందరూ పేదలు, దళితులు, తమిళ కూలీలే కావడం విషాదం. ఇందులో ఒక్క స్మగ్లరు లేకపోవడం యాదృచ్ఛికం కాదు. అన్ని ఎన్‌కౌంటర్ల లోను ఒక్క పోలీసుకు తీవ్ర గాయాలవ్వలేదు. 2013లో జరిగిన కూలీల దాడిలో ఇద్దరు అటవీ సిబ్బంది చనిపోయారు. దానిపై జ్యుడిషియల్ విచారణకు అటవీ సిబ్బంది విజ్ఞాపన చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. అటవీ అధికారుల మధ్య వైరుధ్యాల్లో భాగంగానే ఆ ఇద్దరు బలైనారని స్థానికులు నమ్ముతున్నారు. అందులో పాల్గొన్న కూలీలను శిక్షించాలని అన్ని సంఘాలు ముక్తకంఠంతో నినదించాయి. అప్పటి నుండి ప్రతీకారేచ్ఛతో ప్రభుత్వం హత్యలకు పాల్పడుతోంది. పిట్టకన్నా, చెట్టుకన్నా మనిషి ప్రాణానికి ఏ మాత్రం విలువలేదని పోలీసు సిబ్బంది భావిస్తోంది. ఒక్క చెట్టు కోసం పదుల సంఖ్యలో విలువైన మనుషుల ప్రాణాలను తీయడానికి ఏ మాత్రం వెనుకాడడం లేదు. ప్రఖ్యాత సెలబ్రిటీ సల్మాన్‌ఖాన్ అటవీ ప్రాంగణంలో జంతువులను వేటాడాడని ఇప్పటికీ కోర్టు చుట్టూ తిరుగుతున్నా, బూటకపు ఎన్‌కౌంటర్లో పాల్గొంటున్న పోలీసులపై ఇప్పటివరకు ఒక్క కేసు నమోదు కాలేదు. పైగా ప్రోత్సాహకాలు, అదనపు ఇంక్రిమెంట్లు, ఆగ్జిలరీ ప్రమోషన్లు ఇవ్వబడ్డాయి.

స్మగ్లింగ్ నివారణ

ఎర్రచందనం స్మగ్లింగ్ 2008కి ముందు నుంచి జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. అప్పట్లో శేషాచల ప్రాంత ప్రజలు ఎర్రచందనం దుంగలను పొయ్యిల్లోకి, ఇంటికి కలపగా వాడేవారు. ఈ తరహా ఎర్రచందనం చెట్లు ప్రపంచంలో ఎక్కడా లేకపోవడం, శేషాచల అటవీ ప్రాంతానికే పరిమితం కావడంతో, వీటిని సంరక్షించాల్సిన బాధ్యతగా గుర్తించి ప్రభుత్వం వీటి రవాణాను నిషేధించింది. ఇది అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్‌కు కారణమైంది. దీంతో స్మగ్లింగ్ ఊపందుకుంది. అప్పటి వరకు కట్టెముక్కగా ఉన్న ఎర్రచందనం ఆస్తిగా మారడంతో సమస్య మొదలైంది. దాని ఉపయోగపు విలువ కన్నా మారకపు విలువ వేల రెట్లు పెరగడం మనిషి ప్రాణం కన్నా, దాని విలువను అమాంతం పెంచేసింది. సీమలో నీటి వనరులు లేకపోవడంతో వ్యవసాయం కుంటుపడింది. పెట్టుబడులు లేకపోవడంతో పరిశ్రమలు కనీస స్థాయిలోను లేవు. ఆదాయంలేని ఫ్యూడల్ వర్గాలు ఎర్రచందనం స్మగ్లింగ్‌నే భారీ పరిశ్రమగా చేశారు. వేలమందికి ఉపాధిని, రాజకీయాల్లోకి పెట్టుబడులను, సేవారంగాల్లో పెట్టుబడులను ఇదే అందిస్తోంది. చివరకి ప్రభుత్వం ఈ వనరుల నుండి ఇప్పటికే వెయ్యి కోట్ల ఆదాయాన్ని గడించింది. ఇందులో నయాపైసా కూడా రాయలసీమకు ఖర్చుపెట్టలేదు. కాని ఈ చందనంపై తమిళ కూలీలకు హక్కు లేదని అటవీశాఖామంత్రి వాదిస్తున్నారు. రాజధాని సమస్యతో పాటు, అనేక చిక్కుల్లో ఉన్న ముఖ్యమంత్రిపై నమ్మకాన్ని అన్ని వర్గాల ప్రజలు క్రమంగా స్వల్ప కాలంలోనే కోల్పోతున్న క్రమంలో, త్వరలో స్థానిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అందరి దృష్టిని మరల్చడానికి తమిళ కూలీలను చంపినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. అందుకే భాషా ప్రాతిపదికన తమిళ - ఆంధ్రుల మధ్య చిచ్చుపెట్టే విధంగా తెదేపా మంత్రులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ చిచ్చును రగల్చడం వల్ల తాత్కాలిక ఉపశమనాన్ని పొంది తన పబ్బం గడుపుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లోని వేలూరు-తిరువణ్ణామలై జిల్లాల మధ్య విస్తరించి ఉన్న జువ్వాది కొండల్లోని సుమారు 272 గ్రామాల్లో గిరిజనులు నివసిస్తున్నారు. అడవిలోని చెట్లను నరికి కలపను అమ్ముకోవడం, పశుపోషణ, వ్యవసాయం వీరి ప్రధానమైన జీవవనరులు. వీరప్పన్ అనుచరులుగా వీరిని పేర్కొంటున్నప్పటికీ, వీరికి వీరప్పన్‌కు సంబంధాలు లేవు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోవడం, నిరక్షరాస్యత, పనులు లేకపోవడం, అటవీ అధికారుల ఆంక్షలు వీరిని వలసదారి పట్టించాయి. వీరి దారిద్ర్యాన్ని ఆసరాగా చేసుకుని స్మగ్లర్లు నియమించిన దళారీలు రోజుకు మూడు వేలు చొప్పున పది రోజులకు కాంట్రాక్టు కుదుర్చుకుని వారిని ఆశపెట్టి తిరుపతికి తీసుకువస్తారు. వీరిని అరెస్టు చేస్తే కుటుంబాన్ని ఆదుకుంటామని, జైలు నుండి విడిపించి తీసుకువస్తామని మాయమాటలు చెపుతారు. అరెస్టయితే అస్సలు పట్టించు కోరు. ఇప్పటివరకు 5000 మందికిపైగా కూలీలను ఆంధ్ర ప్రభుత్వం అరెస్టు చేస్తే, అందులో 50 శాతం మంది లాయర్లు పెట్టుకునే స్తోమత లేక జైళ్లల్లో మగ్గుతున్నారు. వీరికి ఉపాధిని, కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలి. అలాగే శేషాచలంలోని ప్రతిచెట్టుకు నంబరు వేసి, ప్రభుత్వమే వాటిని మార్కెట్ చేయాలి. అసలైన స్మగ్లర్లను అరెస్టు చేసి, వారి ఆస్తులను జప్తు చేయాలి. ఎర్రచందనం సంరక్షణకు అటవీ సిబ్బందిని పెంచాలి. ప్రతి గ్రామంలోను వాచర్‌ను ప్రభుత్వం నియమించి వారికి ఉపాధిని కల్పించ గలిగితే ఎర్రచందనం స్మగ్లింగ్ దాదాపుగా తగ్గే అవకాశాలున్నాయి.

(రచయిత పౌరహక్కుల సంఘ సభ్యులు, చిత్తూరు జిల్లా) వీ

కూలీలకో న్యాయం! కార్పొరేట్లకో న్యాయం!

చట్టం ముందు అందరూ సమానమనేది పచ్చి అబద్ధమనడానికి ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లు, సత్యం కుంభకోణం తీర్పు నిదర్శనమని అంటున్నారు ఉషా ఎస్ డానీ

శేషాచలం అడవుల్లో 20 మంది చెట్లునరికే కూలీలను పోలీసులు ఎన్‌కౌంటర్ చేసిన రెండు రోజుల్లోనే 'సత్యం కుంభకోణం'పై కోర్టు తీర్పు వచ్చింది. మదుపుదారులకు దాదాపు పద్నాలుగు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించిన ఈ కేసులో, ప్రధాన నిందితుడు బి. రామలింగరాజుకు సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. రెండు రోజుల వ్యవధిలో జరిగిన ఈ రెండు ఆర్థిక నేరాల కేసులు మన శిక్షా స్మృతికున్న వర్గ స్వభావానికి అద్దం పట్టాయి.

'సత్యం' కేసులో రామలింగరాజు రు. 7800 కోట్ల అవినీతికి పాల్పడ్డట్టు న్యాయస్థానం తేల్చింది. ఎర్రకూలీలకు పదిరోజుల కాంట్రాక్టుకు రు. 30,000 ఇస్తారని మీడియా వార్తలు ధృవీకరిస్తున్నాయి. రెండు ఆర్థిక నేరాల మధ్య వ్యత్యాసం 26 లక్షల రెట్లు. రు. 7800 కోట్ల ఆర్థిక నేరానికి ఏడేళ్ల జైలు శిక్ష సరైనదే అనుకుంటే ఎర్రకూలీలకు కేవలం నిమిషమున్నర కన్నా తక్కువ (85 సెకన్ల) జైలు శిక్షను మాత్రమే వేయాలి. ఒకవేళ, రు. 30,000 ఆర్థిక నేరానికి మరణదండనే సరైన శిక్ష అనుకుంటే రామలింగ రాజు చేసిన ఆర్థికనేరానికి ఆయన మీద 26 లక్షల మరణదండనలు అమలు చేయాలి!!

ఉత్తర తమిళనాడులోని వెనుకబడిన ప్రాంతానికి చెందిన వేలూరు, ధర్మపురం, విల్లుపురం, సేలం, తిరువణ్ణామలై జిల్లాల్లోని కాఫీ తోటల్లో చెట్లు నరికే కూలీలకు రోజుకు మూడు వందల రూపాయల చొప్పున వేతనం ఇస్తారు. వేసవికాలంలో వాళ్లకు ఆ పని కూడా ఉండదు. అలాంటి బలహీన సందర్భాల్లో ఎర్రచందనం స్మగ్లర్ల బ్రోకర్లు అక్కడికి చేరుకుని పది రోజులకు ముప్పై వేల రూపాయల కూలీ ఇస్తామని ఆశపెడతారు. పది రోజులూ సజావుగా సాగితే ఆ కూలీలు చెరో ముప్పయి వేల రూపాయలతో ఇళ్లకు చేరేమాట నిజమేగానీ, చాలాసార్లు అలా జరగదు. పేదరికంలో మగ్గుతూ, డబ్బు ఆశతో నల్లమల అడవులకు వచ్చే చాలా మంది కూలీల జీవితం రాయలసీమ జైళ్లలో ముగుస్తుంది.

స్మగ్లర్లను పట్టుకునే శక్తి, స్వేచ్ఛలేని అటవీ అధికారులు తరచుగా ఈ కూలీల్ని పట్టుకుని స్మగ్లర్లను పట్టుకున్నట్టు ప్రపంచానికి కొన్ని కట్టు కథల్ని వినిపిస్తుంటారు. నెల్లూరు జిల్లా జైలుతో పాటు రాయలసీమలోని నాలుగు జిల్లాల జైళ్లలో గత నాలుగేళ్లలో పదివేల మంది స్మగ్లర్లను బంధించినట్టు అధికారులు చెపుతున్నారు. ఆ సంఖ్యను బట్టే అర్థం చేసుకోవచ్చు వాళ్లు స్మగ్లర్లు కారనీ, కేవలం పొట్టకూటి కూలీలని.

పుట్టిన ప్రతివాడికీ ఆహారాన్నీ, నివాసాన్నీ సమకూర్చే శక్తి ప్రకృతికి ఉంటుంది. కానీ సహజ సంపదల్ని కొన్నివర్గాలు స్వాధీనం చేసుకోవడంతో మిగిలిన వర్గాలు తమ జీవిక కోసం ప్రకృతి మీద కాక ఆధిపత్య వర్గాల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సి వస్తుంది. అలా ఆధారపడడానికి కూడా ప్రతి మనిషి తన పాత వృత్తి నైపుణ్యాల్ని వదులుకుని కొత్త వృత్తి నైపుణ్యాలను అలవర్చుకోవాల్సి ఉంటుంది. అలా అలవర్చు కున్నా చాలా మందికి పనిచేసే అవకాశాలు లభించవు. సరిగ్గా ఈ నేపథ్యం నుండే సమాజంలో 'దొంగ' 'నేరస్తుడు' అనే వాళ్లు పుడతారు. ప్రకృతి సిద్ధమైన భూమిని కొందరు స్వాధీనం చేసుకున్నప్పుడే కదా అనేక మందికి నివాసానికి ఇల్లు లేకుండా పోతుంది? ఆధిపత్యం గల వర్గాలు ప్రకృతిని విచక్షణారహితంగా కొల్లగొట్టే కొద్దీ, స్వాధీనం చేసుకునే కొద్దీ సమాజంలో పేదరికం, నేరం పెరిగిపోతాయి. ఈ క్రమాన్ని అర్థం చేసుకుంటే మనకు ఇంకో విషయం కూడా అర్థమవుతుంది. అదేమంటే పేదలు నేరస్తులుగా మారరు. ఆధిపత్య వర్గాలే వాళ్లను నేరస్తులుగా మారే స్థితికి నెట్టుతాయి. అంతకన్నా కీలకం ఏమంటే నేరం అనేదాన్ని ఎప్పుడైనా ఆధిపత్య వర్గాలే నిర్వచిస్తూ ఉంటాయి. నేరాన్ని నిర్వచించడంలోనే ఆధిపత్య వర్గాల ప్రయోజనం ఇమిడి ఉంటుంది.

నాటి టాటా, బిర్లాల నుండి ఇవాల్టి అంబానీ, అదానీల వరకూ ఏ కార్పొరేట్ సంస్థ చరిత్రను చూసినా వాళ్లంతా ప్రభుత్వ సహకారంతో సహజ సంపదల్ని స్వాధీనం చేసుకుని పైకి ఎదిగినవారేనని సులువుగానే అర్థమవుతుంది.

భారత సామాజిక వ్యవస్థలో నేరానికి కూడా సామాజిక వర్గ స్వభావం ఉంటుంది. సామాజిక వ్యవస్థలో ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న వర్గాలే నేర వ్యవస్థలోనూ ఆధిపత్యాన్ని చెలాయిస్తాయి. పేరు మోసిన ఎర్రచందనం స్మగ్లర్‌లకు పేర్ల చివర రెడ్డి, నాయుడు అని బిరుదులు ఉండడం అసహజం ఏమీ కాదు. ఇంకా వివరాల్లోనికి వెళితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు గంగిరెడ్డి వంటివారు, తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు రాజానాయుడు, టివి భాస్కరనాయుడు వంటి పేర్లు వెలుగులో ఉంటాయని సులువుగానే అర్థం అవుతుంది.

నేరనిరోధక చట్టాలన్నింటిలోనూ నేరానికి సంబంధించిన ప్రతి స్థాయికీ, తీవ్రతకూ ఒక నిర్దిష్ట పేరు ఉంటుంది. చైన్ స్నాచర్, జేబుదొంగ, దొంగ, దోపిడి దొంగ, బందిపోటు వగైరా పేర్లను నేరస్థాయి, తీవ్రత, పరిమాణాన్ని బట్టి వాడుతారు. అలాగే భూ నేరాల్లో ఆక్రమణదారుడు వేరు, కబ్జాదారుడు వేరు. స్వంత నివాసం కోసమో, బతుకు తెరువు కోసమో ఆక్రమణదారులు చేసేది మన్నించదగ్గ నేరమే. అందుకే ప్రభుత్వం తరచుగా ఆక్రమణదారుల ఆధీనంలోని పరిమిత భూమిని క్రమబద్ధీకరించి పట్టాలు జారీ చేస్తుంది. స్మగ్లింగ్ వ్యవస్థలోనూ అనేక అంతస్తులు ఉంటాయి. వీటిల్లో అగ్ర భాగాన స్మగ్లర్లు, మాఫియా నేతలు ఉంటే అట్టడుగున చెట్లునరికే కూలీలు ఉంటారు.

దొంగ – పోలీసులది విచిత్రమైన అనుబంధం. దొంగలు ఉండాల్సిన అవసరం లేని సమాజంలో పోలీసుల అవసరమూ ఉండదు. పోలీసుల అవసరంలేని దశకు చేరుకున్న సమాజంలో దొంగలూ ఉండరు. ఆ విషయం దొంగలకు తెలిసినా తెలియక పోయినా, పోలీసులకు మాత్రం క్షుణ్ణంగా తెలుసు.

అటవీశాఖ సిబ్బందికీ, స్మగ్లర్లకూ మధ్య ఒక అపవిత్ర అనుబంధం లేకపోతే స్మగ్లింగు అంత సజావుగా ఇన్నేళ్లు సాగదు. అయితే తరచుగా చూసీ చూడనట్టు పోయే అధికారులు అప్పుడప్పుడైనా తమ విధుల్ని నిర్వహిస్తున్నట్టు రికార్డుల్లో చూపెట్టాల్సి ఉంటుంది. దానికోసం కనీసపు అరెస్టులు చేయాల్సి ఉంటుంది. ఒక్కోసారి ఈ లాంఛనపు అరెస్టులు బెడిసికొట్టి హింసాత్మకంగానూ మారవచ్చు. అలాంటి సందర్భాల్లో పోలీసులూ, నేరస్తులూ భీకరంగా తలపడే వైరి వర్గాలుగా కనిపిస్తారు గానీ అది నిజం కాదు. అపారంగా పెరిగిపోతున్న అటవీశాఖ అధికారుల ఆస్తుల వివరాలపై ఒక సర్వే జరిపితే ఈ విషయం తేటతెల్లం అవుతుంది. ఇప్పుడైతే చైనా, జపాన్‌ల మూలంగా ఎర్రచందనానికి గిరాకీ వచ్చిందిగానీ పదేళ్ల క్రితం వరకు దాని ఉపయోగాలు మన దేశంలో ఎవరికీ తెలిసేవి కావు. చివరకు చైనాలో అణువిద్యుత్ కేంద్రాల్లోనూ, జపాన్‌లో లైంగిక పటుత్వాన్ని ఇచ్చే మందుల తయారీలోను ఎర్రచందనం పొడిని వాడుతున్నారని తేలింది.

నరేంద్రమోడీ మద్దతుతో సింగపూర్‌ను తలదన్నే రాజధాని నగరాన్ని కట్టాలని ఆశపడ్డ చంద్రబాబుకు ప్రధాని ఖాళీ చేతులు చూపించారు. దానితో చంద్రబాబు తన రాజధాని ఆశలన్నీ ఎర్రచందనం అమ్మకాలపై పెట్టుకున్నారు. ఎర్రచందనానికి ఉన్న మార్కెట్ గిరాకీ ఎంత? మన దగ్గర ఉన్న నిల్వలు ఎంత? వగైరా అంశాలతో సంబంధం లేకుండానే దాన్నొక కొత్త బంగారు గనిగా పేర్కొంటూ భారీ అతిశయోక్తులతో భారీ ప్రచారం సాగించారు.

చెట్లు నరికే కూలీల్ని కాల్చిచంపడం ఒక దారుణమైతే, వాళ్లను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసుల్ని సమర్థించడానికి ప్రభుత్వం చేస్తున్న వాదనలు అంతకన్నా దారుణంగా ఉంటాయి. 'స్మగ్లర్లు ఎర్రచందనాన్ని తరలించుకు పోతుంటే, ఫారెస్టు అధికారులను చంపేస్తుంటే పోలీసులు చూస్తూ ఊరుకోవాలా?' అంటూ అధికారపక్ష నేత ముద్దు కృష్ణమనాయుడు వేసిన గడసరి ప్రశ్న కూడా మరిన్ని ప్రశ్నల్ని లేవదీస్తోంది. చనిపోయిన ఇరవై మంది గతంలో ఎర్రచందనాన్ని స్మగ్లింగు చేశారని గానీ, అటవీ అధికారుల మీద దాడి చేసింది కూడా వారేననిగానీ పోలీసు రికార్డుల్లో నేరం నమోదై ఉందా? అని సూటిగా అడిగితే పోలీసుల దగ్గర సమాధానం లేదు. ఎవరో గతంలో పోలీసుల మీద దాడి చేశారు. ఇంకెవరో అడవికి వస్తే పోలీసులు కాల్చిచంపి పగతీర్చుకున్నారు. వాళ్లుగా అడవికి రాకపోయినా పోలీసులే వెళ్లి బస్సులోంచి లాక్కొని వచ్చి మరీ కాల్పులు జరిపారు.

కూలీలు గుంపులుగా రావడం కూడా తీవ్రమైన నేరం అయినట్టు మరో ప్రచారం జరుగుతోంది. ఎక్కడైనా స్మగ్లర్లు ఒకరిద్దరే ఉంటారు. కూలీలు గుంపులుగానే ఉంటారు. ఇవాళ ఎర్రచందనం కేసు చర్చనీయాంశంగా మారింది కనుక చాలా మందికి కొత్తగా ఉంటోంది గానీ ఇది సర్వత్రా జరిగేదే. గూడ్సుల కొద్దీ బియ్యం మనరాష్ట్రం నుండి అక్రమ రవాణా జరుగుతుంది. ఆ వ్యాగన్లలో రాత్రికి రాత్రే ధాన్యం బస్తాలు ఎక్కించడానికి వందల మంది కూలీలు పనిచేస్తారు. ఇసుక క్వారీలు, ఓడ రేవులు వంటి చోట్ల కూడా ఇలాంటి కూలీల గుంపులే ఉంటాయి. పన్నులు ఎగవేసే నల్లబజారు రవాణా వ్యవస్థలోనూ బరువులు మోసేది ముఠాకూలీలే. వాళ్లలో చాలా మందికి తాము చేస్తున్నది నేరం అని కూడా తెలీదు.

'అడవుల్లో కూలీలకు పనేంట'ని వెంకయ్యనాయుడు వంటివాళ్లు అంటుంటే, 'ఎర్రచందనాన్ని దోచుకుని పోతున్నవారిని కాల్చేందుకు కాకపోతే అసలు పోలీసులకు ఆయుధాలు ఇచ్చి ఉపయోగం ఏంటని?' గాలి ముద్దు కృష్ణమనాయుడు రెచ్చిపోయారు. పైగా, 'మన సంపదను కాపాడడానికి స్మగ్లర్లను (చంపేస్తే) ఎన్‌కౌంటర్ చేసే పోలీసుల్ని విమర్శించడం తప్పు' అంటున్నారాయన.

శేషాచలం ఎన్‌కౌంటర్ సంఘటనలో ప్రభుత్వం పోలీసుల్ని వేనకేసుకు వస్తున్న తీరు ఒక ప్రమాదానికి సంకేతం అయితే, మృతుల మీద పౌరసమాజం సోషల్ మీడియాలోనూ, వ్యక్తిగత సంభాషణల్లోనూ వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలు అంతకన్నా పెద్ద ప్రమాదానికి సంకేతంగా ఉంటాయి. 'నేరస్తుల్ని చంపితే తప్పేంటీ' 'తమను చంపినవాళ్ల మీద పోలీసులు ప్రతీకారం తీసుకోరా?' 'దేశ సంపదను కాపాడుకోవాల్సిన అవసరం లేదా?' 'ఇలాంటి కేసుల్ని న్యాయస్థానాలు పరిష్కరించాలంటే ఎన్ని దశాబ్దాలు కావాలీ?' 'వాళ్లను అరెస్టు చేస్తే తిండిదండగ. ఇప్పటికే వేల మందిని జైళ్లల్లో కూర్చోబెట్టి మేపుతున్నాం', 'తక్షణ న్యాయమే సరైన పరిష్కారం' వంటి సూచనలు విస్తృతంగా వినవస్తున్నాయి.

ఇలాంటి వాఖ్యలు విన్నప్పుడు కోర్టులు, చట్టాలు, విచారణ, నేర నిరూపణ వగైరా బాదరబందీలు లేకుండా ఎవరు నేరం చేసినా సరే నేరం జరగ్గానే, నేరం జరిగిన స్థలంలోనే శిక్షించే, అవసరమైతే చంపేసే న్యాయాన్ని పౌరసమాజం ముక్తకంఠంతో ఆమోదిస్తున్నదనే అభిప్రాయం కలుగుతుంది. కానీ, అది నిజం కాదు. బలహీనవర్గాల నేరం బయట పడినప్పుడు మాత్రమే; మరీ ముఖ్యంగా ఆదివాసులు, ముస్లింలు, ఎస్‌సిలు, ఎంబిసిలు నేరస్తులుగా ఉన్న కేసుల్లో మాత్రమే పౌరసమాజం 'తక్షణ న్యాయం' గురించి మాట్లాడుతుంది. మిగిలిన సందర్భాల్లో మౌనంగా ఉండి పోతుంది.

'జాతిసంపద, దేశసంపద, రాష్ట్ర సంపద' అంటూ ఘనంగా చెపుతున్న మాటలు కూడా సందర్భానుసారంగా మారిపోయేవే. ఆరేళ్ల క్రితం సత్యం రామలింగరాజు నేరం బయట పడినపుడుగానీ, విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న లక్షల కోట్ల రూపాయల నల్లధనం ఎవరెవరిదో తెలిసినప్పుడు గానీ ఇదే పౌర సమాజానికి 'తక్షణ న్యాయమే పరిష్కారం' అన్న నీతి గుర్తుకు రాలేదు. అప్పుడు వాళ్లకు జాతి సంపదలు, దేశ సంపదలు, రాష్ట్ర సంపదలు, ప్రజాసంపదలు గుర్తుకు రాలేదు. గిరిజన కూలీల నేరం బయటపడగానే అందరికీ 'తక్షణ న్యాయమే పరిష్కారం' అన్న నీతిని ఎలుగెత్తి చాటాలనిపిస్తోంది!

ధనికులైన నేరస్తుల్ని మర్యాదగా విచారించడానికిన్నూ, పేదలైన నేరస్తుల్ని క్రూరంగా శిక్షించడానికిన్నూ, వెరసి ధనిక సమాజాన్ని రక్షించడానికి మాత్రమే ప్రభుత్వాలు ఉన్నాయనే అభిప్రాయం సామాన్య ప్రజల్లో బలపడే కొద్దీ సామాజిక అశాంతి మరింతగా పెరుగుతుంది. అప్పుడు పౌరసమాజం ఇంతకన్నా దారుణ సన్నివేశాల్ని చూడాల్సి రావచ్చు. దొంగలు లేని సమాజం కావాలనే కోరిక పౌరసమాజానికి ఉంటుంది. అప్పుడువాళ్లు ఆలోచించాల్సింది పోలీసులు, స్థాయీ సైన్యం లేని సమాజాన్ని ఎలా నిర్మించాలి అని.

(రచయిత సీనియర్ పాత్రికేయుడు, సమాజ విశ్లేషకుడు) వీ

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ - ఎన్‌కౌంటర్లు

***తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమ పాలనా విధానాలు భవిష్యత్తులో ఎలా ఉండబోతున్నాయో ఎన్‌కౌంటర్ల ద్వారా సూచిస్తున్నారని అంటున్నారు* చిమ్మె జాన్ బర్నబాస్**

రెండు తెలుగు రాష్ట్రాలలో ఒకే రోజు రెండు భారీ ఎన్‌కౌంటర్లు జరగడం పూర్తిగా వాస్తవాలను, నేర శిక్షాస్మృతి (సిపిసి)ని, రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమే అనేది పౌర, ప్రజాస్వామిక హక్కులపై అవగాహన ఉన్న వారందరి వాదన. దీనిని కేవలం పోలీసులు తమ ఆత్మరక్షణ కోసం చేసిన ఎన్‌కౌంటర్లుగా భావించలేం. ఎందుకంటే, మొదటిది తెలంగాణ రాష్ట్రంలో వరంగల్ జిల్లా సరిహద్దులో (ఆలేరు సర్కిల్ పరిధిలోనికి వస్తుంది) జరిగిన వికారుద్దీన్ ఎన్‌కౌంటర్. వికారుద్దీన్, అతనితోపాటు ఉన్న నలుగురు సహచరులూ, పోలీస్ వాహనంలో, జుడీషియల్ కస్టడీలో, హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టుకు హాజరు పరిచేందుకు వస్తుండగా జరిగినది. ఐదుగురు నిందితులకు దాదాపు 18 మంది ఎస్కార్ట్ పోలీసులు కాపలగా – రక్షణగా ఉన్నారు. మరి 18 మంది పోలీసులలో ఏ ఒక్కరికీ ఏమాత్రం గాయం కాకుండా, ఒకేసారి ఐదుగురు ఏ విధంగా తప్పించుకునే ప్రయత్నం చేశారో పోలీసులకే తెలియాలి. అంతే కాకుండా వారందరికీ బేడీలు వేసి, అందరినీ మరలా గొలుసులతో కట్టేస్తారు. అంత పకడ్బందీగా ఉండగా వారు పోలీసుల తుపాకులను గుంజుకునే ప్రయత్నం చేశారనడం సమర్థనీయం కాదు. కేవలం పోలీసులు అల్లిన కట్టుకథలు తప్ప మరొకటి కాదు. ఈ 'ఎన్‌కౌంటర్' సూర్యాపేట కాల్పులలో పోలీసులు చనిపోయినందుకు ప్రతీకారంగా చేసినదిగా భావించవచ్చు. ఎందుకంటే తెలంగాణ ప్రభుత్వం సిమి (స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా) కార్యకర్తలను ఏరివేసే క్రమంలో వికారుద్దీన్‌తో సహా మిగిలిన నలుగురిని, సాక్ష్యాధారాలను కనుమరుగు చేసేందుకు ఎన్‌కౌంటర్‌లో చంపి వేశారు. ఇవి తెలంగాణ ప్రభుత్వం చేసిన బహిరంగ హత్యలు తప్ప మరొకటి కాదు. కాబట్టే రాష్ట్ర ప్రభుత్వం తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునేందుకు సుప్రీంకోర్టు జడ్జి చేత విచారణకు ఒప్పుకోవాలి. పోలీసులు తప్పు చేయలేదని నిరూపించే శక్తి (నిజాయితీ) ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నదా?

రెండవది ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా తిరుపతి సమీపంలోని శేషాచలం అడవుల్లో ఎర్రచందనం స్మగ్లర్ల పేరుతో రెండు చోట్ల జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇరవై మందిని చంపేశారు. చనిపోయిన వారందరూ తమిళనాడు రాష్ట్రానికి చెందిన కూలీలు. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ఈ కూలీలందరూ గత వారం రోజుల క్రితమే అరెస్ట్ కాబడి, పోలీసుల కస్టడీలో ఉన్నారు. వారందరినీ శేషాచలం అడవులలోనికి రెండు వేరు వేరు ప్రదేశాలకు తీసుకుని వెళ్లి పోలీసులు నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు. నిజంగా 20 మంది స్మగ్లర్లు అటవీ అధికారులకు – పోలీసులకు దొరికితే, వారి నుంచి తగిన సమాచారం రాబట్టకుండా, స్మగ్లింగ్‌కు సంబంధించిన లోతు – పాతులనూ, వాటి వెనుక ఉన్న రాజకీయ కారణాలనూ సేకరించకుండా, ఒకేసారి అందరినీ కాల్చి పారేయడం ఏ రాజనీతికి నిదర్శనం? పైగా అటవీ కూలీలందరూ దళితులూ, గిరిజన తెగలకు చెందినవారు. తమిళనాడు రాష్ట్రం నుండి కేవలం కూలీ నిమిత్తం వచ్చినవారు – తేబడినవారు. వారిని అక్కడికి తరలించిన వారిని పోలీసులు ఏమి చేశారన్నది ప్రశ్నార్థకం. లేదా వారితో చిత్తూరు జిల్లా పోలీసులు, ఈ రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కైందా అన్న విషయం తేలవలసి ఉంది.

పోలీసులు చెప్పే వాదన చాలా వింతగా ఉంది. అటవీ స్మగ్లర్లు రాళ్లూ, గొడ్డళ్లూ విసరగా, వాటి నుండి తప్పించుకునేందుకు కాల్పులు జరపగా 20 మంది కూలీలు చనిపోయారనేది వారి వాదన. నిజంగా రాళ్లూ, గొడ్డళ్లూ విసిరితే, మరి అటవీ సిబ్బందికి గానీ, పోలీసు సిబ్బందికి గానీ ఏ విధమైన గాయాలూ కాలేదా? అసలు రాష్ట్ర హోంమంత్రి నిమ్మ కాయల చిన్నరాజప్ప 'ఎన్‌కౌంటర్' ఏ విధంగా జరిగిందో, ఏ ప్రదేశంలో జరిగిందో, దానిని వివరించే ప్రయత్నంలోనే 'వివరాలు తేలవలసి ఉంది' – మృతులు 'గుర్తుతెలియని వారు' అంటూ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఈ విధంగా రాష్ట్ర హోంమంత్రే తప్పుడు సమాధానాలు ఇస్తున్నాడు. ఇక డిఐజి కాంతారావు మాత్రం చక్కగా ముఖ్యమంత్రి ఆదేశాలతోనే ఈ 'ఎన్‌కౌంటర్' జరిగిందని అంటున్నాడు. అనగా ఎవరిని చంపాలో, ఎలా చంపాలో రాష్ట్ర పోలీసు యంత్రాంగం – ముఖ్యమంత్రి మాట్లాడుకున్నారనేది సుస్పష్టం. ఇంత దివాళాకోరు పోలీసు వ్యవస్థ ఈ రాష్ట్రంలో ఉన్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎర్రచందనంను బహిరంగ వేలంలో అమ్మడం ద్వారా కోట్ల రూపాయలను ఆర్జించవచ్చుననే ఆదాయ వనరుగా భావించి తద్వారా వచ్చే ఆదాయాన్ని రైతుల రుణమాఫీకి ఉపయోగిస్తామనే వాదన కూడా చేసింది. అనగా 'ఎర్రచందనం'ను కాపాడే క్రమంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ఈ రాష్ట్ర ప్రభుత్వం నియమించి, మధ్య దళారులనూ, మాఫియానూ అరికట్టే క్రమంలో 'ఎన్‌కౌంటర్లు' కూడా చేయవచ్చని ఆదేశించింది. ఇది చాలా అమానుషం – రాజ్యాంగ విరుద్ధం. నిజంగా కూలీలు దొరికినప్పుడు వారు ఏ ఆర్థిక పరిస్థితులలో ఈ వృత్తిని చేపట్టవలసి వచ్చిందో వారి నుంచి సమాచారాన్ని సేకరించవలసి ఉంది. ఆ విధంగా చేయకుండా, ఏక పక్షంగా కాల్పులు జరిపి చంపివేశారు. పోలీసులు నిస్సిగ్గుగా తమ వాదనను సమర్థించుకుంటున్నారు.

హాషింపురా తీర్పు - మరోసారి హత్యాకాండ

***1987లో పోలీసులు జరిపిన దారుణ మారణకాండపై 28 సంవత్సరాల తరువాత ఇచ్చిన తీర్పులో నిందితులను నిర్దోషులుగా వదిలి న్యాయవ్యవస్థ మరొకసారి హత్యాకాండకు పాల్పడిందంటున్నారు* బి. రామకృష్ణ**

దేశంలోనే అతిపెద్ద కస్టోడియల్ మారణకాండపై 28 ఏళ్ల సుదీర్ఘ న్యాయ ప్రక్రియ జరిగింది. 1987 మే 22న జరిగిన ఈ దారుణ ఘటనపై 2015 మార్చ్ 21న కోర్టు తీర్పును ప్రకటించింది. 42 మంది ముస్లింల హత్యాకాండ దోషులెవరికీ శిక్షలు పడలేదు. నిందితులుగా పేర్కొనబడిన వారందరూ నిర్దోషులుగా ప్రకటించబడ్డారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్‌లోని వివిధ మొహల్లాల నుండి 1987 మే 22న వందలాది మందిని ప్రావిన్షియల్ ఆర్మ్‌డ్ కాన్‌స్టేబులరీ (పిఎసి), మరితర పోలీసు బలగాలు పట్టుకోవడం, అరెస్టులు చేయడం జరిగిందని నిరూపించబడింది. హాషింపురా మొహల్లా వారిని పసుపు పచ్చని ట్రక్కులో పిఏసివారు అపహరించారని నిరూపించబడింది. అపహరించిన వారిలో 42 మందిని తుపాకులతో కాల్చి, కొందరిని మురాద్‌నగర్ వద్ద గంగానదిలోకి, మరికొందరిని ఘజియాబాద్ వద్ద హిండన్ నదిలోకి విసిరేశారని నిరూపించబడింది. అయితే 42 మంది ముస్లింలను చంపింది నేరం ఆరోపించబడి ట్రయల్‌ను ఎదుర్కొంటున్న నిందితులేనని మాత్రం నిరూపించబడలేదు. అలాగే 41వ పిఏసి బెటాలియన్‌కు చెందిన యుఆర్‌యు 1493 నెంబర్ గల ట్రక్కు హత్యాకాండకు వాడబడిందని నిరూపించబడ లేదు. 42 మంది హత్యలు జరిగిన రోజు నిందితులకు త్రీనాట్ త్రీ రైఫిల్స్ పదిహేడింటిని ఇచ్చినట్లుగానీ ఇవే రైఫిళ్లు హత్యాకాండ జరిగిన 1987 మే 22న, హత్యా సమయంలో నిందితుల చేతుల్లో ఉన్నట్లుగా అధికారిక రికార్డుల్లో లేవని కోర్టు తేల్చింది. నేరమెంత తీవ్రమైనదైతే అంతే స్పష్టంగా సూటిగా ఆ నేరం నిరూపించబడాలి. ఈ సంఘటనలో జీవిత ఖైదు లేదా మరణశిక్షకు సమానమైన శిక్షలు పడతాయి. కాబట్టి కస్టోడియల్ మరణాలనే కారణం గా బలహీనమైన సాక్ష్యాల ఆధారంగా శిక్షలు వేయడం కుదరదని 16 మంది పిఏసి వారిని నిర్దోషులుగా ప్రకటించారు. కనీసం ఈ మరణాలు కస్టోడియల్ మరణాలని అంగీకరించినందుకు అభినందించాలేమో.

దారుణమైన ఈ కస్టోడియల్ మారణకాండపై న్యాయ ప్రక్రియ 28 ఏళ్లు నడవడం, కావాలనే దోషులెవరికీ శిక్షలు పడకుండా, సరైన సాక్ష్యాలను సేకరించకుండా వాటిని భద్రపరచకుండా , సాక్ష్యాధారాలను ధ్వంసం చేయడాన్ని అడ్డుకోకుండా ఉండేలా చేపట్టిన ఇన్వెస్టిగేషన్ విధానమే అన్యాయమైనది. ఈ రకంగా పరోక్షంగానో, ప్రత్యక్షంగానో దోషులను కాపాడాలనే ప్రయత్నం పోలీసు, నేర విచారణ వ్యవస్థను అసహ్యించుకునేలా చేస్తుందనడంలో ఆశ్చర్యం లేదు. 1996 నుంచి 2000 మధ్య నాలుగేళ్ల కాలంలో నిందితులపై బెయిలబుల్, నాన్ బెయిలబుల్ వారెంట్లు మొత్తంగా 23 జారీ అయ్యాయి. కాని ఈ కాలంలో నిందితులెవ్వరూ కోర్టుకు హాజరు కాకుండా ఉండగలిగారంటే న్యాయస్థానం, నిందితుల్లో ఎవరు బలవంతులుగా మిగిలిపోయారు? వీరిమధ్య ఏమైనా అవగాహన ఉందా అనే అనుమానం వస్తే

ఈ అమానుష చర్యలను వార్తల ద్వారా తెలుసుకున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ తమకు తాముగా (సుమోటో) గా కేసును స్వీకరించి, రెండు వారాలలోపుగా నివేదిక సమర్పించాలని రాష్ట్ర డిజిపిని ఆదేశించింది. తమిళనాడు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఏకమై, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తుతూ, అక్కడికి పోయే బస్సులను ధ్వంసం చేస్తూ తమ నిరసనను తెలియచేశారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం – మానవ హక్కుల ఉల్లంఘనగా భావిస్తూ నష్టపరిహారం చెల్లించాలని చంద్రబాబునాయుడును కోరారు.

రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇవి భారీ ఎన్‌కౌంటర్లు, మొత్తం 25 మంది పౌరులు చనిపోయారు. వారిని కూడా మానవత్వంతో చూడాలి. రాజ్యాంగ హక్కుల కోణంలోనే చూడాలి. భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 'జీవించే హక్కు'ను తెలియచేస్తుంది. ఈ హక్కును ఈ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాశాయి. వారి ప్రాణాలను, వారి కుటుంబ సభ్యులకు ఎవరు తెచ్చి ఇస్తారు? ఈ విషయంలో ఈ రెండు రాష్ట్ర ప్రభుత్వాలూ దోషులే. కేంద్ర ప్రభుత్వం కూడా సహకరిస్తున్నది కాబట్టి వారు కూడా బాధ్యత వహించవలసి ఉంటుంది.

ఉగ్రవాదం లేదా తీవ్రవాదం అణిచివేత పేరుమీద పోలీసులకు విస్తృత అధికారాలను ఇచ్చి, కాల్చి చంపుతుంటే చూస్తూ ఆనందించే సంస్కృతి పోవాలి. పౌర, ప్రజాస్వామిక హక్కుల కోణం నుంచి ఈ సమస్యను చూడాలి.

ఈ రోజు వికారుద్దీన్ – సహచరులు రేపు పోలీసులకు సహకరించని వారందరూ, వారితో విభేదించేవారు లేదా వారికి ముడుపులు (అవినీతి) చెల్లించనివారు ఎన్‌కౌంటర్లలో చనిపోయే ప్రమాదం ఉంది. అప్పుడు విచారించి ఏమి లాభం? చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు అవుతుంది. రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు బాధ్యత వహిస్తామని చెపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు – ప్రజాస్వామికంగా వ్యవహరించ కుండా, న్యాయ వ్యవస్థను గౌరవించకుండా, పోలీసు రాజ్యాలుగా మారిపోతే అది అరాచకం దిశగా పయనించడం అవుతుంది తప్ప రాజ్యాంగ స్ఫూర్తి కాదు – ప్రజాస్వామిక స్ఫూర్తి అసలే కాదు.

కావున ఈ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు నిజాయితీతో, 'సుప్రీంకోర్టు జడ్జి' చేత న్యాయ విచారణకు ఒప్పుకొని, పోలీసుల నిర్దోషిత్వాన్ని, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తెలియచేయాలి. లేనిచో ఈ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల దృష్టిలో తప్పును అంగీకరించినట్లే.

(రచయిత ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

బాధ్యులెవరు? చివరకు 2000లో నిందితులు గ్రూపులు గ్రూపులుగా మే చివరి, జూన్ మొదటి వారాలలో లొంగిపోయారు. వీరికి చీఫ్ జుడిషియరీ మెజిస్ట్రేట్ బెయిల్ నిరాకరించారు. వారు పిఎసిలో ఉద్యోగ నిర్వహణలో ఉన్నందున తప్పించుకునే అవకాశం లేదని, వారిపై నేరం చేశారని తెలిపే ప్రత్యక్ష సాక్ష్యం లేదని చెపుతూ జిల్లా జడ్జ్ బెయిల్ మంజూరు చేశారు. గత నాలుగేళ్లుగా వీరిపై వారెంట్లు ఉన్నప్పటికీ కోర్టుకు హాజరుకాని అనుభవం ఉన్నప్పటికీ కూడా బెయిల్ మంజూరు చేయబడింది. ఈ దుర్ఘటనపై చార్జ్‌షీట్ దాఖలు చేయడానికి తొమ్మిదేళ్ల కాలం పట్టిందంటేనే రాజకీయ, పాలన, పోలీస్ వ్యవస్థలు ఎంత నిర్లక్ష్యంగా ప్రవర్తించాయో తెలిసి పోతున్నది. నిజానికి నేర విచారణ స్మృతి ప్రకారం గరిష్టంగా 90 రోజుల్లో చార్జ్‌షీటు దాఖలు చేయాలి.

కోర్టు విచారణలో భాగంగా 2002 నుండి 2005 వరకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించనేలేదు. కేవలం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించడానికే మూడేళ్ల కాలం తీసుకున్న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఏమనుకోవాలి? హాషింపురా దుర్ఘటన జరిగినప్పుడు 1987లో ఉత్తరప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ మొదలు దాని తీర్పు వచ్చే వరకు జనతాదళ్, సమాజ్‌వాది పార్టీ, బిజెపి, బిఎస్‌పి వంటి ఎన్నో ప్రభుత్వాలు మారాయి. అయినా నేర విచారణలో బలమైన సాక్ష్యాధారాలను కోర్టుకు నివేదించడంలో గానీ కేసును పటిష్ఠంగా నడిపించడంలో గానీ ఏ మాత్రం శ్రద్ధ పెట్టలేదని ఈ మొత్తం 28 ఏళ్ల ప్రస్థానం తెలుపుతున్నది.

42 మందిని చంపినారని నేరారోపణ చేయబడ్డ వాళ్లలో సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి తప్పిస్తే మిగతా వాళ్లంతా కిందిస్థాయి వాళ్లే. ఉన్నత అధికారుల ఆదేశం లేకుండా ఈ కిందిస్థాయి వారు ఇంత పెద్దఎత్తున హత్యలు చేయ సాహసిస్తారా? ఉన్నత స్థాయి హోదాలో ఉన్న అధికారుల పాత్ర గురించి ఎక్కడా ప్రస్తావించక పోవడం కావాలనే జరిగిందని అనుకోలేమా? హత్యా స్థలం నుండి కనీసం ఒక కార్ట్రిడ్జ్‌ను కూడా సేకరించలేదు. వాటిని సాక్ష్యాలుగా ప్రవేశపెట్టలేదు. హత్యకు వాడిన రైఫిళ్లను సీజ్ చేయలేదు సరికదా వాటిని తిరిగి అధికారికంగానే వాడడం జరిగింది. 2006 ఆగస్టు 8 నాటికి గాని ఆ ఆయుధాలను డిపాజిట్ చేయకపోవడం వంటివి అన్నీకూడా ఎంతలా సాక్ష్యాధారాలను ధ్వంసం చేయపూనుకున్నారో అర్థమవుతున్నది.

ఒక ఆర్మీ మేజర్ తమ్ముడైన 23 ఏళ్ల ప్రభాత్ కౌశిక్ హత్య 21 మే 1987న జరిగింది. అతనిపై పేలిన బుల్లెట్ హాషింపురా వైపు నుండే వచ్చిందని అంటున్నారు. ప్రభాత్ కౌశిక్ ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా చెప్పబడు తున్నాడు. ఈ హత్య మరునాడే హాషింపురాలో ఇంటింటిని సోదా చేయడంలో మనుషులను పట్టుకుని పిఎసి వారికి అందించడంలో ఈ ఆర్మీ మేజర్ ప్రధాన పాత్ర వహించాడనేది సిబి సిఐడి రిపోర్టులో నమోదైంది. ఇదే విషయం అప్పట్లో ప్రధానమంత్రి కార్యాలయానికి కూడా అందించ బడింది. కానీ తరువాత జరిగిన కోర్టు ప్రక్రియల్లో గానీ ఇన్వెస్టిగేషన్‌లో గానీ అతని గురించి లేదా అరెస్ట్ చేయడంలో అతనితో పాటు సహకరించిన మిగతా ఆర్మీ ఉన్నతాధికారుల ప్రస్తావన గానీ లేదు.

42 మందిపై ఫైరింగ్ అయిన ఆరు గంటల తరువాత ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి వీర్ బహదూర్‌సింగ్, ఆయన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఇతర ఉన్నతాధికారులతో మీరట్ సర్క్యూట్ హౌస్‌లో సమావేశం జరిగింది. ఆ సమావేశంలో పాల్గొన్న చాలా మంది పిఎసి వారికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడానికి సుముఖంగా లేరు. అప్పటికి మీరట్‌లో 5వేల పిఎసి సిబ్బంది ఉన్నారు. ఒకవేళ చర్యలు తీసుకుంటే వీరు ఎంత బీభత్సంగా స్పందిస్తారోననేది వారిని వేధించింది. హత్యాకాండలో పాల్గొన్న పిఎసి వారిని వెంటనే అదుపులోకి తీసుకోమని తానిచ్చిన సలహాను అక్కడి వారు పట్టించుకోలేదని అప్పటి గజియాబాద్ సూపరింటెండ్ పోలీస్ విభూతి నారాయణ్‌రాయ్ ఫ్రంట్‌లైన్ మ్యాగజైన్‌తో పంచుకున్నారు. సంఘటన జరిగిన మూడురోజుల తరువాత ముఖ్యమంత్రి దీనిపై ఇన్వెస్టిగేషన్‌ను సిబి సిఐడికి అప్పగించాడు. ఈ పరిశోధనలో ఎన్నో లోపాలు ఉన్నాయి. మొదటి నుండి కూడా దోషులను రక్షించే ప్రయత్నం జరిగిందని విభూతి నారాయణ్‌రాయ్ తెలిపాడు. ఏదేమైనా శాంతి భద్రత సమస్యల్లో పౌరపాలన వ్యవస్థలకు సహాయ కారులుగా మాత్రమే ఉండాల్సిన ఆర్మీ మొత్తం సంఘటనను తన అధీనంలోకి తీసుకున్నది. ఈ దురాగతంలో ముఖ్య భూమికను పోషించింది. పౌరుల అరెస్టులను, ఇళ్ల సోదాలను చేస్తూ పోయింది. పోలీసులు ఆర్మీ ఆదేశాలను అనుసరిస్తూ పోయారని ఈ దుర్ఘటనలో పాల్గొన్న సీనియర్ అధికారులను కేసులో బుక్ చేయలేదని విభూతి నారాయణ్‌రాయ్ చెప్పారు.

హత్యాకాండలో గాయపడి బయటపడిన జుల్ఫికర్ నజీర్ అనే వ్యక్తి అప్పటి దేశ ప్రధాని రాజీవ్‌గాంధీ వద్ద ప్రవేశపెట్టబడ్డాడు. అతడు చెప్పిన విషయాలతో రాజీవ్‌గాంధీ కన్విన్స్ అయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి కఠినచర్యలు తీసుకోవాలనుకున్నాడు. అలాంటి చర్యలు తీసుకోవద్దని, అలా తీసుకుంటే రాజ్యం నడపడానికి ప్రధాన సహాయ కారులైన పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతింటుందనే సలహా పనిచేయడంతో దోషులపై తగు చర్యలు తీసుకోబడలేదు. చట్టం ముందు అందరూ సమానులేనన్న దానిని ఈ వాదన హేళన చేస్తుంది. పోలీసుల స్థైర్యం దెబ్బతింటుందంటే వారు చేసిన హత్యల వల్ల చనిపోయిన వారి కుటుంబాల ఆవేదనల మాటేమిటి? బాధితుల జీవితాలను విచ్ఛిన్నం చేసిన వారిని చట్టపరంగా శిక్షించకుండా రక్షించాలనడం ఎంతో హేయమైనది.

తప్పుల తడకలతో విచారణ చేసిన సిబి సిఐడి సైతం ఈ దుర్ఘటనకు కారకులుగా 60 మందికి పైగా పిఎసి వారిని గుర్తించింది. అయితే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మాత్రం 19 మంది కిందిస్థాయి పిఎసి వ్యక్తులపై మాత్రమే ప్రాసిక్యూషన్‌కు అనుమతులిచ్చింది. నిందితులు తీర్పు వచ్చేదాకా కూడా సర్వీసులోనే కొనసాగుతున్నారు. ఎన్నడూ ఈ ఘటనకు సంబంధించి సస్పెన్షన్‌కు గురికాలేదు. వారిపై శాఖాపరమైన చర్యలేమీ తీసుకోబడలేదు. వారికి సంబంధించిన వార్షిక కాన్ఫిడెన్షియల్ రిపోర్టుల్లో వారిపై నమోదైన అభియోగాలను రికార్డ్ చేయలేదు.

ఇదంతా చూస్తుంటే పాలనా వ్యవస్థ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి స్థాయిలో రాజకీయ నిర్ణయాలు ఎంతగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశాయో, చట్టాలను ఎంతలా అపహాస్యం చేశాయో తెలుస్తున్నది. పిఎసి అనేది సంఖ్యాపరంగా గానీ, స్వభావరీత్యా గానీ చూసినప్పుడు హిందూ పారామిలిటరీ ఫోర్సుగా ఉన్నదని హాషింపురా ఘటనపై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇచ్చిన రిపోర్ట్ తెలిపింది. పిఎసిలో కేవలం రెండు శాతం మాత్రమే ముస్లింలు ఉన్నారని చెప్పింది. యూదులకు వ్యతిరేకంగా నాజీలు సాగించిన బీభత్స కాండలాగా మొత్తంగా మైనారిటీల్లో తీవ్రమైన భయోత్పాతాన్ని సృష్టించేదిగా హాషింపురా హత్యాకాండ ఉన్నదని ప్రముఖ జర్నలిస్ట్ నిఖిల్ చక్రవర్తి అన్నాడు.

1984 సిక్కుల ఊచకోతలో గానీ, 2002 గుజరాత్‌లో ముస్లింల హత్యలు గానీ పోలీసులే ప్రత్యక్షంగా బాధితులను ఎత్తుకెళ్లి కాల్చిచంపిన

దాఖలాలు లేవు. అయితే పోలీస్ వ్యవస్థ దానికి వత్తాసుగా నిలిచిందనేది వాస్తవం. కానీ 1987లో మీరట్‌లోని హాషింపురా విషయంలో ప్రభుత్వ సాయుధ దళాలే ముస్లింలన్న ఒకే ఒక్క కారణం చేత 42 మందిని అందరూ చూస్తుండగానే తమ కస్టడీలోకి తీసుకుని ఆ తరువాత కొన్ని గంటల్లోనే సర్వీస్ రైఫిల్స్‌తో కాల్చి చంపేశారు. ఇది మతకల్లోలాల నేపథ్యంలో రాజ్యం చేత ప్రేరేపించబడిన దారుణమైన ముస్లిం హత్యాకాండగా చరిత్రలో చోటు చేసుకున్నది. మొత్తంగా ముస్లింలపై జరిగే దాడుల్లో ప్రధానంగా కనిపించేది, వినిపించేది ముస్లింల వల్లనే శాంతికి విఘాతం కలుగుతుందని కనుక వారికి తగిన గుణపాఠం చెప్పాలని, చెప్పడం సరైనదేనని అనుకోవడం. ఇది సెక్యులర్, ప్రజాస్వామిక వ్యవస్థగా చెప్పబడుతున్న దేశంలో తీవ్రమైన, ప్రమాదకర ధోరణిని సూచిస్తున్నది.

హాషింపురా ఘటన తరువాత నాలుగేళ్లకు 1991లో బిజెపి ఉత్తరప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చింది. బిజెపి అధికారంలో ఉన్నప్పుడు 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదును కూల్చివేశారు. అంతకుముందు దేశవ్యాప్తంగా అద్వానీ చేసిన రథయాత్ర, రాముని గుడికోసం తలపెట్టిన ఇటుకల సేకరణ కార్యక్రమాలు బాబ్రీ మసీదు కూల్చివేత భూమికగా పనిచేశాయి. ఆ తరువాత క్రమేపీ పలు రాష్ట్రాల్లో బిజెపి అధికారంలోకి రావడం గమనించవచ్చు. క్రమంగా మత విద్వేష రాజకీయాలతో ఆర్ఎస్ఎస్ రాజకీయ రూపం అయిన బిజెపి బలం పుంజుకుంటున్నది. హిందూ మతం పేరుతో ఇతర మతాలను ప్రత్యేకించి ఇస్లాం, క్రిస్టియానిటీలను బూచిగా చూపిస్తూ పోలరైజేషన్ చేయడంలో సఫలీకృతం అవుతున్నది. దేశవ్యాప్తంగా ఎక్కడ వీలైతే అక్కడ హిందూ మతశక్తులు ఏ చిన్న సంఘటనకైనా మతం రంగును పులిమి మారణ హోమాలకు సిద్ధపడుతూ వచ్చాయి. వీటికి నేపథ్యాలుగా సావర్కర్, గోల్వాల్కర్‌ల మత విద్వేష, విషపూరిత సిద్ధాంతాలు, భావజాలాలు బలంగా పని చేస్తున్నాయి. ఆ క్రమంలోనే స్వాతంత్ర్యా నంతరం దేశవ్యాప్తంగా ఎన్నో చోట్ల మతకల్లోలాలు జరిగాయి. సున్నితమైన మత విశ్వాసాలను పునాదిగా చేసుకుని దేశవ్యాప్తంగా విద్వేషపూరిత రాజకీయాలు నడుపుతూ అనేక రాష్ట్రాల్లో, చివరకు కేంద్రంలో సొంతబలంపై ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థాయికి బిజెపి ఎదిగింది. ఒకప్పుడు ఇద్దరు పార్లమెంట్ సభ్యులున్న బిజెపి క్రమేపీ 1996లో కేంద్రంలో 13 రోజుల పాలన చేసింది. తదుపరి 1998 ఎన్నికల్లో, 1999 ఎన్నికల్లో సంకీర్ణ ప్రభుత్వం(ఎన్‌డిఏ) పేరుతో కేంద్రంలో అధికారంలోకి రాగలిగింది. 2014 ఎన్నికల్లో పూర్తిగా సొంత మెజారిటీ పొంది బిజెపి పాలన కొనసాగిస్తున్నది. ప్రస్తుతం ఎనిమిది రాష్ట్రాల్లో గతం నుంచి నేటి వరకు మొత్తంగా పన్నెండు రాష్ట్రాల్లో బిజెపి అధికారంలోకి వచ్చింది. రాజకీయాలపై, రాజకీయ అధికారంపై సంఘ్ పరివార్ శక్తుల పట్టు పెరుగుతున్నది. ఇది దేశంలో ప్రజాస్వామిక లౌకిక సమానత్వ విలువలకు జరుగుతున్న ప్రమాదాన్ని తెలియ పరుస్తున్నది.

మొత్తంగా పోలీస్, రాజకీయ, పౌరపాలన, సైనిక వ్యవస్థల మధ్య ప్రత్యక్ష, పరోక్ష అనుకుని, అనుకోని సమన్వయం సహాయ సహకారాల వల్ల హాషింపురా దుర్ఘటనలో తీర్పుకొరకు 28 ఏళ్లు సాగదీయబడింది. ఆ తీర్పులో దోషులెవరికీ శిక్షలు విధించబడలేదు. ఈ సాగతీత క్రమంలో మైనారిటీ మతస్తులపట్ల చూపిన భయంకరమైన అన్యాయం ఆ మతస్తులపై ఏ ప్రభావం చూపుతుంది? ఈ వ్యవస్థలపై ఏహ్యాభావం, కసి పెరిగి విపరీత మార్గాలకు చర్యలకు పాల్పడితే ఎవరు బాధ్యు లవుతారు? ఇలాంటివి ఏ పరిణామాలకు దారులు వేస్తాయి? లౌకిక, ప్రజాతంత్ర శక్తులు, బలం పుంజుకోవాల్సిన అవసరాన్ని ఈ సందర్భం గుర్తు చేస్తున్నది. పాలనారంగ బ్యూరోక్రసీలో గానీ, పోలీసు న్యాయ వ్యవస్థలో గానీ, విద్యా వ్యవస్థలో గానీ, మొత్తంగా అన్నిరంగాల ప్రభుత్వ వ్యవస్థల్లోని ఉన్నతస్థాయి నుంచి నిమ్నస్థాయి ఉద్యోగుల్లో వ్యక్త, అవ్యక్తంగా అంతరంగాలలో విద్వేషపూరిత మత భావజాలం వేళ్లూను కొనదాన్ని బద్దలు చేయవలసి ఉన్నది. దీనికొరకు ప్రణాళికా బద్ధమైన కార్యక్రమాల అవసరం ఎంతగానో ఉన్నది. కులం పునాదుల మీద, మతం పునాదుల మీద మీరు ఒక జాతిని గానీ, నీతిని గానీ నిర్మించలేరని అంబేద్కర్ అన్నారు. ఈ స్ఫూర్తిలో లౌకిక ప్రజాస్వామిక విలువల కొరకు కృషి చేయవలసి ఉన్నది. బిజెపి హిందూ మతం పేరుతో పోలరైజేషన్ చేస్తూ బలం పెంచుకుంటున్న నేపథ్యంలో ఇతర రాజకీయ పార్టీలు ఓట్ల వేటలో అధికార పందెంలో నెమ్మదినెమ్మదిగా హిందూ ఓట్లకు దగ్గరవడం అవసరంగా మారుతున్నది. ఆ క్రమంలో మైనారిటీల భద్రత హక్కుల సాధన కొరకు మొత్తంగానే దళిత బహుజన ఆదివాసి అట్టడుగు ప్రజానీకం హక్కుల సాధన కొరకు సమానత్వ దిశలో జరిగే సామాజిక పోరాటాల ఆవశ్యకత ఎంతో ఉన్నది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

వీక్షణం విడి ప్రతి కొనుగోలుదారులకు ఒక క్షమాపణ, ఒక విజ్ఞప్తి

వీక్షణం పాఠకులలో దాదాపు సగం మంది వీక్షణంకు చందాదారులు కారు, ఏనెలకానెల తమ తమ ప్రాంతాలలో వార్తాపత్రికలు అమ్మే దుకాణాలలో విడి ప్రతి కొనుక్కుని చదువుతుంటారు. గత రెండు నెలలుగా ఆ దుకాణాలలో వారికి వీక్షణం దొరకడం లేదు. రెండు రాష్ట్రాలలోని దాదాపు 300 న్యూస్ స్టాల్స్‌లో వీక్షణం పంపిణీ చేస్తూ ఉండిన ఆనంద్ ఏజెన్సీస్ వీక్షణంను ఇప్పుడు పంపిణీ చేయడం లేదు. మరొక రాష్ట్ర వ్యాప్త సోల్ ఏజెన్సీ గాని, ఎక్కడికక్కడ ఏజెన్సీలు గాని ఏర్పడేవరకూ న్యూస్ ఏజెంట్ల దగ్గర వీక్షణం దొరకదని చెప్పడానికి చింతిస్తున్నాం. పాఠకులకు కలుగుతున్న ఈ అసౌకర్యానికి క్షమించవలసిందిగా కోరుతున్నాం.

ఇప్పటిదాకా ఏనెలకానెల విడిప్రతి కొనుక్కుంటున్న పాఠకులు, అభిమానులు చందాదారులుగా చేరవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. ఎక్కువ కాపీలు అమ్మకం అయ్యే ప్రాంతాలలో, పట్టణాలలో కొత్త, నమ్మకమైన ఏజెంట్లను ఏర్పాటు చేయవలసిందిగా మిత్రులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

– సర్క్యులేషన్ మేనేజర్, *9949391028*

ఊరటనివ్వని పదవ పిఆర్‌సి

***ప్రభుత్వ ఉద్యోగులకు రాజ్యాంగం కల్పించిన కనీస హక్కులను కూడా తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదనీ, తమ న్యాయమైన హక్కులను సాధించుకోవడానికి పోరాటం తప్ప వేరే మార్గం లేదనీ అంటున్నారు* ఎ. నర్సింహారెడ్డి**

బ్రిటిష్ ఇండియాలో 1939కి పూర్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు దాదాపు సమాన వేతనాలు, భత్యాలు ఉండేవి. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. జీవన వ్యయానికి వేతనాలకు పొంతన లేనందున దేశ వ్యాప్తంగా వేతనాల పెరుగుదలకు ఆందోళనలు సాగాయి. 1942 నాటికి ఈ ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. మద్రాసు ప్రావిన్స్‌లో ఎన్‌జిఒలు ఆందోళనకు దిగారు. 1942లో ప్రప్రథమంగా ప్రభుత్వం ఉద్యోగులకు కరువు భత్యం (డిఎ) ప్రకటించింది. అయితే కరువు భత్యం పెంపు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెంచలేదు. కరువు భత్యం పెంచినా పెరుగుతున్న ధరలకు తట్టుకోలేక, జీతాలు చాలక, బతుకే దుర్భరమైన వేళ ఉద్యోగుల ఉద్యమం ఉధృత మైంది. ఫలితంగా భారత ప్రభుత్వం 1946లో ఫెడరల్ కోర్టు జడ్జి సర్ శ్రీనివాస వరదాచారి అధ్యక్షతన పే కమిషన్‌ను నియమించింది. అదే సమయంలో మద్రాస్ ప్రభుత్వ రెవెన్యూ మంత్రి కె.ఆర్.కరంత్ అధ్యక్షతన మరో పే కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల కోసం నియమించింది. భారత ప్రభుత్వ పే కమిషన్ సిఫారసులకు, మద్రాసు రాష్ట్ర ప్రభుత్వ పే కమిషన్ సిఫార్స్‌లకు మధ్య చాలా వ్యత్యాసం ఉన్నది. కేంద్ర ఉద్యోగుల వేతనాలు రాష్ట్ర ఉద్యోగుల వేతనాల కంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువగా ఉన్నవి.

1947, ఆగస్ట్ 15న వలస పాలకుల నుండి అధికార మార్పిడి జరిగి 68 ఏళ్లు కావస్తున్నా ఒకే విధమైన పని, ఒకే ప్రాంతంలో పని, ఒకే విద్యార్హతలు కలిగి ఉన్న కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మధ్యనున్న వేతన వ్యత్యాసం సరిచేయక పోవడం నేటికి కొనసాగుతున్న ఒక అసంబద్ధం. ఈ వ్యత్యాసం నేటికి కొనసాగడం శోచనీయం. కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల, ఉద్యోగుల, ఉపాధ్యాయులకు పెరుగుతున్న ధరల కనుగుణంగా కొనుగోలు శక్తి క్షీణించకుండా, గౌరవ ప్రదమైన జీవితాన్ని గడిపేలా ఎప్పటికప్పుడు వేతనాలను సవరించవల్సి ఉంటుంది. ఉద్యోగుల వేతనాల సవరణ ప్రభుత్వాల దయాదాక్షిణ్యం కాదు. అది ఉద్యోగులకు రాజ్యాంగం కల్పించిన హక్కు. అంతర్జాతీయ న్యాయ సూత్రాల కనుగుణంగా, భారత ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలపైన అంగీకరించిన అంశాల ప్రాతిపదికన న్యాయబద్ధంగా ఉద్యోగులకు వేతనాలు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. ఈ న్యాయబద్ధమైన హక్కు కొరకు కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోరాటాలు చేయక తప్పని దుస్థితి నేటికి కొనసాగుతుంది. ఇప్పటి వరకు కేంద్రం ఆరు వేతన సవరణ కమిషన్లు వేసింది. ప్రస్తుతం ఆరవ వేతన సంఘం సిఫారసులను 1-1-2006 నుండి అమలు చేస్తుంది. 7వ వేతన సవరణ సంఘాన్ని 2016 లోగా నియమించవలసి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పదవ వేతన సంఘం సిఫారసులను ఇటీవలనే ప్రకటించింది.

కేంద్ర ప్రభుత్వం నియమించిన 'న్యాయ వేతనాల కమిటీ' మూడు రకాల వేతనాలను సిఫారసు చేసింది. ఒకటి – రోజు వారి జీవితాన్ని సాగించడానికి 'కనీస వేతనం', రెండు – ఆనాటి పరిస్థితులను, భవిష్యత్ అవకాశాలను బట్టి 'న్యాయ వేతనం', మూడు – 'జీవన వేతనం' ఇవ్వాలని నిర్ణయించింది. కాబట్టి, ఏ వేతన సవరణ సంఘమైన శాస్త్రీయమైన వేతనాలను సిఫారసు చేయడానికి కనీసం మూడు అంశాలను విధిగా పరిగణలోకి తీసుకోవల్సి ఉంటుంది. అవి 1. జీవన వ్యయ ప్రమాణం 2. కుటుంబ దైనందిన అవసరాలు 3. సమాన పనికి సమాన వేతనం. జీవనవ్యయ ప్రమాణాన్ని వినియోగ పాయింట్లలో సూచిస్తారు. ఉద్యోగుల వేతన స్కేళ్లను రూపొందించడానికి వేతన సవరణ కమిషన్ ఆనాడు ఉన్న ధరలు, ద్రవ్యోల్బణం, విద్యార్హతలు, పనిభారం, పనిచేసే ప్రాంతం, పని బాధ్యతలు పరిగణలోకి తీసుకోవాలి. కాని ప్రభుత్వాలు వేతన సవరణ కమిషన్ నియామక ఉత్తర్వుల్లోనే ప్రభుత్వ ఖజానాను, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకోవాలని ఆదేశించడం గమనార్హం. ఈసారి 2013 జూలై 1 నాడు ఎంత డి.ఎ. వేతనంలో కలుపాలి, ఫిట్‌మెంట్ ఎంత శాతం ఇవ్వాలో సూచించమని ప్రభుత్వం కోరింది.

2014 జూన్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విభజన జరిగింది. మేలో జరిగిన ఎన్నికల్లో గెలిచి ఆంధ్రలో చంద్రబాబు, తెలంగాణలో కెసిఆర్ ముఖ్యమంత్రులయ్యారు. బాబు ఉద్యోగుల పదవి విరమణ వయస్సును 58 నుంచి 60 ఏళ్లకు పెంచాడు. తెలంగాణ ఉద్యోగులకు కెసిఆర్ లాయల్ ఇంక్రిమెంట్ ప్రకటించారు. దీంతో రెండు రాష్ట్రాలలో ఉద్యోగ సంఘాల నాయకులు పదవ పిఆర్‌సి అమలు విషయం మరచిపోయారు. తెలంగాణ ముఖ్యమంత్రి దసరా కానుక, సంక్రాంతి కానుక అంటూ కాలయాపన చేశారు. మరోవైపు పిఆర్‌సి నివేదికను పరిశీలించడానికంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జిఒఎంఎస్ 5 (జిఎడి), 12-01-2015 ద్వారా కె. ప్రదీప్‌చంద్ర చైర్మన్‌గా ఒక ఉన్నతస్థాయి కమిటీని వేసి పిఆర్‌సి వ్యవహారం తేల్చమని ఆదేశించింది. మరోవైపు మాది ఉద్యోగ ఫ్రెండ్లీ ప్రభుత్వమంటూ ఊరిస్తుంటే, ఉద్యోగ సంఘాల నాయకులేమో 69 శాతం ఫిట్‌మెంట్ సాధిస్తామంటూ బీరాలు పలికారు. కేంద్రప్రభుత్వ ఉద్యోగుల కంటే మెరుగైన వేతనాలు ఇస్తామన్న ప్రభుత్వం, సాధిస్తామన్న నాయకులు విఫలమయ్యారు.

1961లో పారిస్ కాన్ఫరెన్స్ ఉపాధ్యాయుల సామాజిక, ఆర్థిక అంతస్తు పెరిగే విధంగా వేతనాలు చెల్లించాలని సిఫారసు చేసింది. అలాగే 1957లో జరిగిన 15వ భారత కార్మిక కాన్ఫరెన్స్ ఉద్యోగులకు, కార్మికులకు కనీస వేతనాలను నిర్ధారించేందుకు పలు ప్రతిపాదనలు చేసింది. 15వ ఐ.ఎల్.సి. సమావేశం ప్రతి కుటుంబానికి 4 గురు సభ్యులు ఉంటారని, ఇద్దరు పెద్దలు, ఇద్దరు పిల్లలు. అయితే ఇద్దరు పిల్లలను ఒక యూనిట్‌గా పరిగణించి 'అవసరాల ప్రాతిపదికగా కనీస వేతనం' ఉండాలని నిర్ణయించింది. ఆ మేరకు ప్రతి కుటుంబాన్ని 3

వినియోగ యూనిట్స్‌గా పరిగణించింది. ఒక్కొక్కరికి అవసరమగు నిత్యావసర వస్తువులను పోషకాహార నిపుణుల సూచనల సలహాలతో నిర్ణయించింది. ఆ విధంగా ఒక కుటుంబానికి మూడు వినియోగ యూనిట్స్‌కు (సియుఎస్) అయ్యే ఖర్చును లెక్కించింది. దీనికి అదనంగా 20 శాతం ఇంధనం, విద్యుత్తు, మంచినీరు మొదలగు అవసరాలకు ఖర్చవుతుందనీ, ఆ మొత్తంపై 25 శాతం విద్య, వైద్యం, వినోదం, ఆటవిడుపు, పండుగలు, కుటుంబంలో పెళ్లిళ్లు మొదలైన వివిధ సందర్భాలలో అవసరమవుతుందనీ 15వ ఐ.ఎల్.సి. నిర్ణయించింది. తల్లిదండ్రులను కుటుంబం పరిధిలోకి తీసుకోలేదు. మొత్తంగా కుటుంబం అంటే మూడు వినియోగ యూనిట్లుగా పరిగణించి కనీస వేతనం నిర్ణయిస్తున్నారు. ఈ విధానం ఇప్పటికి మారలేదు. వాస్తవానికి ఇవాళ్టి పరిస్థితులు 1957 కంటె చాలా భిన్నంగా ఉన్నాయి. పిల్లలకు పెద్దల కంటె ఎక్కువ ఖర్చులు అవుతున్నాయి. కావున కుటుంబం అంటే నాలుగు వినియోగ యూనిట్స్‌గా పరిగణించాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుల స్కేళ్లను ఆచార్య ఛటోపాధ్యాయ విద్యా కమిషన్ సిఫారసుల మేరకు ఉపాధ్యాయులందరికీ ఒకే వేతన వ్యవస్థ ఉండాలనీ, తదనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇస్తున్న వేతన స్కేళ్లను రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇవ్వాలి. 20 రాష్ట్రాలు ఉపాధ్యాయులకు కేంద్రం ఇస్తున్న స్కేళ్లను అమలు చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలు మాత్రం ఆ దారిలో ఆలోచించడం లేదు.

అదుపులేని ద్రవ్యోల్బణంతో నిజవేతనాలు తగ్గుతున్నాయి. వినియోగదారుల సూచి కూడ మారుతున్న పరిస్థితులకనుగుణంగా ఉండడం లేదు. 'ఫ్యామిలి లివింగ్ సర్వే' ఆధారంగా వేతనాలను నిర్ణయిస్తున్నారు. ఇందులో 160 రకాల ఆహార, ఆహారేతర పదార్థాలను పరిగణలోకి తీసుకుంటున్నారు. దినదినం పెరుగుతున్న విద్య, వైద్య, రవాణా, ఇంటర్‌నెట్, ఫోన్లు వగైరా ఖర్చులు పరిగణలోకి తీసుకోవడం లేదు. వినియోగదార్ల సూచిని ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి నిర్ధారించాలి. కాని మనదేశంలో 1982 తర్వాత 2001లో నిర్ధారించారు. 14 ఏళ్ల తరువాత కూడా ఈ సూచి మారకపోవడంతో పాటు ఉద్యోగుల వినియోగ వస్తువుల్లో మార్పులు వచ్చినప్పటికీ వాటిని పరిగణలోకి తీసుకోనందున ఉద్యోగులు సరైన వేతనాలు పొందలేక పోతున్నారు. మరోవైపు ఉద్యోగుల కరువు భత్యాన్ని టోకు ధరల సూచి ఆధారంగా నిర్ణయిస్తున్నారు. కాని ఉద్యోగులు వారికి కావాల్సిన వస్తువులను చిల్లర దుకాణాలలో కొంటారు. కావున వినియోగ ధరల సూచి ఆధారంగా కరువు భత్యాన్ని చెల్లించకపోవడం వలన నిజ వేతనాలు పడిపోతున్నాయి. దేశంలో నిరుద్యోగం పెరుగుతున్నందున పిల్లలు 30 సంవత్సరాల వరకు తల్లిదండ్రులకు భారంగానే ఉంటున్నారు. పైగా వయోవృద్ధులైన తల్లిదండ్రుల వైద్య ఖర్చులు పెరిగాయి. అందువలన కుటుంబం అంటే కనీసం నలుగురు సభ్యులుగా గుర్తించాల్సి ఉంటుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ఫించనుదార్ల ఫించన్లు పెంపుదల కోసం, (పి.ఆర్.సి.) ప్రదీప్ కుమార్ అగర్వాల్, ఐఎఎస్ (రిటైర్డ్) నేతృత్వంలో 2013 ఫిబ్రవరి 28న ప్రభుత్వం 10వ వేతన సవరణ సంఘాన్ని నియమిస్తూ జి.ఒ 95 ఉత్తర్వు జారీ చేసింది. ఒక సంవత్సరం లోపల తన నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ఫించనుదార్ల సంఘాలు తమ ప్రతిపాదనలను జూన్ 29 లోపల కమిషనర్‌కు అందజేశాయి. నూతన వేతన స్కేళ్లు 2013 జూలై ఒకటి నుండి అమలులోకి రావాల్సి ఉంది. ఎన్నికల సంఘం పార్లమెంట్‌కు, రాష్ట్ర అసెంబ్లీకి 2014 ఏప్రిల్ / మేలో సాధారణ ఎన్నికలు నిర్వహించడానికి షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఎన్నికల కంటే ముందే పదవ పిఆర్‌సి అమలు చేయించుకోవాలన్న ఉద్దేశ్యంతో ఉద్యోగ సంఘాలు ఈసారి తాత్కాలిక భృతిని (ఇంటీరిమ్ రిలీఫ్‌ను) డిమాండ్ చేయలేదు. కాని 2014 జనవరి నుండి 27 శాతం ఐఆర్‌ను ప్రభుత్వం ప్రకటించింది. దీంతో 2014 మేలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల కంటే ముందే నూతన వేతనాలు పొందాలనే ఆశ ఆవిరై పోయింది. ఎన్నికల ముందు పదవ పిఆర్‌సి అమలు కాదని తేలిపోయింది.

కేంద్ర ప్రభుత్వ ఉపాధ్యాయుల వేతనం (01-01-2015)

కేటగిరి	వేతనం	డిఏ 113శాతం	మొత్తం
కేటగిరి1	21000	23,730	44730
కేటగిరి 2	17140	19,368	36,508
కేటగిరి 3	13500	15,255	28,755

రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయుల వేతనం (01-01-2015)

కేటగిరి	వేతనం	డిఏ 12శాతం	మొత్తం
కేటగిరి 1	35,120	4,214	39,334
కేటగిరి 2	28940	3,473	32,413
కేటగిరి 3	21230	2,548	23,778

పై పట్టికలను గమనిస్తే జనవరి 2015 నాడు కేంద్ర ప్రభుత్వ ఉపాధ్యాయుల కంటే రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులు కేటగిరి 1 వారు రు.5366, కేటగిరి 2 వారు రు.4095, కేటగిరి 3 వారు రు.4977లు తక్కువగా పొందుతారు. 2016లో కేంద్ర ప్రభుత్వం ఏడవ వేతన సవరణ సిఫారసులు ప్రకటిస్తే ఈ వ్యత్యాసం మరింత పెరుగుతుంది. ఈ వ్యత్యాసం ఉపాధ్యాయులకే కాదు ఉద్యోగులకు కూడ కొనసాగుతుంది. వాస్తవ పరిస్థితి ఈవిధంగా ఉంటే ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు మంచి వేతనాలు వచ్చాయని సంబరపడడం ఆత్మవంచన తప్ప మరొకటి కాదు. గత పిఆర్‌సిలో చోటు చేసుకున్న అసంబద్ధాలు ఏ ఒక్కటి పదవ పిఆర్‌సి సవరించలేదు సరికదా! మరిన్ని నూతన అసంబద్ధాలు ఈ పిఆర్‌సిలో చోటు చేసుకున్నాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పించన్ దార్ల సంఘాలు చేసిన విజ్ఞప్తులను పదవ పిఆర్‌సిగాని, ప్రభుత్వం గాని పరిశీలించలేదు. కనీస వేతనం రు.15000 ఉండాలన్న నాలుగవ తరగతి ఉద్యోగుల వేదన ప్రభుత్వం గుర్తించనేలేదు. ఇక పెన్షనర్ల సమస్యలు ఏ ఒక్కటి పరిష్కారానికి నోచుకోలేదు. తొమ్మిదవ పిఆర్‌సిని కాపీ చేసినట్లుంది నివేదిక.

పదవ పిఆర్‌సి నూతన స్కేళ్లను రూపొందించి 01-07-2013 నాడున్న 63 శాతం డిఎను, 29 శాతం ఫిట్‌మెంట్‌ను కలుపుటకు సిఫారసు చేసింది. ప్రభుత్వం 43 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడం వలన 01-07-2013 ముందు పదోన్నతి పొందిన ఉద్యోగి/ ఉపాధ్యాయుని వేతనంలో రెండు వేల రూపాయలపైగా తేడా వస్తుంది. ఒకరోజు లేదా ఒక నెల ఆలస్యంగా పదోన్నతి పొందిన ఉద్యోగికి ఆర్థిక నష్టం వచ్చేలా నూతన వేతన స్కేళ్లను రూపొందించారు. ఉదాహరణకు ఒక సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు 01-06-2013 పదోన్నతి పొందితే అతని పే రు. 10900, డిఏ 63 శాతం డిఏ రు.6867, 43 శాతం ఫిట్‌మెంట్ రు.4687 మొత్తం రు. 22,454లు కాగా, నెక్స్ట్ స్టేజి 22460 వద్ద వేతన స్థిరీకరణ అవుతుంది. అదే

అమ్మకానికి ఆంధ్రప్రదేశ్ - రెండో అంకం

మూడు పంటలు పండే వేలాది ఎకరాల భూములను లాక్కొని అభివృద్ధి పేరుతో విదేశీ కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెడుతూ ప్రభుత్వం రైతులను జీవనోపాధికి, వ్యవసాయానికి దూరం చేస్తోందని అంటున్నారు **పి.వి. రమణ**

'అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టు పెట్టి' అని చెరబండ రాజు కవితలో చెప్పినట్టు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని నడిబజారులో మళ్లీ అమ్మకానికి పెట్టేశారు. చైనా పత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ 'చైనా కమ్యూనిస్టు పార్టీ పాలనలో ఉన్నందున దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయగలుగుతుంది. భారత్‌లో మాకు ఆ అవకాశం లేదు. మా గడువు 5 సంవత్సరాలే. దానిని దృష్టిలో ఉంచుకునే మా ప్రణాళికలను రూపొందించుకోగలం'అని అన్నారు. దీన్ని బట్టి గతంలో కన్నా ప్రచార హోరు, దూకుడూ పెంచడానికి కారణం మనకు సులువుగానే అర్థమవుతుంది. ఐదేళ్లకు ఒకసారి ఎన్నికయ్యే పద్ధతి చికాకుగా ఉంది. ప్రపంచంలోనే కనీ వినీ ఎరుగని భారీ విధ్వంసం చైనాలోనే జరుగుతుందని, దానికి వ్యతిరేకంగా అక్కడి ప్రజలు బ్రహ్మాండమైన పోరాటాలు చేస్తున్నారని గానీ చంద్రబాబుకు పట్టదు. కానీ చైనా పాలకుల వేగం నచ్చింది. అందుకే అక్కడిలాగే 60 అంతస్తుల భవనాన్ని నిర్మించి, అందులో 57వ అంతస్తులో తన సింహాసనాన్ని ఏర్పాటు చేసుకోవాలనుకుంటున్నారు. దీన్ని సాధించడం కోసం లక్షలాది ఎకరాల పంట భూములు, కోట్లాది ప్రజల జీవనాధారం అయిన జల వనరులు, అడవులు, తీర ప్రాంతం, సమస్తమూ కార్పొరేట్ శక్తులకు ధారపోయడానికి చంద్రబాబు నడుం బిగించారు. ఆ వివరాలు చూద్దాం.

ఏప్రిల్ 1న రాష్ట్ర పారిశ్రామిక విధానాన్ని ప్రకటిస్తూ పరిశ్రమల కోసం 10 లక్షల ఎకరాల భూమి బ్యాంకును ఏర్పాటు చేస్తానన్నారు. సింగిల్ డెస్క్ విధానంతో 21 రోజులలోనే పరిశ్రమలకు అనుమతి లభిస్తుందని చెప్పారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో పరిశ్రమల కమిషనర్‌కు అనుమతులిచ్చే అధికారం ఇస్తున్నామన్నారు. 5 సంవత్సరాలు విద్యుత్ రాయితీ కింద యూనిట్‌కి 1 రూపాయి తిరిగి చెల్లిస్తామని, భూమి కొనుగోలు, బదిలీ, తనఖాలకు 100 శాతం స్టాంపు రుసుము మినహాయింపు కల్పిస్తున్నామన్నారు. భూమి లీజు 99 సంవత్సరాలకు పొందవచ్చని, ఆటోమొబైల్ పరిశ్రమలలో కార్మికుల మెరుపు సమ్మెలు లాంటివి నిరోధానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విశాఖలో 'మౌలిక సదుపాయాల మిషన్'ను ప్రారంభిస్తూ దీనిలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో 12.44 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టబోతున్నామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు పెట్టాలనుకున్న వారికి రెడ్ టేపిజం ఉండదని, వారికి ఎర్రతివాచి వేసి స్వాగతం పలుకుతామని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఆరు విమానాశ్రయాలకు అదనంగా మరో 8 విమానాశ్రయాలు నిర్మిస్తామన్నారు. తూర్పు తీరంలో విశాఖ నగరాన్ని లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, సింగపూర్, జపాన్, చైనా, థాయ్‌లాండ్, దక్షిణ కొరియాలతో వాణిజ్య సంబంధాలకు ఇది ముఖద్వారం అవుతుందని చెప్పారు.

పశ్చిమ గోదావరిలో 'స్మార్ట్ విలేజ్, స్మార్ట్‌వార్డ్' పథకాన్ని ప్రారంభిస్తూ, 'గ్రామాల్లోని పేదలకు అభివృద్ధి ఫలాలు అందకుండా స్మార్ట్ ప్రపంచాన్ని

01-07-2013 తర్వాత పదోన్నతి పొందితే పే రు. 21230లు మినిమం ఆఫ్ ద టైమ్ స్కేల్‌లో ఉంటారు. ఒక్కరోజు వెనుకయినందుకు వ్యత్యాసం రు. 1230లు ఉంది. ఇలా అన్ని కేడర్ల పదోన్నతిలో ఈ అనామలి కనిపిస్తుంది. 2010 వేతన స్కేళ్లలోని మినిమం వేతనానికి 63 శాతం డి.ఎ., 43 శాతం ఫిట్‌మెంట్ కలిపితే దాదాపు మినిమం ఆఫ్ న్యూ స్కేలు కావాలి. కాని ఒకటి రెండు స్టేజీలు పైన వేతన స్థిరీకరణ జరుగుతుంది. ఇది సర్వీసులో ఉన్న వారికి ప్రయోజనం కలిగించవచ్చు, కాని నూతనంగా పదోన్నతి పొందేవారికి, నూతనంగా నియామకం అయ్యేవారికి నిజ వేతనం లభించదు.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.సి.ఆర్ రాష్ట్ర ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకంటే మెరుగైన స్కేళ్లు అమలు చేయనున్నట్లు పలుమార్లు ప్రకటించారు. కనీసం కేంద్ర-రాష్ట్ర ఉద్యోగుల మధ్య ఉన్న వేతన వ్యత్యాసాన్ని ముఖ్యమంత్రి దృష్టికి సంఘాల నాయకులు తీసుక వచ్చారా? లేదా? తెలియదు. ఇక నూతన వేతనాలు 01-07-2013 నుండి అమలులోకి రావాలి. అయితే ఆర్థిక ప్రయోజనాన్ని రాష్ట్రం ఏర్పడిన తేదీ 02-06-2014 నుండి అమలు చేయడం వలన ఉద్యోగులు 11 మాసాలు ఎరియర్స్ కోల్పోతున్నారు. ఇక జూన్ 2014 నుంచి ఫిబ్రవరి 2015 వరకు రావలసిన ఎరియర్స్ జి.పి.ఎఫ్‌లో కలుపు తామని మొదట ప్రకటించారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రి బాండ్లు అన్నారు. ముఖ్యమంత్రి మౌనం వహించారు. ఉద్యోగుల్లో స్పందన లేదు. బహుశ మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ గ్ర్యాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల ఫలితాలు చూస్తే అంతర్లీనంగా ఉద్యోగుల ఆగ్రహం వ్యక్తమైనట్లు కనిపిస్తుంది. ఇవాళ్టికీ జూన్ 2014 నుంచి ఫిబ్రవరి 2015 (9 మాసాలు) కాలపు బకాయిలు ఎలా చెల్లిస్తారో స్పష్టం చేయలేదు. నూతన వేతనాలు మార్చ్ జీతం ఏప్రిల్ ఒకటిన పొందు తారన్నారు. అయితే నూతన వేతనాలు ఏప్రిల్ వేతనంతో మే ఒకటిన వచ్చే అవకాశం లేదు. ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తున్నది. హక్కులు ఆయాచితంగా రావు, ఉద్యమాల ద్వారా సాధించుకోవాలి. మనరాష్ట్రం ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు 2000 వరకు ఆదర్శంగా నిలిచింది. చరిత్ర మళ్లీ పునరావృతం అయితేనే ఉద్యోగులు హక్కులు సాధించుకుంటారు.

(రచయిత ఉపాధ్యాయ నాయకులు, రాజనీతి శాస్త్ర విద్యార్థి) వీ

రూపొందిస్తామని కబుర్లు చెపితే అర్థం ఉండదు' అన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి వారికీ ఇళ్లూ, మరుగు దొడ్డి, రక్షిత మంచి నీటి సదుపాయం ఉండాలి. నూటికి నూరు శాతం పిల్లలు పాఠశాలల్లో చేరాలి. అందరికీ జీవనోపాధి లభించాలి. ఇటువంటి 20 అంశాలను లక్ష్యాలుగా ఎంచుకున్నామన్నారు.

దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సదస్సులో పాల్గొన్నప్పుడు వాల్‌మార్ట్ ఇంటర్‌నేషనల్ ప్రెసిడెంట్ డేవిడ్ ఛీజ్ రైట్‌ని ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామం. ఆగ్నేయాసియాకు లాజిస్టిక్ హబ్‌గా ఉంటుంది. పెట్టుబడులు పెట్టండి' అని ఆహ్వానించగా ఛీజ్‌రైట్ 'వేరుశెనగ, జీడిమామిడి, కొబ్బరి, జొన్న, చిరు దాన్యాలు, పండ్లు, అరటి, మామిడి, నిమ్మ, కోడిగుడ్లు, పాల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ ద్వారా రైతులకు సహకరించేందుకు సహాయం చేస్తానని, స్థానిక చిన్నా, సన్నకారు రైతుల నుండి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి వాటిని బ్రాండింగ్ చేసి విక్రయిస్తామని' హామీ ఇచ్చారు.

చిత్తూరు జిల్లా సత్యవేడు పారిశ్రామికవాడ శ్రీసిటీలో 86 ఎకరాల్లో 1200 కోట్ల రూపాయల వ్యయం అంచనాతో పెప్సికో కంపెనీ ప్లాంట్ ప్రారంభించినపుడు 'ఇక్కడ ప్రజలు మంచివారు. మీ ఆస్తులకు మాది బాధ్యత. ఇక్కడ ఉద్యమాలు ఉండవు. బెదిరింపులు అంతకంటే ఉండవు. నిశ్చింతగా ఉండే వాతావరణం కల్పించే బాధ్యత ముఖ్యమంత్రిగా నేను తీసుకుంటాను' అని హామీ ఇచ్చారు. పెప్సికో సి.ఇ.ఓ ఇంద్రానూయి మాట్లాడుతూ 'ఆంధ్రప్రదేశ్‌ను మామిడి గుజ్జు ప్రాంతంగా మారుస్తాం. చిత్తూరు జిల్లాలో పండే మొత్తం మామిడి పంటలను తామే కొనుగోలు చేస్తామనీ, దక్షిణ భారతదేశంలో పెప్సికో 33,000 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉందని' అన్నారు.

చంద్రబాబు జపాన్‌లో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను ఆటోమొబైల్ హబ్‌గా మారుస్తామన్నారు. టోక్యో, నాగసాకీ, యోకోహామా నగరాల తరహాలో నెల్లూరు, చెన్నై, తిరుపతిల మధ్య ప్రాంతాన్ని ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే ఇసూజు సంస్థ 1500 కోట్ల రూపాయల పెట్టుబడులతో పికప్ ట్రక్‌ల తయారీ యూనిట్‌ను శ్రీసిటీలో నెలకొల్పుతుందని అన్నారు.

సింగపూర్‌లో మాట్లాడుతూ 'రండి. పెట్టుబడులు పెట్టండి. మా రాష్ట్రంలో పారిశ్రామిక అశాంతి మచ్చుకైనా కనిపించదు. మీరు ధైర్యంగా పెట్టుబడులు పెట్టుకోవచ్చు. మీకు ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకుంటామని' హామీ ఇచ్చారు.

చైనాలో 'నేను డెంగ్ జియావో పింగ్‌కు అభిమానిని. చైనీయుల అభివృద్ధికి ఆకర్షితుడినయ్యాను. చైనీయులు సంస్కరణలకు అనుకూలురు. మనం పరస్పరం కలిసి పనిచేస్తే ప్రపంచానికే కొత్త అభివృద్ధి నమూనాను చూపవచ్చు' అని అన్నారు. చైనా పారిశ్రామిక వేత్తలకు 82 పేజీల రంగుల పుస్తకాన్ని అందజేస్తూ 'మా ప్రభుత్వం 25 రంగాలపై దృష్టి సారించింది. అక్కడ పారిశ్రామిక వాడల ఏర్పాటుకు మా రాష్ట్రం ఆహ్వానం పలుకుతుంది. మా దగ్గర ఉన్న అపార ఖనిజ సంపద, సహజ వనరులు పారిశ్రామిక వేత్తలకు కోట్లు కురిపిస్తాయి. మా దగ్గర శాంతి భద్రతల సమస్యలుండవు. దేశ సముద్ర తీరంలో 13 శాతం మా రాష్ట్రానికే ఉంది. దక్షిణ భారతదేశంలో ఏ రాష్ట్రానికీ లేనన్ని జలవనరులు మాకే ఉన్నాయి. 10 లక్షల ఎకరాల భూమి సిద్ధం చేస్తున్నాం. అన్ని సదుపాయాలతో పాటు, కార్మిక చట్టాలను కూడా మారుస్తాం. వ్యవసాయాధారిత పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్, ఐటి, డిఫెన్స్, ఏరోటెక్నాలజీ, ఆటో మొబైల్స్, పెట్రోలియం, కెమికల్స్, పెట్రో కెమికల్స్, విద్యుత్ కేంద్రాలు, ఖనిజ ఆధారిత పరిశ్రమలు, మైనింగ్, రోడ్లు, చమురు, గ్యాస్, అంతరిక్ష పరిశోధన, విమానయానం, పోర్టులు, రైల్వేలు, టూరిజం, ఆసుపత్రులు, నిర్మాణ రంగం, మీడియా, వినోదం అన్ని రంగాలలో పెట్టుబడులు పెట్టండి'అని ఆహ్వానించారు.

ఇక నూతన రాజధానిని ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా సింగపూర్, జపాన్ వంటి దేశాలు నిర్మించడానికి పోటీ పడుతున్నాయని, ఒక రాజధానిని నిర్మించడానికి వివిధ దేశాలు పోటీపడడం ఇదే ప్రథమమని అన్నారు. నూతన రాజధానిలో అన్ని సౌకర్యాలు కల్పించి దేవతలుండే స్థానంలా తీర్చిదిద్ది, ఆర్థిక సంపద కొందరికే కాకుండా అందరికీ అందేలా చూస్తామన్నారు. రాష్ట్రంలో ప్రతీ ఇంటిలో ఒక పారిశ్రామికవేత్త, ఒక కంప్యూటర్ నిపుణులు తయారు కావాలని పిలుపిచ్చారు. కొత్త రాజధాని గురించి రంగుల కలలను చూపిస్తున్న చంద్రబాబుకు ఒక్కసారి మయన్మార్ దేశ అనుభవం గురించి గుర్తు చేయాలి.

2005లో మయన్మార్ (బర్మా) మిలటరీ పాలకులు 'నేప్యిడా'లో కొత్త రాజధానిని 4 బిలియన్ డాలర్లు ఖర్చుతో 4800 చదరపు కిలో మీటర్ల భూమిలో నిర్మించారు. ఇది న్యూయార్క్ నగరం కన్నా ఆరు రెట్లు పెద్దది. అక్కడ అన్నీ భారీ సైజులో నిర్మాణం జరిగాయి. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 20 లైన్ల రోడ్లను నిర్మించారు. సఫారీ పార్క్, జూ, గోల్ఫ్ కోర్సులు, రోడ్లకు ఇరువైపులా పెద్దపెద్ద ఖరీదైన బంగ్లాలు, విల్లాలు, ఖరీదైన భారీ హోటళ్లు, భారీ షాపింగ్‌మాల్స్ నిర్మించారు. అక్కడ అన్నీ ఉన్నా లేనిది ప్రజలే. వెళ్లిన కొద్ది మందైనా భయంతో బతుకుతున్నారు. భద్రతలేని పరిసరాలను చూసి భయపడు తున్నారు. ఎక్కడ చూసినా హోటళ్లు, ప్రభుత్వ భవనాలు, అధికారుల విల్లాలే కనిపిస్తాయి తప్ప వీటి మధ్య అసలు రాజధాని ఎక్కడో తెలియని పరిస్థితి ఉంది. దానిపై ఒక భారతీయ విలేకరి 'ఇది నియంతల డిజైన్‌లా ఉంది' అని వ్యాఖ్యానించారు. ఇక్కడకు వచ్చిన ఒక వ్యాపార సంస్థ అక్కడ పరిస్థితిని భరించలేక పాత రాజధాని యాంగూన్‌కే తిరిగి వెళ్లిపోయింది. ఇతర దేశాల నుంచి వస్తున్న పర్యాటకులు దీనిని ఒక వింతగా భావిస్తున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు జరగాలి గాని, తమ ఇష్టానుసారం ఏర్పాట్లు చేసి అందర్నీ రమ్మంటే ఇలాంటి పరిస్థితే ఎదురవుతుందని వేరే చెప్పనక్కర్లేదు.

హైదరాబాద్‌లో కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు 'ఆంధ్రప్రదేశ్‌లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయి. వీటిని 2 నుండి 3 డిగ్రీలు తగ్గించగలిగితే మన రాష్ట్రానికి తిరుగుండదు. పెట్టుబడులు భారీగా వస్తాయి. పారిశ్రామిక వేత్తలు క్యూ కడతారు. ఉష్ణోగ్రతలు తగ్గించడానికి 47 లక్షల మొక్కలు పెంచాలని నిర్ణయం తీసుకున్నామని' చెప్పారు. మరొక సమావేశంలో మాట్లాడుతూ 'రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు నిధులు అవసరం లేదని, భూమినే ప్రధాన పెట్టుబడిగా పెట్టి వ్యాపారం చేయాలనే లక్ష్యంతోనే ఉన్నా'నని ప్రకటించారు.

వెంకయ్య నాయుడి విన్యాసం

ప్రపంచంలోని దేశాలన్నీ మన రాజధానులను, స్మార్ట్ సిటీలను నిర్మించడానికి పోటీలు పడుతున్నాయని చంద్రబాబు అంటుంటే కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్య నాయుడు భారత పరిశ్రమల సమాఖ్య చెన్నైలో 'స్మార్ట్ సిటీ'లపై ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతూ 'సింగపూర్, అమెరికా, జర్మనీ, ఆస్ట్రేలియా తదితర దేశాలు మన దేశంలో

నగరాల అభివృద్ధికి ఉత్సాహం చూపిస్తుండడంతో ఆ దేశాలు వాటిని నిర్మించి ఇస్తాయనే అపోహ ఉంది. అలాంటిది ఎవరూ చేయరు. అలాగే ఆకర్షణీయ నగరం అంటే కేంద్ర ప్రభుత్వం కొత్త నగరాలు నిర్మించి ఇస్తుందని అపోహల్లో కొంతమంది ఉన్నారు. అలా చేయడానికి మేమేమీ ఇంద్రులం కాదు. మా వద్ద మంత్రాలు లేవు' అని అన్నారు. దీన్ని బట్టి జరుగుతున్న ప్రచారానికి ఆచరణలో జరగబోయే పరిణామాలకు ఎంత తేడా ఉంటుందో అర్థమవుతుంది.

విశాఖలో ఏప్రిల్ 8న, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ స్మార్ట్ సిటీ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో వెంకయ్య నాయుడు మాట్లాడుతూ 'పనులన్నీ ప్రభుత్వమే చూసుకుంటుందన్న భావన ప్రజలలో ఉందని దాని నుండి బయటపడాలని సూచించారు. మార్పులకు అనుగుణంగా మానసికంగా ప్రజలు సిద్ధం కావాలని, పన్నులు కట్టకుండా, పన్నులు పెరగకుండా అభివృద్ధి జరగదని అన్నారు. తీర ప్రాంతాలలో ఎంతో అభివృద్ధికి అవకాశం ఉన్నా సిఆర్‌జెడ్ నిబంధనలు అడ్డంకిగా నిలిచాయన్నారు. అసలు ఆ నిబంధనలు ఎందుకు పెట్టారో కూడా అర్థంకాక అధికారులను అడిగానని, వారి నుండి సరైన జవాబు రావడం లేదని అన్నారు. సముద్ర తీరానికి అతి సమీపంలో నిర్మాణాల వల్ల ప్రమాదం ఉన్నా, 500 మీటర్ల వరకూ ఎందుకు నిషేధం ఉందో అంతు చిక్కడం లేదు. మార్పులు చేయడం అంత సులభం కాదని, దానికి ఎన్నో ఒత్తిడులు, విమర్శలు వస్తాయని వాటిని ఎదుర్కోవలసి ఉందని అన్నారు.

సిఆర్‌జెడ్ నిబంధనలను ఎందుకు పెట్టారో తెలియదని సాక్షాత్తు కేంద్రమంత్రి అంటుంటే అధికారులు, న్యాయమూర్తులు ఏమన్నారంటే– 'తీర ప్రాంతాన ఉన్న మడ అడవులు, బీల భూములు, అడవులను నిర్మూలించడం వల్లనే సముద్రతీరం కోత ప్రమాదానికి గురైంద'ని ప్రొఫెసర్ ఎం.ఆర్. మాధవరావు అన్నారు. 'విశాఖ బీచ్ కోత కాన్సర్ లాంటిదని, దాని ప్రమాదాన్ని సరిగ్గా నిర్ధారించి నయం చేయాలి. లక్ష్మణరేఖ లాంటి కోస్తా నియంత్రణ నిబంధనలను ధనవంతులు, పలుకుబడి ఉన్న వారు స్వేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు' అని ఉడా చైర్మన్ బాబురావు నాయుడు అన్నట్లుగా హిందూ దినపత్రికలో వచ్చింది.

సిఆర్‌జెడ్ నిబంధనల ప్రకారం తీర ప్రాంతానికి 500 మీటర్ల లోపున ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని ఉన్నా జివిఎంసి ఉడా సంస్థలు చేపట్టిన నిర్మాణాలను వ్యతిరేకిస్తూ మత్స్యకార సంఘాలు వేసిన కేసులో 2006లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.ఎస్. సింఘ్వీ, జస్టిస్ జి.వి. సీతాపతిలు 'చట్ట విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను నిలిపి వేయ వలసిందిగా మధ్యంతర ఆదేశాలిచ్చారు. అయినా వాటిని పాటించక పోవడం వలన 2007లో ఇదే కేసులో అప్పటి జిల్లా కలెక్టర్‌కు వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని, అలాగే ప్రభుత్వాలు తీరప్రాంతంలో నియమించబడే అధికారులకు పర్యావరణం, జీవావరణం, తీర ప్రాంతాల ప్రాముఖ్యత గురించి, వాటిని రక్షించడానికి అమలులో ఉన్న చట్టాల గురించి సంవత్సరానికి ఒక సారి వర్క్‌షాపులను ఏర్పాటు చేసి వాటి రక్షణ కోసం బాధ్యత వహించేటట్లుగా చేయాలని ప్రధాన న్యాయమూర్తి జి.ఎస్. సింఘ్వీ, న్యాయమూర్తి సి.వి. నాగార్జునరెడ్డిలు ఆదేశించారు.

సిటీ ఆఫ్ డెత్‌గా మారబోతున్న విశాఖ

రాబోయే ఐదేళ్లలో పారిశ్రామిక అవసరాల కోసం 99,200 ఎకరాల భూమి అవసరం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఎపిఐఐసి) భూ సేకరణపై దృష్టి సారించింది. విశాఖలో సమాచార సాంకేతిక పరిజ్ఞాన రంగానికి 27,550 ఎకరాలు, నిర్మాణ రంగానికి 24,000 ఎకరాలు, ప్రాసెసింగ్ కోసం 32,000 ఎకరాలు, రవాణా కోసం 20,700 ఎకరాలు అవసరం ఉంటుందని అంచనా వేశారు.

విశాఖ జిల్లా కలెక్టర్ యువరాజ్ ఇప్పటికే నగరానికి 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న కొండలు, అడవులతో సహా భూముల వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. ఈ నివేదికలో దాదాపు 350 హెక్టార్ల అటవీ భూముల వివరాలు కూడా ఉన్నాయని తెలుస్తుంది.

నగర కమిషనర్ ప్రవీణ్ కుమార్ విశాఖ నగరాన్ని స్మార్ సిటీగా తీర్చి దిద్దేందుకు ఇప్పటికే అమెరికాలో ఒప్పందం జరిగిందని చెప్పారు. దానికి 27 వేల కోట్ల రూపాయలతో అన్ని రంగాలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఇందులో జివిఎంసి వాటాగా రు.13,650 కోట్ల ఖర్చు చేస్తామని, అన్ని సదుపాయాలు కల్పించి 2041 నాటికి విశాఖను ఆకర్షణీయ నగరంగా రూపొందించడమే మా ప్రధాన లక్ష్యమని అన్నారు.

పై పథకాలు అమలు చేయడానికి విశాఖకు పెట్టని కోటలుగా ఉన్న కొండలను ధ్వంసం చేయడానికి సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం అటవీ ప్రాంతంగా నమోదయి ఉన్న ఈ కొండలను డీనోటిఫై చేయాలని చూస్తున్నారు. ఇప్పటికే విశాఖ – భీమిలి బీచ్ రోడ్‌లో ప్రకృతి వరాలైన అనేక కొండలను ఐటి కంపెనీలకు, పర్యాటక అభివృద్ధి సంస్థలకు, సినిమా స్టుడియోలకు కేటాయించారు. ఇప్పుడు విశాఖ రూరల్ మండల పరిధిలో ఉన్న సీతకొండ (85.65 హెక్టార్లు), పెందుర్తి మండల పరిధిలో ఉన్న ఎర్రకొండ (357.18 హెక్టార్లు), నరవ గ్రామంలో ఉనకొండ (549.73 హెక్టార్లు), రూరల్ మండల పరిధిలో గుడ్లవానిపాలెం కొండ (54.39 హెక్టార్లు) గాజువాక, పెదగంట్యాడ పరిధిలో ఉన్న కొండతో కలిపి మొత్తం 1224.95 హెక్టార్లు అంటే 3025.75 ఎకరాల అటవీ భూమిపై వీరి కన్ను పడింది. అటవీ భూములే కాకుండా దేవాదాయ, అర్బన్ లాండ్ సీలింగ్ భూములను కూడా సర్వే చేస్తున్నారు. పర్యావరణ సమతుల్యానికి, తుఫానులు, ఇతర ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడానికి ఈ కొండలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వీటిని విధ్వంసం చేయడం వల్ల భవిష్యత్‌లో చాలా ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కొండలను తవ్వేసి గ్రీన్ ఫీల్డ్ టౌన్ షిప్‌లు, ఫైవ్‌స్టార్ హోటళ్ళు, రిక్రియేషన్ జోన్‌లు, టూరిజం పార్కులు, ఐ.టి హబ్‌లు, అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్లు, ఎమ్యూజ్‌మెంట్ పార్కులు, క్లబ్‌లు, ఫన్ గేమ్స్ ఏర్పాటు చేయడానికి ఉడా భారీ ప్రణాళికలను సిద్ధం చేస్తుంది. నగరంలో ఉన్న కంబాల కొండ రిజర్వ్ ఫారెస్ట్‌ను, జూను తొలగించడానికి కూడా సన్నాహాలు చేస్తున్నారు. తొలగించిన జూ ప్రాంతంలో గోల్ఫ్ కోర్సులు లాంటి పెద్ద ప్రాజెక్టులు నిర్మించాలనే ఆలోచన ఉన్నట్లు మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నట్లుగా పత్రికల్లో వచ్చింది. విశాఖ – భీమిలి బీచ్ రోడ్‌లో 20 వేల కోట్ల రూపాయల ఖర్చుతో ఎంటర్‌టైన్‌మెంట్ సిటీ ఏర్పాటుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది.

ఏప్రిల్ 11న ఆంధ్రా యూనివర్సిటీలో వాతావరణ మార్పులపై జరిగిన సదస్సులో స్మార్ట్ సిటీ కోసం విశాఖలో 2000 నుండి 3000 హెక్టార్ల అటవీ భూమిని బలిపెట్టడం చాలా ప్రమాదాలకు దారి తీస్తుందని శాస్త్రవేత్తలు, నిపుణులు హెచ్చరించారు. విశాఖ జూ ని తరలించి, కంబాల కొండ రిజర్వ్ ఫారెస్ట్ భూమిని సేకరించడాన్ని విమర్శించారు. ఇప్పటికే చాలా అటవీ భాగం కోల్పోయి, మిగిలిన అటవీ ప్రాంతాల వల్లనే విశాఖ నగరం కొద్దిగానైనా శ్వాస పీల్చుకోగలుగుతుందని, వాటిని కూడా తొలగిస్తే చాలా ప్రమాదాన్ని ఎదుర్కోవలసి వస్తుందని

హెచ్చరించారు. 'ఇప్పటికే బీచ్ కోత, తీరప్రాంత రక్షణ వ్యవస్థ విధ్వంసం కారణంగా నగర ప్రజలు అనేక పరిస్థితులను ఎదుర్కొంటున్నారు'అని అటవీ శాఖాధికారి అన్నారు.

'1999లో ఒడిశాలో వచ్చిన సూపర్ సైక్లోన్ ఇప్పటి వరకూ వచ్చిన భారీ తుఫానులలో అతిపెద్దది. దీనిని 5వ నెంబర్‌గా గుర్తించారు. విశాఖలో వచ్చిన హుదూద్ తుఫాన్ 4వ నెంబర్‌గా గుర్తించారు. ఈ 4, 5 నెంబర్ల భారీ తుఫాన్ల వలన విడుదలయ్యే శక్తి దాదాపు 100 హైడ్రోజన్ బాంబులు పేలితే విడుదలయ్యే శక్తితో సమానంగా ఉంటుంది. భవిష్యత్తులో ఉత్తర తీరప్రాంతంలో మరింత తీవ్రమైన పరిస్థితులు ఏర్పడే ప్రమాదముంది' అని ప్రొఫెసర్ ఎస్.ఎస్.వి.ఎస్. రామకృష్ణారావు హెచ్చరించారు.

'విశాఖ నగరం మూడు వైపులా 130 నుండి 150 మీటర్ల ఎత్తుతో కైలాసగిరి, నరవ, యారాడ కొండలు, నాలుగోవైపు బంగాళఖాత సముద్రం చుట్టుముట్టి మొత్తం నగర ప్రాంతం ఒక లోతైన పాత్ర (బౌల్) రూపంలో ఉండడం వలన, పరిశ్రమల నుండి విడుదలయ్యే కాలుష్యం నగరంలోనే బందీ అయిపోయి నగరమంతా ఒక 'అర్బన్ హీట్ ఐలాండ్' గా మారిపోయి చాలా ప్రమాదకరంగా మారింది. 24 గంటల వ్యవధిలో మనం పీల్చే గాలిలో క్యూబిక్ మీటర్‌కు ఉండవలసిన కాలుష్య పరిమితి 60 మిల్లీ గ్రాములు అయితే, హుదూద్ తుఫానుకు ముందు అది 114 మిల్లీగ్రాములు, తరువాత కొన్ని ప్రాంతాలలో 120 మిల్లీగ్రాముల నుండి 125 మిల్లీగ్రాముల వరకూ ప్రమాదకర స్థాయికి పెరిగిపోయింది. గాలిలో కార్బన్‌డైఆక్సైడ్ 400 పి.పి.ఎం. ప్రమాదకర స్థాయిగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తిస్తుంటే విశాఖలో సరాసరి 401.52 పి.పి.ఎం.ల స్థాయిలో ఉంది. ఇది ప్రమాదకర పరిస్థితి' అని ప్రొఫెసర్ ప్రసాదరావు హెచ్చరించారు. మొత్తంగా నగరంలో రాబోయే కాలంలో ఉష్ణోగ్రతలు, కాలుష్యం మరింత ప్రమాదకర స్థాయికి పెరిగి భారీ పర్యావరణ విధ్వంసానికి, ప్రజా నష్టానికి అవకాశాలున్నాయని మేధావులంతా హెచ్చరించారు.

విశాఖ నగరంలో బోరవానిపాలెం సమీపంలో 100 ఎకరాల స్థలంలో కాపులుప్పాడ డంపింగ్ యార్డులో దాదాపు 10లక్షల టన్నుల చెత్త నిల్వ పేరుకుపోయింది. ప్రతిరోజూ దాదాపు 800 – 1000 టన్నుల చెత్త అదనంగా నగరం నుంచి చేరుతుంది. చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి కాగితం లాంటి కాలుష్యాన్ని వెదజల్లని చెత్తను నిబంధనల ప్రకారం కాల్చాలి. కానీ, పేరుకుపోయిన చెత్తలో పాత టైర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు, జంతు కళేబరాలు, రసాయన వ్యర్థాలతో నిండిన వైద్య పరికరాలు కలిసిపోయి ఉంటాయి. వాటిని వేరు చేయకుండా వేల టన్నుల చెత్తను కాల్చేస్తుండడం వలన చుట్టుపక్కల ఉన్న బోరవానిపాలెం, మారిక వలస, పరదేశిపాలెం, ఆర్‌టిసి కాలనీ, రాజీవ్ గృహకల్ప కాలనీ, శారదానగర్ తదితర ప్రాంతాలలో దాదాపు లక్ష మంది ప్రజలు ఈ దట్టమైన పొగను పీలుస్తుండడం వలన శ్వాసాడని పరిస్థితులకు గురై అనేక రోగాల బారిన పడుతున్నారు. విశాఖలో ఉన్న 741 మురికివాడల్లో దాదాపు ఎనిమిది లక్షల మంది పేద ప్రజలు నివసిస్తున్నారు. వారికి ఎటువంటి సదుపాయాలు లేవు. కనీసం మరుగు దొడ్లు కూడా లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. వాటిని పట్టించుకునే నాదుడు ఎవరూ కనబడడం లేదు. సామాన్య ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదు గాని స్మార్ట్ సిటీ నిర్మాణం గురించి ప్రచార హోరు జరుగుతుంది. దీనిని బట్టి స్మార్ట్ సిటీలు ఎవరి కోసమో అర్థమవుతుంది.

ఇప్పటికే విశాఖ నగరంలో పోర్టు, హెచ్‌పిసిఎల్, ఫార్మా, ఇతర కంపెనీల కాలుష్యం కారణంగా లక్షలాదిమంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గొంతునొప్పి, జ్వరం, శ్వాసకోస వ్యాధులు, టిబి, కాన్సర్ వంటి రోగాలు వస్తున్నాయని అనేక శాస్త్రవేత్తల, వైద్య నిపుణుల అధ్యయనాలు నిర్ధారించాయి. కాలుష్యంలో ప్రమాదకరమైన విష రసాయనాలు, భారలోహాలు, హైడ్రోకార్బన్లు అధిక శాతంలో ఉండడం కారణంగానే నగర వాసుల ఆరోగ్యాలు బలి అవుతున్నాయని తెలిపారు. దీనికి తోడు చంద్రబాబు నాయుడు లక్ష్యాలకు అనుగుణంగా కోస్టల్ కారిడార్లు, విమానాశ్రయాలు, స్మార్ట్ సిటీలు, ఆరు లైన్ల రోడ్లు వస్తే విశాఖ నగరం అణు ప్రమాదానికి గురైన హిరోషిమా, నాగసాకీల పరిస్థితికి చేరుకుని సిటీ ఆఫ్ డెస్టినీ, సిటీ ఆఫ్ డెత్‌గా మారిపోతుంది. కాలుష్యంతో పాటు నగరంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి ఉంది. స్టీల్ ప్లాంట్, ఎచ్‌పిసిఎల్, ఫార్మా కంపెనీలలో జరిగిన ప్రమాదాలలో అనేక మంది చనిపోయారు. సాధారణంగా ప్రమాదాల ప్రభావం జరిగిన ప్రాంతానికే పరిమితమవుతుంది. కాని విశాఖలో మొత్తం నగరాన్నే ప్రమాదంలో పడవేసే పరిస్థితులు కొనసాగుతున్నాయి.

కార్పొరేట్ శక్తుల కోసం మోడీ ప్రభుత్వం భూ సేకరణ చట్టంలో ప్రాజెక్టులకు కేటాయించిన భూములలో ఐదేళ్ల లోపు కార్యక్రమాలు నిర్వహించకపోతే తిరిగి భూమిని ప్రభుత్వానికి అప్పజెప్పాలని ఉన్న నిబంధనను తొలగించేశారు. దానికి తోడు చంద్రబాబు చెపుతున్న 99 సంవత్సరాల లీజు విధానంలో పంటభూములనేవి మిగలని ప్రమాదం సిద్ధంగా ఉంది. ప్రాజెక్టుల పేరుతో సెజ్‌ల కోసం లక్షలాది ఎకరాలు తీసుకున్న కంపెనీలలో అధిక శాతం ఎటువంటి పనులు చేపట్టకపోవడం వలన ఆ భూములలో అటు వ్యవసాయం ఆగిపోయి ఇటు పరిశ్రమలు రాక భూములన్నీ వృథాగా పడి ఉన్న పరిస్థితిని మనం చూశాం. చివరకు మోడీ, చంద్రబాబుల విధానాల ఫలితంగా పంట భూములన్నీ రియల్ ఎస్టేట్‌లుగా మారి తిండి గింజలు దొరకని ప్రమాదంలో చిక్కుకుంటాం.

ప్రపంచవ్యాప్తంగా వస్తున్న వాతావరణ మార్పులు, అనేక ప్రాంతాలలో జరుగుతున్న భారీ వనరుల విధ్వంసం కారణంగానే జరుగుతున్నాయనీ, ప్రమాదకరంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయనీ ప్రతిరోజూ అంతర్జాతీయ సంస్థలు, మేధావులు, శాస్త్రవేత్తలు నెత్తీ, నోరు కొట్టుకుని చెపుతూ దానికి విధానాల మార్పు తప్ప వేరే మార్గం లేదని స్పష్టంగా చెపుతుంటే మన ముఖ్యమంత్రి ఉష్ణోగ్రతలు తగ్గించడమంటే స్విచ్ ఆన్, స్విచ్ ఆఫ్ పద్ధతిలో తొలగిస్తాననడం ప్రకృతిని కూడా తను చెప్పినట్లు వినే బానిస కిందే జమకట్టినట్లు తెలుస్తుంది. వాతావారణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతల వలన అకాల వర్షాలు, మంచు తుఫానులు, కరువులు, సముద్ర మట్టాలు పెరగడం లాంటి తీవ్ర ప్రమాదాలతో ప్రపంచమంతా భయ కంపితులవుతుంటే ఉష్ణోగ్రతలు 2,3 డిగ్రీలు తగ్గించడానికి 47 లక్షల మొక్కలు నాటితే సమస్య పరిష్కారం అయిపోతుందన్నట్లుగా చెప్పడం సమస్యను ఎంత తేలికగా తీసుకుంటున్నారో అర్థమవుతుంది. ఇప్పటికే పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగానే హుదూద్ తుఫాన్ నగరాన్ని నాశనం చేసింది. ప్రకృతితో పరాచకాలు ఆడితే ఎలాంటి పర్యవసనం ఎదురవుతుందో రుచి చూపించింది. చంద్రబాబు అభివృద్ధి కార్యక్రమాలు మరింత ఉష్ణోగ్రతలు పెంచేవే గాని తగ్గించేవి కాదు. వనరుల విధ్వంసం ఆపకుండా కేవలం చెట్లు నాటితే ఉష్ణోగ్రతలు తగ్గవు. కావున కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మొత్తం రాష్ట్రాన్ని ప్రమాదంలోకి నెట్టుతున్న చంద్రబాబునాయుడు విధానాలపై జరుగుతున్న ప్రజా పోరాటాలలో అందరూ భాగస్వాములు కావాలి.

(రచయిత కార్మికోద్యమ నాయకులు) వీ

జీవించే హక్కును హరిస్తున్న భూసేకరణ

సమస్త జీవులకు జీవితాన్నిస్తున్న భూమిని అభివృద్ధి పేరుతో కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే భూ సేకరణ చట్టాన్ని అడ్డుకోకపోతే ముందు తరాలకు జీవితం లేకుండా పోయే ప్రమాదముందని అంటున్నారు **షేక్ కరిముల్లా**

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక గత యుపిఎ ప్రభుత్వాల కంటే వేగంగా మరింత దూకుడుగా ప్రపంచీకరణ విధానాలను అమలు చేస్తూ సంపన్నుల సేవలో మునిగిపోయినది. ప్రజలకు చెందిన భూమి, సంపదను అభివృద్ధి పేర దేశ విదేశీ బహుళజాతి కార్పొరేట్ సంపన్నులకు దారాదత్తం చేసే కార్యక్రమానికి శ్రీకారం చేపట్టింది. అదే 'భూసేకరణ 2013 చట్ట సవరణలు'. ఈ భూసేకరణ చట్టం గురించి మాట్లాడుతూ ప్రముఖ భారతీయ పర్యావరణ, సామాజిక కార్యకర్త మేధాపాట్కర్ ఇలా వ్యాఖ్యానించారు.

'వ్యవసాయం, తోటలు, నదులు, అడవులు, చెట్లు, భూగర్భ జలాలు, ఖనిజాలు, అన్నీ కొల్లగొట్టడానికి మారుపేరు భూసేకరణ చట్టం'. అంటే ప్రభుత్వం భూమిని సేకరించడానికి అవకాశం కల్పిస్తుంది కాని, ఒక సమగ్ర ప్రజాస్వామిక పద్ధతిలో కాదు. బడా కార్పొరేట్ సంస్థల, కంపెనీల ప్రయోజనాలు మాత్రమే దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగుతోంది. నిర్వాసితులైన ప్రజల జీవితాలు, వారి జీవనోపాధి, వారి సాంస్కృతిక విశిష్టతలు, సంస్కృతి పట్ల ఏమాత్రం సంబంధం లేకుండా సామాజిక ప్రభావాన్ని పరిగణలోనికి తీసుకోకుండా భూ సంపదను బడా శక్తులకు అప్పనంగా అప్పచెప్పే విధంగా ఈ చట్టం రూపొందించబడింది.

చరిత్ర

భారతదేశంలో మొట్ట మొదట భూసేకరణ చట్టం 1894 బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ వలసపాలనలో వచ్చిన చట్టం ఇది. బ్రిటిష్ వాడు ఈ దేశ వనరుల, సంపదను కొల్లగొట్టడానికి వచ్చాడు కాబట్టి వాడి దోపిడీ వైఖరి ప్రస్ఫుటంగా ఈ చట్టంలో కనిపిస్తుంది. భూసేకరణ వలన భూ యజమానిపై ప్రభావం ఉన్న భూసేకరణ జరిగేది, భూ యజమానికి రక్షణలు, కనీస హక్కులు లేవు. ఈ 1894 చట్టం 1947 తర్వాత కూడా అమలులో ఉంది. ఈ చట్టానికి వ్యతిరేకంగా విశాల ప్రజా ఉద్యమాలు జరిగాయి. ఉదాహరణకు బెంగాల్‌లోని నందిగ్రామ్ ఉద్యమం. ఈ ఉద్యమాల ఫలితంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యుపిఎ ప్రభుత్వం 2013లో 1894 చట్టానికి కొన్ని సవరణలు చేసింది. ఇవి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చక పోయినా కొద్దిపాటి ఊరటనిచ్చాయి.

2013 భూసేకరణ చట్టం ప్రకారం బహుళ పంటలు పండే భూములను ప్రజల నుండి సేకరించరాదు. వ్యాపార, వాణిజ్య, రియల్ ఎస్టేట్ కోసం భూమిని సేకరించరాదు. ఎట్టి పరిస్థితులలోను 5 వేల ఎకరాలకు మించి సేకరించరాదు. ఈ చట్టంలో సెక్షన్ 4 ప్రజాభిప్రాయ సేకరణ, సామాజిక ప్రభావం పరిశీలన అంచనాల గురించి వివరిస్తుంది.

ప్రజాభిప్రాయ సేకరణ

భూసేకరణ చేయదలచినపుడు ఆ ప్రాంత భూ యజమానుల, ప్రజల నుండి అనుమతి తీసుకోవాలి. ప్రైవేట్ కంపెనీలు భూసేకరణ చేస్తే 80శాతం రైతుల అనుమతి తప్పనిసరి. అదే పబ్లిక్ పార్టనర్‌షిప్ ప్రాజెక్టుల కోసం భూసేకరణ జరిగితే 70 శాతం భూ యజమానుల, ప్రజల అంగీకారం అవసరం. రాజ్యాంగం ద్వారా గుర్తింపు పొందిన షెడ్యూల్ ఏరియాలో ప్రభుత్వం ప్రజల అవసరార్థం, భూసేకరణ చేయదలిస్తే ఆయా గ్రామసభల అనుమతి తప్పనిసరి. గ్రామసభల అనుమతి అంగీకారం లేకుండా భూమిని సేకరించే అధికారం ఎవరికీ లేదు.

సామాజిక ప్రభావం అంచనా

సేకరించబడే భూమి ద్వారా కేవలం భూ యజమానులే కాకుండా ఆ భూమిపై ఆధారపడే ఇతర వృత్తుల ప్రజలపై ఇతర భూమి ఆధారిత వృత్తులపై, ఏ ఉద్దేశం కోసమైతే భూమి సేకరించబడుతుందో ఆ ప్రయోజనాల కోసమే భూమి వినియోగం జరుగుతుందా? లేదా? వేరే ఇతర ప్రయోజనాల కోసం భూమిని ఉపయోగిస్తున్నారా? ఆ ప్రాజెక్ట్ అనుకున్న సమయంలో పూర్తి అవుతుందా లేదా? అనుకున్న ఫలితాలు ఇస్తుందా లేదా? ఒకవేళ ప్రజా ప్రయోజనాలు నెరవేరనపుడు, చెప్పిన ప్రయోజనాల కోసం కాకుండా వేరే ప్రయోజనాల కోసం భూమి మళ్లింపు జరిగినప్పుడు ఆ ప్రాజెక్టును దానికోసం కేటాయించిన భూమిని రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంది.

నష్ట పరిహారం

తీసుకున్న భూమికి మార్కెట్ ఖరీదుకట్టి గ్రామీణ ప్రాంతాలలో మార్కెట్‌కు నాలుగింతలు, పట్టణ ప్రాంతాలలో రెండింతలు నష్ట పరిహారం ఇవ్వాలి. పరిహార చెల్లింపులు, పునరావాసానికి తగిన ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయనప్పుడు భూయజమానులను, నిర్వాసితులను ఆ నివాస ప్రాంతం నుంచి ఖాళీ చేయించడానికి వీలులేదు. ముందస్తు చెల్లింపులు ప్రత్యామ్నాయ పునరావాస ఏర్పాట్లు జరగాలి.

ఆహార భద్రత

ఈ చట్టం బహుళ పంటలు పండే సాగు భూమికి సేకరణ నుండి మినహాయింపు కల్పించింది. తద్వారా ఆహార భద్రతకు ప్రాధాన్యం కల్పించింది. తప్పనిసరి స్థితిలో బహుళ పంటల సాగు భూమిని

సేకరించాల్సి వస్తే భూమి విస్తీర్ణంలో కేవలం 5 శాతం మాత్రమే తీసుకోవాలి. అలా తీసుకునప్పుడు ఆ తీసుకున్న భూమికి సమానమైన విస్తీర్ణంలో భూమిని సాగు చేయాలి. ఒకవేళ అలా చేయనట్లయితే ఆహార భద్రత దృష్ట్యా ఒక ఎకౌంటులో దానికి సరిపడ మొత్తాన్ని జమ చేయాలి

మరికొన్ని ప్రత్యేక రక్షణలు

ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు కోల్పోయిన భూమికి బదులుగా భూమి లేదా రెండున్నర ఎకరాలు ఏది తక్కువగా ఉంటుందో అది ఇవ్వాలి. బాధిత కుటుంబాలకు పునరావాసం కల్పించి వారికి ఒకేసారి ఇచ్చే 50 వేల రూపాయలతో పాటు అదనంగా మరో 25 వేలు పునరావాస ప్రయోజనాలు కల్పించాలి. గతంలో ఎటువంటి ప్రాజెక్టు కోసమైనా ప్రభుత్వం భూమిని సేకరించిన తర్వాత ఆ భూమి ఉపయోగించకపోతే లేదా మిగిలిపోతే తిరిగి భూ యజమానులకు ఇవ్వచ్చు లేదా ప్రభుత్వ భూ బ్యాంకుకు గాని అప్పగించాలి.

2013 భూసేకరణ చట్టంలోని ప్రజలకు సంబంధించిన రక్షణలు బిజెపి మోడీ ప్రభుత్వానికి కంటగింపుగా ఉన్నాయి. ఈ రక్షణలను తొలగిస్తూ ఆఘ మేఘాల మీద ఈ చట్టానికి సవరణలు చేస్తూ పెద్దల సభను ప్రోరోగ్ చేసి మరి రెండుసార్లు ఆర్డినెన్స్ తీసుకు వచ్చింది.

భూసేకరణ 2013 చట్టం - సవరణలు

ప్రజా అంగీకారం, సామాజిక ప్రభావ అంచనా రద్దు, భూమిని జాతీయ భద్రత రక్షణ, అణుశక్తి సంబంధం, జాతీయ హైవేలు, రైలు మార్గాల కోసం పెట్రోలియం ఇరత ఖనిజ సంపదల తరలింపుకై వేసే పైప్ లైన్ల కోసం, ఖనిజాల తవ్వకాల కోసం, విద్యుతీకరణ పారిశ్రామిక మండళ్ళు, ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్య ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేసినప్పుడు ప్రజా అంగీకారం, సామాజిక ప్రభావ అంచనా రద్దు చేయబడినది. బహుళ పంటలు పండే సాగు భూమిని కూడా ప్రభుత్వం తీసుకోవచ్చుననే నిర్ణయం చేయబడినది. ఇది అత్యంత హేయం, అమానుషం. ఈ సవరణలు విధానాలు కార్పొరేట్ శక్తుల కోసమే. కనీసం ప్రజల భాగస్వామ్యాన్ని కూడా ఓర్వలేని బిజెపి ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణను కూడా రద్దు చేసింది. ఈ రద్దు ద్వారా చేపట్ట బోయే ప్రాజెక్టు సామాజిక ప్రభావ పరిశీలన అంచనా రద్దు చేయడమేకాక అసలు భూసేకరణకు కారణం చెప్పాల్సిన నిబంధన కూడా తీసి పారవేసింది. ఒక్కసారి భూమిని సేకరించి కంపెనీలకు ఇచ్చిన పిదప భూమి ఎల్లప్పుడూ అది ఆ కంపెనీ ఆస్తిగా ఉండి పోతుంది. తద్వార ఈ దేశ సంపద వనరులు కార్పొరేట్ బహుళజాతి సంస్థల చేతుల్లోకి వెళ్లి వారి ఇష్టారాజ్యంగా మారుతుంది. ఏ ఉద్దేశంతోనైతే భూమి సేకరించ బడుతుందో అది నిజంగా ప్రజా ప్రయోజనాల కోసమే జరిగినదా ఏ అవసరం లేదా ప్రయోజనాల కోసమైతే భూమి సేకరించబడుతుందో అది అనుకున్న సమయంలో జరగకపోతే, చెప్పిన ప్రయోజనాల కోసం భూమి ఉపయోగించకపోతే ఆ ప్రాజెక్టును, భూమిని రద్దుచేసే అధికారం కూడా తీసివేయబడినది. సేకరించిన భూమి ఐదు సంవత్సరాల తర్వాత కూడా వాడుకలోకి రాకుంటే ఆ భూమిని తిరిగి భూ యజమానికి అప్పగించే నిబంధన తీసివేయబడినది. ఈ రకంగా జాతి సంపదను గుత్త సొత్తుగా కార్పొరేట్ బహుళజాతి సంస్థలకు అప్పగించే అధికారం ఈ పాలక శక్తులకు ఎవరిచ్చారు?

రాజ్యాంగ విరుద్ధం ఈ చట్టం

మన రాజ్యాంగంలోని ప్రవేశికలో సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం, రాజకీయ న్యాయం ప్రాతిపదికగా విశాల సామాజిక వ్యవస్థను నిర్మించడం కోసం రాజ్యాంగాన్ని రాసుకొని ఆమోదించాం. రాజ్య వ్యవస్థకు ఒక సంక్షేమ బాధ్యత ఉంటుంది. ఈ కర్తవ్యం భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 38 క్లాజ్ 2లో ఒక ఆదేశిక సూత్రంగా ఉన్నది. ఈ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఈ భూసేకరణ చట్టం ద్వారా ప్రభుత్వం చేసే అధికారం దుర్వినియోగానికి ఇది ఒక హేయమైన ఉదాహరణ. వలస రాజ్యకాలం నుండి ఆచారంగా కొనసాగుతూ ఉంది. ఈ చట్టం ప్రకారం 'ప్రజోపయోగం' కోసం అని ప్రకటించి ఒక వ్యక్తికి చెందిన భూమిని కాని, ఒక వర్గానికి చెందిన భూమిని కాని, ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు. దేశీయ అవసరాల కోసమే కాకుండా ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల కోసం కూడా ప్రభుత్వం భూసేకరణ చేసే వీలు కలిగింది. ఈ చట్టం కింద ఫలానా భూమి స్వాధీనం కోసం ప్రభుత్వం ప్రకటన జారీ చేస్తే ఆ స్వాధీనాన్ని గాని, ఆ స్వాధీనం వెనుక ఉన్న ఉద్దేశాన్ని గాని ఏ న్యాయస్థానంలోనూ సవాలు చేసే వీలులేదు. ఇలా ప్రజల్ని పూర్తిగా నిర్వాసితులుగా నగ్నంగా రోడ్డున పడవేసే దుర్మార్గమైన చట్టం ఇది. ఈ నేపథ్యంలో భూమికి, జీవరాశులకు గల సంబంధం ఇప్పుడు పరిశీలిద్దాం.

భూమి - జీవరాశికి గల పరస్పర సంబంధం

'ప్రకృతి ఆర్థిక వ్యవస్థలో కరెన్సీగా చలామణిలో ఉన్నది డబ్బు కాదు జీవం' - వందనా శివ. ఈ భూమి అందరిది. సకల జీవరాశులకు దీనిమీద జీవించే హక్కు ఉంది. చీమకు కూడా భూమి ఇచ్చే సంపదను అనుభవించి ఆస్వాదించే హక్కు ఉంది. ఈ భూమిపై ఉన్న వనరులన్నీ అందరికి (జీవరాశి) చెందుతాయి. ఎవడిసొత్తు ఎన్నటికి కాజాలదు. భూమి ప్రకృతి వనరు ఈ సంగతి మరిచిపోతే అంతకంటే ఘోరమైన విషయం మరొకటి ఉండదు. ఈ భూమి చుట్టూ ఒక సమూహపు జీవన విధానం, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు ఉన్నాయి. భూమి ఒక జీవితం, ఒక సమూహపు జీవన విధానం, భూమి చుట్టూ, భూమి సృష్టించే సంపద చుట్టూ అల్లుకున్న శ్రమజీవుల పరస్పర సంబంధాలు ఉన్నాయి. ఆ సంపదపై ఆధారపడ్డ ప్రజా సంబంధాలు ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న జీవన విధానాలున్నాయి. ప్రకృతి అనేది సమస్త జీవరాశికి జీవాధారం. సహజ వనరుల దోపిడీ గురించి మాట్లాడుతున్నాం. అంటే ప్రజల వనరులు తీసుకుపోతున్నాడనే కాదు. ప్రకృతి మీద ఆధారపడి బతికే సమస్త జీవరాశుల హక్కులను కూడా తీసుకుపోతున్నాడని అర్థం చేసుకోవాలి. ఆరోగ్యాన్ని కాపాడే గాలి, నీరు రూపంలో కావచ్చు. అనేక రకాల జీవనానికి అవసరమైన సంపదనిచ్చే అడవుల రూపంలో కావచ్చు, ఖనిజ సంపద కావచ్చు. గాలి, నీళ్లు, నేల, చెట్టు ఇవన్నీ కేవలం ప్రకృతి కాదు. విశాల జీవరాశికి జీవాధారం. ఈ చట్టం కొన్ని ఏళ్లుగా పెన వేసుకొని ఉన్న జీవనాధారంను, జీవించేహక్కును హరించనుంది. జీవాధారమే లేకుంటే డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం ప్రకారం కొన్ని జీవులు అంతరించినట్లే మానవాళి కూడా అంతరిస్తుంది. భూమి లేకుంటే దానిమీద ఆధారపడిన ప్రజానీకం భూమిలేని వారు చాకలి, మంగలి, కుమ్మరి సమస్త వృత్తులవారు గిరిజనులు లాంటి వారిని బికారులుగా మార్చి విశాల

14వ ఆర్థిక సంఘం సిఫారసుకు కేంద్రం వెన్నుపోటు

ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తూ, వాటిపై తన పెత్తనాన్ని చెలాయిస్తున్న కేంద్ర ప్రభుత్వం, ఆ పన్నులపై రాష్ట్రాలకు చెందాల్సిన వాటాను ఇవ్వకుండా అడ్డుకుంటోందని అంటున్నారు **వి. హనుమంతరావు**

ఇది కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ గురించిన వ్యాసం. బడ్జెట్ అంటే గణాంకాలు. ఈ లెక్కలు మనకు అర్థం కావని పక్కన పెట్టేయకండి. కేంద్రం మిథ్య అని ఎన్.టి రామారావు ఎందుకన్నారో మీకు తెలుస్తుంది.

2015-16 కేంద్ర బడ్జెట్ రు. 17,77,477 కోట్లు. ఇందులో మనమంతా ప్రత్యేక్షంగా, పరోక్షంగా చెల్లించే స్థూల పన్నుల మొత్తం రు. 14,49,480 కోట్లు. అంటే డబ్బు మన పరిధి, కాని పెత్తనం కేంద్రానిది. కేంద్రం మిథ్య అని ఎన్టిఆర్ అన్నారంటే అనరూ? మీరూ అంటారు. ప్రశాంతంగా కూర్చొని మీరే లెక్క వేసుకోండి.

ఉదయమే మంచం మీద నుంచే లేస్తారు. మీదపడుకున్న మంచం దూది పరుపు, తలగడ, దుప్పటి – వీటన్నిటి మీద మీరు నేరుగా పన్ను చెల్లించక పోవచ్చు. కాని మీరు కొన్న దుకాణదారు బిల్లులో పన్ను వేరే చూపిస్తాడు. అంటే ఆ పన్ను మీరు చెల్లించారు. అలాగే టూత్‌పేస్ట్, తర్వాత తాగే కాఫీ, టీలు, స్నానం చేసేటప్పుడు వాడే సబ్బులు, టిఫిన్, బయటకు వెళ్లేటప్పుడు వేసుకున్న బట్టలు, స్కూటర్ లేక కారు, వాటిలో ఉపయోగించే పెట్రోల్, డీజిల్ – అన్నింటి మీద పన్నులు పరోక్షంగా చెల్లిస్తున్నారు. సాయంత్రం ఇంటికి చేరుకున్న తర్వాత ఇంట్లో వెలిగే లైట్లు, ఫ్యాన్లు పడకగదిలోకి వెళ్లి నిద్రపోయినా పైన తిరిగే ఫ్యాన్ – మరిచిపోయా, మీరు నడిచే రోడ్ మీద మున్సిపల్ పన్ను – ఇలా మీరు బతికి ఉన్న ప్రతిక్షణం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పన్నులు చెల్లిస్తూనే ఉన్నారు. కేంద్రానికో, రాష్ట్రానికో. ఇది చాలదన్నట్లు 1991లో దేశం దివాళా దశలో పడినప్పుడు, మన్మోహన్‌సింగ్ ప్రజా సంక్షేమం దృక్కోణం నుంచి కీలకమైన కొన్ని మంత్రి వర్గాలకు ఇది వరకు చేసిన, ఇప్పుడు చేయబోతున్న కేటాయింపులు పట్టికలో చూడండి.

(రు. కోట్లలో)

మంత్రివర్గం	2013-14	2015-16
వినియోగదారులు, చౌక ఆహార దుకాణాలు	1,064	1,001
తాగునీరు, పారిశుభ్రత	11,935	231
పర్యావరణం, అడవులు వాతావరణ మార్పులు	1,809	995
ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు	527	480
ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం	24,519	7,824
మానవ వనరుల అభివృద్ధి విద్య వగైరా	67,810	17,672
కార్మికులు, ఉపాధి	1,610	94
పంచాయతీ రాజ్	6,111	7,490
గ్రామీణాభివృద్ధి	5,418	3,295
సామాజిక న్యాయం	1,674	1,038
ట్రైబల్స్ మహిళలు, బాలబాలికలు	17,912	989

ఇలా ఎందుకు తగ్గించారు? 14వ ఫైనాన్స్ కమిషన్ కేంద్రం రాష్ట్రాలకు బదలాయించాల్సిన నిధుల వాటాను 32 నుంచి 42 శాతానికి పెంచడంతో రాష్ట్రాలు ఈ బదలాయింపుతో రాష్ట్రాలు ఎక్కడ బాగు పడతాయోననే కుళ్లు బుద్ధితో రాష్ట్రాలకు ఇంతవరకూ చేస్తూ వచ్చిన పథకాల కేటాయింపులను తగ్గించింది. ఆర్థిక సంఘం తన సిఫార్సులను ఇలా ప్రకటించిందో లేదో వెన్వెంటనే సిఫార్సులను అంగీకరిస్తున్నామని ప్రభుత్వం వెంటనే ఆమోదించడం వెనుకనున్న రహస్యం. ఈ చేత్తో ఇచ్చి, ఆ చేత్తో తీసేసుకోవడం అంటే ఇదే. ఈ మార్పు వల్ల కొన్ని కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్రాలకు ఇస్తున్న కేటాయింపుల మార్పు వల్ల 2014-15 (సం.అం) రు. 40,796 కోట్ల నుంచి రు. 25,399 కోట్లకు తగ్గింది. అలాగే 2014-15 (సం.అం) కేంద్ర పథకాలకు రాష్ట్రాల్లో అమలు చేయడానికి అందిస్తున్న నిధులు 2014-15 (సం.అం) రు. 64,561 కోట్లు ఇక ముందు రాష్ట్రాలకు అందబోవు. ఈ విధంగా ఆర్థిక సంఘం చేసిన మంచి సిఫార్సులను కేంద్రం వెన్నుపోటు పొడిచింది.

(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

ప్రజానీకానికి జీవాధారమైన ప్రకృతిని కార్పొరేట్ పెట్టుబడికి ఒక వనరుగా అప్పచెప్పడం అనేది అత్యంత దుర్మార్గమైన ఆలోచన. ఈ చట్టం కేవలం భూమిని ఒక ఆస్తిగా చూస్తూ సమస్త జీవనంలో విధ్వంసం సృష్టించనుంది. ఈ విధంగా దేశాన్ని హోల్‌సేల్‌గా అమ్మేస్తున్న మోడీ ప్రభుత్వ నిజస్వరూపాన్ని బహిర్గతపరచి, బలమైన విశాల పునాది గల ప్రజా ఉద్యమాల ద్వారా ఈ దుర్మార్గపు భూసేకరణ చట్టాలను తిప్పికొట్టకపోతే ముందు తరాలకు ఏమీ మిగలదు.

(రచయిత ఉపాధ్యాయుడు) వీ

వీంచ్ కాలమ్

- దేశానికే మా మతం – మోడీ
  హిందూదేశమా? భారతదేశమా?
- 2030 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను బంగారు భూమిగా తీర్చిదిద్దుతా – చంద్రబాబు
  నకిలీ బంగారమా? అసలు సిసలు బంగారమా? అప్పటికి ఆంధ్రప్రదేశ్ రూపురేఖ లేలా ఉంటాయో ఓ ప్రణాళిక విడుదల చేస్తారా?
- ప్రపంచంలో నాలుగవవంతు బంగారం ప్రైవేట్‌గా వాడకం భారతదేశంలోనే – వార్త
  మహిళలు, నల్లకుబేరులూ వింటున్నారా?
  నల్లధనం దాచేవారిని కఠినంగా శిక్షిస్తాం – ప్రభుత్వం
  ఈ పదినెలల కాలంలో ఒక్కరంటే ఒక్కరినైనా శిక్షించారా?
- కేంద్రంలో ఆర్థికశాఖ ఉపమంత్రిగా ఉండిన యశ్వంత్‌సిన్హా ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ పెట్టుబడులకు వ్యతిరేకం కాగా ఆయన పుత్రుడు జయంతి సిన్హా దేశీ పెట్టుబడులను పెంచాలనే బిల్లు ప్రవేశపెట్టారు– వార్త
  ఫాదర్ ప్రొపొజెస్, సన్ డిస్పొజెస్
- ఇండియా, చైనా సుమారుగా ఒకే సంవత్సరంలో స్వతంత్ర దేశాల య్యాయి. గత 68 సంవత్సరాల్లో చైనాలో అదనంగా కొత్తగా 1,10,000 కిలోమీటర్ల రైలు మార్గాలు నిర్మించగా మనదేశంలో 11,000 కిలోమీటర్లు మాత్రమే.
  నక్కకు నాగ లోకానికి ఉన్నంత తేడా.
- దేశంలో వర్షాల వల్ల వ్యవసాయోత్పత్తి తగ్గుతుంది. తయారీ రంగం కుంటుతూనే నడుస్తోంది – వార్తలు
  అలాంటప్పుడు స్థూల జాతీయాదాయం (అన్ని ఉత్పత్తుల విలువ) 4.7 శాతం నుంచి ఏడు శాతానికి ఎలా పెరుగుతుంది?
- ప్రభుత్వం చేపట్టే ప్రతి పనికి అడ్డుపడడం పద్ధతి కాదు – అరుణ్‌జైట్లీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమరేం చేశారు స్వామీ?
  రైల్వే మంత్రి తన బడ్జెట్ ఉపన్యాసంలో దేవుణ్ణి తలుచుకున్నారు – పార్లమెంట్‌లో.
  ప్రయాణికులారా మీరు దేవుణ్ణి తలచుకుంటూ ప్రయాణించండి.
- అందరికీ ఐదు కిలోల బియ్యం – ప్రభుత్వం
  ఎలాంటి బియ్యం కిలో రూపాయ బియ్యం లాంటివా?
- మహిళలకు తగిన స్థానం ఇవ్వాలి – ఆర్థిక సర్వే
  33 శాతం సర్వే గురించి మాట్లాడరేం?
- ఆకర్షణీయ నగరాల (స్మార్టు సిటీలు) నిర్మాణం – ప్రభుత్వం
  ముందు బతికిబట్టకలిగే గ్రామాల సంగతి చూడండి.
  కార్మిక చట్టాల్లో సంస్కరణలు – ప్రభుత్వం
  పర్మనెంట్ కార్మికులను తగ్గించి, కాంట్రాక్టు కార్మికులను నియమించే సంస్కరణాలు.
- 2014–15లో ఆహార ధాన్యాల పంట 257.07 మిలినియం టన్నులు. ఎంతమంది పేదల కడుపును నింపాయో కూడా చెప్పండి.
  సలహా మేరకు ప్రపంచ బ్యాంక్ నుంచి రుణం తీసుకున్నప్పుడు విధించిన షరతుల ప్రకారం సేవల పన్ను విధించడం ప్రారంభించారు. ఆ పన్ను వసూళ్లు ఇంతై ఏడింతలై అన్నట్లు 2015–16లో రెండు లక్షల కోట్ల రూపాయలు మోడీ మన ముక్కు పిండి వసూలు చేయనున్నారు.
- అప్పు చేయనిదే ప్రభుత్వానికి నిద్ర పట్టదనుకుంటా. బడ్జెట్ 17 లక్షల కోట్లలో చేసి అప్పు ఐదున్నర లక్షల కోట్లు. అప్పిచ్చిన దేశాలు తన అప్పు చెల్లించాలని ఎంత మాత్రం తొందర పెట్టవదు. కాని వడ్డీ మాత్రం ప్రతీపైసా ప్రతీ సంవత్సరం చెల్లించాలనే షరతు ప్రతీ రూపాయలో వడ్డీ చెల్లింపు 20 పైసలు. మనం ప్రభుత్వానికి చేకూర్చే నికర పన్ను ఆదాయంలో వడ్డీ చెల్లింపు 2007–08లో 38.9 శాతం (2007–08). ఈ శాతం 2014–15 (సవరించిన అంచనా) 45.3 శాతానికి పెరిగి నడుస్తున్న సంవత్సరంలో అంటే మోడీ హయాంలో 49.6 శాతానికి పెరగనుంది. అచ్చేదిన్ అంటే ఇదేనా?
  ప్రణాళికా విధానానికి గుడ్‌బై చెప్పేసింది కాని, పురిటి వాసన వదలలేదు. ప్రణాళిక మొత్తం కేటాయింపు దేనికింత ఇదివరకు ఖర్చు చేశారు. నడుస్తున్న సంవత్సరంలో ఎంత కేటాయించారు అనే వివరాలు బడ్జెట్ పుస్తకాల్లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ ప్రణాళికకు 2013–14లో రు. 6,05,573 కోట్ల నుంచి నడుస్తున్న మోడీ నామ సంవత్సరంలో రు. 5,78,382 కోట్లకు తగ్గింది. ప్రణాళికలో సామాజిక సేవలకు కాంగ్రెస్ హయాంలో 2013–14లో రు. 1,50,736 కోట్ల నుంచి మోడీ సంవత్సరంలో రు. 81,003 కోట్లకు దబ్బున పడిపోయింది.

వీ

సృజన 1966–1992 డివిడి కొన్నవారికి విజ్ఞప్తి

సృజన ఆధునిక సాహిత్య వేదిక 1966–1992 సర్వస్వం డివిడిలో జూన్ 1973 (సంచిక 45) స్కానింగ్‌లో రెండు పేజీలు పొరపాటున తప్పిపోయాయి. అలాగే మే 1979 (సంచిక 91) లో మరొక సంచిక నుంచి పది పేజీలు కలిసి, అక్కడ ఉండవలసిన పేజీలు తప్పిపోయాయి. ఈ పొరపాట్లకు చింతిస్తున్నాం. సృజన డివిడి కొనుక్కున్నవాళ్లు srjana.missingpages@gmail.comకు మీ మెయిల్ ఐడి పంపితే ఆ రెండు సంచికలూ సవరించిన ప్రతులు పంపుతాం. మీ డివిడిలో లేదా కంప్యూటర్‌లో పాత ప్రతుల బదులు కొత్త ప్రతులు చేర్చుకోవచ్చు.

– 'సాహితీమిత్రులు'

యెమెన్‌పై సామ్రాజ్యవాద యుద్ధ క్రీడ

***సౌదీ అరేబియా విస్తరణవాద కాంక్షతో యెమెన్‌పై చేస్తున్న దాడుల వల్ల ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారనీ, ఐక్యరాజ్య సమితి ఈ దాడులను నిలువరించకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీసే ప్రమాదం ఉందనీ అంటున్నారు* బైరెడ్డి సతీష్**

ఇస్లామిక్ దేశాల ప్రాంతీయ ప్రాబల్య పరీక్షకు ప్రయోగశాల అయింది యెమెన్. ఓవైపు ఆధిపత్యశక్తికి ఊడిగం చేస్తూనే స్థానిక స్థాయిలో ఆధిపత్యాన్ని, రాచరికాన్ని నిలుపుకోవడం కోసం దాదాపు పది అరబిక్ దేశాలతో జతకట్టింది. యెమెన్‌లో హుతి తిరుగుబాటు పౌరులపై వైమానిక దాడులను సౌది అరేబియా కొనసాగిస్తున్నది. ఉత్తర యెమెన్‌లో మైనారిటీ షియా తెగకు, యాజిదీలకు చెందిన హుతి తిరుగుబాటుదారులు ప్రస్తుత అధ్యక్షుడు మన్‌సూర్ హాదిని పదవీచ్యుతున్ని చేశారు. దేశవ్యాప్త ఆక్రమణకు ముందుకు సాగుతుండడం, హుతి తిరుగుబాటుదారుల ఉద్యమం షియాలు మెజారిటీగా కలిగిన ఇరాన్ సృష్టి అని, తిరుగుబాటు దారులకు అన్నిరకాల వనరులను సమకూర్చడమే కాకుండా ఆయుధ సంపత్తి శిక్షణను ఇరాన్ అందజేస్తున్నదని, ఇప్పటికే ఇరాన్ పట్ల సున్నీల ఆధిపత్య దేశమైన సౌది అరేబియాకున్న వైరం వల్ల తనతో పెద్దగా స్నేహంలేని దేశాలతో కూటమి కట్టి భద్రతా మండలి తీర్మానం కూడా లేకుండానే అన్ని అంతర్జాతీయ సూత్రాలను ఉల్లంఘిస్తూ దాడులను కొనసాగిస్తున్నది.

ఈ తక్షణ నేపథ్యమే కాకుండా యెమెన్‌ను చెప్పుచేతుల్లో ఉంచుకోవాలనే ఎజెండాను సౌది అరేబియా గత కొన్ని దశాబ్దాలుగా సైనిక జోక్యం రూపంలోను, ఇతర రూపాల్లోనూ కొనసాగిస్తూనే ఉంది. ఈ దాడులకు సామ్రాజ్యవాద అమెరికా అండదండలు పుష్కలంగా ఉన్నాయని ప్రత్యేకంగా చెప్పాల్సిందేమీలేదు. ఈ దాడులలో వందలాది మంది అమాయక ప్రజలు ప్రాణాల్ని కోల్పోవడమే కాకుండా లక్షలాది మంది యుద్ధ భయంతో ప్రాణాలు అరచేతులలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ బతుకులు వెళ్లదీస్తున్నారు. వేలాదిమంది తక్షణ, కనీస అవసరాలు తీరక విలవిలలాడి పోతున్నారని ఐక్యరాజ్యసమితి తన నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నది.

2,03,796 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో 26 మిలియన్ల జనాభా, ఉత్తరాన సౌదీ అరేబియాతో, పశ్చిమాన ఎర్ర సముద్రం, దక్షిణాన అరేబియా సముద్రం, తూర్పున ఓమన్‌దేశం సరిహద్దుగా, రెండువేల కిలోమీటర్ల సముద్ర తీరప్రాంతం కలిగి 200 దీవులతో కూడిన అరబ్ దేశమే యెమెన్. యెమెన్‌లో అనేక మతాల ప్రాబల్యం తొలినాళ్లల్లో కనిపించినా క్రమేపీ ఇస్లాం వేళ్లూనికొనిపోయింది. రసూలిద్ లాంటి వంశస్తుల పరిపాలనేకాక అనేకులు యెమెన్‌ను పరిపాలించారు. 20వ శతాబ్దం తొలినాళ్లల్లో యెమెన్ ఒట్టోమాన్, బ్రిటిష్ సామ్రాజ్యాలుగా విడగొట్టబడింది. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఉత్తర యెమెన్‌లో జైది మతవకలైట్ సామ్రాజ్యం 1962లో యెమెన్ అరబ్ గణతంత్ర రాజ్యంగా ఏర్పరచబడింది. దక్షిణ యెమెన్ 1967 వరకు బ్రిటిష్ ఆధిపత్యంలో స్వయం ప్రతిపత్తి కలిగి ఉన్నది. 1990లో మాత్రమే ఈ రెండు ఏకమై గణతంత్ర యెమెన్‌గా ఏర్పడ్డాయి. మిగతా అరబ్ దేశాలంత చమురు సంపద ఈ దేశంలో లేకపోయినా, పెద్దగా నీటివనరులు తక్కువయినప్పటికిని వ్యవసాయం కూడా ఇక్కడ ప్రధానమైనదే. యెమెన్‌కు తొలి అధ్యక్షుడు అయిన అలి అబ్దుల్లా సలేహ్ రెండు దశాబ్దాల పాలనలో దేశంలో తీవ్రమైన పేదరికం, నిరుద్యోగం, విపరీతమైన అవినీతి ఒకవైపు తాండవిస్తుంటే మరోవైపు అధ్యక్షుడు సలేహ్ తన జీవిత కాలం అధ్యక్షుడుగా కొనసాగేలా రాజ్యాంగ సవరణకు పూనుకోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి రాజుకుంది.

సౌది అరేబియా ఉదారంగా అందించే నిధులు వివిధ రకాల తెగల నాయకత్వాన్ని సంతృప్తి పరచడానికే సరిపోయింది. ఈ తెగల ద్వారా సౌది అరేబియా తనపట్టును, రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకొనే ప్రయత్నం చేసింది. ఈలోగా అరేబియా ద్వీపకల్పంలో పాతుకుపోయిన అల్‌ఖైదా అమెరికాకు అత్యంత ప్రమాదకరంగా కన్పించి దాన్ని ఎదుర్కోవడానికి పాలకుల్ని మార్చాలనే పట్టుదలను సౌది అరేబియా ఎదురు చెప్పలేకపోయింది. ఓవైపు ప్రజా ఆందోళనలు మరోవైపు అమెరికా ఒత్తిడితో సౌది అరేబియా ఆధిపత్యంలో ఉండే గల్ఫ్ సహకారమండలి (జిసిసి) చొరవతో సలేహ్ ప్రభుత్వాన్ని గద్దెదింపి ప్రస్తుతం పారిపోయిన అప్పటి ఉపాధ్యక్షుడు అయిన మన్సూర్ హాదిని 2012 ఫిబ్రవరి 21న అధ్యక్షునిగా ప్రతిష్ఠించారు. ఈ అధికార పీఠాల మార్పిడి అంతా హుతి, ఇస్లా పార్టీ, అల్‌ఖైదా తిరుగుబాటు ఘర్షణలో కుప్పు కూలిపోయింది.

2014 సెప్టెంబర్‌లో దేశ రాజధాని అయిన సనాను హుతి తిరుగుబాటు దారులు తన అధీనంలోకి తెచ్చుకున్నారు. ఒక ఐక్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, రాజ్యాంగ ముసాయిదాను చర్చించే క్రమంలోనే దేశాన్ని ఆరు సమాఖ్య ప్రాంతాలుగా విభజించాలన్న ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ హుతి తిరుగుబాటుదారులు ఉద్యమాన్ని ఉధృతం చేయడంతో అధ్యక్షుడు హది, ప్రధానమంత్రి రాజీనామా చేయక తప్పలేదు. మూడువారాల అనంతరం ప్రభుత్వాన్ని ఏర్పరుస్తున్నట్లు హుతి తిరుగుబాటుదారులు తమకుతామే ప్రకటించుకున్నారు. అయితే దీన్ని మిలటరి తిరుగుబాటుదారుగా భావించి ఐక్యరాజ్యసమితి ఆ ప్రభుత్వాన్ని గుర్తించలేదు. సియాల నేతృత్వంతో ఉన్న తిరుగుబాటుదారుల చర్య సహజంగానే సౌది అరేబియాకు ఆగ్రహాన్ని తెప్పించింది. పదవీచ్యుతుడైన హదిని మళ్లీ ప్రతిష్ఠించి అడెన్‌ని తాత్కాలిక రాజదానిగా హది చేత

ప్రకటింపచేసింది. ఒకవైపు అమెరికాతో అణు ఒప్పందం కుదిరి అనేక దశాబ్దాలుగా అమలులో ఉన్న ఆర్థిక ఆంక్షలు తొలగి పోనుండడం, ఇరాక్, సిరియాలలో ఐసిస్‌పైన అమెరికా యుద్ధానికి ఇరాన్ మద్దతు ఇవ్వడం ఆర్థికంగా, సైనికంగా ఇరాన్ ఎక్కడ శక్తివంతమవుతుందోనన్న అక్కసుతో సౌది అరేబియా ఈ ప్రస్తుత దాడులకు తెరలేపింది. దీనికి తోడు అణు ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అరబిక్ దేశాలను రెచ్చగొట్టేలా ప్రకటన చేయడం గమనించదగినది. ఇరాన్ జోక్యం ప్రత్యక్షంగా యెమెన్‌లో ఉందా లేదా అనే అంశం కంటే ఈ సంక్షోభాన్ని షియా, సున్నీల మధ్య ఘర్షణగా అభివర్ణించడం అత్యంత ప్రమాదకరం.

మళ్లీ చరిత్రలోకి వెళ్తే 1918లో నైది ఇమామ్‌యహ్యా నెలకొల్పిన మతవక్మలైట్ సామ్రాజ్యం 1962 వరకు మనుగడలో ఉన్నది. 1962 నుండి కూడా సౌది సామ్రాజ్యం సైనిక, ఇతర రూపాల్లో జోక్యం చేసుకుంటూనే ఉంది. రాచరిక వ్యవస్థను నిలబెట్టేందుకు ఇటీవలి కాలంలో 'అరబ్ స్ప్రింగ్'గా ప్రసిద్ధమైన ప్రజా తిరుగుబాటును అణిచివేసేందుకు గల్ఫ్ సహకార మండలి ద్వారా కీలకమైన పాత్రనే పోషించింది. ఇన్ని దశాబ్దాల కాలం నుండి కూడా తన పెట్రో డాలర్స్‌ను యెమెన్‌కు అందిస్తూ తనకు అనుకూలురైన తెగ నాయకులను ప్రోత్సహించడమే కాకుండా యెమెన్ జనాభాలో 35 శాతంగా ఉన్న షియాలకు రాజ్యాధికార వాటా దక్కకుండా అడ్డుకుంటున్నదని, తన ఆర్థిక పట్టుతో యెమెన్‌లో సలాఫియత్, వహాబి భావజాలం పెరగడానికి కారణమవుతుందని, 'సున్నీకరణ'ను పెద్దఎత్తున చేపడుతుందనే అసంతృప్తి 1982 నుండి యెమెన్‌లోని షియా ప్రజల్లో బలంగా పేరుకుపోయింది. ఇదే ఇరాన్‌కు కలిసి వచ్చిన అంశం, అస్త్రం. ఈ క్రమంలోనే ఇరాన్, షియా వర్గాన్ని చేరదీసి వనరులను సమకూర్చిందనేది వాస్తవం. ఇరాన్‌కు అనుకూల పక్షంగా ఉండి అయోతుల్లా మతవాద, జాతీయ విస్తరణవాద, సంకుచిత ఎజెండాను అమలుచేయడం మినహా మరో లక్ష్యంలేదు హుతి తిరుగుబాటు దారులకు. ఇది సహజంగానే 'సున్నీ' సౌది రాజరిక వ్యవస్థకు కంటగింపుగా మారింది. కానీ హుతి తిరుగుబాటుదారులలో అన్నివర్గాలు ఉన్నాయని, వారిని వ్యతిరేకించే వారిలో షియాలుకూడా ఉన్నారనే వాదనాలేకపోలేదు.

యెమెన్ పైన సౌది సామ్రాజ్యం చేస్తున్న ప్రస్తుత యుద్ధోన్మాదానికి, గతంలో చేసిన సైనిక జోక్యాలకి స్పష్టమైన తేడా ఉంది. తొమ్మిది అరబ్ రాజ్యాలను (ఈజిప్టు, జోర్డాన్, కతర్, సూడాన్, మొరాకో వంటి) అరబేతర రాజ్యం (పాకిస్థాన్)తో (పాకిస్థాన్ పార్లమెంట్ యెమెన్‌లో ప్రత్యక్ష జోక్యానికి వ్యతిరేకంగా తీర్మానం చేసింది) అతిపెద్ద సైనిక సంకీర్ణ కూటమిని ఏర్పరచి (సిరియాకు మినహాయింపు) అత్యంత వ్యయ భరితమైన సంక్లిష్టమైన దాడులకు పాల్పడుతున్నది. యెమెన్ భౌగోళిక స్వరూపం రీత్యా ఈ దాడి ఎక్కువ కాలం కొనసాగే సూచనలే కనిపిస్తున్నాయి. ఈ దాడులలో మొదట బలవుతున్నది, బాధితులవుతున్నది సాధారణ ప్రజలనేది నిస్సందేహం. ప్రజలు సమకూర్చుకున్న మౌలిక సదుపాయాలన్ని ధ్వంసం అయిపోవడం చూస్తే ఈ పేద అరబ్ దేశంలో ఇంకా ఎటువంటి విపత్కర పరిణామాలు ఉంటాయో అనూహ్యమేమీకాదు. ఇంకా క్షేత్రస్థాయిలో జరిగే యుద్ధంతో అంతర్యుద్ధమే కాకుండా, తెగల మధ్య ఘర్షణ పెరుగుతూ, పొరుగు దేశాల్లో దీని ప్రభావం పడి అది అరబ్, అరబేతర దేశాల ఘర్షణగా తలెత్తే ప్రమాదం ఉంది. సైనిక బలాబలాల ప్రదర్శనకు, పోటీకి దారితీసి మొత్తంగానే ఒక యుద్ధ క్షేత్రంగా మారవచ్చు. ఈ దుష్పరిణామాల వల్ల లాభపడేది సామ్రాజ్యవాద దేశాలు, వాటి సైనిక వ్యవస్థలు మాత్రమే. అంతిమంగా అపార సహజ సంపద కలిగిన ఈ ప్రాంతమంతా సామ్రాజ్యవాద శక్తుల చేతుల్లోకి వెళ్తుందనేది నిస్సందేహం.

గమనించదగిన మరో అంశమే మిటంటే ఈ వర్తమాన అరబ్ దేశాల ఐక్యతా కూటమి షర్మల్ 'ఎ' షేక్ లో జరిగిన సమావేశంలో పాలస్తీనా అంశం కనీస ప్రస్తావనకైన నోచుకోకపోవడం. సంవత్సరం క్రితమే ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి వేలాది పాలస్తీనా ప్రజలు ప్రాణాలు ముఖ్యంగా చిన్నారులు ప్రాణాలు పోగొట్టు కోవడం, ప్రజల ఆస్తులు ధ్వంసం కాబడి, గాజా ప్రాంతంలో ఇంకా ఆక్రమణలు కొనసాగిస్తూ వేలాది మందిని జైళ్లల్లో నిర్బంధించి హింసిస్తున్నా, పాలస్తీనా వ్యవసాయ భూముల్ని అక్రమంగా స్వాధీన పరచుకున్నా, పాలస్తీనాను నిరంతరం మృత్యుక్షేత్రంగా మారుస్తున్న ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ఒక్కమాట కూడా మాట్లాడలేదు. యూదుల ఆధిపత్య, దౌర్జన్యపూరిత విధానాలను, చర్యలను ఎదుర్కోకుండానే తమతోతామే యుద్ధం చేసుకునేలా యెమెన్‌పై దాడిని కొనసాగిస్తున్నాయి. నిజానికి హుతీలు కొనసాగిస్తున్న తిరుగుబాటువల్ల కూడా అనేకమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు.

దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న జీవనర్మణ సమస్యల కంటే ఇరాన్ ఎజెండాను ముందుకు తీసుకుపోవడంతో హుతీలు ఆధిపత్య పోరులో కూరుకొనిపోయారు. గత కాలపు నియంత అయిన అబ్దుల్లా సలేహి ప్రధానంగా యాజిదీల ఊచకోతకు కారకుడైన వ్యక్తితో అంటకాగడం హుతీల విద్దూరమైన చర్యకు నిదర్శనం.

కొత్త అధ్యక్షుడైన మన్సూర్ హది ఉత్తర యెమెన్‌కు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాలు అంతకంటే దుర్మార్గుడైన సలేహ్‌తో జతకట్టేలా చేశాయనడం ప్రజా ప్రయోజనాల కోణంలో ఏ మాత్రం సమర్థనీయం కాదు. సౌది అరేబియా నాయకత్వంలో కొనసాగుతున్న సంకీర్ణ దళాల దాడులు యెమెన్ ప్రజా జీవితాన్ని వారి జీవన్మరణ సమస్యల సంక్షోభం నుండి విముక్తి చేయడం లక్ష్యంగా సాగుతున్నాయని ఎవరికీ భ్రమలు లేవు. 2003 నుండి సామ్రాజ్యవాద అమెరికా, ఆఫ్ఘన్, ఇరాక్ యుద్ధాల్లో చేతులు కాల్చుకొని చేష్టలుడిగున్న సందర్భంలో తన చెప్పు చేతుల్లో ఉండే మరోస్థానిక సామ్రాజ్యవాద శక్తిని బలోపేతం చేసే పనిలో పడింది. అరబ్ స్ప్రింగ్‌ను పూర్తిగా నిలువరించే పనిని భుజాన వేసుకుంది సౌది అరేబియా. కతర్‌తో జతకట్టి 2011 లోనే బహ్రెయిన్‌లో తలెత్తిన ప్రజా ఉద్యమాన్ని అణిచివేసి తన ప్రాబల్యాన్ని చాటుకుంది.

అరబ్‌స్ప్రింగ్ ఉద్యమం పునాదుల్ని మార్చే ప్రజా విప్లవమేమీ కాకపోయినా ఊడలు దిగిన అరబ్ రాజరిక వ్యవస్థ ఆ మాత్రపు ప్రజా చైతన్యాన్ని, ఆందోళనలను సహించే స్థితిలో లేదు. తన రాచరికాన్ని పదిలపరుచు కోవాలంటే తను ప్రపంచ సామ్రాజ్యవాద దేశానికి ఊడిగం చేస్తూ తన చుట్టు ఉన్న దేశాలకు తన 'పవరేంటో' చాటి చెప్పాలి. తన దేశంలో ఉన్న షియా మైనారిటీ ప్రజలకు కూడా ఇది ఒక హెచ్చరిక.

మైనారిటీలకు సాధికారత ఎలా?

***తమ స్వప్రయోజనాల కోసం కుల, మతాల పేరుతో ప్రజల మధ్య వైరుధ్యాలు సృష్టించి అధికారం పొందాలనే రాజకీయ పార్టీల కుట్రలను భగ్నం చేస్తూ మైనారిటీ ప్రజలు సమానత్వం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం కృషి చేయాలని అంటున్నారు* ఇర్ఫాన్ ఇంజనీర్**

గత పదేళ్లలో, ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న, ముస్లింలు నడుపుతోన్న రాజకీయ పార్టీలు భారతదేశంలో ఆవిర్భవించాయి. 2005లో, మౌలానా బద్రుద్దీన్ అజ్మల్ ఎఐయుడిఎఫ్‌ని అస్సాంలో స్థాపించారు. 2007లో ముఫ్తి ఇస్మాయిల్ మాలెగావ్‌లో స్థాపించిన ముస్లిం ఫ్రంట్ తరపున చాలా మంది ఎంఎల్ఎలు గెలిచారు. 2008లో మహమ్మద్ ఆయూబ్ అనే సర్జన్ ఉత్తరప్రదేశ్‌లో పీస్ పార్టీని స్థాపించారు. 2009లో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా తన రాజకీయ విభాగంగా సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియాని ఏ సయీద్ అధ్యక్షతన ఆరంభించింది. ముస్లింలని ఐక్యపరచి, ఒక శక్తివంతమైన కూటమిగా తయారు చేయాలనేది ఎస్.డి.పి.ఐ. లక్ష్యమని అధ్యక్ష ప్రసంగంలో అబూబాకర్ అన్నారు. ఏప్రిల్ 2011లో, జమాత్-ఏ-ఇస్లామి వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా ని ఆరంభించింది. వెల్ఫేర్ పార్టీ మొదటి అధ్యక్షుడు ముజ్తబ ఫరూక్, ప్రస్తుత అధ్యక్షుడు ఎస్.క్యు.ఆర్. ఇల్యాస్. ఇవన్నీ కాకుండా, ఎంఐఎం ఈ మధ్య మహారాష్ట్రలో కూడా ఎన్నికల్లో పోటీ చేసి రెండు సీట్లు గెలిచింది.

తమ ఉమ్మడి ప్రయోజనాల సాధన కోసం ప్రజాస్వామ్యంలో సమూహాలు రాజ్యాంగానికి కట్టుబడి ఉంటూ, ప్రజాస్వామ్య ప్రక్రియల్లో పాలు పంచుకోవడం, తమకి లభించాల్సిన న్యాయమైన వాటా కోసం పోరాడడం, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయడం, తమ ప్రయోజనాలకి అనుకూలంగా వాదించడం వంటివి చేయవచ్చు. కొన్ని కులాల, సమూహాల ప్రయోజనాలకి ప్రాతినిధ్యం వహించే పార్టీలు ఇప్పటికే ఉన్నాయి, వాటి గురించి పెద్దగా ఎవరూ అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. ఉదాహరణకి, దళితుల ప్రయోజనాల కోసం ఉన్న పార్టీలు ఇవి - రాంవిలాస్‌పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ, మహారాష్ట్రలోని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, జస్టిస్ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ. అట్లాగే, కుర్మీల పార్టీ అయిన అప్నాదల్, ప్రాంతీయతకి సంబంధించి దక్షిణాదిలో ద్రావిడ పార్టీలు, మహారాష్ట్రలో శివసేన, ఒక మత ప్రయోజనాల కోసమున్న అకాలీ దల్. అయితే, ముస్లింలు ఒక సమూహంగా తమ ప్రయోజనాల కోసం పార్టీలు పెట్టినా, ఎన్నికలలో గెలిచినా, ఇతర మతాలలోని ప్రజలు, మరీ ముఖ్యంగా మీడియా వాటి గురించి చాలా ఆందోళన చెందుతారు. హిందూత్వవాదులు ఎప్పుడూ ముస్లింలని వేర్పాటువాదులుగా, ఉగ్రవాదులుగా, మతతత్వవాదులుగా చిత్రీకరిస్తారు. అందుకే, ముస్లింల పార్టీలేవైనా సరే దేశాన్ని రెండోసారి విభజన వైపు తీసుకు వెళ్తాయని వాళ్ల అనుమానం. ముస్లిం ప్రయోజనాల కోసం పని చేయడమనేది వాళ్ల ఉద్దేశంలో మతతత్వమే.

అస్తిత్వ రాజకీయాలు దౌర్జన్య పూరితంగా, ఆధిపత్య స్వభావంతో, ఇతరుల నుండి దూరంగా ఉన్నప్పుడు, అధికార క్రమాన్ని, నిర్మాణాల్ని బలోపేతం చేస్తూ, (సామాజిక, రాజకీయ, ఆర్థిక) ఉన్నత వర్గాల ప్రత్యేక సౌకర్యాలను రక్షిస్తూ ఉంటాయి. ఇంకో పక్క, పీడిత, మినహాయింపబడ్డ మైనారిటీ సమూహాలు, సమానత్వం, ధర్మం, సామాజికార్థిక రాజకీయ

సరిహద్దు దేశాల్లో తన కనుసన్నుల్లో నడిచే పాలకుల్ని ప్రతిష్ఠించగలిగే సత్తా తనకున్నదని ప్రపంచానికి చాటి చెప్పడం. ఆయిల్ నిక్షేపాల ద్వారా వచ్చే ఆదాయంపైన తనే నెంబర్ వన్‌గా ఉండే ఆరాటం. అందుకే హుతీస్ ఆడెన్, బాబ్ 'ఎల్' మాండెబ్ లాంటి కీలక ప్రాంతాలకు విస్తరించకుండా తక్షణం అడ్డుకుంటున్నది. రోజుకు మూడు మిలియన్ల బారెల్స్ ముడిచమురు బయటకు వెళ్లే హర్మూజ్ జలసంది వీటికి సరిహద్దులుగా ఉండడమే ప్రధాన కారణం.

అంతర్జాతీయ సమాజం ఈ సంక్షోభాన్ని తక్షణమే పరిష్కరించకపోతే ప్రపంచ వ్యాప్తంగా అనేక దుష్పరిణామాలకు దారితీస్తుంది. మరికొన్ని దేశాలు ఈ దాడుల్లో కలిస్తే అంతర్జాతీయ చమురు సంక్షోభం తలెత్తవచ్చు. ఫలితంగా అనేక ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలి ఆయాదేశాల ప్రజల జీవితాలు మరింత సంక్షుభితం అవుతాయి. ప్రైవేట్ ఆస్తులు సరిహద్దులకు ఆవలగా తరలించబడతాయి. సామాజిక జీవితం సంఘర్షణాయుతంగా తయారవుతుంది. అనేక దేశాలు కఠిన చట్టాలను రూపొందించి మరింత క్రూరంగా వ్యవహరించవచ్చు. ప్రజల మీద మరింత అణిచివేత పెరుగుతుంది. రక్షణ ఉత్పత్తులు అమ్ముకునే దేశాలు మరింతగా లాభపడతాయి. ప్రపంచ దేశాల మీద ప్రత్యేకించి అభివృద్ధి చెందుతున్న దేశాలు అనబడుతున్న వాటిపై పెత్తనం మరింతగా చెలాయిస్తాయి. దేశాలు స్వతంత్రతను కోల్పోయి పరాయికరణ చెందే ప్రమాదం ఉంది. ప్రజల స్వేచ్ఛా స్వతంత్రాలు ఆర్థిక సంక్షోభం వల్ల కానీ, కొత్త చట్టాల వల్లకానీ తీవ్ర ఉల్లంఘనకు గురయ్యే అవకాశం ఉంది.

వీటన్నింటిని నివారించాలంటే తక్షణమే దాడిని నిలిపివేసి యెమెన్ ప్రజలకు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే స్వేచ్ఛా వాతావరణాన్ని కల్పించారు. సౌది అరేబియా, ఇరాన్‌లు తమ విస్తరణవాద సిద్ధాంతాన్ని విరమించుకొని ఐక్యరాజ్య సమితికి మరింత స్వేచ్ఛగా, ప్రజాస్వామికంగా వ్యవహరించేలా చేయడం మినహా మరో మార్గం లేదు.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

న్యాయం కోసం తమ అస్తిత్వం ఆధారంగా సంఘటితమవుతారు. అందుకే అస్తిత్వ రాజకీయాలు ప్రజాస్వామికంగానూ ఉండవచ్చు లేదా ఆధిపత్య ధోరణిని కలిగి ఉండవచ్చు. ఆధిపత్య అస్తిత్వ రాజకీయాలు ఎక్కువగా జాతీయవాదం, ప్రాంతీయత, ఉన్నత జాతికున్న హక్కులు, ఆది నుంచి నివాసం ఉన్న వారికి ప్రత్యేక హక్కులు వంటి నినాదాలతో జాతీయ, సామాజిక, విద్య, ఆర్థిక వనరులలో, అధికార నిర్మాణాలు, సంస్థలు, ప్రభుత్వ పరికరాలు, యంత్రాంగంలో తమకి రావాల్సిన న్యాయమైన వాటా కన్న ఎక్కువ భాగాన్ని డిమాండ్ చేస్తాయి. భారత దేశ హిందూత్వవాదుల ప్రకారం, మైనారిటీలు హిందువులని, అన్నలుగా పరిగణించి, వాళ్ళకి తమ్ముళ్ళుగా సేవనందించాలి. ప్రజాస్వామిక అస్తిత్వ రాజకీయాలు ఇందుకు భిన్నంగా సమాజంలో అంతర్భాగమవ్వడాన్ని, వనరులలో, అధికార నిర్మాణాల్లో తమకి న్యాయంగా రావాల్సినంత భాగాన్ని, సురక్షిత మత-సాంస్కృతిక స్థలాన్ని కోరుకుంటాయి. సమాజంలోని బహు సమూహాల కోరికలని సర్దుబాటు చేస్తూ, అనుకూల ప్రతిస్పందన ఇచ్చే దిశగా రాజ్యాన్ని మార్చే ప్రయత్నాన్ని ప్రజాస్వామిక అస్తిత్వ రాజకీయాలు చేస్తాయి. ఈ ప్రయత్నంలో భాగంగా అవి అస్తిత్వ సమూహాల్లోని వ్యక్తులను విభేదించే, ప్రశ్నించే, అస్తిత్వాలను అతిక్రమించే, మార్చుకునే స్వేచ్ఛని ఇస్తాయి. ఉదాహరణకు, హింసాత్మక సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ నిర్మాణాలని, వివక్ష సాధనాలని ప్రశ్నించే, పోరాడే దళిత, ఆదివాసి ప్రజాస్వామిక అస్తిత్వ రాజకీయాలు తమ కులాల, జాతుల వరకే పరిమితం కాకుండా, ఇతర అణగారిన ప్రజలకు- దళిత స్త్రీలు, అట్టడుగున ఉన్న శ్రామిక జీవులకు - న్యాయబద్ధ రాజకీయ వ్యవస్థ కల్పించడానికి కృషి చేస్తాయి.

మజ్లిస్ - ఇ - ఇత్తెహాదుల్ ముసల్మీన్ (ఎంఐఎం)

ఎస్‌డిపిఐ, ఎంఐఎంల రాజకీయ కార్యక్రమాలు ఆధిపత్య ధోరణి కలిగిన అస్తిత్వ రాజకీయాలు. ఎంఐఎం మీడియాలో చేస్తున్న విశ్లేషణలో తనని తాను మెజారిటీ సమూహాల ఆధిపత్య అస్తిత్వ రాజకీయాలను వ్యతిరేకిస్తున్న ప్రజాస్వామిక పార్టీగా చూపెట్టినా, నిజానికి అది ముస్లింల అస్తిత్వాన్నే ప్రధానమైనదిగా చూసే ఆధిపత్య ధోరణి కలిగిన పార్టీయే. ముస్లిం సమాజంలో మతపరమైన చైతన్యం కలిగించి, మత ప్రాతిపదిక కలిగిన సమూహాన్ని ఒక రాజకీయ సమూహంగా మార్చి, దానికి తానే రాజకీయ ప్రతినిధిగా ఉండాలనేది ఎంఐఎం లక్ష్యం. ఇతర మతాల కన్నా భిన్నంగా, ఉన్నతంగా ఉన్నామనే భావన ఆధారంగా ముస్లిం సమాజ రాజకీయ ఐక్యతని ఎంఐఎం ప్రతిపాదిస్తుంది. ముస్లింలని ఐక్యపరచి, వాళ్ల సత్తా చూపించాలని ఎంఐఎం ఉద్దేశం. సాంస్కృతికంగా, భాషాపరంగా, జాతిపరంగా విభిన్నత కలిగి, వివిధ మతపరమైన శాఖలుగా ఉన్న ముస్లిం సమాజాన్ని ఐక్య పరచడానికి, ఎంఐఎం ముస్లిం సమాజ గత వైభవాన్ని గుర్తు చేస్తూ, భావావేశం కలిగించే భక్తి చిహ్నాలని నిర్మిస్తూ, వాటి చుట్టూ ముస్లిం సమాజాన్ని సమీకరిస్తుంది. షరియా, పవిత్ర ఖురాన్, మహమ్మద్ ప్రవక్త, ఉర్దూ భాష ఇవన్నీ ఎంఐఎం గతంలో వాడుకున్న కొన్ని చిహ్నాలు, అట్లాగే 80-90లలో బాబ్రీ మసీద్ కూడా వాడుకొన్నారు. ఎంఐఎం గూండాలు హైదరాబాద్‌లో తస్లీమా నస్రీన్ మీటింగ్ మీద కూడా దాడిచేశారు. తస్లీమా నస్రీన్‌కి, సల్మాన్‌రష్దీకి వీసాలు ఇవ్వకూడదని, వాళ్ల పుస్తకాలు నిషేధించాలని డిమాండ్ చేశారు. ముస్లిమేతరులను లక్ష్యంగా చేసుకుని మాట్లాడిన ద్వేషపూరిత ప్రసంగానికి అక్బరుద్దిన్ ఒవైసి మీద కేసు కూడా నమోదైంది.

ఉగ్రవాదులనే అబద్ధపు ఆరోపణల కింద నిర్బంధించబడ్డ ముస్లిం యువత - మక్కా మసీదులోని బాంబు పేలుళ్లకి అరెస్టు చేయబడిన వారితో సహా, మానవహక్కుల కోసం ఎంఐఎం ఏమి చేయలేదు. మసీదు బాంబు పేలుళ్లలో అరెస్టు చేయబడ్డ యువతకి వ్యతిరేకంగా ఎటువంటి సాక్ష్యాధారాలు లేవని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విధానసభలో ఒప్పుకునేలా చేసింది మానవ హక్కుల సంస్థలు. వాళ్లు అంత పోరాటం చేసిన తరువాత, నిర్బంధించబడ్డ యువతకి బెయిల్ ఏర్పాట్లు చేసి దాని నుంచి ఎంఐఎం రాజకీయ లబ్ధి పొందాలని చూసింది.

ఎంఐఎం వృద్ధి, విస్తరణ హిందూత్వవాదుల పెరుగుదలకి ప్రతిస్పందన, సాకు కూడా. హింత్వవాదుల సవాలుని ఎదుర్కొనగల ఏకైక శక్తిగా ఎంఐఎం ముస్లిం సమాజం ముందు నిలబడుతుంది. కాని నిజానికి హిందూత్వవాదులు మరింత పెరిగేలా దాని ఆచరణ ఉంటుంది. ఢిల్లీ విధానసభ ఎన్నికలలో ఎంఐఎం పోటీ చేయడంతో, కొద్ది మంది ముస్లిం యువత వోట్లని అది సంపాదించినా, దాని పర్యవసానంగా ఎఎపి అభ్యర్థులు ఓటమి పొందే అవకాశం ఉంది. అందుకే, ఎంఐఎం బిజెపితో కుమ్మక్కై ఢిల్లీ ఎన్నికలలో నిలబడిందేమో అనే ఊహాగానాలు ఉన్నాయి.

మహారాష్ట్ర ఎన్నికలలో అధిక సంఖ్యలో ముస్లింలు ఎంఐఎంకి వోట్లు వేయడమనేది బిజెపి పెరుగుదలతో వచ్చిన మత విభజన, బిజెపికి చెందిన యోగి ఆదిత్యనాథ్ 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాగించిన నిలవ్ జిహాద్ వ్యతిరేక ప్రచారం పర్యవసానం. అంతే కాకుండా ఇంకో బిజెపి పార్లమెంట్ సభ్యుడు సాక్షి మహారాజ్ మదర్సాలను ఉగ్రవాద శిబిరాలుగా వర్ణించడం, బిజెపి మంత్రి మేనకాగాంధీ రాజస్థాన్ ఉప ఎన్నికలలో ప్రచారం చేస్తూ గోవధ నుండి వస్తున్న లాభాలు ఉగ్రవాదానికి వాడబడుతున్నాయని అనడం కూడా ముస్లిం వోటుకి కారణాలు. బిజెపి 16వ లోక్‌సభ ఎన్నికలలో గెలిచిన తరువాత ముస్లింల మీద పెరిగిన దాడులకి కొన్ని ఉదాహరణలు మసీదుల్లో లౌడ్‌స్పీకర్‌లు పెట్టకూడదనడం, మొరాదాబాద్ దగ్గర్లోని కాంథ్‌లో నమాజ్ జరుగుతున్న సమయంలో కావాలని మసీదుల ముందు సంగీతం వాయించడం, అలీగర్ ముస్లిం యూనివర్సిటీలో జాట్‌లని మెప్పించడానికి, క్యాంపస్‌లో ఆందోళన పెంచడానికి రాజామహేంద్ర ప్రతాప్ పుట్టినరోజుని జరపాలనే ప్రయత్నం. ముస్లింల మీద దాడితో పాటుగా హిందూత్వవాదులు త్రిలోక్‌పురి (ఢిల్లీ), అహమ్మదాబాద్, వడోదర, సోంనాథ్ (అన్ని గుజరాత్ లోవి) లలో హింసకి పాల్పడ్డారు. ఈ మొత్తం దాడులని లౌకిక పార్టీలేవి సమర్థవంతంగా వ్యతిరేకించ లేదు.

వెనకబాటు తనం, దాడులు పెరుగుతున్న వాతావరణం, బలహీనులమనే భావన కలిసి, ముస్లిం సమాజం ఐక్యంగా ఉండి తమ బలమేమిటో చూపించాలనే ఎంఐఎం వాదనకి, కొంత మందిలో సానుభూతిని కలిగించాయి. ముస్లిం వోటర్లందరు కలిసికట్టుగా ఓట్లేసేటట్టు చేయాలనేది ఎంఐఎం రాజకీయ వ్యూహం. ముస్లిం వోటర్లను ఐక్య పరచాలంటే ఒక ముస్లిం మాత్రమే వాళ్ల ప్రయోజనాలకి, కోరికలకి

నిజమైన ప్రాతినిధ్యం వహించగలడని, తాము మాత్రమే ముస్లింలకి అసలైన ప్రతినిధులమని ఎంఐఎం ముస్లిం ఓటర్లకి గట్టి నమ్మకం కలిగించాలి. ఇది ముస్లిం సమాజానికి తానొక్కడినే ప్రతినిధినని జిన్నా చేసిన వాదనలాంటిది. మహారాష్ట్ర విధానసభ ఎన్నికలప్పుడు ఔరంగాబాద్, ఇతర ప్రదేశాల్లో ప్రసంగిస్తూ ఎంఐఎంకి చెందిన ఒవైసి సోదరులు తాము ఎటువంటి పరిస్థితులనైన, శక్తులనైన నిర్భయంగా ఎదుర్కోగలమని చెప్పారు. ముస్లిం సమాజానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రస్తావిస్తూ, గతంలో తామే పాలకులమని గుర్తుచేసి, అన్యాయాన్ని ఎదిరించడానికి ముస్లింలు అందరు కలిసికట్టుగా ఎంఐఎంకి వోటు వేయాలని అన్నారు. ఐతే, వాళ్ల వ్యూహం సరైనది కాదు. తెలంగాణ బయట ఎంఐఎం ఒకటో రెండో సీట్లు గెలుచుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది, అంతే. ముస్లిం సమాజం ఎదుర్కొంటున్న సవాళ్ల పట్ల మిలిటెంట్‌గా ఉంటూ, ఇతర ముస్లిం పార్టీలకి రాజకీయంగా స్థానం లేకుండా చేయడం ఎంఐఎం లక్ష్యం. అయితే, ముస్లింలు 35 శాతం కన్నా ఎక్కువ ఉన్న నియోజకవర్గాల్లో మాత్రమే వాళ్లు దీన్ని సాధించగలరు. అటువంటి నియోజకవర్గాల్లో మాత్రమే ముస్లింలు ఎక్కువగా ఉన్న, ముస్లిం నేతృత్వం ఉన్న పార్టీ గెలిచే అవకాశం ఉంది. దేశంలో, 19 జిల్లాల్లో మాత్రమే ముస్లింలు జనాభాలో 50 శాతం ఉన్నారనే వాస్తవాన్ని అధిగమించడానికి ఎంఐఎం దళితులతో పొత్తు కూడాలనే వ్యూహాన్ని రచిస్తోంది. అయితే, ఇది చాలా కాలం కిందటే విఫలమైన సామాజిక పొత్తు. దాన్ని మొదటిసారిగా గూండా నుంచి రాజకీయ నాయకుడిగా మారిన హాజీ మస్తాన్, 1985లో, నిదళిత్ ముస్లిం సురక్ష మహా సంఘ్ పేరిట పెట్టాడు. కాని ఒక్క సీటు కూడా గెలవలేక పోయాడు. ఎంఐఎం ముస్లింల ఆవేశాలను రెచ్చగొట్టడమే కాని ఎప్పుడూ కూడా దళితులు ఎదుర్కొంటున్న వివక్షనూ, అణచివేతనూ పార్లమెంట్‌లో కాని, బయట కాని ఖండించలేదు. మరి సహజంగానే దళితులు అటువంటి పొత్తుకి తమ మద్దతివ్వరు.

2001 సెన్సెస్ ప్రకారం, 25 జిల్లాల్లో ఒక మిలియన్‌ను మించి ముస్లిం జనాభా ఉన్నారు. వీటిలో పెద్దది ముర్షీదాబాద్ (3.7 మిలియన్), దాని తర్వాత వరసగా మలప్పురం, దక్షిణ, ఉత్తర 24 పరగణాలు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న మూడు జిల్లాలు హిందీ రాష్ట్రాల బయటే ఉన్నాయి. భారతదేశంలోని 593 జిల్లాల్లో, 9 మాత్రమే ముస్లిం ప్రధానమైన (75 శాతం) జిల్లాలుగా పరిగణించ వచ్చు. ఈ తొమ్మిదిలో లక్షద్వీప్, జెడకెలో 8 జిల్లాలున్నాయి. ముస్లింలు జనాభాలో 50–75 శాతం ఉన్న 11 జిల్లాల్లో ఆరు అస్సాంలో, రెండు జెడకెలో, ఒకటి చొప్పున కేరళ, బీహార్, పశ్చిమ బెంగాల్‌లో ఉన్నాయి. ముస్లింలు జనాభాలో 25–50 శాతం ఉన్న జిల్లాలు 38 ఉన్నాయి. అవి 12 యుపిలో, 5 పశ్చిమ బెంగాల్, కేరళలో, 4 అస్సాంలో, 3 బీహార్‌లో, 2 జార్ఖండ్‌లో, 2 ఢిల్లీలో, ఒకటి చొప్పున ఆంధ్రప్రదేశ్, హర్యానా, జెడ్‌కె, ఉత్తరాంచల్, పాండిచ్చేరిలో ఉన్నాయి. 182 జిల్లాల్లో, ముస్లింలు జనాభాలో 10–25 శాతం ఉన్నారు. ఈ 182 జిల్లాల్లోని ముస్లింల సంఖ్య మొత్తం దేశంలోని ముస్లిం జనాభాలో 47 శాతం ఉంటుంది. 65 శాతం ముస్లింలు నివసించే జిల్లాల్లో, వాళ్లు జనాభాలో 25 శాతం కన్నా తక్కువ ఉంటారు.

ముస్లింలు 10 శాతం నుంచి 25 శాతం ఉన్న జిల్లాల్లో ఎన్నికల ఫలితాల మీద వాళ్ల ప్రభావం ఉండాలంటే, వాళ్లలో మత స్పృహ ఎక్కువగా ఉండి, ముస్లిమేతరులు కుల, సాంస్కృతిక, రాజకీయ ప్రాతిపదిక మీద విడిపోయి ఉండాలి. అంటే, 47 శాతం ముస్లింలు తమ వోటుని సమర్థవంతంగా వాడుకోవాలంటే ముస్లిమేతరులలో కొన్ని సెక్షన్లతో కలిసి ఉమ్మడిగా వోటు వేయాలి. ఐతే, ముస్లింలు 10–25 శాతం ఉన్నప్పుడే, భద్రతని దృష్టిలో ఉంచుకుని కలిసికట్టుగా వోటేసే అవకాశం ఉంది. వాళ్లు జనాభాలో 50 శాతం మించిన నియోజక వర్గాల్లో, వాళ్ల వోటు కోసం వివిధ రాజకీయ పార్టీలు ముస్లింలని తమ అభ్యర్థులుగా నిలబెట్టడంతో ముస్లింల వోటు చీలిపోయే అవకాశం ఎక్కువ. ఇంకో పక్క, ముస్లిమేతరులు తమ బలాన్ని చూపెట్టడానికి కలిసికట్టుగా ఓటేసే అవకాశం ఉంది. ఉదాహరణకి, ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో, 51 శాతం ముస్లిం జనాభా ఉన్న రాంపూర్ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థి నేపాల్‌సింగ్ గెలిచారు. ముజఫర్‌నగర్‌లోని మత అల్లర్ల మూలాన ఏర్పడ్డ మత విభజన దీనికి ఒక కారణమైతే, బిజెపి వివిధ కులాల వోట్లని సమీకరించ గలిగింది. ఇంకో పక్క, ముస్లిం వోట్లు సమాజ్ వాది, కాంగ్రెస్, బి.ఎస్.పి పార్టీల మధ్య చీలిపోయాయి.

పార్లమెంట్‌లో అతి తక్కువ ముస్లిం ప్రతినిధులు ఉండడానికి పైన పేర్కొన్న అంశాలు పాక్షిక కారణాలు. ఉదాహరణకి – ముస్లింలు 40 శాతం ఉన్న అలీగర్‌లో, వాళ్లందరు కలిసి వోటు వేసుంటే, హిందువుల వోట్లు చీలిపోయి ఉంటే, ముస్లిం అభ్యర్థి గెలిచేవాడు. ఐతే, అక్కడ జరిగినది ఏమిటంటే సమాజ్ వాది పార్టీకి చెందిన ముస్లిం అభ్యర్థి జఫర్ ఆలం, బిజెపికి చెందిన సతీష్ కుమార్ గౌతం, బిఎస్‌పి (బహుజన సమాజ్ పార్టీ) కి చెందిన అర్వింద్‌కుమార్‌సింగ్‌ల తర్వాత మూడో స్థానంలో వచ్చాడు. ముస్లింల వోట్లు చీలిపోయి, హిందువులందరు కలిసికట్టుగా వోట్లు వేసేట్టుగా చేసిన బిజెపి వ్యూహం ఫలించింది. 45.5 శాతం ముస్లింలున్న మొరాదాబాద్‌లో బిజెపికి చెందిన కువర్ సర్వేష్ సింగ్, ఎస్‌పికి చెందిన ఎస్‌టి హాసన్‌పై గెలిచాడు. 35 శాతం కన్న ఎక్కువ ముస్లింలున్న భివాండీలో బిజెపికి చెందిన కపిల్ మొరేష్వర్ పాటిల్ గెలుపొందాడు. రెండో స్థానంలో కాంగ్రెస్‌కి చెందిన విశ్వనాథ్ రాంచంద్ర పాటిల్ రాగా, అన్సారి ముంతాజ్ అబ్దుల్ సత్తార్ అతి తక్కువ వోట్లు పొందాడు. ముస్లింల వోట్లని విభజించి, హిందువుల వోట్లని సంఘటిత పరచడమే బిజెపి వ్యూహమని సుబ్రమణ్యం స్వామి ఒక ఇంటర్వ్యూలో ఒప్పుకున్నాడు.

ముస్లింలకి ఇప్పుడు కావాల్సింది మత విభజన కాదు, వాళ్ల ప్రయోజనాలకి ప్రజాస్వామిక ప్రాతినిధ్యం, దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి. విభజన, ఉమ్మడి ఓట్లు వాళ్ల ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తాయని లోక్‌సభ, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు చూపెడుతున్నాయి. ప్రజలకిప్పుడు కావాల్సింది సామాజిక న్యాయం ప్రాతిపదికా గల రాజకీయాలు, రాజ్యాన్ని జవాబుదారీగా, మానవ హక్కులను గౌరవించేదిగా మార్చే రాజకీయాలు. మతపరమైన స్పృహ కాదు కావాల్సింది, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం కోరుకునే సంస్కృతి కావాలి. ఇదే అట్టడుగు ప్రజా సమూహాల, మత, భాషా మైనారిటీల, దళితుల, ఆదివాసుల, స్త్రీల, శ్రామికుల – అవసరం.

(ఫ్రాంటియర్, ఫిబ్రవరి 17, 2015 సంచికలో వచ్చిన వ్యాసానికి అనువాదం. అనువాదం – పి. అరవింద) వీ

సర్వేజనా సుఖినోభవంతు! ఫత్వా జారీ హై!

***మతం పేరుతో ప్రజలను మూఢ విశ్వాసాల్లోకి, అభద్రత, అజ్ఞానంలోకి నెట్టి, దేశ వనరులను విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతున్న హిందూ మత పాలకుల అసలు స్వభావాన్ని బహిర్గత పరుస్తున్నారు* భూసారం శివన్న**

భరతమాత బహుపవిత్రం. గోమాత పరమ పూజ్యం. గోవధ మహాపాపం. గొడ్డు మాంస భక్షణ పరమ పవిత్ర మహా భారతావని యందు నిషిద్ధం. దేశవాసులందరూ ఈ నీతి సూత్రాలను 'అ ఆ ఇ ఈ ఉ ఊ'లుగా భావించ వలెను. చదువులన్నియు ఈ అక్షరాభ్యాసంతోనే మొదలు గావలెను. బడులలో ఇవి ప్రార్థనాంశంగా సదా పాటించవలెను. ఇటుల చేయకుండుట దేశద్రోహ నేరంగా పరిగణించబడి కఠిన శిక్షలు అమలు చేయబడును. ప్రజలందరూ ఇది గుర్తించి మెలగవలెను.

భారతదేశమున నివసించు హిందూ మతేతురులకు, అందునా ముస్లిం మతస్తులకు ఓటుహక్కు నిషిద్ధం. ఇది వేద సంగతం పరమధర్మమని గుర్తెరుగ వలెను. పరమ పావన భారతావనిలో నివసించు అందరికీ హిందూ న్యాయం, నీతి రీతులు వర్తించును. భిన్నమతాల వారికి భిన్నమత న్యాయమన్నది పూర్తి అసంగతం, హిందూధర్మ విరుద్ధం. అందువలన భారతావనిలో ఇది చెల్లనేరదు.

జగమంతా హిందూ జంటలు జనసంపదను ఇబ్బడి ముబ్బడిగా పెంచవలె. మామిడి పూతవలె, పవిత్ర గంగా జల సింధువుల వలె పూసి, కాసి, ప్రవహించి, భూగోళమంతా విస్తరించి తరించవలె. అటుల చేయనిచో మహాపాపం చుట్టుముట్టి నరకానికి చేరుకుందురని గుర్తించవలె. భారతావనిలో నివసించు యువతులు, మహిళలందరూ హిందూ కట్టు, బొట్టు సాంప్రదాయం పాటించవలెను. ప్రేమ, గీమ, దోమ అంటూ కుల, మత కట్టుబాట్లను కాలదన్ని కులాంతర, మతాంతర వివాహాలు చేసుకొనుట నిషిద్ధం. ఈ కట్టుబాట్లను అధిగమించిన వారి కుత్తుక ఉత్తరించబడును. యువతులు, మహిళలు ఇది తెలిసికొని, ఒళ్లు దగ్గరుంచుకుని ప్రవర్తించ వలెను.

గెడ్డములు పెంచుకునే ముస్లిం యువకులు, బురఖాలు ధరించే ముస్లిం యువతులు ఈ పవిత్ర దేశమున టెర్రరిస్టులుగా, దేశ ద్రోహులుగా పరిగణించ బడుదురు. గెడ్డములున్ననూ, లేకున్ననూ ఎర్రజెండా చేకొన్న వారందరు, గోచిపాత అడవి మనుషులు, కూలి వాళ్లు, దేశ ద్రోహులుగా పరిగణించ బడుదురు. అంతేగాక, వీరందరికీ ఎన్‌కౌంటర్ల మరణం సంప్రాప్తించును. హిందూ పురాణ సూత్రాలను, మనుధర్మాలను మరిచి చెత్త సాహిత్యం రాయు కవులు, రచయితలు, కళాకారులు హిందూజాతి ద్రోహులు, దేశద్రోహులు అగుదురు. వీరందరూ ఉరికంబాలకు వేలాడ దీయబడుదురు. ఇది దైవ లిఖితం, పరమధర్మం. కాదనుటకు లేదు. తస్మాత్ జాగ్రత్త!

నుదుట సింధూర తిలకం దిద్దుకొనుట, సింధూర వస్త్రములు ధరించుట, రామనామాన్ని జపించుట, హిందూ దేవ దేవతలకు గృహ విముక్తి గావించి, బజారుకు తెచ్చి, జులూసులు తీసి, చిందులేయించి, జలకాలు ఆడించి, నిమజ్జనాలు చేయించి, భక్తి రసాన్ని తెప్పలై పారించి, ముక్తిని సాధించవలె.

వేదాలులేని శాస్త్రమేలేదు. ఈనాటి సకల ఆధునిక విజ్ఞాన శాస్త్రాలన్నియు వేదాపహరణములే కదా! ఇప్పటి జెట్లు, సాటిలైట్లు, రాకెట్లు పురాణాల పుష్పక విమానాల ముందు దిగదుడుపే కదా! ఇది గ్రహించిన మన హిందూ అపర అంతరిక్ష శాస్త్రజ్ఞ స్థితి ప్రజ్ఞా దురంధరులు ఏడుకొండల నెక్కి, ఎంకన్నకు మొక్కి తాము తలపెట్టిన అంతరిక్ష ప్రయోగ నమూనాలకు వెంకన్న ఆశీస్సులను గ్రహాలను పొంది, విజయ గజేంద్రాల నదిరోహించుట వెనుక ఉన్న శాస్త్ర మర్మమును దేశంనందలి సకల సంస్థలు, సర్వజనులు శిరోధార్యమని గుర్తించి; సదా క్రమం తప్పక ఆచరించి తరించవలె.

అంబేద్కర్ మహాశయుని మహితాత్మునిగా పూజించవలె. హిందూ బ్రాహ్మణ్య గంగాజలంతో, పవిత్ర గోవుపాలతో నిత్య అంబేద్కర్ విగ్రహాభిషేకాలు గావించవలె. ఆ మహనీయునికి షిరిడీ సాయిబాబా వోలె గుడులు గోపురాలను వాడవాడల నిర్మించి, ధూపదీప నైవేద్యాలను, ప్రసాదాలను సమర్పించి, పల్లకీలలో ప్రతిష్టించి ఊరూరా ఊరేగించవలె. ఇటుల మనువు స్థానమున దైవాంశ సంభూతుడైన అంబేద్కర్‌ను హిందూ ఆధునిక దైవం సుస్థిరపర్చవలె. ఇదియే కులనిర్మూలన మహదాశయమని; ఇదియే పరమ పవిత్ర మార్గమని; బహుజనులు, పలు జనులు శిరసా వహించవలె. పవిత్ర అఖండ భారతమున మసీదులు చర్చిలన్నియు ఒకనాటి హిందూ మందిరాలే. ఇక్కడి జనులందరూ హిందువులే. పవిత్ర గంగా జల సింధువులే. పరమతాల బారిన పడి చెల్లాచెదరైన ఒకే గూటిపక్షులే. అందుకే ఆ పక్షులన్ని తిరిగి ఒకే హిందూ గూటికి చేరుటయన్నది తప్పనిసరి. పవిత్ర హిందూత్వ సంద్రంలో కలసి తరించుట సముచితం. ఇదియే భారతావని భావి చరిత.

ఈ కలి కాలమున పెట్టుబడే పరమ దైవమని గ్రహించవలె. దేశ విదేశీ పెట్టుబడి పాద పద్మాలకు మొక్కి నిత్యమూ పూజించుట, పెట్టుబడి దీవెనలు పొందుట ఆధునిక హిందూ మత ధర్మమని గుర్తించవలె. అదియే అసలు సిసలు దేశభక్తి. అదియే హైందవాభివృద్ధి. అదియే హైందవ వికాసం. అదియే విముక్తి. అదియే స్వచ్ఛ సింధూర మహాభారత్. నిత్యమూ హైందవ దేవ దేవతలకు ప్రణమిల్లి, పెట్టుబడి విశ్వ ప్రభువులకు మోకరిల్లి, ముకిళిత హస్తములతో సాష్టాంగపడి ఈపవిత్ర భూమి సర్వసంపదలనూ భక్తితో, నిమీలిత నేత్రాలతో, నైవేద్యమిచ్చి, అర్పించి, తరించుటయే దేశ ప్రజల పరమావిధిగా భావించవలె! బుర్రకి సనాతనబూజు – ముడ్డికికాకీ చెడ్డీ – నెత్తికి కాషాయ టోపీ – చేతికి లాఠీ – అపర హైబ్రీడ్ సామ్రాజ్యవాద మనువాద బ్రాహ్మణ్య సంకర పెట్టుబడిలూటీ; తుపాకులతో, తూటాలతో సాకారం చేయుటయే హిందూత్వ వికాస ధర్మం కదా! సర్వేజనా సుఖినోభవంతు అను గొప్ప ఇదియే కదా! ఓం శాంతి! ఓం శాంతి! అనగా, తెగిపడే కుత్తుకుల, ఫాసిస్టు మూకల స్వైరవిహారాల అశాంత శాంతియే కదా! శాంతి ఓం అశాంతి!

(రచయిత శ్రామిక నేస్తం పత్రిక సంపాదకులు) వీ

న్యాయ స్థానాల్లో ప్రగతిశీల తీర్పులు?

***చట్టాల్లోని లొసుగుల వల్ల రాజ్యాంగబద్ధంగా పౌరులకు ఉన్న స్వేచ్ఛా, స్వాతంత్ర్య హక్కులు కూడా హరించబడుతున్నాయనీ, అటువంటి చట్టాల రద్దుతో కనీస హక్కులైనా ప్రజలకు అందే అవకాశం ఉందనీ అంటున్నారు* గిరీష్ షహానే**

సుప్రీంకోర్టు ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 66ఎ ని రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించడం ఉదారవాదులకు ఒక చిన్న గెలుపు. ఈ సెక్షన్ ప్రకారం ఎలక్ట్రానిక్ సాధనాల ద్వారా ఇతరులను నొప్పించే, బాధించే విషయాలను ప్రసారం చేయడం నేరంగా పరిగణించబడుతుంది. దేన్ని నేరంగా పరిగణించవచ్చు అనేది ఎంత అస్పష్టంగా నిర్వచించబడిందంటే, అధిక శాతం ట్వీట్లు, ఫేస్‌బుక్ పోస్టులు చట్ట ఉల్లంఘన కిందకి వస్తాయి. జస్టిస్ రోహింటన్ ఫలి నారిమన్ తన తీర్పులోని 88వ పేజీలో ఈ విధంగా రాసారు:

'సెక్షన్ 66ఎ పరిధి ఎంత విస్తృతంగా ఉందంటే, దాదాపు ఏ విషయం పైన ఏ అభిప్రాయమైనా దాని పరిధిలోకి రాగలదు. సమాజపు కట్టుబాట్లు, ఆచారాల పట్ల ప్రకటించిన ఎటువంటి అసమ్మతైనా దాని పరిధిలోకి రాగలదు. ఇంతటి పరిధి గల చట్టానికి రాజ్యాంగ పరమైన ఆమోదం లభించిందంటే, అది పూర్తిగా వాక్ స్వాతంత్ర్యాన్ని హరించినట్టే.'

సెక్షన్ 66ఎ ని రాజకీయ నాయకులు తమని విమర్శించే వారిని దండించే పరికరంగా వాడుకున్నారు. సుబ్రమణ్య స్వామి లాంటి వారు అబద్ధపు, నిందా, ద్వేషపూరిత ప్రచారాన్ని వెబ్‌లో ఎంతైనా చేయవచ్చు కాని, మామూలు పౌరులు మాత్రం రాజకీయ నాయకులను విమర్శించినా వాళ్లు ఈ సెక్షన్ కింద అరెస్టులను, నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. అటువంటి ఉదాహరణల ఆధారంగానే పిటిషనర్లు ఈ సెక్షన్ ఎంతగా దుర్వినియోగబడుతోందో తమ వాదనలో వినిపించారు. దీనికి సమాధానంగా ప్రభుత్వ న్యాయవాది ఈ సెక్షన్ ని న్యాయపరంగానే ఉపయోగిస్తామని న్యాయ స్థానానికి హామీ ఇచ్చారు. ఐతే, ఆ హామీని తోసి పుచ్చుతూ, జస్టిస్ నారిమన్ ఇలా అన్నారు:

'సెక్షన్ 66ఎ కి చట్టబద్ధత లేకపోయినప్పుడు, అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఆ సెక్షన్‌ని సహేతుకంగా వాడతామని భరోసా ఇచ్చినా అది చెల్లదు. ప్రభుత్వాలు మారవచ్చు కాని చట్టం ఎల్లకాలం ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వం ఈ చట్టాన్ని జాగ్రత్తగా అమలు చేసినా, తర్వాతి ప్రభుత్వాలు అట్లాగే చేస్తాయని లేదు. అందుకని, సెక్షన్ 66ఎ న్యాయబద్ధతని దాని అర్హతల ఆధారంగా నిర్ణయించాల్సిందే కాని అమలును బట్టి కాదు.'

అసంపూర్ణ గెలుపు

ఐతే ఈ గెలుపు పిటిషనర్లకి పూర్తి గెలుపు కాదు. కేసు పరిధిలో సెక్షన్ 66ఎ మాత్రమే కాకుండ, ఐ.టి. చట్టం లోని ఇంకో రెండు వివాదాస్పద సెక్షన్లు కూడ చేర్చబడ్డాయి. అవి – వ్యక్తిగత సమాచారం మీద, సంభాషణల మీద ప్రభుత్వానికి అడ్డుకొనే, నిఘా ఏర్పరిచే హక్కులనిచ్చిన సెక్షన్ 69ఏ.

అట్లాగే, గూగుల్ వంటి మధ్యవర్తుల మీద తమ కంప్యూటర్లలో ఉన్న సమాచారాన్ని నియంత్రించే బాధ్యత పెట్టిన సెక్షన్ 79. సెక్షన్ 79 ప్రకారం, గూగుల్ వంటి కంపెనీలు హానికరమైన, అభ్యంతరకరమైన, నిందాపూరితమైన, అశ్లీలమైన, అసభ్యమైన, ద్వేషపూరితమైన, వేధింపుకు గురి చేసే, అపవాదు వేసే, దూషించే, జాతుల, సమూహాల మధ్య విద్వేషాలని రెచ్చగొట్టే, జూదాన్ని, నగదు బదిలీలో అవకతవకలని ప్రోత్సహించే ఎటువంటి సమాచారాన్ని పంచకూడదు, ప్రదర్శించకూడదు, ప్రచురించకూడదు, ప్రసారం చేయకూడదు.

న్యాయస్థానం సెక్షన్ 69ఎ రాజ్యాంగ విరుద్ధమైనది కాదని తీర్పు ఇచ్చింది. అంటే, ప్రభుత్వము, పోలీసులు మనందరి మీదా యథేచ్ఛగా నిఘా కొనసాగించవచ్చు. సెక్షన్ 79ని కూడ ఒక షరతు మీద కొనసాగించింది – మధ్యవర్తి కంపెనీలు వెబ్‌లోని సమాచారాన్ని న్యాయస్థాన ఉత్తర్వుల ఆధారంగా మాత్రమే అడ్డగించగలరు, బాధితులమని చెప్పుకునే వ్యక్తుల కోరిక / డిమాండ్ ఆధారంగా కాదు.

మన ఆహారం, మతం, చూసే సినిమాలు కూడ నియంత్రించబడుతున్న ఈ కాలంలో అసంపూర్ణ గెలుపు కూడా హర్షించాల్సిన విషయమే. భారతీయ జనతా పార్టీ కేంద్రంలోనూ, పలు రాష్ట్రాల్లోనూ అధికారంలో ఉన్న ఈ కాలంలో ప్రగతిశీల చట్టాలు వచ్చే అవకాశం ఎటూ లేదు, కాబట్టి పౌర హక్కుల వృద్ధి సుప్రీం కోర్టు పైనే ఆధారపడి ఉంది. దురదృష్ట వశాత్తూ, కోర్టు చాలా సందర్భాల్లో ప్రాథమిక హక్కులను కాపాడలేక పోయింది, ముఖ్యంగా ఎమర్జన్సీ కాలంలో, ఇటీవల కొన్ని ముఖ్య సందర్భాలలో. దీనికి గట్టి ఉదాహరణ – 2013లో జస్టిస్ సింఘ్వి, ముఖోపాధ్యాయలు స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణిస్తూ చేసిన తీర్పు. అప్పటికే ఢిల్లీ హై కోర్టు, ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 377ని పరస్పర అంగీకారమున్న పెద్దల విషయంలో ఉపయోగించడాన్ని రాజ్యాంగ విరుద్ధమని తీర్పు చెప్పి ఉంది. ఈ విషయం తమ పరిధి లోని ప్రాథమిక హక్కులకు సంబంధించినదైనా, న్యాయమూర్తులు దీనిపై నిర్ణయాన్ని తిరిగి పార్లమెంటుకు అప్పజెప్పారు.

ఒక భర్త, భార్యపై అత్యాచారం చేయడానికి వీలు కల్పించే ఐపిసి సెక్షన్ 375లోని మినహాయింపుని కొట్టి వేయడానికి కూడ కోర్టు సుముఖత చూపలేదు. ఢిల్లీ హైకోర్టు సెక్షన్ 377 మీద ఇచ్చిన తీర్పు తర్వాత యుపిఎ ప్రభుత్వం తమ విధానాలలో సర్దుబాటు కోసం మంచి ప్రయత్నం చేసింది కాని జస్టిస్ వర్మ కమిటీ వైవాహిక అత్యాచారాన్ని

బుజ్ బుజా పోరాటాల భూమిక

బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా మధ్యప్రదేశ్‌లోని రెండు గ్రామాల ప్రజలు చేస్తున్న ఆ పోరాట స్వభావాన్ని అధ్యయనం చేసి ఆ అనుభవాలను మనతో పంచుకుంటున్నారు **హేమా వెంకట్రావ్**

2005 తర్వాత సెజ్‌లు, థర్మల్ పవర్‌ప్లాంట్లు పుట్టుకొచ్చిన విధానం చూస్తే ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం అన్న చందాన ఏ రాష్ట్రం ఏగినా అదే వనరుల దోపిడి, దాని చుట్టూ వ్యథల కథల సమాహారమే ఆయా ఉద్యమ ప్రాంతాల వారు తమ అవగాహన చైతన్యాన్ని అనుసరించి వివిధ దశలలో వివిధ పోరాట రూపాల్ని ఎంచుకుంటున్నారు. మధ్యప్రదేశ్‌లోని కట్ని జిల్లా, బుజ్ బుజా డొకారియా అనే రెండు గ్రామాల్లోని ప్రజలు వెల్స్‌పర్ బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాట రూపాలు మన పోరాటాల కంటె విభిన్నంగా ఉండి ఆలోచింపచేస్తాయి.

2013 జూన్ నుంచి అక్టోబరు వరకు ఉద్యమకారుల నిరసనను ఎలక్ట్రానిక్ మీడియా అతిసాదాగానే ప్రసారం చేసింది. వెల్స్‌పర్ కంపెనీలకు వ్యతిరేకంగా సాగుతున్న ఈ పోరాటంలో కంపెనీ సమాచారం దళారుల పాత్ర, భూ వివరాల కంటె కూడా ప్రజలు తిరుగబడిన తీరు మేధావులనే కాదు మామూలు పౌరులను సైతం ఆకట్టుకొని మద్దతు కూడగట్టేలా చేసింది. అక్కడే ఉన్న సహచరుడు వెంకట్రావ్ ఇచ్చిన సమాచారం, వనరుల దోపిడికి వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాలతో ఉన్న అనుబంధం అధ్యయనం కోసం ఉద్యమ ప్రాంతాలకి తోడ్కెల్లింది.

ఈ పర్యటనలో వారు ఎంచుకున్న ప్రతిఘటనా పోరాట రూపాల గురించి అధ్యయనం చేయదలచాం. వివిధ బహుళజాతి సంస్థలపై జరుగుతున్న పోరాటాలలో కాకినాడ నుండి నందిగ్రాం, కూడంకుళంల వరకు ఉద్యమాలు పలు పోరాట రూపాల్ని పరిచయం చేశాయి. వాటికి కొంత భిన్నంగా 'చితి' పోరాటం కింద చెప్పబడిన పితృస్వామ్య భావజాలం నుంచి పుట్టుకొచ్చిన ప్రక్రియ దేశ వ్యాప్తంగా కాకపోయినా ఆ రాష్ట్ర వ్యాప్తంగా (మధ్యప్రదేశ్) కదిలించింది. తెలుగు రాష్ట్రాలలోలాగా హక్కుల పోరు వాతావరణం కూడా లేదు కాబట్టి ప్రజలు కూడా వత్తిడికి సరెండర్ అవుతారనే అవకాశాలు ఎక్కువనే అంచనాలతోనే బయలుదేరాం. ఈ ఆత్మాహుతి పోరాట రూపం తెలంగాణ ఉద్యమంలో సుపరిచితమే. కాకపోతే బుజు బుజా డొకారియా ప్రజలు ఏ మేరకు ఈ పోరాట రూపాలతో సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలను అడ్డుకోగలరు అన్న ఆసక్తి ఉత్తేజపరిచింది.

ముందస్తుగా ఒక దృక్పథం ప్రాతిపదికగా ఉన్నప్పటికీ ప్రజా పోరాటాల అధ్యయనంలో మా దృక్పథాన్ని మరింత పదును పెడుతుందనే ఆశాభావం కార్యోన్ముఖులను చేసింది. తెలుగు రాష్ట్రాల వనరుల దోపిడీ వ్యతిరేక పోరాటాలలో మా అవగాహనను బలపరిచే అంశాలను, తిరస్కరించే అంశాలను క్రోడీకరించవలసిన సందర్భంగా తీసుకోవడం జరిగింది. స్వీయ మానసిక దృక్పథం నుండి ఉద్యమాల్ని నిరపేక్షంగా చూడాలనే స్పృహతో బుజ్ బుజా డొకారియా ఉద్యమం ముంగిట మమ్మల్ని నిలిపింది. వీటిని అర్థం చేసుకునే క్రమంలో స్థానిక పురోగమన శక్తుల కృషి, పోరాటంలో వారి మద్దతు, ఇతర ఉద్యమాల సంఘీభావం కోరడంలో వారు తీసుకుంటున్న చొరవ, చర్యలు కార్యకర్తలుగా ఎంత వరకు ఉపయోగపడతాయో అధ్యయనం చేయాలని, అవసరమైతే సహకారాన్ని అందజేయాలనే సదుద్దేశంతో బయలుదేరాం.

ఉద్యమ ప్రాంత వివరాల్లోకి వస్తే హైదరాబాద్‌లో పాట్నా ఎక్స్‌ప్రెస్ ఎక్కి 20 గంటలు ప్రయాణం చేస్తే కట్ని అనే జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకుంటాం. ఇక్కడ నుంచి వారణాసికి 10 గంటలు ప్రయాణం. రైల్వేస్టేషన్ నుంచి సుమారు గంట రోడ్డు ప్రయాణం చేస్తే బుజ్ బుజా డొకారియా గ్రామాలు వస్తాయి. ఈ కట్ని అనే ప్రదేశం దేశానికి నాభిస్థానంలో ఉంది. పంచాయితీరాజ్ మంత్రిత్వశాఖ లెక్కల ప్రకారం దేశంలోని 250 వెనుకబడ్డ జిల్లాలో ఇది ఒకటి. సుమారు 70 శాతం ఆదివాసులు నివసించే ప్రాంతం. మిగతా వారు వివిధ కులవృత్తులు చేసుకుంటున్న కులాలు. అత్యల్ప సంఖ్యలో ఆధిపత్య కులాలకు చెందిన బ్రాహ్మణులు, బనియా, ఠాగూర్లు ఉన్నారు. రెండు గ్రామాల్లో సుమారు 5000 జనాభా, 3000 ఓటర్లు ఉంటారు. మొత్తం భూమి 600 ఎకరాలు ఉండగా 5వ వంతు భూమి రైతులది. తక్కినది ప్రభుత్వ భూమి. భూమితో పాటు సుమారు 6000 పశుసంపద గ్రామ సొంతం.

కూడా నేరంగా పరిగణించమని చేసిన సిఫారసుని అంగీకరించ లేదు. గత నెల, వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించమని దాఖలైన పిటిషన్‌ని సుప్రీం కోర్టు సాంకేతిక కారణాల మీద తోసిపుచ్చింది.

సుప్రీంకోర్టులో ప్రగతిశీల తీర్పులు రావడమనేది లాటరి లాంటిదన్నది కాదు ఇక్కడ సమస్య, నా ఉద్దేశంలో సమస్య అసలు రాజ్యాంగంలోనే ఉంది. పెరుగుతున్నప్పుడు నేను అనుకొన్నట్టుగా అది ప్రగతిశీల పత్రం కాదు, రకరకాల సర్దుబాట్లతో ఏర్పడిన, మధ్యస్థమైన నాణ్యత గల పత్రం. దానిలోని ఉత్తమ నిబంధనలు కూడా సవరణల మూలాన పలుచనైపోయాయి. వ్యక్తి హక్కులను తగ్గించి, రాజ్యాధికారాన్ని విపరీతంగా పెంచిన మొదటి సవరణ అన్నిటికన్నా చెడ్డది. ఈ మొదటి సవరణ ముసాయిదా తయారు చేసి, పార్లమెంటులో ప్రవేశ పెట్టినది నెహ్రూ, అంబేద్కర్. కాబట్టి, వాళ్ల మంచి పనిని తరువాతి వాళ్లు చెడగొట్టారని నిందించ లేము.

(అనువాదం – పి. అరవింద) వీ

మోర్జాపూర్ నుంచి సింగ్రోలి మధ్య రేవా, సత్నా, కట్ని, ఉమారియా, షాడోల్, అనూప్‌పూర్ జిల్లాలను కలుపుతూ కోస్టల్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను ప్రభుత్వం ప్రతిపాదించింది. టైగర్ జోన్‌కు ప్రసిద్ధి గాంచిన బాంధవాఘడ్ ఇక్కడు నుంచి కేవలం 2.2 కిలో మీటర్ల దూరంలోనే ఉంది. నిజానికి బఫర్‌జోన్ 10 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి ప్రాజెక్టులు తీసుకోకూడదు. ఇంతటి ప్రజాగ్రహానికి గురైన థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు వాల్‌స్పన్ సినిటెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (కేంద్ర మంత్రి వెంకయ్యానాయుడు బినామి కంపెనీగా సమాచారం) 1980 మెగావాట్లతో తలపెట్టదలిచింది. గతంలో ఈ కంపెనీ ఒకప్పటి మన ఉమ్మడి రాష్ట్రంలో కూడా 500 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టుకు ఒప్పందం కుదుర్చుకుంది. (వెల్స్‌పర్ ఎనర్జీ – వికిపిడియా). ఈ కంపెనీకి రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో పవర్ ప్రాజెక్టులను నిర్మించి ప్రజలను నిర్వాసితులను చేసిన చరిత్ర గత శతాబ్దం నుండి ఉంది. అప్పటి స్థానిక కాంగ్రెస్ ఎంఎల్ఎ (ఇప్పుడు బిజెపిలోకి మారాడు) వెల్స్‌పర్ కంపెనీకి బంగారుబాట వేసి సహజంగానే దోపిడిలో భాగమయ్యాడు.

వలసవాద ప్రభుత్వం తయారు చేసిన భూసేకరణ చట్టం 1894 ప్రకారం మే 2011న 593.44 ఎకరాలు వెల్స్‌పర్ కంపెనీ కోసం నోటిఫికేషన్ ఇచ్చారు. సహజంగానే రైతుల గుండెల్లో ఆందోళన మొదలైంది. నోటిఫికేషన్ కంటె ముందే బనియా, బ్రాహ్మణ కమ్యూనిటీ దళారులు భూముల కోసం ప్రజల్ని మభ్య పరచడానికి ప్రయత్నించారు. అక్కడున్న ప్రజలు మాజీ సర్పంచ్, పాఠశాల టీచర్‌గా పనిచేసిన వారి నాయకత్వంలో ఐక్య సంఘటన కట్టారు. ప్రభుత్వం గ్రామ సభ నిర్వహించడానికి ప్రజలు ప్రతిబంధకం కాగా జనాభాలోని చనిపోయిన వారి పేర్లతో దొంగ ముద్రలు వేసుకున్నారు. షరా మామూలే ప్రజాభీష్టం మేరకే ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందని రిపోర్టులు రాసుకున్నారు. చట్టంలోని ముసుగులను ఆధారం చేసుకొని బలవంతంగా ప్రభుత్వ అంచనాల ప్రకారం రైతుల పేరిట బ్యాంకుల్లో చెక్కులు వేశారు. (కాని ఇప్పటి వరకు రైతులు అంగీకరించలేదు) ప్రభుత్వ కంపెనీ అధికారులు భూమిని కొలవడానికి వస్తే మహిళలు తరిమికొట్టారు. పోలీసు బలగాలు పంపినప్పుడు మహిళలు అగ్రభాగాన ఉన్న ఈ ఉద్యమంలో 'సోనుబాయి' అనే మహిళ 'తమ భూముల్లోకి రావద్దని హెచ్చరిస్తూ కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంది. కోపోద్రిక్తులైన ప్రజలు చితులు పేర్చుకొని భూమిని బలవంతంగా లాక్కొంటే ఆ చితులకే ఆహుతి అవుతామని హెచ్చరికలు ప్రభుత్వానికి జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మందికి పైగా ప్రజా సమూహాలు ఉద్యమ ప్రాంతానికి వెళ్లి సంఘీభావంతో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నినదించారు. తిరుగుబాటు చర్యగా ప్రభుత్వ కుట్టు ట్రైనింగ్ సెంటరును ధ్వంసం చేశారు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా అన్నట్టు ప్రభుత్వం పోలీసుల్ని ఆయుధంగా వాడి 21 మందిని బలితీసుకుంది. ప్రజల్ని భయ భ్రాంతులకు గురి చేశారు. దాదాపు ప్రతి ఒక్కరి మీద కేసులు నమోదు చేయబడ్డాయి. చావోరేవో తేల్చుకోవాలనుకున్న ఉద్యమకారులు మరింత బలాన్ని పుంజుకొని ఉద్యమాన్ని గ్రామం నుంచి కలెక్టరు ఆఫీసుకు తరలించారు. 2013 జూన్ నుంచి సెప్టెంబర్ 15 వరకు చితులు తామే పేర్చుకొని కలెక్టరు ఆఫీసు ముందు సుమారు 100 రోజులుపైగా తమ ఉపాధిని కూడా వదలిపెట్టి కుటుంబాలతో సహా ఉద్యమించారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. బహుళజాతి కంపెనీలకు అమ్ముడు పోగా మిగిలిన మీడియా వీరి పోరాటాల్ని వెలుగులోకి తీసుకొచ్చింది.

అదే సెప్టెంబర్‌లో కాంగ్రెస్ కిసాన్‌సభ జరగవల్సి ఉండగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు హామీ ఇస్తున్నట్టు నమ్మించి టెంటులను ఎత్తి వేయించింది. అపనమ్మకంతో ప్రభుత్వానికి కొంత సమయాన్ని, అవకాశాన్ని ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్రజలు ఉద్యమాన్ని సడలించారు. కాని కొన్ని నెలల పాటు ఎదురు చూసిన ప్రజలకు ఎటువంటి జవాబుదారీతనం ప్రభుత్వం నుంచి కనపడలేదు. పైగా పోలీసు బలగాలతో రాజ్యం అండతో కంపెనీ అధికారులు పొలాల్లోని చెట్లను బుల్డోజర్ల సహాయంతో నరికివేసి మట్టి దిబ్బలుగా మార్చేశారు. ప్రభుత్వ దాష్టికాన్ని చూసి విసిగి పోయిన ప్రజలు తమ నిరసనగా గ్రామాల్ని వదిలేసి సామాన్లతో సహా వలస పోవడానికి తమ ఇళ్లను సైతం వదిలేసి మూకుమ్మడిగా బయలుదేరినప్పుడు పోలీసు నిఘా వర్గాలు రైలును మధ్యదారిలో అడ్డుకొని అటకాయించి గ్రామాలకి ప్రజల్ని తరలించారు. అప్పటికే ఉపాధి కోల్పోయి, అప్పులపాలై బయట ప్రజాతంత్ర శక్తుల నుంచి ఆశించినంత మద్దతు రాక పోవడంతో ప్రజలు కొంత గడుపు తీసుకోదలిచారు. ప్రభుత్వ సహాయంతో కంపెనీ భూముల చుట్టూ ప్రహరి గోడ కట్టేసింది. దేవాలయ ప్రాంతాల్ని ఆక్రమించుకోదల్చితే ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన రాగా కాస్తంత భూమిని ఉద్యమాన్ని నిలవరించ డానికి కేటాయించారు. అక్కడే ప్రజలు ప్రతి ఏటా ఉత్సవాల్ని జరుపుకుంటారు.

తిరగబడ్డ ప్రజలపై అధికారుల మీద హత్య ప్రయత్నం, అనధికారం గా ఇతరుల ఆస్తులలో ప్రవేశించడం (భూమి ప్రజలదైనప్పటికి) దాడి మొదలగు సెక్షన్లలో కేసులు బనాయించారు. ఇప్పటికే కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఉద్యమ కారులు కూడా తమ అభ్యర్థనలను న్యాయ వ్యవస్థ ముందు మొరపెట్టు కున్నారు. చనిపోయిన వారి జాబితాతో గ్రామ సభలు నడిపారని, అసలు గ్రామసభ తీర్మానాలు చెల్లవని, పంచాయితీరాజ్ చట్టానికి తిలోదకాలు ఇచ్చారని తమ భూములు తిరిగి ఇచ్చేయాలని వేడుకున్నారు. స్పందించిన హైకోర్టు 'స్టేటస్–కో' ప్రకటించింది. స్టేటస్–కో అంటే యథాతథంగా ఉంచడం అంటే దిబ్బలుగా మార్చిన ప్రాంతాన్ని యథాతథంగా ఉంచడం. అంటే ప్రజల్ని నిస్సహాయులుగా ఉండడమే. బాలగోపాల్ మాటలు ఈ సందర్భంలో గుర్తొస్తున్నాయి. 'న్యాయస్థానాల కంటె ప్రజా ఉద్యమాలే బలీయమైనవని, కోర్టులు పాలక యంత్రాంగానికి కొమ్ముకాస్తాయి కాబట్టి ఆచితూచి అంచనా వేయాలని' సెజ్ ఉద్యమ కారులకు సలహా ఇచ్చేవారు. ఇంక తుదితీర్పు వెలువడలేదు కాబట్టి కంపెనీ తమ కార్యక్రమాలను మొదలు పెట్టలేదు.

'ప్రకృతి అనేది ప్రజానీకానికి జీవనాధారం. సహజ వనరుల దోపిడి గురించి మాట్లాడుతున్నాం అంటే ప్రకృతి మీద ఆధారపడి బతికే హక్కును కూడా వారే తీసుకుపోతున్నారని అర్థం' అంటారు హక్కుల ఉద్యమ నాయకుడు బాలగోపాల్ (రాజ్యం – సంక్షేమం) ఈ ప్రాతిపదికన జీవించే హక్కును కాపాడుకోవడం కోసం, భూమి నుంచి పర్యావరణ కేవలం సహజవనరుల నుంచి భౌతికంగా నిర్వాసితులు కావడమే కాకుండా జీవనశైలి నుంచి నిర్వాసితులు కావడం అనే జాగురుకతతో వివిధ పోరాటరూపాలతో ఉద్యమకారులు ప్రాణాలను తెగించి పోరాడడం విశేషం.

ఒక అంచనా ప్రకారం ఆరు దశాబ్దాల మన అధికార మార్పిడి చరిత్రలో ఆరు కోట్లకు పైగా ప్రజలు నిర్వాసితులయ్యారు. ఈనాడు పాలిస్తున్న బిజెపి ప్రభుత్వం మతాన్ని మిలాఖతు చేసి పారిశ్రామీకరణ, పట్టణీకరణ, మౌలిక సౌకర్యాలు అభివృద్ధి అనే నీతి మాటల్ని ప్రజల ముందు పెట్టి మునపటి ప్రభుత్వాల కంటె సామ్రాజ్యవాద గుత్తపెట్టుబడిదారులకు రెడ్‌కార్పెట్ పరుస్తుంది. అవసరమైనచోట 'గ్రీన్‌హంట్'ను ప్రయోగిస్తుంది. మరి అప్పుడు ఉద్యమకారులకు అండగా నిలిచే ప్రజాస్వామిక వాదులు, ఉద్యమాలకు తాత్వికతను అందించే సెక్షన్ల పాత్ర ఏమిటి? అన్న ప్రశ్న రావచ్చు. ప్రజల మాటల్లోనే చెప్పాలంటే 'ఎంతో మంది వచ్చి పోతుంటారు. కాని ఈనాటికి అండగా నిలిచింది ఎవరూ లేరు' అని వాపోయారు. ప్రశాంత్ భూషణ్, (సుప్రీంకోర్టులో ఉద్యమాలకు అండగా నిలిచే సీనియర్ న్యాయవాది), రాజ్‌గోపాలన్, ఎక్తాపరిషత్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి వచ్చినా వారి ప్రభావం, సహకారం ఉద్యమకారులకు ఆశించినంతగా దక్కలేదు. స్థానికంగా సోషలిస్టుపార్టీ నాయకులు వచ్చినా ఎలక్షన్లలో ఓటర్లను ఆకట్టుకోవడానికి పద్దపాట్లే కాని వేరు కాదు అని ప్రజల నమ్మకం. ఈ క్రమంలోనే నాయకులు జైరాం రమేష్ (అప్పటి కేంద్రమంత్రి)ని కలిశారు. వాగ్దానాలు వెల్లువ ప్రవహించింది కాని ఫలితం శూన్యం. స్థానిక మీడియా పెట్టుబడిదార్ల కొమ్మే కాసింది.

ఒకింత ఊరట నిచ్చే విషయమేమిటంటే సోంపేట ఉద్యమంలా సమాజంలో చైతన్యవంతులైన మేధావులు కొంత మంది ఈ ఉద్యమానికి మద్దతునిస్తూ సహకరిస్తున్నారు. సీనియర్ జర్నలిస్టు అరవింద్ వర్మ, స్వంతంగా కట్నీలో పాఠశాలను నడిపిస్తున్న నార్వాణి, తెలుగు నేల నుంచి వెళ్లి అక్కడ స్థిరపడ్డ నార్ల కుటుంబం ఉన్నది. గమనించవలసిన విషయం ఏమిటంటే తెలంగాణ, ఆంధ్రలో ఉన్న హక్కుల స్పృహ, వాతావరణం మేము పర్యటించిన నాలుగు, ఐదు జిల్లాల్లో కూడా కనపడలేదు. బహుశా అక్కడ ఉన్న ఉద్యమ నేపథ్యం వేరు కావడం చేత అనుకుంటాను. రాజ్యాన్ని, ప్రస్తుత పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమాన్ని, మార్గాన్ని వ్యతిరేకించే మౌలిక ఉద్యమ నిర్మాణం. మేధావి వర్గం కొరత మనకు ఈ ఉద్యమంలో స్పష్టంగానే కనిపిస్తుంది. అందుకే ఆర్థికవేత్తలు, సామాజిక శాస్త్ర నిపుణుల, మానవ హక్కుల కార్యకర్తల పాత్ర మద్దతు ఈ ఉద్యమాలకు లభించడం లేదన్నది వాస్తవం.

భారతదేశంలో అభివృద్ధి కోసం ఎంచుకున్న పెట్టుబడిదారీ మార్గం అశేష ప్రజానీకాన్ని తమ ఆర్థిక వ్యవస్థ నుంచి నిర్వాసితులను చేస్తుంది. అలాగని కొత్తగా ఏర్పడబోతున్న ఆర్థికవ్యవస్థలో కూడా కలవలేక పోతున్నారు. ఇలా ప్రజావ్యతిరేకంగా బలవంతంగా నెట్టబడ్డ సమూహాలు రోజురోజుకు భారత ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయి. మందు గుళికలుగా పెట్టుబడి దారీ విధానం బుజ్జగించడానికి సరికొత్త విధానాలు ఎలా ప్రవేశ పెడుతుందో, ప్రజా సమూహాలు అంతేధీటుగా తమ చైతన్య స్థాయిలో వివిధ పోరాట రూపాలకు ఎంచుకుంటున్నారు. ఈ పోరాట రూపాలు మొత్తంగా ఆపలేక పోవచ్చు. కాని అభివృద్ధి గమనాన్ని పాక్షికం గానైనా అడ్డుకుంటాయి. డా. ముదునూరి భారతి వివరించినట్టు (2012 నవంబరు 11న హైదరాబాద్ లో జరిగిన ఆర్.ఎస్ దాని స్మారక సదస్సులో సమర్పించిన పత్రం ప్రచురణ వీక్షణం జనవరి 13 దశాబ్ది ప్రత్యేక సంచిక) అభివృద్ధిని కొత్తగా విభిన్నంగా పునర్నించి పునరాలోచించి మిగులు మనుష్యులకు కొత్త వ్యవస్థలోకి ప్రదర్శమేళనం చేసే క్రమాన్ని మొదలు పెట్టకుండా, నిర్వాసితులకు ప్రధాన పాత్ర ఇవ్వకుండా, నిర్వాసితం అభివృద్ధి క్రమాలను ఐక్యం చేయకుండా సమాజ పరివర్తన వాస్తవరూపం ధరించదు. అప్పటివరకు ప్రజలు వ్యూహాత్మకంగా తమ లక్ష్యసాధనకు వివిధ పోరాట రూపాలను ఎంచుకుంటారు.

దేశంలో వివిధ రూపాల్లో సాగుతున్న ప్రతిఘటనా పోరాటలన్నిటిని ఒకేగాటిన కట్టి వాటికి వ్యతిరేకంగా రాజ్యం నిర్బంధాన్ని ప్రవేశపెట్టదు. ప్రజాస్వామ్యబద్ధంగా జరుపుతున్నామని చెపుతున్న ధర్నాలను, పాద యాత్రలను, వీటిని ప్రాణంతో సహ పణంగా పెట్టడానికి సిద్ధపడ్డ ప్రజల పోరాట పటిమను రాజ్యం అంచనా వేస్తుంది. అడవి బిడ్డలుగా బతుకుతున్న వారి గురి ఎక్కడ పెట్టగలరోననే పాలకుల గుండెల్లో గుబులు రేపింది. చితిమీద కూర్చోని భూమి కోసం బూడిద అవ్వడానికి సిద్ధపడ్డ వారి సరికొత్త వ్యూహాన్ని సర్వశక్తులు వెచ్చించి అడ్డుకున్నారు. వేలకు వేలుగా మిలటరీ పోలీసులను తరలించారు. మా భూమే కాదు మా ఊర్లను కూడా ఏలుకోండి అని నిరసన తెలిపితే అడవి అంటుకుంటుందేమోనన్న భయంతో ప్రజల్ని దారి మధ్యలో అడ్డుకొని వెనక్కి తీసుకొచ్చి దింపారు. గ్రామంలో కొంత మందిని ఇన్‌ఫార్మర్లుగా డబ్బులిచ్చి కొనుకున్నారు. బ్రిటిష్ వారి పద్ధతిలో 'విభజించు పాలించు' అన్న ప్రాతిపదికన భూమి ఉన్న రైతులను, రైతు కూలీలను విభజించడానికి ప్రయత్నాలు జరుపుతున్నారు. కాస్తోకూస్తో మద్దతునిస్తున్న ప్రజాతంత్ర శక్తులను అడ్డుకోవడానికి అన్ని విధాల ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.

అయినా సరే పట్టువిడువని భూమిపుత్రులు తమను తాము సమ్మాళించు కుంటూ, విశ్లేషించుకుంటూ సమాయత్తమవుతున్నారు. ప్రజలు ఎంచుకున్న పోరాట రూపాల్లో ఫ్యూడల్ భావజాలం ఉండొచ్చు. గత అనేక ఏళ్లు ఉద్యమ శక్తులు పొరుగున ఉన్న చత్తీస్‌గడ్‌లోనూ, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ లో భారీ కార్పొరేషన్లను నిలుపగలిగారు. కాని ఇక్కడ ప్రజా పోరాటాల అనుభవాన్ని సైద్ధాంతిక దృక్పథాన్ని, రాజకీయ పదునును, నిశితంగా సమీక్షించే శక్తులు ఇక్కడ లేకపోవడం ఒక లోపమే. అయినా ఒకసారి యుద్ధం మొదలైంది ఇది ఇతర యుద్ధాల మాదిరిగానే విస్తృతం అవుతుంది. దాని తర్కం, ఎత్తుగడ ప్రజలకు తెలుసు. ఈ యుద్ధం వారి జీవనసరళిలో భాగమైంది. కాబట్టి వెనక్కి మళ్లడం అనేది ఉండదు. ఇదే వారి జీవితాల్లో ఇప్పుడు సాగుతుంది. తుపాకీలు, లాఠీలు యుద్ధక్షేత్రంలో వారి బలాబలాలు తెలుసు. మరికొన్ని ప్రాణాలు పోతాయని తెలుసు. అవి ఎటువైపైనా పోవచ్చని ప్రజల వాదన. పాలకులు సాగించే వ్యవస్థీకృత హింసకు, ప్రజా ప్రతిఘటనకు మధ్య ఉన్న వ్యత్యాసం అక్కడి ప్రజలకు, మద్దతుదార్లకు స్పష్టమైన అవగాహనే ఉంది. వివిధ దేశ, విదేశీ ఏజెన్సీల నుండి నిధులు పొందుతున్న స్వచ్ఛంద సంస్థల గోడ మీద పిల్లివాటం, మోసపూరిత వ్యవహారాలు, రిపోర్టింగులతో డబ్బు తెచ్చుకొనే వారి ఎత్తుగడలను గ్రహించే వారి మద్దతును పోరాట నాయకత్వం కోరలేదు. చత్తీస్‌గడ్‌కు పొరుగున ఉన్న ఈ ప్రాంతం మీద మావోయిస్టుల ప్రభావంలేదు. వామపక్ష హక్కుల సంఘాల ప్రమేయం లేదు.

ప్రజలు పాలకుల అభివృద్ధి నమూనాకు వ్యతిరేకంగా స్వాలంబన మీద ఆధారపడి ప్రత్యామ్నాయ అభివృద్ధిని సాధించే ప్రయత్నంతో ఉన్నందున ప్రభుత్వం అణిచివేతతో యుద్ధానికి దిగింది. పెట్టుబడి తరుపున ప్రజలపై రాజ్యం యుద్ధానికి దిగుతున్న సందర్భం. ఇది

కోచింగ్ సెంటర్లు అవసరమా?

***కోచింగ్ సెంటర్ల వ్యాపారం విద్యా వ్యవస్థను అధోగతిపాలు చేస్తోందనీ, పాఠశాల స్థాయి నుంచే అటు ప్రభుత్వం, ఇటు తల్లిదండ్రులు చక్కటి విద్యా బోధన, శిక్షణ ఇస్తే కోచింగ్ సెంటర్ల అవసరమే ఉండదనీ అంటున్నారు* గీత**

ఈ మధ్యకాలంలో కోచింగ్ సెంటర్లను నియంత్రించాలని, వాటిలో వసతులను మెరుగుపరచాలని, అధిక ఫీజులు వసూళ్లు చేయకుండా చూడాలని డిమాండ్‌లు వస్తున్నాయి. నవోదయ పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశం కోసం, రకరకాల కోర్సుల్లో ప్రవేశం కోసం జరిగే పరీక్షలకు సంబంధించిన వాటి నుండి రకరకాల ఉద్యోగాలు, అత్యున్నత స్థాయి ఐఎఎస్ ఉద్యోగాల వరకు కోచింగ్ సెంటర్లు శిక్షణనిస్తున్నాయి. వీటికి మౌలిక రూపమైన ట్యూషన్లయితే కె.జి. నుండే నడుస్తున్నాయి. కోచింగ్ సెంటర్లలో జరిగే ప్రత్యక్ష బోధనే కాకుండా, బయట మార్కెట్‌లో ఎన్నో రకాల, పబ్లిషర్ల స్టడీ మెటీరియల్‌లు, పోటీపరీక్షలకు సంబంధించిన మ్యాగజైన్‌లు విస్తృతంగా లభిస్తున్నాయి. ఇవన్నీ కూడా నిరుద్యోగుల నుండి, విద్యార్థుల, తల్లిదండ్రుల నుండి సొమ్ము చేసుకుంటున్నాయి. మరోవైపు ట్యూషన్లు, కోచింగ్‌లు ఎంతో మంది చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధిని ఇస్తున్నాయి. కొంతమంది ఉద్యోగులకు అదనపు ఆదాయాన్ని సమకూరుస్తున్నాయి. ఫక్తువ్యాపార సరళిలో నడిపించే వారికి లక్షలలో, కోట్లలో గిట్టుబాటు అవుతున్నది. పాఠశాల, ఇంటర్, డిగ్రీ, పి.జి.వంటి వివిధస్థాయిలో చక్కటి బోధన, శిక్షణ అందించబడితే ప్రత్యేక కోచింగ్‌ల కోసం వేలు, లక్షలు పోయాల్సిన అవసరం ఎందుకు వస్తుంది.

ప్రస్తుతానికి ప్రభుత్వ అధీనంలో కొన్ని స్టడీ సర్కిల్స్ నడుస్తున్నాయి. వాటిలో ప్రవేశానికి మళ్లీ ప్రవేశ పరీక్షలు. ఐఐటి, ఎంసెట్‌ల పేరుతో ఐఐటి ఫౌండేషన్ కోసమని ఎనిమిదోవ తరగతి నుండే ప్రత్యేక కోచింగ్‌ల పేరుతో ఎన్నో ప్రైవేట్ సంస్థలు నడుస్తున్నాయి. ఐఐటిల్లో ప్రవేశ పరీక్షలకై కోచింగ్ ఇవ్వడంలో పేరు ప్రఖ్యాతలు పొందినది రామయ్య ఇన్‌స్టిట్యూట్. ఈ సంస్థలో చేరడానికి ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షకు వేల మంది హాజరవుతారు. దేశ వ్యాప్తంగా విద్యార్థులు రాస్తుంటారు. వారిలో నుండి రెండు వందల లోపే విద్యార్థులను ఎంపిక చేస్తారు. రామయ్య సంస్థ పెట్టే ఈ ప్రవేశ పరీక్ష కొరకు ఎన్నో సంస్థలు కోచింగ్ ఇస్తాయి.

వలసవాద పాలనలో కాకుండా ముడి సరుకులను తరలించుకు పోవడమేగాక మన అవసరాలను అదనుగా చూపించి పరిశ్రమలను స్థాపించి అదనపు విలువను దోచుకోవడానికి ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. దానికి జాతీయత, హిందూత్వ అనే ముసుగుని ధరించి సంపదంతా ఒకచోట పోగుచేసి పళ్లెంలో పెట్టి సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వర్గానికి అప్పనంగా అందించడానికి అభివృద్ధి పేరిట గారడీ చేసే మోడీ వచ్చేసాడిక.

గత ఎన్నికలలో మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నుంచి బిజెపి అధికారాన్ని హస్తగతం చేసుకుంది. వనరుల దోపిడిలో దళారులుగా మారడానికి ఏ పార్టీ అయినా ఒకటే. అవకాశాన్ని బట్టి పార్టీలు మారే క్రమంలో అప్పటి కాంగ్రెస్ ఎంఎల్‌ఎ సంజయ్‌పాఠక్ బిజెపి గాలివాటం చూసి ఎన్నికల ముందే ఆ ఆపార్టీలోకి దూకేశాడు. అప్పటి వరకు కాంగ్రెసు తరపున సెక్యులరిజం గురించి మాట్లాడిన ఎంఎల్‌ఎ, ఇప్పుడు హిందూత్వం దేశాన్ని ఎలా అభివృద్ధిలోకి తీసుకొస్తుందో, హిందూ ప్రజల మనోభావాలకు మార్గదర్శ కత్వాన్ని ఎలా ఇస్తాదో ప్రకటిస్తున్నాడు. అదే పోరాట ప్రాంతంలో హిందూ గుడులకు గజం కోసం ప్రజలతో (హిందువుల) సహకరించడు. ప్రజలే పోరాడి గుడులున్న భూమిని ఆక్రమించుకొని యాగభూమిగా మార్చుకున్నారు. ప్రతి ఏటా గత రెండు సంవత్సరాలుగా జనవరిలో యాగాన్ని నిర్వహిస్తున్నారు. మాజీ సర్పంచ్ లెక్కల ప్రకారం ఈ సంవత్సరం 8 లక్షలు చందా వసూలు చేసి ఖర్చుపెట్టారు. ఇదీ ఒక ఎత్తుగడగానే ప్రజలు చెప్పారు. ఇలాంటి ఎత్తుగడలు, నిరసన రూపాలు శత్రువుని తిప్పిగొట్టడానికి అవసరమా? అవి ప్రజల్ని సంఘటిత పరుస్తాయా? అన్నది ప్రశ్న.

ఈ ప్రతిఘటనా పోరాట రూపాలు ఫ్యూడల్ పితృస్వామిక భావజాలానికి ప్రతీకలుగా కన్పిస్తాయి. నిజానికి 'చితి' అన్నది హిందూ పితృస్వామిక భావ జాలానికి ప్రతీక. స్త్రీని స్వంత ఆస్తిగా వ్యవహరించిన దశలో మొన్న 80ల వరకు కొన్ని చోట్ల ఆచరింపబడింది. తమని తాము ఆహుతి చేసుకుంటామనే హెచ్చరికతో కూడా నిరసన రూపాన్ని ఒక పోరాట స్ఫూర్తిగా ఎత్తిపట్టడానికి ఇది అడ్డంకి కాకపోయినా మన ఆలోచనలు ఆ వైపుకు నెట్టివేస్తాయి. అలాగే ఊర్లను ఒక నిరసన ప్రకియగా వదిలి వేయడం ప్రతిఘటనా రూపంగా చేయోచ్చా లేదా అన్నది మనకు ప్రశ్న రావచ్చు. పోరాటంలో వివిధ రూపాలను ఎంచుకోవడం అన్నది ఉద్యమకారుల చైతన్యం, స్పృహ, స్థానిక అవసరాలు, అనుభవం, తాత్వికత మీద ఆధారపడి ఉంటుంది. వాటికి సరైన తాత్వికత, నిర్దేశన, పోరాటాలతో పాటు పీడనలేని సమాజాన్ని కోరుకునే ప్రతి మేధావి, ప్రజా సంఘాల, పార్టీల బాధ్యత.

ఏది ఏమైనప్పటికి దేశంలోని వైవిధ్యాలను ఆలంబన చేసుకొని పెట్టుబడి వర్గం వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు రూపాల్లో ఎంచుకున్న ఈ దోపిడి స్వభావాల గుర్తించి ప్రత్యామ్యాయ పోరాట రూపాలను పోరాటస్ఫూర్తితో ఆలోచించాలి. ఇది మొత్తంగా పెట్టుబడికి వ్యతిరేకంగా సాగుతున్న జీవన్మరణ పోరాటం. దేశంలో పెట్టుబడి సృష్టిస్తున్న విధ్వంసానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతి ఉద్యమం నుంచి మనం నేర్చుకోవలసింది ఎంతో ఉంది. ఆ ఉద్యమ స్ఫూర్తిని ఎత్తిపట్టే ప్రత్యామ్నాయ పోరాట రూపాలను, నమూనాలను ఆవిష్కరించవలసి ఉంది.

(రచయిత న్యాయవాది) వీ

ఈ ఎన్నో సంస్థల్లో చేరడానికి మళ్లీ ఒక ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఇది ఐఐటిలో తమ పిల్లలను చేర్పించాలనే లక్ష్యంగా ఉన్న తల్లిదండ్రులకు అనుభవంలో ఉన్న విషయమే. అనేక రకాల కోచింగ్‌లు ఇచ్చే సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

రాష్ట్రంలో గ్రూప్ - 1, 2, 3, 4, యుపిఎస్‌సి నిర్వహించే సివిల్ సర్వీస్ పరీక్షలు, బ్యాంకింగ్, రైల్వేలు, పోలీసు, ఆర్మీ, ఇంజనీరింగ్, టీచర్ తదితర ఉద్యోగాలు, గేట్, టిఒఎఫ్ఎల్ వంటి మరెన్నింటి కోసమో పోటీ పరీక్షల్లో తమ దురదృష్టమో, అదృష్టమో పరీక్షించుకోవడానికి దిక్కులేని పరిస్థితుల్లో కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దాపురించింది. అసలు ప్రవేశపరీక్షల్లో గాని, ఉద్యోగాల కోసం నిర్వహించే పోటీ పరీక్షల్లో గాని అర్హతగా గుర్తించిన కోర్సుల్లో లేని వాటిలో లేదా అంతకు మించిన స్థాయికి సంబంధించిన ప్రశ్నలను ఎందుకు అడగాలి? ఆ పరిస్థితిని ఎందుకు కల్పించాలి? దీనివలన వివిధ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు, ఉద్యోగార్థులు తమ అర్హత కోర్సుల్లో చదవని వాటి కోసం ఈ కోచింగ్ సెంటర్లను ఆశ్రయించడం జరుగుతున్నది. లేదా చాలా వరకు అర్హత కోర్సులను చదివే సందర్భంలో గుణాత్మకతను సాధించేలా విద్యాసంస్థల స్థాయి అలాగే విద్యార్థుల స్థాయి లేకపోవడం జరుగుతున్నది. విద్యాసంస్థల స్థాయి అన్నప్పుడు అక్కడి విద్యా వాతావరణం - చాలినంత అధ్యాపక సిబ్బంది, వారిలో విశ్లేషణాత్మక, అన్వయాత్మక సమర్థవంతమైన బోధనా నైపుణ్యాలు, తరగతి గదుల్లో జరిగే చర్చలు, బోధనాభ్యసన ప్రక్రియలు, మౌలిక వసతులు, సమర్థవంతమైన రిసోర్స్‌ఫుల్ గ్రంథాలయం, కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటి ఎన్నో ఇమిడి ఉంటాయి. విద్యార్థులు వివిధ స్థాయిల్లో (పాఠశాల, ఇంటర్, డిగ్రీ) చదువుతున్నప్పుడే తాము చదువుతున్న సబ్జెక్టులపై సమగ్రమైన అవగాహనను, అన్వయింపుతో కూడిన విశ్లేషణలు చేయగలిగే పట్టును అందించేలా విద్యాసంస్థలు ఉన్నట్లైతే కోచింగ్ సెంటర్ల అవసరం ఉండేది కాదు. మేధావులు, నిరుద్యోగ అభ్యర్థులు, విద్యార్థి ఉద్యమశక్తులు, విద్యార్జనా వివిధస్థాయిల్లో ప్రతి తరగతిలో గుణాత్మకతను పెంపొందించేలా చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. పాఠశాలల, కాలేజీల, సమయాల్లో మాత్రమే కాకుండా ప్రతిరోజు ఆదివారాలతో సహా ఉదయం నుండి రాత్రిళ్లు పొద్దు పోయేదాకా విద్యార్థులకు అందుబాటులో ఉండేలా విద్యాసంస్థల్లో లైబ్రరీలను మెరుగు పరచాలి. వీటిలో చాలినన్ని రెఫరెన్స్ పుస్తకాలు, స్టడీ మెటీరియళ్లు, పోటీ పరీక్షలకు సంబంధించిన సమగ్ర సమాచారం, జిరాక్స్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి. పూర్తిస్థాయిలో సుశిక్షితులైన అంకితభావంతో పనిచేసే అధ్యాపక సిబ్బందిని నియమించాల్సి ఉంటుంది.

ఏ కోర్సులు ఏ భవిష్యత్‌కు దారితీస్తాయో, వాటిలో ప్రవేశాలు ఎలా? అందుకొరకు ఏమి చదవాల్సి ఉంటుంది? ఎలా చదవాల్సి ఉంటుంది? ఏయే రంగాల్లో, ఏయే కోర్సులు చదివిన ఎంత మంది అవసరం ఉన్నది? మొత్తం ఎంతమందికి ఈ అవకాశాలు వస్తాయి? ఏయే రంగాల్లో ఎవరెవరు ఎంత వరకు రాణించవచ్చో అంచనా వేస్తూ క్రమబద్ధమైన గైడెన్స్ ఇచ్చే వ్యవస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ఫలితంగా ప్రత్యేకించి కొన్ని కోర్సులపైనే, (ఉదాహరణకు ఐఐటి, ఎంసెట్) కొన్ని ఉద్యోగాలపైనే విపరీతమైన క్రేజ్ ఏర్పడడం, అవి తప్పిస్తే భవిష్యత్తే లేదనేంతగా విపరీత పరిస్థితికి అవకాశం ఇచ్చినట్లైంది. కెరీర్ గైడెన్స్, కౌన్సిలింగ్‌ను ప్రతిస్థాయిలో నిర్వహించినట్లైతే ఈ పరిస్థితి వచ్చేది కాదు.

మొత్తం సమాజంలో ఏయే స్థాయిల్లో ఎంతమంది ఏమేమి చదువు కుంటున్నారు? ఏయే కోర్సుల ద్వారా ఎంతమందికి ఏయే ఉద్యోగాలు వస్తాయి? ఎంతమంది ఏయే పనుల్లో ఉపాధి పొందవచ్చు? ఏయే రంగాల్లో ఎంతమంది నిష్ణాతులు అవసరమవుతారు? వంటి అనేక విషయాల్లో మండల, జిల్లా, రాష్ట్ర దేశీయ, అంతర్జాతీయంగా వివిధ రంగాల్లో అందివచ్చే విద్యా, ఉపాధి, ఉద్యోగ అంశాలను విద్యార్థులకు, తల్లిదండ్రులకు అందుబాటులో ఉండేలా చేస్తే వారికి స్పష్టత వస్తుంది. దీన్ని అనుసరించి వారి ఆసక్తులు, అవసరాలు, అందుబాట్లను అనుసరించి ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని వీరి అవసరాలు తీర్చేలా పాఠశాల ఇంటర్, డిగ్రీ, పి.జి. స్థాయిల్లో గుణాత్మక, శాస్త్రీయమైన ప్రణాళికతో విద్యా బోధన జరపడానికి విధానపరమైన నిర్ణయాలు, ఆచరణాత్మక కృషి జరుగవల్సి ఉన్నది. సమసమాజ దిశలో మానవీయ, శాస్త్రీయ విలువలతో సమగ్ర మూర్తిమత్వ వికాసాన్ని సాధించేదిలా ఉంటూ భవిష్యత్ జీవితంలో తమ కుటుంబాలను పోషించుకునేందుకు దోహదపడేదిగా విద్యా విధానం ఉండాలి. చదువులు, జ్ఞాన సంపాదన, ఉద్యోగం, ఉపాధి వెతుక్కోవడం అనేవి వ్యక్తిగత విషయంగా చూడ బడుతున్న దశ నుండి ఇవి సామాజిక అంశాలుగా, వీటికి సమాజమే (ప్రభుత్వం) బాధ్యత పడేలాగా ఎదగాల్సి ఉన్నది.

విద్యా, ఉద్యోగం, ఉపాధి గ్యారంటీ చేయబడ్డ దశలో కోచింగ్ సెంటర్ల అవసరం ఉండదనేది గ్రహించాలి. ప్రతి విద్యా సంస్థ కేవలం పాఠాలు బోధించడం, సిలబస్ పూర్తిచేయడం, అకడమిక్ పరీక్షల్లో గట్టెక్కించడం మాత్రమే కాకుండా ప్రతి విద్యార్థిలో అంతర్గతంగా నిబిడీకృతమైన శక్తి సామార్థ్యాలను వెలికితీసి వాటిని సామాజిక ప్రయోజనాల దృష్ట్యా అభివృద్ధి చేసుకోవడంలో తోడ్పడేవిగా ఎదగాల్సి ఉన్నది. విద్యార్థులు ఏయే రంగాల్లో, క్షేత్రాలల్లో సఫలీకృతులు, నిష్ణాతులు అవుతారో గుర్తించగలిగేలా విద్యా సంస్థలు ఎదగాల్సి ఉన్నది. అలా గుర్తించిన రంగాల్లో, విద్యార్థుల ఆసక్తులు, అంతర్గత శక్తి సామార్థ్యాలను అనుసరించి విద్యా బోధన జరిగే పరిస్థితులు కల్పించాలి. ఆ రంగాల్లో విద్యార్థులు వికసించేలా ఉన్నత చదువులు కొనసాగించడానికి అవసరమైన పరిస్థితులు కల్పించబడాలి. అటు పిమ్మట ఆ రంగాల్లోనే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తే వారి ఇష్టాలకు, ఆసక్తులకు తగిన రంగం కాబట్టి అందులో ఉద్యోగ సంతృప్తి, స్వయం సంతృప్తిని పొంద గలుగుతారు. ఏదో డబ్బు కోసమో, కుటుంబ పోషణ కోసమో మాత్రమే కాకుండా పాషన్‌నేట్‌గా, సృజనాత్మకంగా పని చేసే అవకాశం ఉంటుంది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. - సం.*

అన్ని అనర్థాలకు తల్లివేరు రాజకీయం

సమాజంలోని అన్ని సంక్షోభాలకూ పాలకులు అమలు చేస్తున్న రాజకీయ విధానాలే ప్రధాన కారణాలనీ, రాజకీయాల్లో సమూల మార్పు రావాలనీ అంటున్నారు **వై.ఎచ్.కె. మోహన్‌రావు**

ఏ జలాశయంలోనైనా నీరు పైనుండి తేటబడుతూ వస్తుంది. అడుగు భాగానికి చేరుకుంటేనే బురద ఉంటుంది. పైన చెప్పుకున్న నానుడి అవినీతి రొచ్చుతో నిండిన భారతీయ వ్యవస్థకూ వర్తిస్తుంది. అన్ని రంగాలలో వేళ్లూనుకుని జడలు విప్పుకున్న ఈ అవినీతి ఎక్కడెక్కడ ఉందో చెప్పడం కంటే ఎక్కడ లేదో చెప్పడం చాలా సులువు. ఎందుకంటే పెద్దగా ఆలోచించవలసిన అవసరం ఉండదు కనుక. బుర్ర గోక్కొని వెతుక్కోవలసిన పని అంతకన్నా లేదనుకోవచ్చు. మూల మూలలా పాషాణ సదృశ్యంగా మారిన అవినీతి విశ్వరూపం అల్లకల్లోలంగా మారిన జలధిలా ఉంది. సునామి విజృంభించిన అవధిలా ముంచుతుంది. రాజకీయాలలో, పాలనలో అడుగడుగునా విశృంఖలంగా రాజ్యమేలుతున్న అవినీతి జాఢ్యం దేశం అణువణువును ప్రభావితం చేస్తుంది.

ఇటీవల బీహార్ రాష్ట్రంలోని వైశాలి జిల్లాలో మెట్రిక్యులేషన్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల మూకుమ్మడి చూచి రాతలు, చిట్టీలతో కాపీయింగ్ చేసిన సంఘటనల్లో అక్కడి పోలీసులు 900 మందిపై కేసులు నమోదు చేసి లాకప్‌లోకి నెట్టారు. ఈ సంఖ్య జిల్లా మొత్తంలోనో, రాష్ట్ర వ్యాప్తంగానో కాపీయింగ్‌కు జరిగిన అరెస్టులనుకుంటే పొరపాటే అవుతుంది. ఈ 900 మంది ఒకేఒక్క పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సంబంధించిన నిందితులు. వీరిలో విద్యార్థులు, వారికి అత్యంత చాకచక్యంగా ప్రాణాలను సైతం ఖాతరు చేయకుండా 4 అంతస్తుల వరకూ బల్లుల్లా గోడలు ఎగబాకి చిట్టీలు అందించి ఉత్తీర్ణత శాతం పెంచడానికి శ్రమకోడ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు, శ్రేయోభిలాషులు ఇతరత్ర వ్యక్తులు ఉన్నారు. ఈ జబ్బు ఆ రాష్ట్రంలో ఏ స్థాయిలో వ్యాప్తి చెందిందంటే ఒక్కో విద్యార్థికి సగటున ముగ్గురు రాష్ట్ర వ్యాప్తంగా సహకారం అందించడానికి చాలా కష్టపడ్డారట. ఈ తతంగాన్నంతా పరీక్షలు నిర్వహించే అధికారులు, పరీక్షా కేంద్రాలలోని నిఘా సిబ్బంది చూస్తూ కూడా అంతా పకడ్బందీగా జరుగుతున్నట్లు బిల్డప్‌లిస్తూ పరీక్ష గదుల్లో పచార్లు చేస్తూ గంభీరతను ప్రదర్శిస్తారట. రాష్ట్ర వ్యాప్తంగా 1217 కేంద్రాల్లో 14 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే వారికి సహాయపడిన వారిని మూల్యాంకనం చేస్తే రమారమి 40 లక్షలదాకా నిందితులుగా తేలుతారన్నది విస్మరించలేని వాస్తవం. ఇదో సామూహిక నైతిక పతనం.

మరో విషయాన్ని గురించి ప్రస్తావిస్తే 2015 మార్చ్ నెలలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఉపాధ్యాయ విధాన పరిషత్ ఎన్నికలకు సంబంధించి మీడియా ముందుకొచ్చిన సంగతులు పరాకాష్ఠకు చేరిన విలువల పతనాన్ని ప్రదర్శించాయి. గుంటూరు, కృష్ణా జిల్లాల స్థానానికి అంతకు క్రితం ఆ స్థానం నుండి రెండు పర్యాయాలు పనిచేసిన కె.ఎస్. లక్ష్మణరావు, ఉభయగోదావరి జిల్లాల స్థానం నుండి రాము సూర్యరావు పిడిఎఫ్ అభ్యర్థులుగానూ, తెలుగుదేశం పార్టీ మద్దతుతో ఎ.ఎస్. రామకృష్ణ, చైతన్యరాజు బరిలో నిలిచారు. ఈ ఎన్నికలలో అధికార 'దేశ' పార్టీ అవలంభించిన నీతి బాహ్య ఒరవడి ఎన్నికల వ్యవస్థనూ, ప్రజాస్వామ్య భూమికను అపహాస్యం చేసింది. టిడిపి మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, పార్టీ సీనియర్, చోటా నాయకులు తెగబడి పాఠశాలల్లోకి చొరబడి ప్రచారం చేయడమే గాక ఓటర్లకు సెల్ ఫోన్‌లు, డబ్బు పంపిణీ చేసిన తీరు పరమ జుగుప్సాకరం. మూడు నుంచి ఐదు వేల వరకూ కవర్లలో పెట్టి పంపిణీ చేసి ప్రలోభపెట్టిన వైనం మన రాజకీయ వ్యవస్థలోని భ్రష్టాచారాన్ని బహిరంగ పరిచింది. నిస్సిగ్గుగా 'దేశం' పార్టీవారు చేస్తున్న ధన పంపిణీని సిపిఎం పార్టీ నాయకులు విజయవాడలో అడ్డుకుని డబ్బుతో ఉన్న కవర్లను, వెయ్యి రూపాయల కరెన్సీ నోట్లనూ మీడియా ముందుకు తీసుకువచ్చి టిడిపి నీతిబాహ్య పోకడను ప్రజల ముందు ఆవిష్కరించారు. నిజం చెప్పుకోవాలంటే పిడిఎఫ్ అభ్యర్థులు నైతిక కట్టుబాటుతోనే ఎన్నికలలో వెళ్లారని చెప్పుకోవచ్చు. అయినప్పటికీ గుంటూరు, కృష్ణా స్థానంలో గెలుపొందిన 'దేశం' ఉభయ గోదావరిలో పరువు పోగొట్టుకుంది. ప్రలోభాలకు గురిచేయడమే కాకుండా కొన్ని ప్రాంతాల్లో 'దేశం' పార్టీ మంత్రులు, ఎంఎల్‌ఎలు ఉపాధ్యాయులను బెదిరింపులకు గురి చేశారని వార్తలు వెలువడినాయి. అయినా ఉభయ గోదావరిలో ఆ పార్టీకి భంగపాటు తప్పలేదు. పాపం చంద్రబాబు ఉభయ గోదావరి పరాజయంపై తెగ నొచ్చుకున్నాడట. ఆకాశమేదో విరిగి మీద పడినట్లు బాధపడ్డాడట. నాయకుల సమన్వయం లోపం, అభ్యర్థి ఎంపికలో పొరపాటు ఈ ఓటమికి దారితీసినట్లు ఆయన తేల్చి వేశారు. ఏం కొంప మునిగిందో? ఒక ఎంఎల్‌సి అభ్యర్థి పరాజయాన్ని తట్టుకోలేని ఈ విధమైన దుష్ట పోకడలే భారత్‌ను భ్రష్టు పట్టిస్తున్నాయి.

ఈ అధ్యాయంలో మరో కోణమేమిటంటే మేధో వర్గానికి చెందిన ఉపాధ్యాయుల అనైతిక ప్రయాణం సమాజం రుగ్మతలకు చికిత్స చేయవలసిన వారు ఉపాధ్యాయులు. మంచి విద్యతో పాటు విద్యార్థులకు నైతిక విలువలు, వ్యక్తిత్వ నిర్మాణం నేర్పవలసిన మాన్యులు. కాగా గౌరవప్రదమైన స్థానంలో ఉన్న ఉపాధ్యాయులు కనీసం ఢిల్లీలో సామాన్యుడు ప్రదర్శించిన విజ్ఞతను కూడా అనుసరించకపోవడం విషాదకరం. అధికార పార్టీ అభ్యర్థి తరపున అందిన ప్రలోభాలకు లొంగిపోయి కవర్లు, కరెన్సీ, చరవాణీలతో సంతృప్తిపడి తాము అవినీతి పక్షానే ఉన్నామని అనేక మంది ఉపాధ్యాయ మేధావులు

నిరూపించుకున్నారు. డబ్బుకు కక్కుర్తిపడి ఓట్లు వేసిన ఉపాధ్యాయులు వ్యవస్థను ఏ వైపుకు తీసుకువెళుతున్నామోననే విషయాన్ని గమనంలోకి తీసుకోకపోవడం విచారకరం. ఈ ఎన్నికలు దేశంలోని మేధో వర్గాల వక్ర నడతను వెల్లడి చేస్తున్నాయి.

కేంద్ర ఇంధన శాఖా సచివుల అధీనంలో నడిచే ఇంధన ధరల స్థిరీకరణ కమిటీ రహస్య నివేదికలు అధికారుల కన్నుగప్పి దారి తప్పుతున్నాయని చాలా కాలానికి బహిర్గతమైంది. వేసిన తలుపులు వేసినట్లే ఉండి, తాళాలు తీసిన ఆనవాళ్లు అగుపించకుండానే బీరువాలలో గుప్తంగా దస్త్రాలలో ఉండే సమాచారమంతా గుట్టు చప్పుడు కాకుండా బయటకు వెళ్లిపోతుంది. దస్త్రాలలోని ముఖ్యమైన పత్రాలు అదే కార్యాలయంలోని జిరాక్స్ మిషన్‌ను ఉపయోగించుకుని తీసిన కాపీలు వెళ్లాల్సిన చోటుకు భద్రంగా చేరాయి. అవసరమైన చేతులలోకి సలక్షణంగా వెళ్లి పోయాయి. ఈ క్రమం ఏ స్థాయిలో ఉందంటే ఈ నేరానికి పాల్పడినవారు తప్పిదం చేయకపోతే ఈ కుట్ర వెలుగు చూసేది కానే కాదు. ఆ కార్యాలయంలో పనిచేస్తూ రహస్యాలను కాపాడవలసిన గుమస్తా ఉద్యోగులు, నాలుగవ తరగతి ఉద్యోగులు చేతులు కలిపి ఈ దారుణానికి పాల్పడినట్లు విచారణలో వైనం వెలుగు చూసింది. వాస్తవానికి ఈ దస్త్రాలు చేతికి రావాలంటే ఏడు తాళాలు తీయాలట. ఈ అఘాయిత్యానికి ఒడిగట్టిన వారు ఏడు నకిలీ తాళం చెవులు తయారు చేయించి నగరమంతా గాఢ నిద్రలోకి జారుకున్న పిదప అర్ధరాత్రో, అపరాత్రో మారు తాళం చెవులతో ద్వారాలన్నీ తెరిచి దస్త్రాలను జిరాక్స్ తీసి ఎప్పటిలాగే చడీచప్పుడు కాకుండా తిరిగి బీరువాలలో పెట్టి యథావిధిగా తాళాలన్నీ వేసి గప్‌చిప్ మనిపించేవారు. అయితే ఒకనాడు యథావిధి చేతివాటానికి ఒడిగట్టిన గ్రంథ సాంగులు జిరాక్స్ తీసిన అనంతరం అసలు దస్త్రాన్ని పొరపాటున బీరువాలో పెట్టడం మరిచి ఎప్పటి మాదిరిగానే తలుపులు తాళాలు వేసి వచ్చిన నేపథ్యంలో రంగం మొత్తం బహిర్గతమైంది. అసలు దస్త్రం బయటకు వచ్చిన తీరుతో అధికారుల ఖంగుతిన్నారు. ఇది ఎట్లా జరిగిందో అర్థం కాక తలలు బద్దలు కొట్టుకున్నారు. అప్పటికి తేరుకున్న అధికారులు లోతైన విచారణ చేపట్టడంతో అసలు గుట్టు మొత్తం రట్టయింది. కొసమెరుపేంటంటే ఈ అక్రమ పాప ఫలం అందుకునే వారిలో ఒకరు, ప్రపంచ కుబేరుల్లో చేరిపోయిన ఇంధన పరిశ్రమాధిపతి రిలయన్స్ ముఖేష్ అంబాని. ఎన్ని తరాలైనా కూర్చుని మనగలిగినంత సంపద పోగేసుకున్న అంబానీ సోదరుని అత్యంత నీతిమాలిన మార్గం ఇది. తన ఆర్థిక బలగాలతో భారత ఆర్థిక వ్యవస్థను శాసించగలిగిన ఒక పారిశ్రామిక వేత్త దిగజారిన వ్యక్తిత్వానికి మచ్చుతునకగా ఈ ఉదంతాన్ని చెప్పవచ్చు. తన కక్కుర్తి నైజం వెల్లడైతే ప్రపంచం ఛీకొడుతుందన్న సిగ్గు ఎగ్గులేని భావదారిద్ర్యానికి చెరిగిపోని చిహ్నంగా ఎంచవచ్చు.

ఈ మధ్యన జరిగిన ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో ఆప్ పార్టీ అధ్యక్షులు ప్రస్తుత ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అక్కడి ఓటర్లకు ఒక విన్నపం చేశారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీల డబ్బు పంపిణీ అడ్డుకోలేక చేతలుడిగి చూస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం వైఫల్యాన్ని గమనించిన కేజ్రీవాల్ ఆయా పార్టీలు ఇచ్చే డబ్బు పుచ్చుకుని తమ పార్టీ ఆప్ అభ్యర్థులకు ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడే ఒక విచిత్రమైన ట్విస్ట్ నడిచింది. ముద్దాయిని వదిలి ఫిర్యాదిని అదిలించి నట్లుగా ధన ప్రవాహానికి అడ్డుకట్ట వేయలేని ఎన్నికల కమిషన్ బిజెపి, కాంగ్రెస్ పంపిణీ చేసే డబ్బు తీసుకోండని ఓటర్లకు చెప్పిన కేజ్రీవాల్ గొప్ప నేరానికి పాల్పడినట్లు వివరణ కోరుతూ ఆయనకు సంజాయిషీ నోటీసు పంపింది. ఆడ చేతగాక మద్దెల ఓడు అన్న చందంగా ఉంది ఈ చర్య. ఎన్నికలలో క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతుందో తెలిసి కూడా ఆ దిశగా దిద్దుబాటు చర్యలు చేపట్టలేని ఎన్నికల సంఘం అక్రమ పద్ధతులను వెలుగులోకి తెచ్చిన వారిపై చర్యలంటూ తన చేతగాని తనాన్ని చాటుకుంటుంది. ధన రాజకీయాలపై చర్చలు జరిగిన ప్రతి సందర్భంలోనూ వివిధ ఛానళ్లలో పాల్గొనే ప్రజా ప్రతినిధులు సైతం ఎన్నికలలో ధన ప్రభావం, డబ్బు, మద్యం పంపిణీని అంగీకరిస్తున్న విషయాన్ని మనం చూస్తూనే ఉన్నాం. ఒక సందర్భంలో టిడిపి ఎంపి జె.సి. దివాకర్‌రెడ్డి మీడియా ముందు బహిరంగంగా మాట్లాడుతూ 50 కోట్లు ఎంఎల్ఎ, 100 కోట్లు ఎంపి ఖర్చుచేసి ఎన్నికలలో గెలుస్తున్నారన్న బహిరంగ రహస్యాన్ని విప్పాడు. ఇంతా గుల్ల చేసుకుని వచ్చిన తమకు ఏమాత్రం గౌరవం లభించడం లేదన్నారు. ప్రాధాన్యతా హీనంగా ఎంతకూ కొరగాకుండా ఉన్నామని బాధపడ్డారు. అంధత్వాన్ని నటిస్తున్న స్వతంత్ర సంస్థలైన ఎన్నికల సంఘాలు ఎన్నికలలో అపచారాలను పెంచి పోషిస్తున్నాయి. రాజకీయ పార్టీల మరో కోణం ఎదుటి పార్టీలో బలమైన అభ్యర్థులను వేదుకుని తమ పార్టీ అభ్యర్థిగా పోటీచేయమని మలుపుకుంటూ ప్రతిపక్ష పార్టీలను బలహీన పరుస్తున్నాయి. నంద్యాల శాసనసభ అభ్యర్థి శోభానాగిరెడ్డి 2014లో జరిగిన ఎన్నికల సందర్భంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించి నప్పటికీ ఓటర్లు ఆమెనే గెలిపించారు. ఎన్నికల చరిత్రలో ఇదో సంచలన తీర్పు. అనంతరం ఆమె మరణంతో ఖాళీ అయిన స్థానాన్ని భర్తీ చేసేందుకు వచ్చిన ఎన్నికల్లో వైసిపి తరపున శోభ కుమార్తె అఖిల ప్రియారెడ్డిని ఎంపిక చేసుకుంది. అయితే అఖిలప్రియను తమ పార్టీ తరపున పోటీ చేయమని అభ్యర్థించింది 'దేశం' పార్టీ. అదే విధంగా పిడిఎఫ్ తరపున ఎంఎల్‌సిగా పదవీ కాలం ముగిసినాక తిరిగి అదే పిడిఎఫ్ పక్షాన పోటీ చేయాలని నిర్ణయించుకున్న కెఎస్. లక్ష్మణరావును సైతం 'దేశం' పార్టీ అభ్యర్థిగా పోటీ చేయమని దేబరించింది. ఇదో ముష్టి ఆలోచన. రాజకీయాలను ఏ మేర దిగజార్చాలో మన రాజకీయ పార్టీలకు తెలిసినంతగా ప్రపంచంలో ఇతర దేశాల పార్టీలకు తెలియదేమో!

మహాభారత గాధలో ధర్మజుడు జ్యూతంలో పాంచాలిని కోల్పోయినప్పుడు పాండవ పట్ట మహిషిని తోడ్కొని రమ్మని దుర్యోధనుడు సేవకుని ఆదేశిస్తాడు. అప్పుడు అక్కడే ఆశీనులైన భీష్మా చార్యులు, ద్రోణుడు, విదురుడు తీవ్రంగా నిరసిస్తారు. అయితే ధృతరాష్టుడు సామ్రాట్ స్థానంలో ఉండి వీరి నిరసనను తప్పుపడతాడు. ద్రౌపధిని జ్యూత సభకు రమ్మని చెప్పాలని వారిని కోరుతాడు. దేశాజ్ఞి అయి ఉండి యువరాజు దుర్యోధనుని ఆదేశాలు పాటించకపోతే సామ్రాజ్యంలో బానిసలైన ప్రజలు ఈ తిరస్కారాన్ని అనుసరించరా? అంటూ ధృతరాష్ట్రుడు ప్రశ్నిస్తాడు. తదనంతరం తిరస్కరించిన ద్రౌపధిని దుశ్శాసనుడు శిరోజాలు పట్టుకుని ఈడ్చుకు రావడం గాథకు కొనసాగింపు. కాగా ఈ జ్యూత గృహ ద్రౌపది సంఘటన అనంతర కాలంలో ఆచారంగా కొనసాగి ఇతరత్రా దేశాలకు ఎగబాకింది. ద్వారకలోని పౌరులు భార్యలను పందెంగా ఒడ్డిన సందర్భం లో బలరాముడు అడ్డుకుని మందలిస్తాడు. ధర్మాజుని జ్యూత ప్రీతిని,

పాంచాలిని పందెంలో ఒడ్డడాన్ని ఈసడించుకుంటాడు. అధర్మానికి పాల్పడినట్లు ధర్మరాజును నిందిస్తాడు. ధర్మాన్ని మంట గలిపాడని దూషిస్తాడు. బహుశా ఇదంతా కథే కావచ్చు. వాస్తవంగా జరిగి ఉండక పోవచ్చు. ఏ రచన అయినా ఆనాటి సామాజిక పరిస్థితుల ఆధారంగా నడుస్తుంది. రచయిత అప్పటి సాంఘిక స్థితి గతులను బట్టే కథనాన్ని నడుపుతాడనేది నిర్వివాదం. మహాభారతాన్ని వాస్తవ గాధని నమ్ముతున్న వారి అంచనాల ప్రకారం కీ.పూ 3600ల సంవత్సరాల నాటిదని విశ్లేషించారు. అయితే ఇక్కడ మనం అవగతం చేసుకోవలసిన అంశమేమంటే ఆనాటి మహిళల అత్యంత దిగజారిన బానిస స్థానాన్ని. ఒక పట్ట మనిషి పరిస్థితే అంత దారుణంగా ఉంటే ఆనాటి రాచరిక వ్యవస్థలో మిగిలిన మహిళల, ప్రజల స్థానం అంచనాకు అందదేమో! అయితే పై సంఘటనలు నాటి ప్రజల నికృష్ట జీవితానికి గీటురాళ్లుగా నిలుస్తాయి. ద్వారక కథనం మనకేమి నేర్పుతుందంటే పాలకులను ప్రజలు అనుసరిస్తారనడానికి చక్కని నిఘంటు విశ్లేషణగా నిలుస్తుందని.

రామాయణ మహాభారతాలు పాఠ్యాంశాలుగా చేర్చకపోవడం వల్లనే దేశంలో ధర్మాలు, సంప్రదాయాలు నాశనమయ్యాయని హిందూ వాద శక్తులు ఇటీవల కాలంలో తరచూ వ్యాఖ్యానిస్తున్నాయి. ధర్మజుని జ్యూతం, పాంచాలిని ఒడ్డిన విషయాలు ధర్మ వ్యతిరేకమని బలరాముడు ధ్వజమెత్తాడు. ఆ విషయంలో ధర్మజుని ఇప్పటికీ హిందూ సమాజం నెత్తిన పెట్టుకుని ముందుకు వెళుతుంది. ఏ ధర్మాన్ని పాఠ్యాంశాలుగా చేర్చాలో అర్థం కాని విషయం. రామాయణంలో రాముడు ఏక పత్నీ వ్రతుడైతే మహాభారత కథానాయకుడు శ్రీకృష్ణుడు అష్టపడతుల విలాసుడు. ఇతరత్రా ప్రేమాయణాలు కూడా ఆయన బహిరంగ విన్యాసాలే. అట్లాగే వివాహమాడమని కోరిన మహిళ ముక్కు – చెవులు కోయించిన రాముడు కూడా ఉన్నాడు. ఈ ధర్మాలన్నింటినీ పాఠ్యాంశాలుగా మార్చాలా? అనేది ప్రస్తుతం మనముందున్న పెద్ద ప్రశ్న. నీకు అర్థంకాని సంశయాన్నొక దానిని హిందూవర్గాల ఎదుటకు తీసుక వస్తున్నాను. మన ప్రధాని నరేంద్రమోడీ రామాయణ, మహాభారతాలు ఆకళింపుకాని వాడని నేననుకోవడం లేదు. అయితే ఆయనకు దూరంగా ఉన్న ఆయన పత్ని యశోదాబెన్ అభ్యర్థిస్తుంది. తనను నరేంద్రమోడీ ఆదరించి ఆశ్రయమిస్తే ఒక భార్యగా ఆయనకు సేవలు అందిస్తానంటుంది. మరి నరేంద్రమోడీ ఈ రెండు ఇతిహాసాలలోని ఏ ధర్మం ప్రకారం యశోదాబెన్ కోరికను మన్నించడం లేదు. ఏ ధర్మం ప్రకారం శివసేన ఎంపిని బిజెపిలోకి తీసుకుని మంత్రి పదవి ఇచ్చి శివసేనను కిరికిరిలో పెట్టాడు. విశ్వహిందూ పరిషత్ ఇతర మతాలలోకి వెళ్లిన హిందువులను 'ఘర్‌వాపసి' పేరుతో తిరిగి హిందూ మతంలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తుంది. దీనికంటే ముందు యశోదాబెన్‌ను వీరు ఆమె భర్త నరేంద్రమోడీ ఇంటికి చేర్చి పుణ్యం కట్టుకోవాల్సిన అవసరం ఉంది.

ఒకింత పైన చెప్పుకున్న సంగతులన్నీ ఇతిహాసాలతో మహిళల స్థితి గతుల గురించేననే విషయం గుర్తుచేస్తాను. నాగరిక ప్రపంచ మనుకుంటున్న ఈనాటి కాలంలోనూ పైన సంఘటనలకు భిన్నంగా స్త్రీల మనుగడ ఉన్నట్లుగా చెప్పలేం. మరింత దయనీయంగా ఉందని కూడా గట్టిగా చెప్పవచ్చు. నిర్భయను మానభంగం చేసినవారిలో ఒకరై తిహార్ జైలులో ఉన్న ముఖేష్‌సింగ్‌తో చిత్ర నిర్మాత లండన్ వనిత వెస్లీ ఉడ్విన్ ఇండియాస్ డాటర్ డాక్యుమెంటరీ చిత్రీకరణ సందర్భంలో జరిపిన సంభాషణలో అతను మాట్లాడిన కిరాతకమైన మాటలు భారతీయ మహిళల దీనస్థితికి దర్పణం పట్టాయి. మానభంగం చేసే సందర్భంలో సహకరించకుండా ప్రతిఘటించడం వలననే హత్యకు పాల్పడ్డామని తెలిపిన సంగతీ, ముఖేష్‌కు వకాల్తా పుచ్చుకుని న్యాయస్థానంలో అతని తరఫున వాదించిన న్యాయవాదుల వ్యాఖ్యానాలు మనదేశంలోని స్త్రీమూర్తుల జీవిత గమనాలు నాటి జ్యూతగృహ ద్రౌపది కథనాన్ని మించి సాగుతున్నాయనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ఈ సంఘటనను నిరసిస్తూ పెద్దఎత్తున జరిగిన ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నిర్భయచట్టం నేరాలను ఏమాత్రం అదుపులో పెట్టలేక పోయిందని అనంతరం మహిళలపై జరిగిన నేరాల సంఖ్య వెల్లడి చేసింది. నిర్భయ చట్టం వచ్చిన తర్వాత 2014లో దేశవ్యాప్తంగా జరిగిన ఈ తరహా నేరాల సంఖ్య 33,707 రమారమి ప్రతి 16 నిమిషాలకు ఒక మానభంగం జరుగుతుందనేది ఒక నిర్దిష్ట అంచనా. రోజూ 92 మంది మహిళలు మానభంగానికి గురవుతున్నారని గణాంకాలు తెలుపు తున్నాయి. 2013 ఫిబ్రవరిలో నిర్భయ చట్టం వస్తే ఆ సంవత్సరంలో జరిగిన స్త్రీ సంబంధిత నేరాలను మించి 2014లో 32 శాతం అధికంగా జరిగినట్లు కేంద్రీయ నేర గణాంకాల సంస్థ తెలుపుతుంది. ఇది ఇలా ఉంటే డెమోక్రటిక్ రిఫామ్స్ బాడీ సర్వే ప్రకారం ప్రస్తుత పార్లమెంటులో 34 శాతం మంది ఎంపిలు ఏడు ఏడేళ్లకు తక్కువగాని జైలు శిక్ష విధించే నేరాలకు సంబంధించిన ఆరోపణలతో 186 మంది నిందితులుగా ఉన్నారు. వివిధ రకాల నేరారోపణలు ఎదుర్కొంటూ ముద్దాయిలుగా 225 మంది ఎంపిలున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. దేశంలో అన్నిరంగాలలో కుళ్లి కంపుకొడుతున్న ఈ అనైతిక దుష్ట లక్షణాల మూలాలన్నీ పాలకుల అపభ్రష్ట పాలనలోనూ, రాజకీయ నాయకుల అపసవ్య ఆలోచనలోనే ఉన్నాయి. బరితెగించి సాగుతున్న ఆకృత్యాల తల్లివేరు అక్కడే పాదుకొని ఉంది. భారత్‌ను పట్టి పీడిస్తున్న అవినీతి అనైతిక పునాదులు రాజకీయాల్లోనే ఉన్నాయి. ఓటర్లు తీసుకుంటున్నారు మేమిస్తున్నామంటున్న రాజకీయ నాయకుల వైఖరిలోనే మార్పు రావాలి. ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఇటీవలి కాలం వరకూ వచ్చిన అనేక ఎన్నికలలో డబ్బు పంపిణీ జరగకపోయినా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లు వేశారన్న సత్యాన్ని రాజకీయ వేత్తలంతా గుర్తించాలి. అవినీతి మురుగుతో లుకలుకలాడుతున్న వ్యవస్థ ప్రక్షాళన ఉచ్ఛ స్థానంలో ఉన్న రాజకీయాల నుండే ప్రారంభం కావలసి ఉంది. గెలుపే ధ్యేయంగా సాగే నీచ పోకడలకు స్వస్తి పలకాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మేమిట్లాగే ఉంటాం! ప్రజలు నీతివంతంగా ఉండాలను కోవడం వెర్రితనం అవుతుంది గాక మరొకటి కాదు.

సమాజంలో ఊడలు దిగిన అవినీతి, అనైతిక నడవడులు మానవ సంబంధాలను ధ్వంసం చేశాయి. పౌరుల మధ్య విద్వేషాలను పెంచి పోషించాయి. ఏ వ్యక్తి మరో వ్యక్తిపై వాత్సల్యం చూపడం, నమ్మకం ఉంచడం అనే దశ జారిపోయింది. దేశ భక్తి మృగ్యమైపోయింది. కుటుంబ విలువలు సైతం పాతాళానికి చేరిపోయాయి. భారతీయ పౌర సమాజం స్వచ్ఛంగా, స్వేచ్ఛగా, నిజాయితీ, నిబద్ధలతో, అవినీతి రహిత నిర్మాణం జరగాలంటే రాజకీయాలు, పాలన తేటపడినప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది.

(రచయిత పల్నాడు రచయితల సంఘం అధ్యక్షులు) వీ

జర్నలిజం చేసే మంచి కూడా ఉంది

జర్నలిజంలో మంచి ఉందనీ, అందులోని లోపాలకు జర్నలిస్టులను, సంపాదకులను, మేనేజ్‌మెంట్లను మాత్రమే బాధ్యులను చేయకుండా వ్యవస్థలో వస్తున్న మార్పులను అర్థం చేసుకోవాల్సిన అవసరముందనీ అంటున్నారు టంకశాల అశోక్

జర్నలిజాన్ని, జర్నలిస్టులను కొరడాలతో కొట్టడం ఈ సరికి ఒక సంప్రదాయంగా మారింది. కారణాలు ఏమిటో అందరికి తెలిసినవే గనుక ఇక్కడ రాయనక్కరలేదు. కొందరు జర్నలిస్టులు కూడా తమను తాము కొట్టుకుంటున్నారు. తమ వృత్తిపై వస్తున్న విమర్శలతో వారు ఏకీభవించడం అందుకు కారణం. అనగా వారు ఆత్మవిమర్శ చేసుకుంటు న్నారన్నమాట. ఏ రంగానికి సంబంధించి అయినా విమర్శలు, ఆత్మవిమర్శలు అవసరమే. అట్లా అవసరమనుకోవడం ప్రజాస్వామిక స్ఫూర్తి. అందులోని ఉద్దేశం లోపాలు ఏమైనా ఉంటే సరిదిద్దుకుని తమ లక్ష్యాల కోసం బాగా పనిచేయడం.

కాని ఇటువంటి విమర్శలు, ఆత్మవిమర్శల క్రమంలో ఒక్కోసారి కొంత దారితప్పడం కూడా ఉంటుంది. ఎప్పుడైనా మంచి చెడులపై సమతులనమైన సమీక్షలు అవసరం. చెడును, మంచిని రెండింటినీ గుర్తించాలి. చెడును గుర్తించి సరిదిద్దుకోవడం ఎంత అవసరమో, మంచిని గుర్తించి ప్రోత్సహించడం కూడా అంత అవసరం. అప్పుడు బయటివారికి జర్నలిజం గురించి సవ్యమైన అభిప్రాయం ఏర్పడుతుంది. స్వయంగా జర్నలిస్టులకు ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు విచక్షణా దృష్టి ఏర్పడుతుంది. తమలోని మంచిని పెంచుకుని అవాంఛనీయ లక్షణాలను వదులుకునేందుకు తగిన అవగాహన లభిస్తుంది. ఈ వృత్తిలోకి కొత్తగా రాదలచుకున్న వారికి, మీడియా గురించి కొత్తగా తెలుసుకునే వారికి సమదృష్టి కలుగుతుంది.

కాని ఈ మౌలికమైన దృష్టిని చాలామంది విమర్శకులు కోల్పోతున్నారు. స్వయంగా వారికి కూడా మంచి చెడుల అవగాహన సరిగా లేనందున, తీవ్రమైన విమర్శలకు పరిమితమవుతున్నారు. ఒక స్థాయిలో అది ఫ్యాషన్‌గా మారింది. ఇది ఎటువంటి వాతావరణాన్ని సృష్టిస్తున్నదంటే, జర్నలిజం వల్ల చెడుతప్ప అసలు మంచి ఏమీ జరుగుతున్నట్లు లేదని పలువురు భావించే స్థితి ఏర్పడింది. అంతకన్న ప్రమాదకరం ఏమంటే, స్వయంగా జర్నలిస్టులు కూడా తమ రంగం గురించి తమకే అవగాహన లోపిస్తూ, ఆత్మన్యూనతకు లోనవుతున్నారు.

కాని, సమతులన దృష్టితో పరిశీలించినప్పుడు, జర్నలిజానికి సంబంధించి జరుగుతున్న దానిలో చెడుతో పాటు తగినంత మంచి కూడా ఉన్నట్లు అర్థమవుతుంది. ఇప్పుడు నిర్దిష్టంగా కొన్ని విషయాలు చెప్పుకుందాం. గ్రామీణ ప్రాంతానికి వెళ్లి, ఒకవేళ మీడియా అన్నది, ముఖ్యంగా పత్రికలు లేనే లేనట్లయితే అక్కడ పరిస్థితి ఏమిటన్నది ఊహించి చూడండి. అదే ప్రశ్నను గ్రామీణులలో వేర్వేరు వర్గాల వారికి వేసి చూడండి. పత్రికలు, వాటి టాబ్లాయిడ్లు గ్రామ ప్రాంతాలలో దశాబ్దాలుగా ఉన్నాయి. ఒకవేళ ఇవేవీ ఇంతకాలం లేకుండినట్లయితే, ఒకవేళ రేపటినుంచి లేకుండా పోయినట్లయితే, పరిస్థితి ఎట్లా ఉంటుందని వారిని అడగండి. ఒకవేళ మీరు గ్రామీణ ప్రాంతానికి చెందినవారైతే స్వయంగా కూడా ఊహించేందుకు ప్రయత్నించండి.

పత్రికల ద్వారా వారికి చాలా సమాచారం లభిస్తున్నది. ప్రతి సమాచారం సాధికారతే. అది తమ చుట్టూ, తమకు ప్రత్యక్షంగా సంబంధించినది అయినా కాకపోయిన, జరిగే ఘటనలు కావచ్చు. తమ జీవితాలకు సంబంధించి ప్రభుత్వ స్థాయిలో జరుగుతున్నది కావచ్చు. తమ వృత్తులకు సంబంధం ఉండి సమాజంలో జరిగేది కావచ్చు. (ఉదాహరణకు వానలు, పంటలు, విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, సబ్సిడీలు, కరెంటు, మార్కెట్లు, ధరలు వగైరాలు). ప్రభుత్వ విధానాలు, వాటి మంచిచెడులు, వాటిపై వినవచ్చే వాద ప్రతి వాదాలు, మార్పులు, అమళ్లు, అందులోని లోపాలు, వేర్వేరు చోట్ల వ్యక్తమయ్యే నిరసనలు, అధికార – ప్రతిపక్షాల తీరు తెన్నులు మొదలైనవి కావచ్చు. నేరాలు, శాంతి భద్రతలు, పౌర హక్కులు, పోలీసుల ధోరణి, అధికారుల స్పందనల వంటివి కావచ్చు.

ఈ అన్ని సమాచారాలు పత్రికల ద్వారా అందుబాటులోకి వచ్చి సాధారణ ప్రజలు సాధికారులవుతున్నారు. ఆ సమాచారాలపై ఆలోచనలు, చర్చలు చేసుకుంటున్నారు. వైఖరులు, నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మరొక స్థాయిలో పత్రికలు, జర్నలిస్టుల తీరును కూడా గమనించి తమ అభిప్రాయాలు తాము ఏర్పరచు కుంటున్నారు. ఆ విధమైన పరిజ్ఞానం కూడా సాధికారతే. సమాచారం తెలియడం, ఆలోచించుకోవడం, అందుకు అనుగుణంగా వ్యవహరించ గలగడం, ఇదంతా కలిపి ఒక చైతన్యం కావడం. ఇదే సాధికారత అంటే. పత్రికలు ఈ పాత్రను బాగా నిర్వర్తిస్తున్నాయి. తమలో లోపాలు నిజం. కాని అవి ఎట్లున్నా అంతకు అనేక రెట్లుగా మరొకవైపు మంచిని చేస్తున్నాయి. చెడు కనిపించినంత కొట్టవచ్చినట్లుగా ఈ పార్శ్వం కనిపించడం లేదు. చెడు గురించి మాట్లాడినంతగా మంచి గురించి మాటలు వినిపించకపోవడం సహజం. ఒకసారి సంయమనంగా ఆలోచించి చూస్తే మాత్రం జర్నలిజంలో కనిపిస్తున్న లోపాలకన్న అది చేస్తున్న మంచి నిజంగానే అనేకరెట్లు ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతుంది.

ఈ విషయం జర్నలిజాన్ని, జర్నలిస్టులను కొరడాలతో కొడుతున్న పట్టణ మేధావులు, ఇతర విమర్శకుల కన్న సాధారణ ప్రజలకు బాగా తెలుసు. పట్టణ మేధావులు, ఇతర విమర్శకులకు పత్రికల గురించిన కొన్ని పార్శ్వాలు తెలుసు. కాని, తమ స్థాయిలో గాక సాధారణ స్థాయిలో జీవించే జన సమూహాలకు సమాచారం రూపంలో లభిస్తున్న సాధికారత ఏమిటో, దానివల్ల నిత్య జీవనంలో కలుగుతున్న ప్రయోజనాలు ఏమిటో తెలియవు. రెండు వర్గాల మధ్య ఏ విధంగానైతే అనేక విషయాలలో ఒక పరస్పర సంబంధం లేనిస్థితి (డిస్‌కనెక్ట్) ఏర్పడుతున్నదో, పత్రికల విషయంలోనూ అదే విధంగా ఉంది. విమర్శకులు ఈ మంచిని కూడా గుర్తించి లోపాలను ఎత్తిచూపే సమతులన దృష్టిని తీసుకున్నట్లయితే

వస్తువులూ - వాటి పరిణామ క్రమం

***ఆదిమ మానవుల నుంచి ఆధునిక మానవుల దాకా వస్తువుల పరిణామ క్రమం గురించి చెబుతూ, ఆ వస్తువులు ఆయా కాలాల అవసరాల బట్టి మార్పులు చెందాయని అంటున్నారు* వి. వెంకట్రావు**

'విమానాన్ని రైట్ సోదరులు కనిపెట్టారు'. విమానాన్ని ఇప్పుడు కనిపెట్టేదేమిటి రామాయణ కాలంలోనే విమానాలు ఉన్నాయి. రావణుడు పుష్పక విమానం ఎక్కలేదా? టెలివిజన్ ఫలానా వాళ్లు కనిపెట్టారు. టెలివిజన్ కూడా మహాభారత కాలంలోనే ఉంది. ఒకపక్క కురుక్షేత్ర యుద్ధం జరుగుతుంటే, సంజయుడు రన్నింగ్ కామెంటరీ చెప్పలేదా? అదేమిటి? ఈనాడు మనం వాడుతున్న టెలివిజన్ అదే కదా? అసలు ఈ వస్తువులన్నీ మన పూర్వీకులు ఏనాడో కనిపెట్టారండి. వీటికి సంబంధించిన అన్ని వివరాలు మన వేదాల్లో ఉన్నాయి. విదేశీయులు అవన్నీ దొంగిలించేసి, వాళ్ల దేశాలు తీసుకుపోయి, ఇప్పుడు వాళ్లే కనిపెట్టి నట్లు బయట ప్రపంచానికి చూపెడుతున్నారు. అసలు ఇవన్నీ మనవే.

ఇలాంటి సంభాషణలు మనం అప్పుడప్పుడు వింటుంటాం. ఆనాడంటే పురాణాల కాలంలోనే ఇలాంటి వస్తువులు వాడకంలో ఉన్నాయా? ఆనాటి వ్యక్తులు ఈ వస్తువులు నిజంగా వాడేవారా? నిజం తెలుసుకోవాలి. ఏ వస్తువు అయినా మనుషులు తయారు చేస్తేనే తయార వుతుందనేది చాలా ప్రాథమికమైన విషయం. ఇది అందరూ ఒప్పుకొనే సత్యం. అయినప్పటికీ, వస్తువుల ఉత్పత్తికి సంబంధించిన కొన్ని విషయాలైన తెలుసుకుంటేనేగానీ, అసలు నిజం తెలియదు. పుష్పక విమానం అయినా, ఇంకో వస్తువయినా, మహిమాన్వితమైనది కాదనీ, మానవులే ఏకాలంలోనైనా తయారు చేసుకోవాలనీ, ఇలా వాస్తవ దృష్టితో అంటే, భౌతికవాద దృష్టితో ఆలోచించాలి. అలా ఆలోచించి చర్చించు కోకపోతే అసలు నిజం ఏమిటో ఎప్పటికీ తెలియదు.

అసలు రామాయణ, భారతాలు ఏకాలంలో జరిగాయి. రామాయణం త్రేతాయుగంలో, భారతం ద్వాపర యుగంలో. ఇవన్నీ యుగాల లెక్కలు. తర్కానికి దొరకని లెక్కలు. ఇవి కచ్చితంగా ఫలానా కాలంలో అని చెప్పలేం. రామాయణ, భారతాలు అసలు జరిగాయా, లేదా అనేది అనవసరం. కాసేపు జరిగాయనే అనుకుందాం. అయితే ఏకాలంలో జరిగాయి. కాలాన్ని లెక్కకు తీసుకునేది క్రీస్తు శకం నుండే. అంతకు ముందు జరిగిపోయిన కాలాన్ని క్రీస్తు పూర్వం అంటారు. క్రీస్తు పూర్వం గురించి వెనక్కి వెళ్లాలంటే, ఎంతయినా వెనక్కి వెళ్లవచ్చు. ఆ వెళ్లడానికి అంతు ఉండదు. ఈ రామాయణ, భారతాలు తీసుకుంటే ఎప్పుడో అప్పుడు క్రీస్తు పూర్వం అనే అనుకుందాం. అంటే, క్రీస్తు పూర్వం ఈ వస్తువులు ఉన్నాయా అన్నది ప్రశ్న?

పరిస్థితి ఒక విధంగా ఉంటుంది. ఉపయోగకరం అవుతుంది. విమర్శ అన్నది తన పాత్రను సక్రమంగా నిర్వర్తించినట్లు అవుతుంది. కాని అట్లా జరగడం లేదు. పైన అన్న డిస్‌కనెక్ట్ వల్ల వీరు క్రమక్రమంగా ఒక ఊహాలోకంలోకి వెళ్లిపోతున్నారు. అందువల్ల జరుగుతున్న మేలు ఏమిటో ఇన్నేళ్లలోనైతే కనిపించలేదు. లోపాల గురించి సాధారణ ప్రజలు ఎత్తి చూపుతున్నది తక్కువ కాదు. కాని వారిది మంచి చెడులు రెండింటినీ గుర్తించే సంయమనం, సమతులనం. అందులో నెగెటివిజం ఉండదు.

కనుక, పత్రికలు లేని తమ ప్రపంచాన్ని ఊహించి చెప్పమంటే అది వారికి అంతుపట్టడం కూడా కష్టం. వారిలో ఎవరైనా సరే గత కొద్ది దశాబ్దాలు మీడియా విజృంభణ కాలాన్ని సావధానంగా సమీక్షించుకుంటే, పత్రికలు అందుబాటులో ఉండడం, జర్నలిస్టులు తమ చుట్టూ ఉండడం వల్ల కలుగుతూ వచ్చిన మేలేమిటో తేలికగా చెప్పగలరు. అందుకే మనకు వారి నుండి తరచు వినిపించే మాట 'పేపరోళ్లకు చెప్తాం' అన్నది. గ్రామాలలో ప్రభుత్వం రెవెన్యూ, పోలీస్, ఫారెస్ట్, వ్యవసాయ అధికారులు. అదే పద్ధతిలో తమకు మంచికి చెడుకు వెంట నిలిచేపని, ఈ అధికారుల నుంచి రక్షణగా నిలిచే పాత్రను పత్రికలు చాలా నిర్వహిస్తున్నాయి. అవి ఇచ్చే సమాచారమే ఒక సాధికారత కాగా, అవి నిర్వహించే క్రియాశీల పాత్ర ఒక పెద్ద అండవంటిది. పత్రికల్లో లోపాలున్నాయని పైన చెప్పుకున్నాం. కాని అవి ఉండి కూడా సాధికారతనివ్వడం, అండగా నిలవడం కాదనలేనివి.

నిజానికి ఈ అంశంపై ఎవరూ క్షేత్రస్థాయిలో, సూక్ష్మ స్థాయిలో అధ్యయనాలు చేయడం లేదుగాని, పత్రికల వల్ల వివిధ తరగతుల గ్రామీణులకు కలుగుతున్న సాధికారత ఏమిటి? జరుగుతున్న మేలేమిటి? అని ఎవరైనా పరిశీలిస్తే, పత్రికలు చేస్తున్న మంచి గురించి గొప్ప దృశ్యం ఆవిష్కారమవుతుంది. జర్నలిజం శాఖలు, ఆ రంగానికి సంబంధించిన వివిధ సంస్థలు ఏవైనా ఈ పనిచేస్తే బాగుంటుంది.

పోతే, విమర్శకులు సరిగా చూడని విషయం మారొకటి ఉంది. జర్నలిజంలోని లోపాలను విమర్శించడం, జర్నలిస్టులనూ మేనేజ్‌మెంట్లను విమర్శించడం వరకు సరే. ఇందులో సంతోషించవలసింది ఏమంటే ఈ లోపాలకు కారణం జర్నలిస్టులు, ఎడిటర్లు మాత్రమే కాదని, మేనేజ్‌మెంట్ల పాత్ర కూడా ఉందని వారు గుర్తిస్తున్నారు. కాని దీనంతటికి వెనుక వ్యవస్థలో గల పరిస్థితులు, అందులో వస్తున్న మార్పులు కూడా కారణమవుతున్నాయని ఇంకా వారి దృష్టికి రావడం లేదు. ఇందుకు మినహాయింపులైన విమర్శకులు కొద్ది మంది మాత్రమే. ఇది కూడా సరిగా విమర్శకుల దృష్టికి, సాధారణ ప్రజల దృష్టికి రావలసిన అవసరం ఉంది. జర్నలిజం శాఖలు, సంస్థలు, సీనియర్ జర్నలిస్టులు ఈ ప్రయత్నం చేయాలి. ఈ కోణం కూడా ముందుకు వచ్చినప్పుడు తప్ప లోపాల గురించి సమగ్రమైన అవగాహన కలగదు. జర్నలిజం చేస్తున్న మంచి ఏమిటనేదే గాక, ఇంకా చేయగల మంచి ఏమిటో కూడా ఆ విధంగా గుర్తించి ప్రోత్సహించడం జరగవలసిన పని.

(రచయిత సీనియర్ జర్నలిస్ట్) వీ

కాలానికీ, ఈ చర్చకీ సంబంధం ఏమిటీ అనుకోవచ్చు. కానీ, సంబంధం ఉంది. ఈ రోజు మనం వాడుతున్న వస్తువులు ఒక వంద, రెండు వందల సంవత్సరాల క్రితం లేవు. రెండు వందల సంవత్సరాల క్రితం వాడే వస్తువులు ఒక వెయ్యి సంవత్సరాల క్రితం ఉండవు. ఒక వేళ ఉన్నా, అవి అనేక మార్పులకు లోనయ్యి, వేరే రూపంలో ఉంటాయి.

సమాజం లాగే వస్తువులు కూడా, మనుషుల వాడకం కోసం, మనుషుల చేత తయారు చేయబడి, తమలోని అనేక వైరుధ్యాలను పరిపూర్ణం చేసుకొని, ఇంకా మెరుగైన, ఇంకా ప్రయోజనకరమైన రూపం లోనికి రూపాంతరం చెందుతాయి. అంటే మానవ శ్రమతో, తయారు చేసిన ఈనాటి మనం చూస్తున్న, మనం వాడుతున్న వస్తువుల రూపం లోనికి మార్పు చెందుతాయి. ఈనాడు మనం చూస్తున్న ప్రతి వస్తువుకి ఒక చరిత్ర ఉంటుంది. అది అనేక దశల్ని దాటుకుంటూ, ఈనాటి ఈ స్థితికి చేరుకుంది. మనం కూర్చున్న కుర్చీనే తీసుకుందాం. అది ఈనాడు ఉన్న ఈ రూపంలో ఒక వెయ్యి సంవత్సరాల క్రితం ఉండి ఉండదు.

'ఒక మాంత్రికుడు మంత్రదండంతో ఒక్కసారి గాల్లో తిప్పి, ఏదో మంత్రం చదివితే, అక్కడ ఒక అయిదు అంతస్తుల భవనం ప్రత్యక్షమైంది' అని ఒక కథలో ఇప్పుడు ఎవరూ రాయరు. రాసినా ఎవ్వరూ నమ్మరు. అలాంటి సంఘటనలు ఈనాడు ఎక్కడా జరగవనీ, అది అసాధ్యమైన విషయం అని అందరికీ తెలుసు. కానీ, ఈ కాలంలో సాధ్యం కానివి ఆ కాలంలో సాధ్యమేనేమో అని నమ్మేవాళ్లు ఉన్నారు. అలాంటి వాదోపవాదాలు జరుగుతున్నాయి. అలాంటి వస్తువులు మన పూర్వీకులు వాడేవారనీ వాటికి సంబంధించిన అన్ని వివరాలూ మన వేదాల్లో ఉన్నాయనీ కొంతమంది వాదిస్తూనే వుంటారు.

అందుకే వస్తువుల తయారీకి సంబంధించిన చరిత్ర కొంతయిన తెలుసుకోవాలి. ఉదాహరణ తేలిగ్గా ఉండడం కోసం కర్ర కుర్చీనే తీసుకుందాం. ఏ వస్తువు తయారు చేయాలన్నా ముడి పదార్థాలూ, పనిముట్లూ, శ్రమ చేయడానికి మనుషులూ సిద్ధంగా ఉండాలి. ఈ మూడు వస్తువులూ ఉంటేనే ఏ వస్తువు అయినా తయారవుతుంది. ఇందులో ఏ వస్తువు లేకపోయినా, వస్తువు తయారుకాదు.

మన కుర్చీ ఉదాహరణలో కుర్చీకి ముడి పదార్థం ఏది. బల్ల చెక్కలూ, ఇనప మేకులూ. ఇక పనిముట్లయితే రంపం, సుత్తిలాంటివి. ఇవన్నీ ఎక్కడ నుండి వస్తాయి. అంటే, అవి అంతకుముందే తయారయి సిద్ధంగా ఉండాలి. అంటే, ఇనపమేకులూ, సుత్తీ, రంపం అప్పటికే ఉన్నాయి. అంటే, అప్పటికే ఇనుము సమాజంలో ఉండాలి. లోహయుగం ప్రారంభం అయిన తర్వాతే ఆ వస్తువులు వాడకంలో ఉంటాయి. లోహ యుగానికి ముందు ఆ వస్తువులు వాడినట్లు ఎవరైనా రాస్తే, అది ఊహ మాత్రమే అవుతుంది. పనిముట్లు ఉంటేనే, వాటి సహాయంతో ఏ వ్యక్తి అయినా కుర్చీ తయారు చేయగలడు.

ఎక్కడైనా ఏ దేశంలోనైనా, ఎంత చిన్న వస్తువైనా, ఎంత పెద్ద వస్తువైన ఇవి ఉండవలసిందే. వాహనాలు నడవాలంటే, ప్రధానంగా ఇంధనం ఉండాలి. పెట్రోల్, డీజిల్ లాంటివి. పెట్రోల్ ఎక్కడి నుండి వస్తుంది. అది భూమి లోపల ఉంటుంది. దాన్ని వెలికితీసి, శుద్ధిచేసి ఇంకా అనేక రకాల మార్పులు చేసి పెట్రోల్‌ను వాడకానికి సిద్ధం చేయాలి. అంటే, అప్పటికే పెట్రోల్ భూమి లోపల ఉంటుందనీ, దానికి మండే గుణం ఉంటుందనీ, దాన్ని ఇంధనంగా ఉపయోగించుకోవచ్చనీ, ఇవన్నీ ఆనాటి మనుషులకు తెలిసి ఉండాలి. వాహనాల కన్నా ముందు, వాటితో దీపాలు వెలిగించుకోవచ్చు. దీపాల వాడకం కొన్నాళ్లు జరిగిన తర్వాత, దాన్ని వాహనాలకి కూడా ఉపయోగించుకోవచ్చుననీ తెలుసుకొని ఉండవచ్చు.

ఇలాంటివన్నీ నిత్యజీవితంలో అనేక అనుభవాల ద్వారా, అనేక ఆలోచనల ద్వారా, ఒకరి ద్వారా ఒకరికి అంది, అందులో ఇంకా ఇంకా అనేక అభివృద్ధికరమైన మార్పులు జరిగి నూతన వస్తువుల ఆవిష్కరణ జరుగుతుంది. అంతే తప్ప ఒక్కసారిగా ఏ వస్తువూ ఆకాశంలో నుండి ఊడిపడదు. మంత్రాలకు చింతకాయలు కాదు కదా చింత ఆకు కూడా రాలదు.

ఇప్పుడు మనం విమానం వద్దకు వద్దాం. మన పురాణాల్లో ఉపయోగించిన విమానం గాల్లో ఎగురుతుంది. విమానం తయారు కావాలంటే తేలికపాటి లోహం ఉండాలి. ఇంకా ఇంధనం ఉండాలి. ఇంకా అనేక రకాలైన ఇతర సామగ్రి ఉండాలి. విమానం తయారికి కావలసిన చిన్న బోల్ట్ లేకపోయినా విమానం తయారుకాదు. ఒక చిన్న కుర్చీ విషయంలోనే ఇంత గతం ఉంటే, మరి విమానం సంగతి.

విమానం తయారు చేయడానికి ఎన్ని రకాలైన ముడి పదార్థాలు కావాలి? ఎన్నిరకాలైన పనిముట్లు కావాలి? ఎంత టెక్నాలజీ కావాలి' అదంతా ఆనాటికే అంటే క్రీస్తు పూర్వం నాటికే ఉందా? ఒక్క ఇంధనాన్నే తీసుకుంటే, రామాయణ కాలంలో వాహనాలు ఎలా నడిచాయి. అప్పుడు ఉన్న వాహనాలు అన్నీ గుర్రపు బళ్లూ, ఎద్దుల బళ్లూ, మనుషులు మోసే పల్లకీలు. ఇలా ఆనాటి మానవుల, జంతువుల శ్రమశక్తే ఇంధనంగా వాడారు. ఏ కిరసనాయిలు లాంటివి ఆనాడే ఉన్నాయి అనుకున్నా, అవి దీపాలకి మాత్రమే వాడారు అనుకోవాలి. అంతే తప్ప వాహనాలకి వాడలేదు.

అలాంటిది విమానం నడపడానికి ప్రధానమైన ఇంధనమే లేకుండా, పుష్పకవిమానం గాల్లో ప్రయాణించిందని రాస్తే, అది వాస్తవ మవుతుందా? ఒక్క ఇంధనమే లేనప్పుడు, విమానం తయారికి కావలసిన ఇతర వస్తువుల మాటేమిటి. అవి ఆనాడు ఉన్నాయా? 'అవి కూడా ఉన్నాయేమో' అని ఊరికినే అనేస్తే సరిపోదు. ఇతర వస్తువులకు ఆ ముడి పదార్థాలు కాని వేరే వేరే వస్తువులకు ఉపయోగిస్తూ ఉండాలి. ఇంధనాన్నే తీసుకుందాం. అప్పటికే నేలమీద నడిచే మోటారు వాహనాలూ, ఇంకా పెట్రోల్ ఉపయోగించే ఇతర వస్తువులూ ఆనాటికే వాడకంలో ఉండాలి. అలా ఉంటే అందులో కొంతన్నా నిజం ఉంటుంది.

అది ఎలా అంటే, అప్పటికే ఇంధనం బళ్లు నడపడానికి వాడకంలో ఉందనుకుందాం. 'ఆ ఇంధనంతో వేరే వేరే వాహనాలు కూడా నడపవచ్చు' అనే ఆలోచన వస్తుంది. అది క్రమంగా గాల్లో లేచే వాహనానికి కూడా వాడవచ్చునేమో అనే కొత్త ఆలోచన కలిగి, ఆ ఆలోచన కొత్త ప్రయోగాలు చేయడానికి అవకాశం కల్పిస్తుంది. కొత్త ఆలోచనలకు నాంది పలకడానికి కావలసిన బేసిక్ పరిస్థితులు అప్పటికే ఉండడం జరిగితేనే, నూతన వస్తు ఆవిష్కరణ జరుగుతుంది. అసలు ఇంధనమే ఆనాటి సమాజానికి ఇంకా పరిచయం కాకపోతే, ఇక ఇంధనంతో కొత్త ప్రయోగాలు ఎలా జరుగుతాయి.

అసలు విమానానికి ప్రాథమిక రూపం బెలూన్లు. ఆ బెలూన్‌లో ఉష్ణ వాయువుని నింపి, అవి గాల్లో ఎగారేసేవారట. ఉష్ణ వాయువు ఊర్ధ్వ ముఖానికి, శీతల వాయువు అధో ముఖానికి ప్రయాణం చేస్తాయనే చిన్న విషయం గ్రహించి, ఆ సూత్రం ఆధారంగా అనేక ప్రయోగాలు చేశారు. అలాంటి ఎన్నో ప్రయోగాల ఫలితమే విమానం. ఏ వస్తువు సంగతైనా ఇంతే. దాని వెనుక ఎంతో కథ ఉంటుంది.

ఒక్క ఇంధనం సంగతే ఇది. మరి విమానం తయారికి కావలసిన ఇతర ముడి పదార్థాల మాటేమిటి? విమానం తయారికి కరెంటు కూడా అవసరమేననుకుందాం. ఆనాటికే కరెంటు ఉందా? ఉంటే బల్బులూ, ఫేనులూ వాడేవారా? లేదు అనే విషయం వేరే చెప్పనవసరం లేదు.

అసలు కరెంటే లేనపుడు, కరెంటు సహాయంతో వేరే వస్తువులు చేయవచ్చుననే ఊహ ఎలా కలుగుతుంది? ఎప్పుడైనా, ఎక్కడైనా ఊహలకీ, నూతన ఆవిష్కరణలకీ కావలసిన బేసిక్ పరిస్థితులు ఆనాటికే ఉండి ఉండాలి. అలా ఉంటేనే కొత్త ఆలోచనలకు తగిన పునాది ఏర్పడి, కొత్త వస్తువులు తయారవుతాయి.

అంతే కాకుండా ప్రతి వస్తువుకి ఒక ఫార్ములా ఉంటుంది. అంటే ఆ వస్తువు ఎలా పనిచేస్తుందో, దానికి సంబంధించిన గణిత సూత్రాలూ, సైన్సు సూత్రాలూ ఉంటాయి. మన పురాణాల్లో వాడారని చెపుతున్న వస్తువులకు అలాంటి ఫార్ములా ఉందా? మన పురాణాల్లో ఒక పుష్పక విమానమే కాదు, టెలివిజన్ ఉంది. దివ్య దృష్టి ఉంది. ఎగిరే చాపలూ, కీలుగుర్రాలు, కాలికి లేపనాలు పూసుకుని గాల్లో ఎగరడం, ఇక్కడ మాయమై అక్కడ ప్రత్యక్షం కావడం, వరాలు, శాపాలు ఇంకా చాలా చాలా ఉన్నాయి.

ఇది సైన్సు వ్యాసం కాదు. ఏ వస్తువు ఎలా పనిచేస్తుందో, ఆయా రంగాల్లో ఉన్న వ్యక్తులు, సైన్సు బాగా తెలిసిన వాళ్లు బాగా చెప్పగలరు. ప్రతి వస్తువూ అనేక దశల గుండా ప్రయాణించి, ఉన్నత దశకు చేరుకుంటుందనీ, ఆయా మార్పులకు మనుషుల మేధా, శారీరక శ్రమలే కారణమనీ, ఏ వస్తువూ ఒక్కసారిగా ఆకాశం నుండి ఊడిపడదనీ చెప్పడమే ఈ వ్యాసం ఉద్దేశం.

టెక్నాలజీ ఆధునికుల సొంతమా?

ఆధునిక టెక్నాలజీ అంతా ఈ కొత్తతరం సొంతమనీ, పాతతరం వాళ్లకు టెక్నాలజీ గురించి ఏమీ తెలియదనీ ఈనాటి యువతలో ఒక అభిప్రాయం ఉంది. పాత రేడియోలూ, గ్రామఫోన్ రికార్డ్ లాంటివి చూస్తే యువత హేళన చేస్తుంటారు. కానీ, అది చాలా తప్పు. టెక్నాలజీ అనేది ఎప్పుడూ ఉంది. మానవజాతి పుట్టుక ఏనాడైతే జరిగిందో, చతుష్పాదుడైన మానవుడు, రెండుకాళ్ల మీద ఏనాడైతే నడవగలుగుతున్నాడో, ప్రకృతిలో ఏది దొరికితే అది కాకుండా, తన శ్రమతో ఏనాడైతే ఆహార పదార్థాలని సమకూర్చుకోగలుగుతున్నాడో, ఆనాడే టెక్నాలజీ ప్రారంభమైనది. కాకపోతే అది ప్రాథమిక రూపాలతో, మొదటి అడుగులతో ప్రారంభమైంది.

రుబ్బురోలు, గ్రైండరుగా మారడమే టెక్నాలజీ కాదు. రుబ్బురోలు కూడా టెక్నాలజీయే. ఒక పెద్దరాయి మధ్యలో కన్నంలాగా చేసి, అందులో మరో రాయి ఉంచాలనీ, ఆ రెండురాళ్ల సహాయంతో గింజల్ని గుండలాగా చేసుకోవచ్చని తెలుసుకోవడం కూడా టెక్నాలజీయే. పుట్టు చెముడు అయినా తన తండ్రిపై ఎంతో ప్రేమతో, చెవిటి మిషన్ కనిపెడదామని ఒక వ్యక్తి ఎంతో ప్రయత్నించాడు. మానవ చెవి నిర్మాణం ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి, అర్ధరాత్రి శ్మశానానికి వెళ్లి, పాతిపెట్టిన శవాన్ని బయటకు తీసి, కోసి చూశాడట. ఆ విధంగా ఎంతో శ్రమ కోర్చి, మరెన్నో ప్రయోగాలూ చేసినా, చెవిటి మిషన్ కనుక్కోలేక పోయాడట. కానీ, ఆ ప్రయత్నంలో టెలిఫోన్ కనుక్కున్నాడు. అతడే గ్రాహంబెల్. (టెలిఫోన్ కథ)

ఇలాంటి అనుభవాలు నూతన వస్తు ఆవిష్కరణలో ఎన్నో జరిగాయి. జరుగుతుంటాయి. ఇలాంటి వాటికి ఈ దేశం, ఆ దేశం అని లేదు. అన్నీ దేశాల్లోను జరుగుతుంటాయి. కొన్ని సంఘటనలూ, కొన్ని అనుభవాలూ బయటకు వస్తాయి. కొన్ని రావు. వ్యక్తుల దగ్గరే ఆగి పోతాయి. ఫలితం మాత్రం బయటకు కనిపిస్తుంది. చరిత్రకెక్కదు. పాత లేకపోతే కొత్తలేదు. గతం లేకపోతే వర్తమానం లేదు. వర్తమానం లేకపోతే భవిష్యత్తు లేదు.

టెలిఫోన్ లేకుండా సేల్‌ఫోన్ లేదు. టెలిఫోన్‌కి అభివృద్ధి చెందిన రూపమే సెల్ ఫోన్. ఇదంతా వస్తువుల పరిణామ క్రమ చరిత్ర. అంతా ఒక క్రమంలో అంచెలంచెలుగా జరగాలి. అంతే తప్ప అభివృద్ధి చెందిన రూపాన్ని గతకాలంలో చూడలేం. క్రీస్తు పూర్వమే ఫ్రిజ్‌లు వాడినట్లు, 70,80 ఏళ్ల క్రితం సినిమాల్లో సెల్‌ఫోన్‌లు వాడినట్లు చూపిస్తే అది ఊహ అవుతుంది తప్ప వాస్తవం కాదు.

ఈనాడు ఏ కొత్తవస్తువు కనిపెట్టినా, ఆ వస్తువు మన పురాణకాలంలోనే ఉన్నదని వాదిస్తే, దానికి అర్థం లేదు. ఊహలు ఎన్నయినా చేసుకోవచ్చు. ఎందుకంటే ఊహలకి అంతూ దరీ ఉండవు. ఇలాంటి అభూత కల్పనలతో కూడిన కథలు మన దేశంలోనే కాదు, అన్ని దేశాల జానపద కథల్లోనూ ఉన్నాయి.

ఉదాహరణకు ఉక్రెయిన్ జానపద కథల్లో అయితే, గాల్లో ఎగిరే ఓడలూ, ఒక్క అంగలో భూమండలం అంతా దాటేవాళ్లూ, వంద మైళ్ల దూరంలో ఉన్న పక్షుల్ని కూడా గురిచూసి బాణంతో వేటాడే వాళ్లూ, పీపాలకు పీపాలకు తాగేవాళ్లూ ఇలా రకరకాలుగా ఉన్నాయి. (ఉక్రెయిన్ జనపద గాథలు)

ఆఫ్రికన్ జానపద కథల్లో అయితే, సూర్యుడికి ఒక కూతురు ఉంటుంది. ఆమె ఆకాశంలో ఆడుకుంటుంటుంది. గ్రహాలతో బంతాట ఆడుకుంటుంది. అలా ఆమె మన భూగ్రహాన్ని కూడా చూసి ముచ్చట పడుతుంది. (ఆఫ్రికన్ జానపద కథలు)

ఇక అరేబియన్ నైట్స్ కథల్లో, అల్లాఉద్దీన్ అద్భుతదీపం కథ మనకు తెలిసిందే. దీపం రుద్దితే భూతం ప్రత్యక్షమై కోరిన కోరికలు తీరుస్తుంది. ఇలాంటి కోరికలు తీర్చే వస్తువులు మనకీ ఉన్నాయి. అక్షయ పాత్రలూ, కామధేనువులూ ఎన్నిలేవు.

భవిష్యత్ రోజుల్లో అలాంటి అద్భుత దీపం మన భారతీయులు ఎవరైనా కనుక్కున్నారనుకుందాం. దాన్ని చూసీ ఏ అరబ్బు దేశం వాళ్లో, 'అబ్బే! ఇది మా అల్లాఉద్దీన్ కథలో ఏనాడో ఉంది. కావాలంటే మా పురాతన కథలు చూసుకోండి. ఇవాళ మీరు కొత్తగా కనుగోనేదేమిటి' అన్నారనుకుందాం. అప్పుడు మనకి ఎలా ఉంటుంది.

అయితే పురాతన కథల్లో కల్పనలు ఎందుకున్నాయి?

ఆదిమ మానవునికి కంటికి కనిపించే ప్రకృతి అంతా వింతగానే ఉంటుంది. హఠాత్తుగా పెద్ద శబ్దంతో ఉరుములూ, కళ్లు మిరిమిట్లు గొలిపే కాంతితో మెరుపులూ, బలమైన చెట్లను సైతం నేలకూల్చే ఈదురు గాలులూ, తుఫానులూ, అగ్ని పర్వతాలూ, హఠాత్తుగా అడవులు తగలబడి పోవడాలూ ఇలా ప్రతీది అద్భుతమే. మానవుని కంటే ప్రకృతి ఎంతో బలమైనదీ, వింతైనదీ. అందుకే ప్రకృతిని జయించాలానే కోరిక చాలా బలంగా ఉంటుంది.

ఈ గాలిని బంధిస్తే బాగుండును. ఈ నదుల్ని అడ్డుకుంటే బాగుండును. (శివుడు తన జటాజూటంలో గంగను బంధిస్తాడు.) తుఫాను లాంటి ప్రకృతి బీభత్సాలు ముందుగా తెలిస్తే బాగుండును. ప్రకృతి జయించాలన్న కోరిక వాస్తవంలో తీరక, వాటిని కథల రూపంలో చెప్పుకొని ఆనందపడతాడు. వాస్తవంలో జరగని వాటిని, ఊహల్లో జయించి తృప్తిపడతాడు. అందుకే ఆనాటి కథల్లో అలాంటి కల్పనలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. అది ఎంత మాత్రమూ తప్పు కాదు. ఊహల్ని నిజం చేసుకునే ఫలితమే నదులకు ఆనకట్టలు కడ్డడం, తుఫాను హెచ్చరిక లాంటివి. అంతే తప్ప అలాంటి కల్పనలు ఆనాడు నిజంగా ఉన్నాయని కాదు.

(రచయిత దర్జీ) వీ

'ఒక హిజ్రా ఆత్మకథ' - రాజ్యాంగ నైతికతా పాఠం

సెక్సువల్ మైనారిటీల హక్కులను గుర్తించడం, పరిరక్షించడం భారత రాజ్యాంగ నైతికతలోనూ, ప్రజాస్వామిక సంప్రదాయంలోనూ భాగమంటున్నారు **కల్పన కన్నబిరాన్**

నైతిక చట్రంగా రాజ్యాంగం

'ట్రాన్స్‌జండర్ కమ్యూనిటీ సభ్యులు గురయ్యే యాతన, వేదన, బాధలను సమాజం చాలా అరుదుగా గుర్తిస్తుంది, గుర్తించాలనే శ్రద్ధ కూడా చూపించదు. ముఖ్యంగా ఎవరి శారీరక లైంగికతను వారి మనసూ, శరీరం కూడా తమవి కావని తిరస్కరిస్తాయో వారి లోలోపలి అనుభూతులను సమాజం హర్షించదు. ట్రాన్స్‌జండర్ కమ్యూనిటీని మన సమాజం అవహేళన చేస్తుంది. నిందిస్తుంది. తిడుతుంది. రైల్వే స్టేషన్లు, బస్‌స్టాండులు, పాఠశాలలు, పనిచేసే ప్రదేశాలు, పెద్ద దుకాణాలు, సినిమాహాళ్లు, ఆసుపత్రులు మొదలైన బహిరంగ ప్రదేశాలలో వాళ్లను పక్కకు నెట్టేస్తారు. అంటరాని వాళ్లుగా చూస్తారు. సమాజం భిన్న అస్తిత్వాలను, వ్యక్తీకరణలను ఆమోదించి అక్కున చేర్చుకోదు. మనం మార్చాల్సిన ఆ ఆలోచనా ధోరణి తన నైతిక ఓటమి అనే వాస్తవాన్ని సమాజం మర్చిపోతుంది'.

(సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా ఇన్ నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా అండ్ అదర్స్, రిట్ పిటిషన్ (సివిల్) నం.604 ఆఫ్ 2013, పేరా 1)

సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పుకి మూడు ఏళ్ల ముందు నాజ్ ఫౌండేషన్ తీర్పులో ఢిల్లీ హైకోర్టు రాజ్యాంగానికి ఒక కొత్త వ్యాఖ్యానాన్ని ఆవిష్కరించింది. సెక్సువల్ మైనారిటీల (లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జండర్, క్వీర్ వ్యక్తులు) హక్కులు ఇప్పుడు వివక్ష, అణచివేత, సాంఘిక వెలి, స్వేచ్ఛా నిరాకరణ అనే వాటి గురించీ, స్వేచ్ఛ గౌరవాల అర్థాల గురించీ సామాన్య అవగాహన కలిగించే దారి దీపాలు అయ్యాయి. ప్రజలందరి మానవహక్కులను, వారి సెక్సువల్ ఓరియంటేషన్‌తో, జండర్ అస్తిత్వంతో సంబంధం లేకుండా దేశీయ ప్రభుత్వాలు గౌరవించి రక్షించి వారి అనుభవంలోకి తేవాలని అంతర్జాతీయ మానవహక్కుల స్థాయిలు విస్తరించి, వివిధ దేశాలు గౌరవించాల్సిన తప్పనిసరి ఒప్పందంగా చాలా వివరంగా చెప్పిన మాటలే ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టులకు మార్గదర్శకాలయ్యాయి. బాబాసాహెబ్ అంబేద్కర్‌ని పేర్కొంటూ, ఆయన మాటలను గుర్తుచేస్తూ కోర్టు పబ్లిక్ నైతికతకు వ్యతిరేకంగా రాజ్యాంగ నైతికతను ఎత్తిచూపవలసిందిగా ప్రభుత్వాన్ని కోరింది. 'భారత రాజ్యాంగం భిన్నత్వాన్ని గుర్తిస్తుంది. రక్షిస్తుంది. ప్రాధాన్యతనిస్తుంది. కేవలం వారి సెక్సువల్ ఓరియంటేషన్ కారణంగా హోమోసెక్సువల్స్‌ని నిందిస్తూ ముద్రవేయడం, నేరస్తులుగా చూడడం అనేది రాజ్యాంగ నైతికతకు విరుద్ధం' (పేరా 80).

కోర్టు ఇంకా ముందుకెళ్లి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15ని

ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల హక్కుల బిల్లు ఆమోదం

ట్రాన్స్‌జెండర్ (లింగాతీత) వ్యక్తుల విద్యా, ఉద్యోగ, భద్రత హక్కులను పరిరక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలని కోరుతూ తమిళనాడుకు చెందిన తిరుచ్చి శివ ప్రవేశపెట్టిన ప్రైవేట్ సభ్యుడి బిల్లును ఏప్రిల్ 24న రాజ్యసభ ఆమోదించింది. ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు ప్రభుత్వ లెక్కల ప్రకారం ఐదు లక్షల మంది ఉండగా, వాస్తవంగా 20-25 లక్షలు ఉన్నారనీ, వారు అసమానతను, వివక్షను, అవమానాన్ని ఎదుర్కొంటున్నారనీ, వారి రక్షణ కొరకు ఇటువంటి చట్టం కావాలనీ శివ అన్నారు. భాజపా సభ్యులు ముందు వ్యతిరేకించినప్పటికీ ప్రభుత్వం తరపున ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఇటువంటి చట్టం తేవాలని ప్రభుత్వం కూడ ఆలోచిస్తున్నదని అనడంతో మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందింది.

'ఏ పౌరులైనా ఇతరులను కులం, లింగం, ఇతర ప్రత్యేక కారణాల వల్ల బహిరంగ స్థలాలను వినియోగించుకోకుండా నిరోధించరాదనే' దానిలోని సెక్స్ (లింగం) అనే పదం కోర్టు దృష్టిలో స్త్రీ, పురుషులకు మాత్రమే వర్తించదు, సెక్సువల్ మైనారిటీలందరికీ వర్తిస్తుంది, వారిలో ట్రాన్స్‌జండర్లు ముఖ్యమైన భాగం అని కూడా చెప్పింది. సెక్సువల్ ఓరియంటేషన్, జండర్ అస్తిత్వాలను అర్థం చేసుకోడానికి ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల ప్రకటనను అన్వయిస్తూ హైకోర్టు తన తీర్పులో మూడు విధాలైన రక్షణలను ముందుకు తెచ్చింది. అవి ఎ) వివక్షారాహిత్యం బి) ప్రైవేట్ హక్కుల రక్షణ సి) సెక్సువల్ ఓరియంటేషన్ జండర్ అస్తిత్వాలతో సంబంధం లేకుండా అందరికీ ప్రత్యేక, సాధారణ మానవహక్కుల రక్షణకు హామీ ఇవ్వడం.

(నాజ్ ఫౌండేషన్ అండ్ అదర్స్ వర్సెస్ గవర్నమెంట్ ఆఫ్ ఎన్‌టిసి ఆఫ్ ఢిల్లీ అండ్ అదర్స్, 2009 (160) ఢిల్లీ లా టైమ్స్ 277)

వివక్షారాహిత్యం, స్వేచ్ఛ అనేవి రాజీపడకూడనివి అనే భావనే రాజ్యాంగానికి పునాదిగా ఉంది. అది రాజ్యాంగ నైతికతా భావన. మన సమాజంలో 'సహజంగా' ఏర్పడి ఉన్నవికావు. తప్పనిసరిగా పౌరులందరూ మినహాయింపు లేకుండా అలవర్చుకోవలసినవి. సెక్సు మీద ఆధారపడిన వివక్షా రాహిత్యం కీలకమైన రాజీలేనని హక్కు. దాని గురించి హేతుబద్ధం కాని అభిప్రాయాలు అభ్యుదయ శక్తుల నుంచి వచ్చినా 'తప్పనిసరిగా అలాగే వస్తాయి'. ఈ హక్కు వాటినెదుర్కొని నిలబడాలి. రాజకీయమైన రాడికలిజం ఎప్పుడూ తీవ్రోన్మాదపూరిత సంప్రదాయ శక్తులతో సుఖంగా ఇమిడిపోతూ జతకడుతుంది. ముఖ్యంగా

స్త్రీ పురుషుల లైంగిక కలయిక మీద ఆధారపడిన పితృస్వామ్యం, జండర్ ఆధిపత్యాల విషయంలో వారిద్దరివీ ఒకే అభిప్రాయాలవుతాయి.

గౌరవంగా శారీరక సమగ్రతతో జీవించడానికున్న రాజ్యాంగహక్కు హిజ్రా హక్కు కూడా!

సాహిత్యం మానవ అనుభవాలకు కిటికీలు తెరుస్తుంది. జస్టిస్ స్టీవెన్ బ్రెయిర్ చెప్పినట్లు సాహిత్యం మన అనుభవాలకూ, వాటికి పూర్తిగా భిన్నంగా ఉండే అనుభవాలకూ మన మనసులను తెరుస్తుంది. అలా చేయడం ద్వారా మన ఆలోచనా దిగంతాలను, అవగాహనను, సహానుభూతులను లెక్కించలేనంతగా విశాలం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. సాహిత్యం మన మేధాపరమైన చెరసాలల నుంచి మనల్ని విముక్తం చేస్తుంది. పద్ధతుల గురించి, నీతి గురించి, ఏది సరైన ప్రవర్తన అనుకుంటామో దాని గురించి, మానవత్వం గురించి మనకున్న ప్రాథమిక ఊహలను కూలగొడుతుంది. అందువల్లే సాహిత్యం చాలా తీవ్రమైన దాడులకు, అసహనానికీ గురవుతుంది. ఈ అసహనం అతి వేగంగా రచన నుంచి రచయిత శరీరానికీ, జీవితానికీ వ్యాపిస్తుంది. రచయిత ఆధిపత్య సాంఘిక గ్రూపుకు చెందకుండా, పురుషుడు కాకుండా ఉన్నట్లయితే ఈ అసహనం ప్రకటించే పద్ధతులు మరింత తీవ్రంగా ఉంటాయి. సెక్సువల్ మైనారిటీల పైనా స్త్రీలపైనా ఈ దాడులు ఎప్పుడూ వ్యక్తిగతంగా, వాయురిస్టిక్‌గా ఉంటాయి. రచయిత గౌరవం, ప్రైవసీ హక్కుల పట్ల వీటికి ఏమాత్రం గౌరవం ఉండదు.

రేవతి రాసిన 'ఒక హిజ్రా ఆత్మకథ' మనలను కదిలించే స్వీయ నివేదిక. ఆమె లైంగిక అస్తిత్వం, తనమీద పడిన నిందాముద్రపై, వివక్షపై ఇంటా బైటా చేసిన పోరాటాల నివేదిక. ఆమెకున్న అత్యంత ధైర్యసాహసాలు, తన చుట్టూ ఉన్న వ్యతిరేక వాతావరణంలో తన జీవితాన్ని అర్థవంతం చేసుకోవాలనే పట్టుదల ఇవన్నీ మనల్ని మన గురించిన సత్యాన్ని మరల పరీక్షించుకోమని బలవంతపెడతాయి. ఆ పుస్తకం మనల్ని ప్రత్యేక సదుపాయాలు, సహాయ సహకారాలనే ఆధారాల గురించి పునరాలోచించమని ఒత్తిడి పెడుతుంది. ఆధిపత్య భావజాలం అనే బోనులోంచి మనల్ని విడుదల చేసుకోమంటుంది. రేవతి ప్రపంచం మన నుండి వేరు కాదు. మనలోపల దాగి ఉన్నదే.

జండర్ ఒక సాంఘిక ప్రపంచాన్ని సంపూర్ణంగా ఆవిరి చేస్తుంది. జండర్ అస్తిత్వం అనేక భిన్న మార్గాలలో, పద్ధతులలో ఒకేసారి నిర్మించబడుతుంది. అంతాకలిసి, మళ్లీ ఒకదానితో ఒకటి సంభాషించు కుంటూ జుడిత్ బట్లర్ చెప్పినట్లు 'జండర్ గురించిన ఆధిపత్య భావన ఒకరి వ్యక్తిత్వాన్ని హరించి వేయగలదు. జీవితంలో ఓటములను దాటుకుంటూ కొనసాగగల పట్టుదలకున్న సామర్థ్యాన్ని ఆ ఆధిపత్య భావన తగ్గించి చూస్తుంది.' రేవతి జీవిత కథ ద్వారా మనం జండర్ కేవలం శారీరకపరమైనది (బయలాజికల్) మాత్రమే కాదని తెలుసుకుంటాం. అది వ్యక్తిత్వం, అస్తిత్వం, గౌరవం, హుందా తనం, పని, వేషధారణ, నడక తీరు, ప్రవర్తన, సంభాషణ, ఇష్టాలు, అయిష్టాలు, ప్రేమలు, కోరికలు వీటన్నిటితో కలిసి ఉంటుంది.

ఆడ పనుల మీద రేవతికున్న ఇష్టం వల్ల, బాలికలు ఆడే ఆటలంటే ఉన్న ఇష్టం వల్లా ఆమెను చిన్నతనంలోనే బడి 'ఆడబ్బాయి'గా ఏడిపించింది. అప్పుడామె తన తల్లిదండ్రుల చిన్నకొడుకైన దొరైస్వామి. శిక్షలు, సరిదిద్దే ప్రయత్నాలు కూడా చిన్నతనంలోనే ప్రారంభమయ్యాయి. టీచర్లు ఆమెను 'అబ్బాయిలా ధైర్యంగా ఉండనందుకు' కొట్టేవారు. ఐనా ఆమె అమ్మాయిలాగే ప్రవర్తించేది. ఆమెకు ఆ పద్ధతే తెలుసు. అబ్బాయిలా ఉండడమెలాగో తెలియదు. మిగిలినవాళ్లు అడుగుతున్నారు గదా అని అబ్బాయిలా ఉండలేకపోయింది. నాటకాలలో ఆడవేషాలు వేసినపుడు ఆమె ఒక పాత్ర ధరించలేదు. ఆమె అచ్చం తనలాగే ఉన్నాననుకుంది. మళ్లీ మామూలుగా మగ దుస్తులు వేసుకున్నపుడు తనలోని అసలు వ్యక్తిని వెనక్కునెట్టి మారువేషంలో వెళ్తున్నట్లనిపించేది ఆమెకు. వయసు వచ్చేసరికి మరిన్ని సందేహాలు, అయోమయాలు. ఇతర అబ్బాయిల మీద కోరిక కలగడం సరైందేనా? తనకొక్కదానికే ఇలా అనిపిస్తుందా? తనలాంటివారు ఇంకెవరన్నా ఉన్నారా? వాళ్లెక్కడ కనపడతారు? ఆమె పదో తరగతికి వచ్చేసరికి 'నా శరీరంలో నా లోపల మార్పులు జరగడం నా అనుభవంలోకి వచ్చింది. నాలో ఒక అణచిపెట్టలేని స్త్రీత్వం పెరుగుతున్న అనుభవం నాకు కలిగింది. అది నన్ను పొద్దస్తమానం వెంటాడసాగింది. నా గురించి నేను పురుషుని శరీరంలో చిక్కుకున్న స్త్రీగా అనుకున్నాను.' (రెండవ చాప్టర్ నుంచి)

తన శరీరానికి తాను పరాయిదయిపోవడం గురించి లోతైన బాధ అనుభవించి తనలాంటి మనుషుల కోసం, తనెక్కడి నుంచి వస్తోందో అర్థం చేసుకోగల మనుషుల కోసం వెదకడం మొదలుపెట్టింది. పూర్తిగా కొత్తదైన సాంస్కృతిక పదజాలాన్ని నేర్చుకుంది. తనకొక మూలాన్ని, తన ఇంట్లోలేని మూలాధారాన్ని ఇచ్చేలా అమ్మాయి పేరు పెట్టుకుంది. ఇంటికి తిరిగి వస్తూ, ఇదంతా భరించలేని సోదరుల చేతిలో దెబ్బలు తింటూ, తనకు సానుభూతిగాని, అండగానీ దొరకకపోవడంతో మళ్లీ పారిపోయింది. మళ్లీ ఇంకోసారి – తన కుటుంబంపై ఉన్న ఇష్టాన్ని తెంచుకోలేక, ఆ కుటుంబ సంకేతాలలో బతకలేక మళ్లీమళ్లీ పారిపోవాల్సి వచ్చేది. తను ఏ కమ్యూనిటీకి చెందుతుందో ఆ కమ్యూనిటీలో ఆమెకు ప్రేమ, అవగాహన దొరికినప్పటికీ, అక్కడ సర్దుబాటు చేసుకోవడం కూడా తేలిక కాదు. గౌరవంతో కూడిన సామాజిక సంబంధాలుండే ప్రాంతాలున్నప్పటికీ, నిస్సహాయత, నిందాముద్రలుండడం వల్ల వీధుల్లో వారికి హింస, తీవ్రమైన వేధింపులు ఎదురయ్యేవి. అత్యాచారం, లైంగిక వేధింపులు, అవమానాలు, మగవాళ్ల భౌతిక దాడులు తెలిసీ, తెలియకా జరుగుతుండేవి.

'ఆ సమయంలో నేను నిరాశపడేదాన్ని. మనుషులు ఇలా కూడా ఉండొచ్చు కదా అనుకునేదాన్ని. దేవుడు మమ్మల్నిలా చేశాడు అనుకునే దాన్ని. మాకంటూ ఒక పని లేదు. మా తల్లిదండ్రులు మమ్మల్ని అర్థం చేసుకోరు. ఈ ప్రపంచానికి మేమంటే అయిష్టం. వీటన్నిటికన్నా మాకు మనుషుల్లా గౌరవంగా హుందాగా జీవించాలని ఉంటుంది'ఆమె జీవితాన్ని నాశనం చేసిన హింసతో పాటు రేవతి హిజ్రా ప్రపంచంలోని ఉప సంస్కృతుల గురించి ఆసక్తికరమైన విషయాలు చెప్పింది. ఢిల్లీ, ముంబై, బెంగుళూరుల మధ్య ఉన్న భిన్నత్వాలు 'వాళ్ల సంతోషాలు, ఆచారాలు, వేషధారణ నియమాలు, ఆధిపత్యాల అంతరువులు, అధికార సంబంధాలు, ఆ కమ్యూనిటీ జమాత్ వల్ల ఒక ఇంటికి మరొక ఇంటికి మధ్య రాకపోకలపై ఆంక్షలు, కమ్యూనిటీ లోపల అనుబంధాలను నిర్మించే ఆప్యాయతలు, ఆత్మీయతలు' వీటన్నిటి గురించీ రాసింది.

హిజ్రా సమస్య - 4

హిజ్రా సమస్యకు ఉన్న వ్యక్తిగత మానసిక, శారీరక, సామాజిక కోణాలను చర్చిస్తూ పరిష్కారాలు సూచిస్తున్నారు

రంగనాయకమ్మ

(గత సంచిక తరువాయి)

'ఏది ప్రకృతి సహజత్వం? ఎవరు నిర్ణయిస్తారు దాన్ని?' అని వాదన చేసే వాళ్ళెవరైనా నిజంగా ఉంటే, వాళ్ళు 'మేము ప్రకృతి జ్ఞానం లేని అజ్ఞానులం' అని రుజువు చేసుకుంటున్నారన్నమాట! పశువులూ పక్షులూ, ప్రకృతి గురించి ఏ వాదాలూ చేయవు. అయినా అవి, ప్రతీ చర్యలోనూ ప్రకృతి సహజంగానే ప్రవర్తిస్తాయి. మొత్తం భూగోళంలో ప్రకృతి జ్ఞానం లేని జీవులు ఎవరైనా ఉంటే, వాళ్ళు ప్రధానంగా స్వలింగ సంపర్కులే. మగ హోమోల భాషలో, 'ముఖరతీ, అంగచూషణం, మలద్వార శృంగారం' వంటి రోత, వికృత, కుళ్ళు కుళ్ళు వాగుళ్లెన్నో ఉన్నట్టు చదివాను. స్త్రీలని హింస పెట్టే మగ పశు తుల్యులు కూడా (పశువులు అలా చేయవు. పశువులు నన్ను క్షమించాలి) అవే కుళ్ళు ప్రవర్తనలతో ఉంటారని స్త్రీల ద్వారా విన్నాను. మగ హోమో పశు తుల్యుల శృంగారం అంతా ఆ వికృతత్వంతో నిండినదే.

స్వలింగ సంపర్కాల వాళ్ళు, 'మేము ప్రకృతిని ధిక్కరించే ధీరులం' అనే ఉన్మాదంలో మునిగి ఉంటారు. వాళ్లందరూ ఒకసారి, అమా యక జనం ముందు, మలద్వారాలతో భోజనాలు చేసి చూపిస్తే, నెత్తితో నడిచి చూపిస్తే, చెవులతో మాట్లాడి చూపిస్తే – అలాంటివి ఇంకా చేసి చూపిస్తే, 'ప్రకృతి సహజత్వం అనేది లేదు' అని అందరూ తెలుసుకుంటారు. అంతే గాక, ఆ ప్రకృతి ధిక్కారుల్ని అందరూ మెచ్చుకుంటారు.

స్వలింగ సంపర్కాల్ని సమర్థించే వాళ్ళు, ఆ సమర్థకులు ఆ విధానాల్ని పాటించే వాళ్ళు కాక పోయినా, ఆ విధానాల్లో సైన్సు ధర్మాలు ఉన్నా యని వాదిస్తారు. 'స్వలింగ సంపర్కం అంటే, అది కేవలం ఆకర్షణ మాత్రమే. వారి మధ్య శారీరక సంబంధాలు ఉండవు. స్త్రీ పురుషుల మధ్య ఉండే ఆకర్షణ వంటిదే స్వలింగాల మధ్య ఆకర్షణ కూడా. వీరిలో సెక్స్ సమస్య ఉండదు' అంటారు.

'స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణలో, శారీరక సంబంధాల వాంఛ కూడా ఉంటుంది. స్వలింగాల వాళ్ల మధ్య ఆకర్షణలు కూడా ఆలాంటివే అయితే, అక్కడ కూడా శారీరక వాంఛలు ఉండ వలిసిందే. అసహజత్వం అనేది, దానిదే' అంటారు సమర్ధకుల వ్యతిరేకులు.

'అలా కాదు, స్వలింగాల వాళ్లు కేవలం ఆలింగనాలూ ముద్దులూ మాత్రమే చేసుకుంటారు' అంటారు సమర్ధకులు.

ఈ భాష అంతా వాదించడానికే కష్టమైన భాష. ఆలింగనాలూ ముద్దులూ కూడా శారీరక వాంఛలే. ఆ వాంఛలతో చూడడం గానీ, తాకడం గానీ, సెక్స్ కిందకే వస్తాయి. అసలు స్వలింగాల వాళ్లు తమ వాంఛల గురించి 'మల ద్వార శృంగారం' అనీ, ఇంకేదో అనీ, పెంట మాటలన్నీ గర్వంగా చెప్పుకుంటారు. దానికే చట్టాలు కావాలంటారు. ఆ సంబంధాల్ని లీగల్‌గా కూడా కావాలంటారు. కానీ, స్వలింగాల వాళ్ల సమర్థకులు అయితే, 'అసలు వాళ్ల మధ్య శరీరాల సంబంధాలే ఉండవు. ఉండేది ఆకర్షణే' అంటారు.

ఒక డాక్టరు హోమోల్ని అర్థం చేసుకోవాలన్నట్టుగా ఒక విషయం చెప్పారు. 'హోమోలుగా గడుపుతోన్న ఇద్దరు ఆడవాళ్లని, వాళ్ల కుటుంబాల పెద్ద వాళ్లు చాలా మందలిస్తే, వాళ్లల్లో ఒక అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్య చేసుకుందంటే, హోమోగా ఉండడంతో ఆమెకి ఏదో బలమైన కారణం ఉన్నట్టే కదా?' అనే అర్థంతో చెప్పారు. అలా మాట్లాడారంటే, ఆ డాక్టరు, హోమో సంబంధాల్ని సమర్థిస్తున్నట్టూ కాదు,

---

అనేక రకాల జీవనోపాధుల గురించి కూడా రాసింది. దుకాణాలలో డబ్బు అడగడం, బదాయిలకు వెళ్లడం, సెక్సువర్క్ మొదలైనవి.

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు విలువ ఇచ్చే వ్యక్తిగా రేవతి ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి, ఒక గురువు నుంచి ఇంకొకరి దగ్గరకు ఒక జీవనోపాధి నుండి మరొక దానికి వెళ్లింది. సెక్సువర్కంటే బొత్తిగా ఇష్టం లేదు. లైంగికానందం పొందాలనే తీవ్రమైన కోరిక, కానీ లైంగిక అనుభూతిని ఒక పనిలా చూడటం తప్ప మరో అవకాశం లేని పరిస్థితీ – వీటన్నిటినీ చూసింది. సెక్సు వర్కు చేస్తూ తండ్రిని పోషిస్తే తండ్రి ఆమెను మోసం చేసి అంతా లాక్కున్నాడు. ఆమె ప్రేమించి పెళ్లాడిన వాడు వదిలేసి వెళ్లాడు. కొంతకాలం ఉద్యమంలో పనిచేసి మళ్లీ సెక్స్‌వర్క్‌కి వెళ్లడం, మళ్లీ అది వదలడం.

దీనంతటిలోనూ, ఆల్కహాలుతో కొంత మర్చిపోగలిగినా ఆమెకు కాస్త ఓదార్పు, సౌకర్యం హిజ్రా కమ్యూనిటీలోనే దొరికింది. ఒక పొట్టి మాత్రమే ఇతరుల అనుభూతులను, బాధను, నష్టాన్ని, వేదనను తెలుసు కోగలుగుతుంది... మేం ఒక విధంగా కాకుల గుంపువంటివాళ్లం. మేం కలిసే ఉంటాం. (9వ భాగంలో చివరి పేరా) అందుకనే ఆమె తనలాంటి వాళ్లతో మాట్లాడాలని బయల్దేరింది. వాళ్ల బాధ, అవమానాల కథలను రికార్డు చేస్తోంది. అవమానంతో వాళ్లు పడే బాధలు, సాంఘిక ద్వేషం గురించి రాస్తోంది. వాళ్ల గురించి రాస్తూ తన గురించీ రాసుకుంటోంది. దానివల్ల మనం జీవితం, హుందాతనం, మానవత్వం, మానవ భిన్నత్వం, మానవీయతల అర్థాలను నేర్చుకోవచ్చు.

(రచయిత డైరెక్టర్, కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్) వీ

వ్యతిరేకిస్తున్నట్టూ కాదు. ఆయన డాక్టరు కాబట్టి, 'ఆమె ప్రవర్తనలో ఏదైనా కారణం ఉందా?' అని వెతుకుతున్నట్టే అలా అన్నారు.

ఆయనతో నా చనువు వల్ల నేను కూడా నా ఆలోచనలు నేను చెప్పాను. 'ఆత్మహత్యలు అన్నీ ఆత్మగౌరవంతో జరిగేవే అంటారా? అజ్ఞానాలతోటీ, పంతాలతోటీ, తప్పుడు విలువలతోటీ, తొందరపాటు తోటీ జరిగేవి కూడా ఉంటాయి కదా? పెంపుడు కుక్క చచ్చిపోతే ఒకావిడ ఆత్మహత్య చేసుకుందని ఒకప్పుడు ఒక వార్త చదివాను. ఆ మనిషే ఏడాది కిందట స్వంత బిడ్డ చచ్చిపోతే ఆత్మహత్య చేసుకోకుండా బతికి ఉన్నదే. కుక్కకి ఇచ్చిన విలువ బిడ్డకి ఇవ్వలేదు. తమ పార్టీ రాజకీయ నాయకుడు పోతే, వెంటనే పది మంది టప టపా ఆత్మహత్యలు చేసు కుంటారు. రాజశేఖర్‌రెడ్డి పోయినప్పుడు అలాగే జరిగింది. ఒక సారి తమిళనాడు ముఖ్యమంత్రి అయిన జయలలితకి ఏదో జరిగితే, ఆమె భక్తురాలు ఒకామె నాలిక కోసేసుకుందనే వార్త అందరూ చదివారు. (నాలికలో ఏ మూల ఎంత కోసుకుందో ఆ వివరాలు లేవు. చిన్న గాటు పెట్టుకుని ఉండొచ్చు.) ఆ తర్వాత, ఆ ముఖ్యమంత్రి, ఆ భక్తురాలికి డబ్బు ఇచ్చింది, 'నా కోసం ఎంతెంత త్యాగాలు చేసే వాళ్ళు ఉన్నారో చూడండి' అని! ఒక ఘోర వార్తలో, మరీ మూర్ఖ, క్రూర తల్లిదండ్రులు, ఒక రాత్రి, తమ స్వంత పిల్లని, తమ గుమ్మంలోనే, దేవుడి పటం ముందు 'బలి' ఇచ్చేసిన వార్త నాలుగేళ్ల కిందట వచ్చింది. పరువు నమ్మకాల కోసం పిల్లల్ని తల్లులే హత్యలు చేసేస్తున్నారు! నమ్మకాలు ఏ స్థాయిలోకి పోతాయంటే, ఏదో తప్పుడు కోరికతో వాళ్ల పీకని వాళ్లే కోసేసుకుంటారు. పొట్టలో నుంచి పేగులు బయటికి లాగేసుకున్న వాడికి చెప్పలేనంత కీర్తి వస్తుంది, మత గ్రంథాల్లో. హోమో ఆడ మనిషి ఆత్మహత్య చేసుకుందంటే, 'అయ్యో, ఆ పెద్ద వాళ్లు, ఆమె ఇష్టానికి ఆమెని వదిలెయ్యవలసింది' అని ఆమె గురించి సానుభూతి చూపవలిసిందే గానీ, ఆ ఆత్మహత్యని చూసి, ఆ హోమోల సంబంధంలో ఏదో సహజమైన సైన్సు కారణం ఉండి ఉంటుందనే అర్థానికి రాగలమా?' అంటూ మాట్లాడాను నేను.

'హోమో నాగరికత' ని సమర్థించే మేధావులు, 'ఇది ఎంతో పూర్వ కాలం నుంచీ ఉన్నదే' అంటారు. సరే, పూర్వకాలం నుంచీ ఉంది. పూర్వకాలంలో ఇంకా చాలా అజ్ఞానాలు ఉన్నాయి. పూర్వకాలం, ఈ నాటి కాలం కన్నా అజ్ఞానకాలం. పూర్వకాలంలో, కొందరు మగ పశువులు, ఆవులూ మేకలూ వంటి ఆడ జంతువులతో శృంగారం నెరిపిన రోతలు కూడా ఉన్నాయి. ఇప్పటికీ ఆ వార్తలు కనపడుతూనే ఉంటున్నాయి. సమాజంలో, ధనవంతులు ప్రారంభమై, ఒక్కో ధనికుడికి డజన్ల కొద్దీ ఉంపుడు కత్తెలూ, నేరస్తులకు జీవితాంతాల వరకూ ఖైదులూ ఏర్పడితే, ఆ పరిస్థితుల్లో స్వలింగ సంపర్కాలు ప్రారంభమవ్వడం, అదే విస్తరించడం, వింత కాదు. పూర్వకాలం, అంధకారాల, క్రూరత్వాల కాలం. కుష్టు రోగుల్ని నూతుల వంటి గోతుల్లోకి తోసి, వాళ్లని బయటికి రానివ్వకుండా చేసిన కాలం అది. ఆడవాళ్లని సతీసహగమనాల పేరుతో సజీవంగా కాల్చేసిన కాలం అది. పూర్వకాలంలో స్వంత పిల్లలతో తల్లిదండ్రుల సంబంధాలూ, స్వంత తోబుట్టువుల మధ్యనే సంబంధాలూ, బహు భార్యాత్వాలూ, బహు భర్తృత్వాలూ, ఎన్నెన్ని అజ్ఞానాలు లేవు! ఆ కాలమా ఆదర్శ కాలం? పూర్వ కాలంలో ఏ కౄరత్వం ఉంటే ఆ క్రూరత్వాన్నీ, ఏ అజ్ఞానం ఉంటే ఆ అజ్ఞానాన్నీ, తర తరాలకూ నిలబెట్టుకుంటూ వెళ్లాలా? 'పూర్వం నుంచే ఉంది' అనే వాదం ఏ విషయంలోనూ పనికిరాదు. 'అది మంచిదా, చెడ్డదా? అది సహ జమా, అసహజమా? అది న్యాయమా, అన్యాయమా?' అనే ప్రశ్నలే ముఖ్యం. ఆ ప్రశ్నల్ని బట్టి చూడాలి.

ఈనాటి హోమో సమస్య, పాత కాలానిదే కావచ్చు. పాత కాలంలో కొన్ని మంచి విషయాలు కూడా ఉండవచ్చు. కానీ, పాతదంతా ఉత్తమమూ అవదు, సహజమూ అవదు. ఈ సమస్యకి పరి ష్కారం, మొదట బోధనా, వివరణా వంటివీ; వాటి వల్ల ఫలితం లేకపోతే, 'మీ ఏడుపు మీరేడవండి' అనడమే మంచి పరిష్కారం! దాన్ని సాంఘికంగా నిరసించవలిసిందే గానీ, అది చట్టాల ద్వారా అడ్డుకునే విషయం కాదు. ఇద్దరు ఆడవాళ్లు గానీ, ఇద్దరు మగవాళ్లు గానీ, వాళ్ల కొంపల్లో వాళ్లు, వాళ్ల గదుల్లో వాళ్లు, ఎలా ప్రవర్తిస్తారో, ఆ ఇద్దరికీ అది అంగీకారమే అయితే, దాన్ని చట్టం పట్టుకోవడం సాధ్యం కాదు. పట్టుకోడానికి చట్టానికి హక్కు ఉండదు.

ఒక విషయం ఏమిటంటే, స్త్రీ పురుషులైన వాళ్లు, 'మా శృంగారం ఇదీ' అని ప్రకటించు కోరు. అలాగే, ఇద్దరూ ఆడవాళ్లే అయినా, ఇద్దరూ మగవాళ్లే అయినా, 'మేము హోమోలం' అని ప్రకటించుకోనక్కరలేదు. ఇద్దరు వ్యక్తుల శారీరక సంబంధం, ఆ ఇద్దరికి మాత్రమే ఏకాంత సంబంధం. అది వాళ్ల వ్యక్తిగతం.

రోడ్ల మీదే ముద్దులూ, రోడ్ల మీదే కావిలింతలూ, మర్మాంగాల బహిరంగ ప్రదర్శనలూ – వంటి చేష్టలకు అర్థాలు చెప్పకోవాలంటే, అదంతా 'బూర్జువా సంస్కృతి'! మనుషుల్ని ఏ విలువలూ, ఏ మంచి చెడ్డలూ లేని పశువులుగా మార్చడమే ఆ సంస్కృతి లక్షణం. మనుషులకు, ఒక వివేకం, ఒక జ్ఞానం, ఒక తర్కం, అలవడ్డాయంటే, అవి ఒక చోట ఆగవు. అవి బూర్జువా సంబంధాల్ని ప్రశ్నించి కూలదోసే దాకా వెళ్తాయి. కాబట్టి, మనుషులు యజమానుల దగ్గరికి పోయి పనులు చేసేసి, తర్వాత బయటపడి చెడిపోయి తిరుగుతూ, సిగరెట్లతో, తాగుళ్లతో, గుడ్డలిప్పేసు కుని, రోడ్ల మీద ముద్దులతో తిరిగి, హోటళ్లలో తినేసి, అలాగే గడిపేస్తే చాలు! ఆ రకంగా యజమానుల సరుకులన్నీ అమ్ముడైపోతూ ఉంటే, సరుకుల వాళ్లకి ఎంత క్షేమం! ఎంత లాభం! బూర్జువా సంస్కృతి, మనుషుల్ని ఇంకా ఇంకా నీచ స్థాయికి దించుతూ, ఆ సంస్కృతిని గొప్ప అభ్యుదయంగా, నాగరికతగా, స్వేచ్ఛగా, హక్కులుగా, ప్రచారం చేస్తూ ఉంటుంది.

మానవ హక్కుల సంఘాల వాళ్లు బైల్దేరి ప్రతీ రోతనీ, పవిత్ర హక్కుగా నిలబెట్టడానికి చూస్తారు. వాళ్లు, 'హక్కులు' అనే వాటిలో, తప్పుల్నీ ఒప్పుల్నీ, అన్నిటినీ కలేసి ఏకం చేస్తారు.

హక్కుల సంఘాల ప్రకారం, వ్యభిచారాలకీ హక్కులు కావాలి! కడుపుల్ని అద్దెలకు ఇచ్చుకుని, తల్లులెవరో తండ్రులెవరో పుట్టే పిల్లలకి తెలియకుండా చేయడానికి ఆడవాళ్లకి హక్కులు కావాలి. అందాల పోటీలకు హక్కులు కావాలి. హోమోల సంబంధాలకు హక్కులు కావాలి. బూర్జువా సంస్కృతిలో ప్రతీ రోతకీ హక్కు కావాలి. చెడ్డలన్నిటికీ, మంచిని ధ్వంసం చేసే హక్కులు కావాలి. హోమో సమస్య, చివరికి హక్కుల సమస్యగా మాత్రమే అయిపోతుంది.

4) 'హిజ్రా' సమస్య ఒక్కటే ఎంతో కొంత ఆలోచించదగ్గ సమస్య. ఈ సమస్యలో మాత్రమే 'ఎక్స్, ఎక్స్ వై' విషయంగానీ, 'జెండర్ డిజార్డర్' విషయంగానీ, సైన్సు అంశాలుగా కనపడుతున్నాయి. అలా అని హిజ్రాగా కనపడే ప్రతీ వ్యక్తినీ ఆ విషయాల వల్లే తయారైన వ్యక్తిగా అనుకోనక్కర లేదనీ, ప్రతీ హిజ్రా మీదా పరీక్షలు జరిగితే గానీ, ఆ వ్యక్తి విషయం తేలదనీ, డాక్టర్లు అంటారు.

రేవతి రాసిన వాటిల్లో ఒక విషయం స్పష్టంగా కనపడుతోంది. హిజ్రాలుగా ఉన్న పెద్ద వయసు గురువులు ఎప్పటికప్పుడు చిన్న వయసు వాళ్లని పట్టి, హిజ్రాలుగా మార్చి, వాళ్ల ద్వారా డబ్బు సంపాదిస్తారు. హిజ్రాలుగా మారిన కొత్త వాళ్లు సెక్స్ దందాలూ, షాపుల మీద పడి అడుక్కునే దందాలూ చేసి డబ్బు తెచ్చి గురువులకు ఇవ్వాలి!

రేవతి ఒక సారి సెక్స్ వృత్తి ఆపుకుని ఏదో చేతి పని మొదలుపెడితే, ఆ గురువు, 'నీ దందా నువ్వు చేసుకుంటే ఎక్కువ డబ్బు వస్తుంది కదా?' అంది. అప్పటి నుంచీ ఈమె మళ్లీ తన వృత్తి మొదలుపెట్టింది. తర్వాత, దానికీ డబ్బు రాక ఇబ్బంది పడింది.

ఒక కంపెనీలో ఉద్యోగాలు చేసే ఇద్దరు ఆడవాళ్లు, అర్ధరాత్రి సమయానికి నైట్ డ్యూటీలు ముగించి ఇళ్లకి పోతూ, ఒక పార్కు గేటు దగ్గర ఇద్దరు ముగ్గురు హిజ్రాల్ని చూస్తూ ఉంటామని నాకు ఈ మధ్య చాలా సార్లు చెప్పారు. (హిజ్రాల గురించి ఏమైనా తెలుసా – అని నేను అడగడం వల్ల) ఆ ఆడ వాళ్లు, ఆ పార్కు ముందు నుంచే ఇళ్లకు పోవాలి. అంత రాత్రిలో, వీళ్లు ఇంకా పది గజాల దూరంలో ఉండగానే హిజ్రాల సెంటు వాసనలు వాళ్లు అక్కడ ఉన్నారని చెప్పేస్తూ ఉంటాయి. మొగాళ్లే చీరలు కట్టుకుని ఉన్నట్టు ఉంటారు వాళ్లు. పార్కు గేటు ముందు వెలుతురులో, వాళ్ల చీరల మీద అద్దం బిళ్లలూ, చెవుల జూకాలూ, చేతుల గాజులూ తలలో పువ్వులూ పెదాలకు రంగులూ, అవన్నీ కనపడ తాయి. ఆ ముస్తాబులకే రోజూ బోలెడు ఖర్చవు తుంది. వాళ్లు 'సెక్స్ కస్టమర్ల కోసం' ఎదురు చూస్తూ ఉంటారని నాలుగు రోజుల తర్వాతే వీళ్లకి అర్థమైంది. 'వాళ్లకి కూడా మా లాగా ఉద్యోగాలు ఉంటే, అంత కష్టంగా బతుకు తారా?' అనిపిస్తుంది వీళ్లకి, వాళ్లని చూసినప్పుడల్లా.

ఆ హిజ్రాల దగ్గర ఒక్కో రోజు స్కూటర్లు ఆపి మొగాళ్లు నిలబడి మాట్లాడుతూ ఉంటారు. ఒక్కో రోజు వీళ్లూ వాళ్లూ పార్కు లోపల చెట్ల కిందకి చీకట్లోకి వెళ్లిపోతూ ఉంటారు. ఒక్కో సారి ఆ మొగాళ్ల వెనక స్కూటర్ల మీద వీళ్లు ఎక్కి వెళ్లడం కూడా కనపడుతుంది.

రేవతి రాసిన ప్రకారం, హిజ్రాల దగ్గరికి వచ్చే మొగాళ్లు రౌడీలూ, తాగుబోతులూ, బిచ్చగాళ్లూ, ఆ రకం వాళ్లూ, పోలీసులూ కూడా.

నాకు ఆ విషయాలు చెప్పే ఆ ఆడ వాళ్లు, 'వాళ్లు ఎందుకూ అలాంటి బతుకులు బతుకు తారు? ఏ స్వీపరు పనులైనా చేసుకోలేరా?' అంటారు.

హిజ్రాలకి పనులు ఎవరూ ఇవ్వరు. మగ వాళ్లే చీరలు కట్టుకుని వచ్చి పనులు చేస్తామంటే ఇళ్లల్లో అయినా ఆడ వాళ్లు ఇంటి పనులు చేయించుకోరు. మగవాళ్లే వచ్చి పనులు చేస్తే చేయించుకుంటారు. హిజ్రాలకు ప్రభుత్వమే పనులు ఇవ్వడం ఇంత వరకూ లేదు. ఇదంతా హిజ్రాలుగా మారే వాళ్లకి తెలుసు. అలాగే బతుకుతామని తెలుసు.

72 ఏళ్ల దీపా అనే హిజ్రా, 'హిజ్రాగా జీవించడానికి ఎవరూ ఇష్టపడరు' అన్నదని ఒక వ్యాసంలో చదివాను. అంత వయసు వచ్చిన తర్వాత ఆ హిజ్రాకి ఆ జ్ఞానం వచ్చి ఉండాలి.

మత నమ్మకాల వాళ్లు కొందరు, హిజ్రా జీవితాన్ని చాలా సహజత్వంగా భావిస్తారు. భారతంలో అర్జునుడు నపుంసకుడనీ, శివుడు అర్ధ నారీశ్వరుడనీ, శిఖండి ఆడదిగా పుట్టి మగవాడై పోయిందనీ, ఆ రకం మాటలు చెపుతారు. నపుంసకత్వం, ఏనాడైనా హిజ్రా సమస్య వంటిది కాదు. రెండు అంగాలతో బిడ్డ పుట్టడం వెనకటి కాలంలో కూడా జరగడం వల్ల, అది ఆడా–మొగా కలిసిన విషయంగా కనపడింది. అయినా అది, హిజ్రా సమస్య వంటిది కాదు. 'హిజ్రా బతుకు శివుడంత పవిత్రం' అని హిజ్రాల నమ్మకం.

హిజ్రా సమస్యని వేరుగానే చూడాలి. అందులో, నిజం కేసులూ, నిజం కాని కేసులూ, కూడా ఉంటాయి. నిజం కాని కేసులు ఎందుకు తయారయ్యాయో, అది చూడాలి. ఆ హిజ్రాలందరూ నిరుపేద జీవితాల వల్లే, హిజ్రాగా మారితే సంపాదనకు మార్గం దొరుకుతుందని అలా తయారవుతున్నారనే అర్థం కనపడుతోంది.

అసలు 'హిజ్రా' అనేది లేకుండా చేసుకోవాలంటే మార్గం ఏమిటి?

1) పిల్లలు ఇళ్లల్లోనే పుడతారు. వాళ్లు ఎదిగేటప్పుడు, వాళ్ల ప్రవర్తనలో ఏవైనా అర్థం కాని మార్పులు కనపడుతూ ఉంటే, వాళ్లని మందలించినా ఫలితం లేకపోతే, ఆ పిల్లల్ని వెంటనే డాక్టర్లకి చూపించాలి. ఆ ఊళ్లో డాక్టర్లు లేకపోతే, వాళ్లు ఎక్కడ ఉంటే అక్కడికే వెళ్లాలి. దేవుళ్ల గుళ్ల కోసం ఎంత దూరం అయినా వెళ్లరూ? ఎంత ఖర్చు అయినా పెట్టరూ? పిల్లల్ని డాక్టర్లకి చూపించడం తల్లిదండ్రుల మొదటి బాధ్యత.

2) డాక్టర్లు పరీక్షలు చేస్తారు. హార్మోన్ ట్రీట్‌మెంటూ, ఆడపిల్లగా మారాలనుకోవడంలో ఉండే సమస్యల గురించి చెప్పడమూ, జరగాలి. పిల్లవాడి ప్రవర్తన గురించి, పిల్లవాడి తల్లిదండ్రులకు కూడా డాక్టర్లు చాలా శ్రద్ధగా చెప్పాలి. పిల్లవాణ్ణి హేళన చేయవద్దనీ, సానుభూతిగా చూడమనీ, అలాగైతే పిల్లవాడు ఇంటి నుంచి పారిపోకుండా ఉంటాడనీ, చెప్పాలి. సరైన వైద్యంతో, పిల్లవాణ్ణి పిల్లవాడిగానే నిలబెట్టవలసిన బాధ్యత డాక్టర్లది. ఈ ఏర్పాటు ప్రభుత్వం ద్వారా జరగాలి.

3) వైద్యం వల్ల కూడా ఫలితం లేకపోతే, పిల్ల వాడి పుటకలో ఒక లోపం జరిగినట్టూ, ఆ లోపాన్ని భరించాలి అన్నట్టూ పెద్ద వాళ్లు అర్థం చేసుకోవాలి. పిల్లలకు చెవిటి తనమో, గుడ్డి తనమో సంభవిస్తే పిల్లల్ని వదులుకోము కదా? వాళ్లని మరింత శ్రద్ధగా చూసుకుంటాము. అలాగే ఈ లోపంతో కూడా పెద్దవాళ్లు రాజీపడి, పిల్లవాణ్ణి, ఆడపిల్ల పుట్టినట్టు గానే భావించుకోవాలి.

4) అంధులైన పిల్లలకు కూడా రిజర్వేషన్ల ద్వారా చదువులూ, ఉద్యోగాలూ, ఉంటున్నాయి. పిల్లల్ని చదివించుకోగలిగే కుటుంబాల వాళ్లు, పిల్లల్ని ఎలాగా చదివించుకుంటారు. చదివించుకోలేని కుటుంబాల కోసమే ప్రభుత్వ చట్టాలు అవసరమవుతాయి. – ఈ క్రమం అంతా సవ్యంగా జరిగితే హిజ్రాలు ఎందుకు తయారవుతారు?

2014 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ఒక తీర్పులో, హిజ్రాల్ని 'థర్డ్ జెండర్'గా (ఆడా, మగా కాని మూడో లింగంగా) పరిగణించాలి' అని చెప్పింది. కానీ హిజ్రాలు మగ పిల్లలుగానే పుట్టారు. అయినా వాళ్లు, 'మేము స్త్రీలుగా అయ్యాం. మమ్మల్ని స్త్రీలుగా గుర్తించాలి' అంటారు. ఎన్నికల్లో స్త్రీ అభ్యర్థులుగా నిలబడతామని కూడా అంటారు. 'మనుషులు'గా ఉన్నవాళ్లని, 'ఆడా మొగా కాని వాళ్లు' అనడం ఎందుకు?

వాళ్లు చాలా అత్యల్ప సంఖ్యే. వాళ్లని స్త్రీలుగానే గుర్తిస్తే, సమాజానికి ఏం నష్టం వస్తుంది? అదే సుప్రీంకోర్టు తీర్పు, 'హిజ్రాల్ని 'వెనకబడ్డ తరగతి' (బ్యాక్‌వర్డ్ క్లాస్)గా గుర్తించి రిజర్వేషన్లు ఇవ్వా ల'ని కూడా చెప్పింది. కానీ రిజర్వేషన్లు ఇవ్వడంలో, 'స్త్రీగానా, పురుషుడిగానా?' అనే ప్రశ్న వస్తుంది. అంటే, వాళ్లని స్త్రీలుగా గుర్తించాలా, పురుషులుగా గుర్తించాలా – అనే విషయం మొదట తేలాలన్నమాట! ఇప్పటి వరకూ సమాజానికి ఆ మనుషుల సమస్య పట్ల లక్ష్యమే లేదు.

రేవతి, తన పుస్తకంలో, తమ లాంటి వాళ్లందరూ గతి లేకే పడుపు బతుకు బతుకుతున్నామనీ, తమ లాంటి వాళ్లకి చదువులూ ఉద్యోగాలూ కావాలనీ, అంటుంది. కానీ, దొరైస్వామికి మొదటి గురువు, 'నీకు హిజ్రా జీవితం ఎందుకు? నీది మంచి కుటుంబం. చదువుకో, ఉద్యోగం చేసుకో!' అని చెప్పినా అతను వినలేదు. హిజ్రాగా మారితే ఎలాంటి బతుకు బతకాలో ఆపరేషన్ కన్నా ముందే అతనికి తెలుసు. అయినా, ఆ గురువు ఎంత చెప్పిందో, ఇతను ఆ వయసులో పూల జడ సరదాలో ఉండి ఎంత గ్రహించాడో తెలియదు. హిజ్రాలకు షాపుల్లో పనులైనా, ఇంటి పనులైనా, ఎవరూ ఇవ్వరనీ; అప్పటికే హిజ్రాలుగా ఉన్న వాళ్లు పడుపు వృత్తి తోనే బతుకుతున్నారనీ; తెలిసి కూడా, ఆపరేషన్ చేయించుకుని ఆ దందాయే ముస్తాబులతో రేవతి మొదలుపెట్టింది. ఇష్టం లేకుండానే పడుపు వృత్తికి సిద్ధపడ్డట్టయితే, మగవాడిగా ఉండడానికి ఇష్టం లేకపోయినా దానితో రాజీపడవచ్చు. వ్యభిచారం కన్నా, అడుక్కోవడం కన్నా, ఇష్టం లేకపోయినా మగవాడిగా ఉండడం ఆత్మగౌరవం గల జీవితం. దొరైస్వామి, ఇంటి నుంచి పారిపోకుండా ఇంట్లోనే ఉండిపోతే, అతన్ని చదివించే తల్లిదండ్రులు ఉన్నారు. తర్వాత ఏదో ఒక ఉద్యోగం ఉండేది. ఒక వేళ, అతనికి నపుంసకత్వం అయితే, పెళ్లి చేసుకోకుండానే ఉండవచ్చు. అటువంటి 'ఆడంగి' మగవాడి పట్ల ఆడవాళ్లు సోదరత్వంతో సానుభూతిగా ఉంటారు. అప్పుడప్పుడూ చీరలు కూడా కట్టుకోవచ్చు. జీవితాన్ని అలా గడుపుకోవడం కన్నా శరీరాన్ని అష్ట వంకర్లు చేయించుకుని, వీధుల్లో అడుక్కుతింటూ, పడుపు పని చేస్తూ, ఇతర మనుషులలో కలిసే అర్హత లేకుండా చేసుకుని – మిగతా కాలం అంతా అలా బతకడమేనా? రోగాల్లో గానీ, వృద్ధాప్యంలో గానీ, ఎలా గడుస్తుంది? దొరైస్వామికి ఏ డాక్టరైనా చిన్నతనంలో, 'ఆపరేషన్ చేయించుకుంటే, ఇక నీ జీవితం నా నా వంకర్లతో ఫలానా ఫలానా రకాలుగా జరుగుతుంది' అని వివరంగా చెప్పి ఉంటే, తగిన వైద్యం చేసి ఉంటే, రేవతి తయారయ్యేదా? రేవతి కూడా 'తప్పు చేశానా?' అనుకున్న సందర్భాలు ఒకటి రెండు ఉన్నాయి.

దొరైస్వామికి మొదటి గురువు, 'నీకు హిజ్రా జీవితం ఎందుకు? నీకేం అవసరం?' అన్నదంటే, దాన్ని బట్టి ఏం తెలుస్తోంది? హిజ్రాలుగా మారుతోన్న వాళ్లల్లో అనేక మంది కేవలం వ్యభిచార వృత్తికోసం అలా తయారైన వాళ్లే అని తెలియడం లేదా?

రేవతి కూడా తన శిష్యులకి, 'మీకీ జీవితం వద్దు. చదువుకోండి' అని చెప్పింది, ఎందుకు? 'ఆడ'గా మారవద్దనే కదా?

నేను చదివిన ఒక వ్యాసంలో, హిజ్రాలుగా ఉండే వాళ్లల్లో ఎక్కువ మంది 'లోయర్ మిడిల్ క్లాస్ బ్యాగ్రౌండ్' (దిగువ మధ్యతరగతి కుటుంబాల) వారిగా ఉంటారని చదివాను.

డాక్టర్లు చెప్పిన ఎక్స్, ఎక్స్, వై లక్షణంగానీ, జెండర్ డిజార్డర్ లక్షణం గానీ, లేకుండానే, కేవలం అడ్డగోలు బతుకు దెరువుల కోసం ఎవరైనా హిజ్రాగా తయారయ్యారంటే, లేదా పిల్లల్ని ఎత్తుకుపోయి అలా తయారు చేశారంటే, అదంతా పేదతనం నుంచి పుట్టే సమస్య అవుతుంది. దానికి పరిష్కారం 'పేదతనం మాయం అవడం' తప్ప ఇంకేం ఉంటుంది?

హిజ్రాల్ని హోటళ్లలోకి రానివ్వరనీ, ఎంత చిన్నపని అయినా ఇవ్వరనీ, రోడ్లు ఊడ్చే స్వీపర్ పనుల కన్నా వ్యభిచారాన్నే హిజ్రాలు ఎక్కువ సంపాదనగా అనుకుంటారనీ, చదివాను. 'హిజ్రాల్ని దయగా చూడాలి. వివక్షగా చూడ కూడదు' అని కాదు ఆలోచించవలసింది. అసలు హిజ్రాతనమే ఉండకూడదు – అనే పరిష్కారం కోసమే ఆలోచించాలి.

ఏ సమస్యలోనైనా, ఏది సహజమో, ఏది వికృతమో, గ్రహించాలంటే, ప్రకృతి సైన్సు జ్ఞానమూ, సమాజ సైన్సు జ్ఞానమూ, రెండూ కావాలి. కేవలం హక్కుల ఉద్యమాలూ, చట్టాల ఉద్యమాలూ, అన్ని సమస్యల్నీ పరిష్కరించవు.

హిజ్రాలు అనే వాళ్లు తయారవుతూ ఉంటే, వాళ్లని సాధారణ జనం ఎంతో కొంతదూరంగా ఉండడం తప్పదు. అది తప్పు అయినా ఆ తప్పు, 'హిజ్రాలుగా తయారవడం' అనే తప్పు నుంచే పుట్టుకొచ్చే తప్పు. మగ పిల్లవాడికి చిన్న వయసులోనే తగిన వైద్యమూ, తగిన బోధనా, సానుభూతీ, పేదరికం నిర్మూలనా, అనే అంశాలన్నీ, హిజ్రాతనాన్ని మాయం చేయగలవు. మానవ సమాజంలో, 'స్త్రీలూ – పురుషులూ' అనే మాటలు తప్ప, 'హిజ్రాలూ, కొజ్జాలూ' అనే మాటలు భాషలో నుంచి గతించిపోవాలి. అది జరగకపోతే, అది హిజ్రా సమస్యకి పరిష్కారం కాదు.

హిజ్రా మనిషి కలెక్టర్ పని చేసినా, ఆ మనిషి హిజ్రాయే అయితే, ఆ మనిషి, తోటి మనుషు లతో కలిసి బతుకుతున్నట్టు కాదు. హిజ్రాలు, జనం నుంచి డబ్బు లాగడంలో ఎంత మొండిగా ప్రవర్తించగలరో తెలిపే ఉదాహరణ ఒకటి ఉంది. (ఇది రేవతి పుస్తకంలోది కాదు, వేరే వ్యాసం లోది.) 2006లో, పాట్నాలో (బీహార్ రాష్ట్రం) జనం నుంచి పన్నులు వసూలు చేసే పని తమకు అప్పజెప్పమని హిజ్రాలు ప్రభుత్వాధికారుల్ని అడి గారు. ఆ అధికార్లకి అది నచ్చింది. హిజ్రాలు కూడా ఆ అధికార్లతో కలిసి పన్నుల వసూళ్ల కోసం తిరిగారు. హిజ్రాల్ని చూసి హడలెత్తిన జనం, పన్నులన్నీ చకచకా చెల్లించారు. పన్నులన్నీ బాగా వసూళ్లై హిజ్రాలకు 4 శాతం కమిషన్ వచ్చింది. ఇది బాగుంది గానీ, మనుషుల్ని హిజ్రాలుగా ఉంచి, వాళ్లకి ఏదో ఒక పని చూపించడమా పరిష్కారం? – కాదు. అసలు హిజ్రాలే తయారు కాకూడదు. వాళ్లు మగ వాళ్లుగానే ఉండి పోవాలి. 'హిజ్రా, కొజ్జా' మాటల్ని మనుషులు మరిచిపోవాలి.

(అయిపోయింది)

(రచయిత బహు గ్రంథకర్త, మార్క్స్ 'పెట్టుబడి' పరిచయకర్త) వీ

మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణంకు పంపగూడదు. – సం.

జర్మనీతో శాంతి కోసం లెనిన్ పోరాటం-2

మొదటి ప్రపంచ యుద్ధం ముగిసే సమయంలో ఏర్పడిన బోల్షివిక్ ప్రభుత్వ నేతగా లెనిన్ జర్మనీతో శాంతి కుదుర్చుకోవడానికి చేసిన ప్రయత్నాలను వివరిస్తున్నారు **ఎన్.వి.ఎస్. నాగభూషణ్**

(గత సంచిక తరువాయి)

ఇలాంటి తప్పుడు ధోరణులకు ఆనాడు వీరు చూపిన కారణం ఆత్మహత్యా సదృశమని చెప్పక తప్పదు. నిజానికది ఆత్మహత్యా సదృశం కాదు, ఆత్మహత్యే! జర్మనీలో విప్లవం రాబోతోందనీ, జర్మనీ ప్రభుత్వంతో సంధి చేసుకుంటే, అది ఆ ప్రభుత్వానికి బలాన్నిచ్చి, అక్కడి విప్లవ కారులకు నష్టం కలిగిస్తుందనీ, జర్మన్‌లను యుద్ధ చర్యలకు రెచ్చగొడితే, అవి అక్కడి ప్రజలను కోపోద్రిక్తుల్ని చేసి, విప్లవాన్ని త్వరితం చేస్తుందనీ ట్రాట్స్కీ వాదన! ఇక వామపక్ష కమ్యూనిస్టులైతే, దాదాపు సైన్యంలేని రష్యా, జర్మనీతో 'విప్లవాత్మక యుద్ధం' చేయాలని వాదించారు. ఈ ఇద్దరూ కూడా ఒంటిగా ఒక దేశంలో సోషలిజం జయించజాలదని వాదించారు. 'అన్ని నాగరిక దేశాల్లోనూ ఒకేసారి సోషలిజం వస్తుందన్న నాటి పశ్చిమ యూరప్ సోషల్ డెమోక్రాట్ల అవగాహనకు భిన్నంగా, 'ఒకే దేశంలో గానీ, కొన్ని దేశాల్లో గానీ సోషలిజం విజయం సాధించడం సాధ్యమే' అని లెనిన్ అభివృద్ధి చేసిన సిద్ధాంతానికి (లెనినిజంలో అదొక ముఖ్యమైన అంశం – రచన) వీరి వాదన పూర్తి వ్యతిరేకం అనడం స్పష్టం! అంతేగాక, ప్రపంచ విప్లవం గెలిస్తేనే, రష్యాలో విప్లవాన్ని నిలబెట్టు కోగలమని వారన్నారు. రష్యా ఇప్పుడు ప్రపంచ విప్లవ క్రమానికి అగ్రస్థావరం, పటుతరమైన కేంద్రం అయిందని గుర్తించడం వారికిష్టం లేదు. ప్రపంచ విప్లవ ప్రయోజనాల కోసం, సోవియట్ ప్రభుత్వాన్ని బలి పెట్టాలని చెప్పేదాకా వీరు వెళ్లారు. విజయవంతమైన కార్మికవర్గం, ఇతర దేశాలకు 'తన సొంత బయినెట్ల సహాయంలో విప్లవాన్ని తీసుకు వెళ్లాలన్ని' ట్రాట్స్కీ చెప్పాడు. దీనర్థం ఏమంటే, సోవియట్ రష్యా ప్రపంచ పెట్టుబడిదారీ విధానంపై విప్లవ యుద్ధాన్ని ప్రకటించనైనా ప్రకటించాలి. లేదా సోవియట్ అధికారం మాకు భారంగా ఉంది. మేం ఆ స్థాయికి పరిపక్వం కాకుండానే వచ్చాం' అని అంగీకరించాలి!

వీరి వాదన ఈ విధంగా వింతగా, భయంకరంగా ఉండడానికి అసలైన కారణం ఏమిటి? ప్రపంచ విప్లవ ప్రయోజనాల కోసం, స్వదేశంలో సాధించిన విప్లవ విజయాన్ని సైతం త్యాగం చేయాలన్న నిజమైన త్యాగబుద్ధితోనే వారు అలాంటి వాదనలు లేవదీసి, పార్టీలో అలాంటి గందరగోళం సృష్టించారా? ఆ రోజుల్లో కొందరు అదే నిజమని నమ్మారు. అయితే ఆ తర్వాత అందుకు గల అసలు కారణం వెల్లడైంది. బుఖారిన్, అతని నాయకత్వం కింద ఉన్న తీవ్రవాద కమ్యూనిస్టుల ముఠా, ట్రాట్స్కీతోనూ, ఇంకా వామపక్ష 'సోషలిస్టు రివల్యూషనరీ' పార్టీ (ఎస్.ఆర్.లు) తోనూ కలిసి, సోవియట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రహస్యమైన కుట్ర చేస్తున్నారని, 'సోవియట్ వ్యతిరేక ట్రాట్స్కీ యైట్ల మితవాదుల కూటమి' విచారణ (1938లో) బయటపడింది. పైన పేర్కొన్నవారంతా బ్రెస్టు – లితోవ్స్క్ సంధిని భగ్నం చేయడానికీ, లెనిన్, స్టాలిన్, స్వెర్ట్‌లోవ్‌లను అరెస్టు చేసి, హత్య చేసి, వామపక్ష ఎస్.ఆర్.లతో కలిసి ఒక నూతన ప్రభుత్వాన్ని ఏర్పరచేందుకు కుట్రపన్నారని ఆ విచారణ ద్వారా వెల్లడైంది.

ఈ రహస్య విప్లవ ప్రతీఘాత కుట్రను చేస్తూనే, మరోపక్క బోల్షివిక్ పార్టీపై ఈ తీవ్రవాద కమ్యూనిస్టుల ముఠా, ట్రాట్స్కీ మద్దతుతో బహిరంగ దాడికి సైతం పాల్పడింది. పార్టీని చీల్చడానికీ, అనుచరవర్గాన్నీ విడదీయ డానికీ ప్రయత్నించింది. శాంతి సంభాషణల కాలంలో ఈ ముఠాకు మాస్కో, పెట్రోగ్రాడ్, ఉరాల్స్ వగైరాలకు చెందిన కొన్ని పార్టీ శాఖల్లో కొంత తోడ్పాటు లభించింది. దాంతో ఈ ముఠా మరింత రెచ్చిపోయింది.

పార్టీ బయట సాగుతున్న దుష్ప్రచారం సరే, పార్టీ లోపలే ఎదురైన ప్రతిఘటన వల్ల ఆపద్ధర్మ శాంతి సంధి కుదుర్చుకోవడంలో ఇబ్బందులు ఏర్పడి, పార్టీ తీవ్ర సంకట పరిస్థితుల్లో పడింది. దీంతో జర్మనీ యుద్ధ రంగం పొడవునా తీవ్రమైన దాడులకు పాల్పడి, మరింతగా లోలోపలికి చొచ్చుకుని వస్తూ, పెట్రోగ్రాడ్‌ని సమీపించింది. రాజధాని నగరానికి ప్రమాదం సంభవించడంతో, బూర్జువాలూ, భూస్వాములూ, సామ్రాజ్య వాద బంట్లూ చక్కని అవకాశం చిక్కిందని సంబరపడిపోయారు. జర్మనీ, దాని మిత్రరాజ్యాల సైన్యాలకు స్వాగత సత్కారాలు జరపడానికి సిద్ధపడి పోయారు. పనిలో పనిగా హతమార్చాల్సిన బోల్షివిక్ పార్టీ నాయకుల లిస్టులు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు!

పార్టీలో ఏర్పడ్డ పరిణామాలు లెనిన్‌కూ, ఆయన అనుచరులకూ తీవ్ర మనస్తాపాన్ని కలిగించాయి. విషమ పరిస్థితుల్ని ఎదుర్కోవడం ఆయనకు కొత్తకాదు. తనను భౌతికంగా అంతం చేసేందుకు జారిజమూ, ఆపై తాత్కాలిక ప్రభుత్వమూ చేసిన ప్రయత్నాల నుండే ఆయన పలుమార్లు సురక్షితంగా బయటపడ్డారు. ఆయన ప్రాణాలు ఎంత విలువైనవో పార్టీకి తెలుసు. అక్టోబర్ విప్లవానికి ముందే కాదు, ఆ తర్వాత ఆయన ప్రత్యర్థుల భయంకర దాడులకు లక్ష్యంగానే ఉన్నారు. అయితే జాగ్రత్తగా ఉండమని తన శ్రేయోభిలాషులైన పార్టీ సహచరులు పదేపదే చేసే హెచ్చరికలను ఆయన అంతగా పట్టించుకోలేదు. (అందు వల్లనే సమీప భవిష్యత్తులో ఆయనపై పలుమార్లు తుపాకీ కాల్పులు జరిగాయి. ఒక సంఘటనలో ఆయన తీవ్రంగా గాయపడి, ఆ గాయాల తోనే చివరికి మరణించారు – రచన) కానీ రాజకీయంగా జరిగే దాడుల్ని మాత్రం ఆయన ఏ మాత్రం ఉపేక్షించేవారు కాదు. అందునా ఇది కేవలం తన రాజకీయ పంథా మీద మాత్రమే కాదు. దేశ భవిష్యత్తు మీదా, విప్లవ భవిష్యత్తు మీదా జరుగుతున్న ఘోరాతి ఘోరమైన దాడి. అందువల్లే తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.

అయితే బాధపడుతూ కూర్చుంటే ప్రయోజనం ఏమిటి? దానివల్ల పరిస్థితులు మరింత విషమిస్తాయి తప్ప, సరికావు. శత్రువుల రాజకీయ

దాడులను, రాజకీయ పోరాటాలతోనే ఎదుర్కోవాలి! అయితే శత్రువుల్ని గుర్తించడం తేలిక. అందువల్ల వారిపై జరిపే సైద్ధాంతిక పోరాటాల్ని నిర్వర్తించడం కూడా తేలికైన విషయమే. కానీ మిత్రుల రాజకీయ దాడుల్ని గుర్తించడం కష్టం. అలాగే వారిపై జరిపే రాజకీయ పోరాటాల్ని నిర్వహించడం కూడా కష్టమైన విషయమే. అందునా ఈ మిత్రులు సొంత పార్టీలోని వారే. అంతేకాక వీరిలో కొందరు సెంట్రల్ కమిటీ సభ్యులుగా కూడా ఉన్నారు! (వీరి నిజ ఉద్దేశాల గురించి లెనిన్‌కు ఏమాత్రం అనుమానం కలుగలేదు. కేవలం తన రాజకీయాల్ని వ్యతిరేకిస్తున్న వారిగానే ఆయన చూశారు గాని, తననూ, తన మద్దతు దారుల్నీ భౌతికంగా అంతం చేయడానికి తగిన అదును కోసం చూసేవారిగా ఏమాత్రం ఆయన అనుమానించేవారు కాదు – రచన) అందువల్లనే వారు తనపై పార్టీ సభల్లో ఎంతగా బురద చల్లేందుకు ప్రయత్నించినా, వారిపై ఆ స్థాయిలో విరుచుకుపడక, సరళంగా, సున్నితంగా మందలిస్తూ, ప్రత్యుత్తరం ఇచ్చారు. వారిని పార్టీలో కలుపుకుపోయేందుకే ప్రయత్నించాడు. మిత్రులుగానే వారిని భావించారు. తనకు మద్దతిచ్చే వారిని 'పెత్ల్యూర' (ఉక్రేనియన్ జాతీయ వాదుల నాయకుల్లో ఒకరు.) తో పోల్చి బుహారిన్ పట్ల లెనిన్ వ్యక్తం చేసిన అభిప్రాయం, ఆయన మాటల్లోనే 'ఒకే పార్టీలో సభ్యులుగా మనం కలిసి ఉండడం. బుహారిన్‌తో 96 శాతం మనం ఏకీభవిస్తున్నా మన్న విషయాన్ని తెలియజేస్తోంది. మనం సొంత కామ్రేడ్స్ కుటుంబంలో ఉన్నాం. మనం మన సొంత మహాసభలో ఉన్నాం' (కేంద్ర కమిటీ రాజకీయ నివేదికపై ముగింపు ప్రసంగం. తేదీ 8-3-1918 లెనిన్ సంకలిత రచనలు, ఆరవ సంపుటి, 90, 98 ల పేజీల నుంచి)

ఈ విధంగా వారితోటి వైరుధ్యాన్ని ఆయన మిత్ర వైరుధ్యంగానే చూశారు. కానీ వారు దాన్ని శత్రు వైరుధ్యంగా చూసినట్లు చరిత్ర మనకు తెలియజేస్తోంది. అయితే లెనిన్ వారు లేవనెత్తిన అంశాల్ని తక్కువ చేసి చూడలేదు. తీవ్రంగానే తీసుకున్నారు. వారిని ఎదుర్కొనే విషయంలో ఏ మాత్రం ఆవేశానికి లోనుకాకుండా, తీవ్రనిగ్రహంతో వ్యవహరించారు. తన సునిశిత మేధస్సుతో, వస్తుపరమైన పరిస్థితుల ఆధారంగా రాజకీయ పరమైన కచ్చితమైన జోస్యాలను చెప్పగల ధీశక్తితో, సూత్రబద్ధమైన వైఖరితో ప్రత్యర్థులను ఎదుర్కొని, వారి వాదాల్ని పటాపంచలు చేశారు. తద్వారా ప్రత్యర్థుల నుండి వారి అనుచరుల్ని విడదీయడమేగాక, ఊగిసలాడుతున్న కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసి, తన పోరాటంలో విజయాన్ని సాధించారు.

అయితే అప్పటికే కొంత నష్టం జరిగింది. జర్మనీ, దాని మిత్ర రాజ్యాల గొంతెమ్మ కోర్కెలు శ్రుతిమీరాయి. వామపక్ష కమ్యూనిస్టుల, ట్రాన్సీయిస్టుల చర్యల ఫలితమే ఇది. అయినప్పటికీ సంధి కుదుర్చుకోక గత్యంతరం లేదు. ఆ సయమంలో ప్రత్యర్థుల గోలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మరల లెనిన్‌కే విజయం. లెనినిజంలోని విశేషం ఇదే. రాబోయే పరిణామాల్ని ముందుగానే ఊహించి, తగిన సన్నద్ధతలు తీసుకోవడమే ఆయన విజయ రహస్యం! ఈ పరిణామంలో కూడా పార్టీ పత్రికల్లో దాదాపు రోజుకో వ్యాసం రాసి, అవసరమైన స్థాయిలో వెంటవెంటనే సమావేశాలు నిర్వహించి, కార్యకర్తల్ని విజ్ఞానవంతం చేసి, ప్రత్యర్థుల వాదాల్లోని బలహీనతల్ని అందరికీ ఎరుకపరచి, వారి మద్దతు సంపాదించారు. దేశ చరిత్రలో, అలాగే బోల్షివిక్ పార్టీ చరిత్రలో కూడా ముఖ్యమైన ఈ మలుపులోని పరిణామాలను గమనించడం రాజకీయ చరిత్ర పాఠకులకు ఎంతైనా ఆసక్తిదాయకం కనుక ఇప్పుడాయన అంశాల్ని క్లుప్తంగా పరిశీలిద్దాం.

విడి ఆపద్ధర్మ శాంతి సంధి కుదుర్చుకోవాలంటే, తమ షరతులేమిటో జర్మనీ, దాని మిత్ర పక్షాలు జనవరి 5న తెలిపినట్లు ఇంతకు ముందు తెలుసుకున్నాం. అయితే ఆ షరతుల్ని రష్యా ఆమోదించాలంటే, మొదట పార్టీ, ఆపై అత్యున్నత అధికార పీఠమైన అఖిల రష్యా సోవియట్ల మహాసభ అంగీకరించాలి. పార్టీ అంగీకారానికి పూర్వం సామాన్య కార్యకర్తల మనోగతాన్ని అందుకు అనుగుణంగా మలచాల్సి ఉంటుంది. అయితే, అక్టోబర్ విప్లవం అతి తక్కువ రక్తపాతంతో విజయం సాధించడం, అనంతరం సాగిన ప్రతీఘాత దాడుల అణచివేత కూడా తేలిగ్గానే జరగడం వల్ల ఇప్పుడు కార్యకర్తలంతా సునాయాస విజయాల మత్తులో ఉన్నారు. అందువల్ల వారు నిలువెల్లా ఆయుధాలు ధరించిన జర్మన్ సైన్యాన్ని కేరెన్స్కీ (అక్టోబర్ విప్లవానికి ముందు రష్యా ప్రధాని) దళాల కన్నా అధికంగా వారు భావించడం లేదని లెనిన్ గ్రహించారు. అందువల్ల వారు జర్మనీతో ఆపద్ధర్మ సంధిని అసలేమాత్రం ఊహించలేక పోతున్నారని కూడా ఆయన తెలుసుకున్నారు. అంతేగాక, వారిని పార్టీలోని ప్రత్యర్థులు రకరకాలుగా రెచ్చగొడుతుండడం కూడా ఆయన చూస్తూనే ఉన్నారు. అందువల్ల వారికి వాస్తవాల్ని తెలియ జేయాలని భావించి, పార్టీ సెంట్రల్ కమిటీ సమావేశానికి (జనవరి 11న) ముందుగా, జనవరి 8న పెట్రోగ్రాడ్‌లో గల పార్టీలోని ప్రముఖ సభ్యులు కొంతమందితో (63 మంది) సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 'ఆపద్ధర్మ శాంతి సంధి సమస్య చరిత్ర గురించి' అనే పేరుతో అంతకు ముందు రోజు సవివరంగా తాను రాసిన వ్యాసాన్ని వారికి వినిపించారు.

ప్రస్తుతం జరుగుతున్న శాంతి సంప్రదింపుల్లో తేలింది ఏమంటే, మనం ఇప్పుడు యుద్ధాన్ని కొనసాగించడమో లేదా దురాక్రమణ పర శాంతికైనా ఒప్పుకోవాలని, ఈ రెండు ప్రత్యామ్నాయాలే తప్ప, మూడో పరిష్కారం లేదని, అదీగాక సంభాషణల్ని ఇకపొడిగించడం కూడా కుదరదని, వెంటనే ఏదో ఒకటి నిర్ణయించుకోవాలని లెనిన్ తన వ్యాసంలో వివరించారు. కొంతమంది తక్షణ విప్లవాత్మక యుద్ధాన్ని కొనసాగించేందుకు అనుకూలంగా కొన్ని వాదనలను వినిపిస్తున్నారని చెపుతూ ఆయన, ఆయా వాదలనూ, వాటిలోని అసంబద్ధతలనూ వివరించారు.

వాటిలో మొదటి వాదన ప్రకారం, ఈ తరుణంలో జర్మనీతో విడిగా శాంతి సంధి చేసుకోవడం 'ఒక సామ్రాజ్యవాద బేరం'గా ఉండడమేగాక, అది అంతర్జాతీయ శ్రామిక వర్గ మౌలిక సూత్రాలకు పూర్తి విరుద్ధంగా ఉంటుంది.

అయితే పై వాదన తప్పని ఆయన చెపుతూ, అందుకొక చక్కని ఉదాహరణ ఇచ్చారు. ఒకానొక కార్మిక సంఘం, తాను చేసిన సమ్మెలో ఓడిపోయినప్పుడు, అది తన యజమానులతో తిరిగి పనిలో చేరేందుకు చేసుకునే ఒప్పందంతో ఆయన ఈ శాంతి సంధిని పోల్చారు. ఆ ఒప్పందంలో ఆ కార్మిక సంఘం తన యజమానులకు అనుకూలమైన, తనకు అననుకూలమైన షరతుల్ని పొందుపరచాల్సి ఉంటుంది. అంత మాత్రం చేత ఆ కార్మికసంఘం సోషలిజానికి ద్రోహం చేసిందని అనం. అందుకు విరుద్ధంగా, యజమానులకు లాభాలను చేకూర్చి, తమలోని కొద్ది మంది కార్మికులకు రాయితీలు సాధించే వారినే సోషలిజానికి ద్రోహులుగా పరిగణిస్తాం అని ఆయన ఈ రెండింటిలోని తేడాలను తెలిపారు. ఇప్పుడు కొంతమంది (రాజీవాదులు) జర్మనీతో జరిగే

యుద్ధాన్ని రక్షణాత్మక ధర్మ యుద్ధమని చెపుతూ, ఆచరణలో ఆంగ్ల – ఫ్రెంచి సామ్రాజ్యవాదుల్ని అంటకాగుతూ, స్వార్థం కోసం వారితో కుదుర్చుకున్న ఒప్పందాల్ని మరుగున పరుస్తున్నారని, వారే అసలైన సోషలిజానికి ద్రోహం చేసే వారని ఆయన విమర్శించాడు.

తక్షణ యుద్ధానికి అనుకూలంగా ఉన్న మరో బలమైన వాదన ఏమంటే, శాంతి సంధిని కుదుర్చుకోవడం ద్వారా రష్యన్లు జర్మన్ సామ్రాజ్యవాదపు ఏజెంట్లవుతారనేది. దీని ప్రకారం జర్మనీ తన సైనికుల్ని రష్యన్ రంగం నుంచి ఉపసంహరించుకునేందుకు రష్యన్ ప్రభుత్వమే అవకాశం కల్పించినట్లవుతుంది.

ఈ వాదన కూడ పూర్తిగా తప్పని ఆయన వివరించారు. ఎందుకంటే, విప్లవాత్మక యుద్ధమని చెప్పబడే యుద్ధం ద్వారా నిజానికి రష్యన్లు ఆంగ్లో – ఫ్రెంచ్ సామ్రాజ్యవాదపు ఏజెంట్లవుతారు. రష్యన్లు ఈ యుద్ధాన్ని గనుక కొనసాగిస్తే, ఆ సైన్యంలోని ప్రతి ఒక్కడికీ వంద రూబుళ్లు ఇస్తామని బ్రిటిష్ వాళ్లు రష్యన్ సేనాధిపతి క్రిలెంకోకి ఆశ చూపిన సంగతిని ఈ సందర్భంగా లెనిన్ గుర్తు చేశారు. నిజానికి వారి వద్ద తాము ఒక్క కోపెక్కు తీసుకోక పోయినప్పటికీ, జర్మన్ సైన్యంలో కొంత భాగాన్ని పక్కకి మళ్లించడం ద్వారా, వారికి సాయం చేసిన వారమవుతామని ఆయన వివరించారు. ఈ దృష్ట్యా తాము ఏదో ఒక సామ్రాజ్యవాద బంధాల నుండి తప్పించుకోలేమనీ, అయితే దీని నుండి చేయాల్సిన నిర్ధారణ ఏమంటే, రెండు సామ్రాజ్యవాద దేశాల్లో దేనికి తోడ్పడితే లాభకరం అని కాకుండా, ఒక దేశంలో విజయం సాధించిన సోషలిజాన్ని నిలబెట్టుకోవడమే ముఖ్యమని ఆయన సూత్రీకరించారు.

ఈ విధంగా తక్షణ విప్లవాత్మక యుద్ధానికి అనుకూలవాదల్ని సమీక్షించిన పిదప తాము చేయాల్సిన నిర్ధారణల గురించి ఆయన వివరించాడు. ప్రస్తుతమేగాక, రాబోయే కొద్ది నెలల వరకూ తమకు జర్మన్ల దాడిని తిప్పిగొట్టగలిగే పరిస్థితిలో తన సైన్యం లేదనీ, ప్రస్తుతం అది అలసి ఉన్నదనీ, దీనికి తోడు తిండి పదార్థాల సరఫరా, ఉసిపోయిన వారి స్థానంలో కొత్తవారిని ప్రవేశపెట్టడం – ఇదంతా అస్తవ్యవస్తంగా ఉంది. రెండో విషయం ఏమంటే, గుర్రాలు పనికి మాలిన స్థితిలో ఉన్నందున, ఫిరంగిబలం నాశనమైపోతుంది. తీరాన్ని రక్షించే స్థితి లేనందున, శత్రువులు పెట్రోగ్రాడ్‌ని ఆక్రమించుకోగలిగి ఉన్నారు. సైన్యంలో మెజారిటీకి యుద్ధం ఇష్టం లేదు. సైన్యాన్ని ప్రజాస్వామికీ కరంచడానికి కొన్ని నెలలు పడుతుంది. ఈ అంశాన్ని పట్టించుకోకుండా యుద్ధాన్ని కొనసాగిస్తే, పరిణామాలు వేరుగా ఉండి, ఇంతకన్నా అననుకూల శాంతి సంధిని కుదుర్చుకోవలసి ఉంటుందనీ, మరిన్ని తీవ్ర పరాజయాలు ఎదురైతే, సోషలిస్టు ప్రభుత్వమే మారిపోయి, వేరే ప్రభుత్వం శాంతి సంధిని కుదుర్చుకోవలసి ఉంటుందనీ, ఎందుకంటే, యుద్ధం మూలంగా అలసిపోయిన రైతు సైన్యం బహుశా కొద్ది వారాల్లోనే ప్రస్తుత ప్రభుత్వాన్ని కూలదోస్తుందనీ ఆయన హెచ్చరించారు.

ఆయన తన వ్యాసాన్ని చదివి వినిపించిన అనంతరం వోటింగ్ తీసుకోవడం జరిగింది. వోటింగ్‌లో లెనిన్‌ని సమర్థించినవారు కేవలం 15 మంది మాత్రమే 32మంది 'వామపక్ష కమ్యూనిస్టుల' వైఖరి (జర్మనీతో విప్లవాత్మక యుద్ధాన్ని చేయాలి) ని బలపరచగా, 16 మంది ట్రాట్స్కీ వైఖరి (జర్మనీతో శాంతి వద్దు, యుద్ధం వద్దు) ని సమర్థించారు. దీంతో లెనిన్‌కు తన ముందున్న కర్తవ్యంలోని తీవ్రత అర్థమై, అందుకు తగిన సన్నద్ధం అయ్యేందుకు పూనుకున్నారు.

శాంతి సంధి విషయమై చర్చిందానికి పార్టీ కేంద్ర కమిటీ సమావేశం జనవరి 11న జరిగింది. అందులో లెనిన్, అంతకు ముందు జనవరి 8న పార్టీ ముఖ్య కార్యకర్తలు 63 మంది ముందు తాను ఈ అంశంపై చదివి వినిపించిన ప్రధానాంశాలనే వివరించి, అప్పుడు తీసుకున్న వోటింగ్ సరళి గురించి తెలిపారు. తర్వాత 'వామపక్ష కమ్యూనిస్టులూ' ట్రాట్స్కీ – లెనిన్ ప్రస్తావించిన అంశాల్ని ఖండించి తమ తమ వాదాల్ని వినిపించాక, శాంతి సంధిపై జరిగిన చర్చలో లెనిన్‌నే మెజారిటీ సభ్యులు బలపరిచారు. అయితే ప్రజా బాహుళ్యంలో విప్లవాత్మక యుద్ధాన్ని సమర్థించే ఒక ధోరణి ఉన్నందున, దాన్ని మార్చేందుకుగాను రెండో విడత శాంతి సంభాషణల్లో చర్చలు సాధ్యమైనన్ని ఎక్కువ రోజులు కొనసాగించాలనీ, జర్మనీ తుది అల్టిమేటమ్ ఇచ్చేపక్షంలో, వెంటనే సంతకాలు పెట్టాలనీ ప్రతిపాదిస్తూ, ఈ ప్రతిపాదనపై వోటింగ్‌ను ఆహ్వానించారు లెనిన్. లెనిన్ ప్రతిపాదన 12–1 వోట్లతో ఆమోదం పొందింది.

అనంతరం శాంతి సంభాషణల్లో రష్యన్ బృందానికి నాయకత్వం వహించేందుకు గాను రష్యా విదేశీ వ్యవహారాల శాఖ ప్రజా కమిస్సార్ అయిన ట్రాట్స్కీ బ్రెస్ట్ – లితోవ్స్క్‌కు బయలుదేరివెళ్లారు. వెళ్లే ముందు అతడికి కేంద్ర కమిటీతో పాటు లెనిన్, శాంతి సంభాషణల్లో రష్యన్ వైఖరికి సంబంధించి స్పష్టమైన ఆదేశాలివ్వడం జరిగింది. ఆ ఆదేశాల ప్రకారం, శాంతి సంభాషణల్ని సాధ్యమైనంత దీర్ఘకాలం కొనసాగేలా చూడాలి. ఒకవేళ జర్మన్ పక్షం, తమ షరతుల్ని ఒప్పుకోని పక్షంలో సంభాషణలు భగ్నం అవుతాయని, అల్టిమేటమ్ గనుక ఇచ్చిన పక్షంలో ఆ షరతుల్ని ఒప్పుకుంటూ వెంటనే శాంతిసంధి మీద సంతకాలు పెట్టాలి.

అయితే ట్రాట్స్కీ, తనకివ్వబడిన ఆదేశాల్లో మొదటిదాన్ని సరిగానే నిర్వహించారు. అసలే అతడు జిత్తులమారి. తన అంతరంగాన్ని ఎదుటి వారికి చెప్పకుండానే ఎదుటి వారి ఉద్దేశాల్ని బయటపెట్టించి, వారిని బోల్తాకొట్టించడంలో అఖండమైన తెలివితేటలు కలవాడు. అతడు సంభాషణల్ని జనవరి 28 దాకా పొడిగించగలిగారు. కానీ జర్మనీ అల్టిమేటమ్ ఇచ్చి, వైఖరిని స్పష్టం చేయమనీ, తమ షరతుల ప్రకారం సంతకాలు చేసేదీలేనిదీ వెంటనే స్పష్టం చేయమనీ నిలదీసే సరికి, అతడి వైఖరి మారిపోయింది. అతడు దేశానికి ఆపద సమయంలో, సోవియట్ల అధికారాన్ని, విప్లవాధికారాన్నీ కాలరాచే విధంగా, ద్రోహబుద్ధితో తన వ్యక్తిగత అజెండా అమలు పరిచేందుకు, పదవిని అడ్డుపెట్టుకుని మరీ ప్రవర్తించాడు. ఆ విధంగా అతడు పార్టీ కేంద్ర కమిటీ, ప్రజా కమిస్సార్ల సమితి అధ్యక్షుడైన లెనిన్ ఆదేశాల్ని ఉల్లఘించి, తన ద్రోహ బుద్ధిని బయటపెట్టుకున్నారు.

దీంతో శాంతి సంభాషణలు భగ్నమయ్యాయి. లెనిన్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఎప్పటికప్పుడు ట్రాట్స్కీ ఇలా ద్రోహబుద్ధిని బయట పెట్టుకుంటూనే ఉన్నారు. అతడు మారుతాడు కదా అన్న ఉద్దేశంతోనే పార్టీలోకి అతన్ని ఆరవ కాంగ్రెస్‌లో (1917 ఆగస్టు) చేర్చుకున్నారు. నమ్మి అతడికి పదవిని కట్టబెడితే, ఇలా ప్రవర్తించారు. అయితే అతడు ఒంటరిగా లేదు. వామపక్ష కమ్యూనిస్టులు అతడి తోకగా పార్టీలోనే ఉన్నారు. పార్టీ బయట వామపక్ష, మితవాద ఎస్.ఆర్.లూ, మెన్షివిక్కులూ గుంటకాడ నక్కల్లా కాచుకుని ఉన్నారు! అయితే బాధకరం విషయం ఏమంటే, పార్టీలోని సాధారణ కార్యకర్తలు కూడా పెక్కు మంది, విప్లవం తేలిగ్గా గెలుపొందిన మత్తులో ఇలాంటి వారికి వంతపాడుతున్నారు.

హేతువాద ఉద్యమాలు - మీడియా వైఖరి

ప్రజా చైతన్య వేదికలకు అండగా ఉండవలసిన మీడియా నేడు హిందూ సామ్రాజ్యవాద శక్తులతో జతకట్టి ప్రజల చైతన్యాన్ని కించపరిచే స్థాయికి దిగజారుతోందని అంటున్నారు **పల్లవోలు రమణ**

ఒక మంచి కార్యక్రమం కొత్తగా జరుగుతుంటే ఇది ఎందుకు చేస్తున్నారు? దీనివల్ల సమాజానికి ఎంత మేరకు మేలు జరుగుతుంది అని తెలుసుకోవడానికి ప్రయత్నించడం 'విజ్ఞానం' అవుతుంది. అంతేకాని కొత్తను చూడగానే ఆశ్చర్యపోయినా, భయపడినా అది వారి అజ్ఞానమే అవుతుంది. ఈ కోవలోకే వస్తుంది ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి నాడు చెన్నైలోని పెరియార్ తెడెల్ నందు జరిగిన 'తాళి – ఎగతాళి' కార్యక్రమం. ఈ కార్యక్రమం పేరు వింటూనే అనేక మంది హిందూ సాంప్రదాయాన్ని అవపోసన పట్టిన మేధావి వర్గంగా గుర్తింపు పొందిన విఎచ్‌పి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు చర్చల పేరుతో ఎలక్ట్రానిక్ మీడియా, పత్రికా మాధ్యమాల ద్వారా ఘాటైన విమర్శలు గుప్పించారు. హిందూ సాంప్రదాయాన్ని దెబ్బతీసేందుకని ఒకరు, డబ్బుకు అమ్ముడు పోయి తాళి తీసివేశారని మరొకరు, ఈ పనికి పూనుకున్న డి.కె.(ద్రవిడ కళగం) పార్టీ అధినేత అయిన డా. వీరమణిని అరెస్టు చేసి, ఆ పార్టీని నిషేధించాలని మరొకరు దుమ్మెత్తిపోశారు.

ఈ కార్యక్రమం మొత్తం ప్రత్యక్షంగా చూసిన నేను ఈ విషయంపై వివరణాత్మకంగా నాకు తెలిసిన మేరకు ప్రజలకు వివరించాలని తలచాను.

సమాజంలో సమూల మార్పు రావాలని కోరుకునే వారిలో ద్రవిడ కళగం పార్టీ ఒకటి. ఈ పార్టీ స్త్రీ పురుష సమానత్వాన్ని ఉద్ఘాటిస్తుంది. తరతరాలుగా స్త్రీ బానిసత్వానికి ప్రతీకగా ఉన్న తాళిని తీసివేయాలనే కార్యక్రమం డి.కె.పార్టీ తీసుకుంది. పెరియార్ ఆదర్శాలు, సిద్ధాంతాల ద్వారా ఏర్పాటైన ఈ పార్టీకి ఇటువంటి కార్యక్రమాలు జరపడం కొత్తేమీ కాదు. అందుకు అంబేద్కర్ 125వ జయంతిని పురస్కరించుకొని ఈ పని చేయడం మొదలు పెట్టింది. సమాజంలో పేరుకపోయిన మూఢ నమ్మకాలు, విశ్వాసాల పైన అనునిత్యం కార్యకర్తలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తు ఉంటారు. ఇక్కడ పని చేసేవారు పూర్తిగా నాస్తికులై ఉంటారు. వారి ఇళ్లకు వెళ్లి చూస్తే వారి భార్య మెడలో తాళి, కాళ్లకు మెట్టెలు ఉండవు. అంతే కాకుండా పెరియార్, దేశ నాయకుల ఫోటోలు తప్ప దేవుళ్ల ఫోటోలు కనపడవు. వారి కుమార్తెలను, కుమారులను దాదాపుగా నాస్తికులకే ఇచ్చి పెళ్లిళ్లు చేస్తుంటారు. అంబేద్కర్ జయంతి కార్యక్రమానికి నన్ను, నా మిత్రుడు ప్రజా నాస్తిక సమాజం వ్యవస్థాపకులు జి.డి.సారయ్యను ప్రత్యేకంగా డి.కె.పార్టీవారు ఆహ్వానించారు. మాకు గతంలో పరిచయమున్న నాస్తిక కుటుంబాన్ని కలిసేందుకు వెళ్లాం. ఆ కుటుంబాన్ని చూసి నాకు ఆశ్చర్యం కలిగింది. ఆ కుటుంబ యజమాని పేరు గోరా. ఆయన వయస్సు 75 ఏళ్లు. సుమారు పదిహేనేళ్ల నుంచి వెన్నుపూస నొప్పితో మంచానికి, ఆ ఇంటికే పరిమితమై ఉన్నారు.

ఇక జర్మనీ దాడి చేయదని వారి మాటల్ని వీరు గుడ్డిగా విశ్వసిస్తున్నారు. అయితే రక్తం రుచి మరిగిన పులి ఊరికే కూర్చుంటుందా? అది తిరిగి పంజావిసిరినప్పుడే, సత్యం బోధపడుతుంది. అప్పుడు పై వారు దారికైనా వస్తారు. లేదా వారిని అనుసరించేవారు వారికి వీడ్కోలైనా పలుకుతారు!

లెనిన్ అంచనా తప్పిపోవడమన్నది ఎప్పుడూ జరగలేదు. ఆ రోజు ఎప్పుడో కాదు. త్వరగానే వచ్చింది. ఫిబ్రవరి 16న జర్మనీ, తాను కుదుర్చుకున్న యుద్ధ విరమణ సంధిని రద్దు చేసుకుంటున్నట్లూ, తిరిగి తాను యుద్ధ కలాపాల్ని మొదలెడుతున్నట్లూ ప్రకటించి, ఆ తర్వాత రెండు రోజులకే, అంటే ఫిబ్రవరి 18న యుద్ధ రంగం పొడవునా దాడులు సాగించింది. ఇది డిసెంబర్ రెండు నాటి యుద్ధ విరమణ సంధి షరతుల ఉల్లంఘన తప్ప వేరు కాదు. ఆ షరతుల ప్రకారం, ఏదైనా దేశం యుద్ధ చర్యలు ప్రారంభించడానికి ఏడు రోజుల వ్యవధినివ్వాలి. కానీ జర్మనీ రెండో రోజులకే యుద్ధాన్ని ప్రారంభించింది!

జర్మనీ ప్రకటన వెంటనే, ఫిబ్రవరి 17నే సాయంకాలం లెనిన్ కేంద్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించి, తిరిగి జర్మనీతో సంప్రదింపులు ప్రారంభించాలని ప్రతిపాదించారు. అయితే జర్మనీ అలా ప్రకటిస్తుంది గానీ, దాడి జరపదని ట్రాట్స్కీ గట్టిగా వాదించడంతో, లెనిన్ ప్రతిపాదన వీగిపోయింది. తిరిగి ఇదే సమస్య మీద 18 నాటి ఉదయం కూడ చర్చ జరిగి, మరల లెనిన్ ప్రతిపాదన వీగిపోవడం జరిగింది. అయితే జర్మనీ దాడి చేసిన సంగతి 18వ తేదీ సాయంకాలానికి తెలిసి, వెంటనే సి.సి. అత్యవసర సమావేశం నిర్వహించారు. లెనిన్ ముందుచూపు అప్పటికి గానీ సభ్యులకు తెలిసింది కాదు. అలాగే ట్రాట్స్కీ మాటల్లోని డొల్లతనం కూడ వారికి తెలిసి వచ్చింది. అయినప్పటికీ ట్రాట్స్కీ, 'తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లన్నట్లు తన మాటల్నే పట్టుకుని వేళ్లాడినా, వామపక్ష కమ్యూనిస్టులు ఇంకా అతనికి వంతపాడడం మానలేదు. కమిటీలో సుదీర్ఘంగా, తీవ్రవాదోప వాదాలు జరిగిన అనంతరం, మెజారిటీ సభ్యులకు లెనిన్‌ని బలపరచక తప్పింది కాదు. అందువల్ల ముందు అనుకున్న ప్రకారం జర్మన్‌లు పెట్టిన షరతుల్ని ఒప్పుకుంటూ, శాంతి సంధి మీద సంతకాలు పెట్టేందుకు సోవియట్ ప్రభుత్వం తన సంసిద్ధతను తెలియజేస్తూ, ఫిబ్రవరి 19 ఉదయాన ఒక వైర్లెస్ సందేశం పంపించింది. జర్మనీ తన కచ్చితమైన షరతుల్ని తెలిపితే, 12 గంటల్లో తన సమ్మతిని తెలుపుతానని అది ప్రకటించింది.

(ఇంకా ఉంది)

(రచయిత రిటైర్డ్ లెక్చరర్) వీ

అయితే ఆయన మాటల్లో దేవుడులేడన్న విషయాన్ని పదే పదే చెప్పడం నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. ఇటువంటి ఎన్నో కుటుంబాలు డి.కె.పార్టీలో ఉన్నాయి. ఇక అసలు విషయానికి వద్దాం.

ప్రస్తుత పురుషాధిపత్య సమాజంలో స్త్రీలు మార్పు కోరుకోవడం సమంజసం కాదంటారా? ఒక్కసారి ఆలోచించండి. ఒక స్త్రీ బయటికెలితే ఆమె కట్టు, బొట్టు, వేషధారణ చూసి ఆమె వివాహితా, అవివాహితా, వితంతువా అనే విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ పురుషుడికి ఆ పరిస్థితి ఉందా? తరతరాల స్త్రీ సాంప్రదాయాలతో, కట్టుబాట్లతో బానిసత్వంలో మగ్గిపోతోంది.

బాల్యంలో తండ్రి వద్ద, యుక్త వయసులో భర్త ఆధీనంలో, వృద్ధాప్యంలో కొడుకుల ఆధీనంలో ఉండాలని మనుధర్మశాస్త్రం ఘోషిస్తుంది. స్త్రీలు జన్మతా బానిసలు అని మన హిందూ వేదాలన్ని చెపుతున్న మాటలే.

ఏ సనాతన ధర్మాలు కూడా స్త్రీకి స్వేచ్ఛ నివ్వలేదు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పేవారు ఒక్కసారి చరిత్రను తిరిగేయాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉంది. సతీసహగమనం, అంటరానితనం, బాల్యవివాహాలు, తదితర సాంప్రదాయాలన్నీ హిందూ సాంప్రదాయాలేనన్న వాస్తవాన్ని మొదట మరచిపోవద్దని మనవి చేస్తున్నాను. ఈ రోజు సతీసహగమనం పేరు వింటేనే ఒళ్లు గగుర్పాటుకు గురవుతుంది. కానీ నేడు సతీసహగమనం మా హిందూ సాంప్రదాయం, మేం నిర్వహించుకుంటాం అనే దమ్మూ - ధైర్యం ఏ హిందువులోనైనా ఉందా? ముందు మనం ఆలోచించాలి. అలాగే అంటారని తనం కూడా. 'అంటరానితనం అనుభవిస్తే కానీ తెలియదంటాడు ఒక గొప్పవ్యక్తి. అది అక్షరాల నిజం. ఒక అగ్రవర్ణుడి ఇంటికి వెళ్లి మంచినీరు కావాలని అడిగితే పశువుల మూత్రం ఎత్తే పాత్రతో నీళ్ల దోసిట్లో పోయించుకొని తాగేవాడికి తెలుస్తుంది బాధ ఎలాగుంటుందో. అలాగే బాల్యవివాహాలు. పూర్వం ఆడపిల్ల పుష్పవతి కాకముందే వివాహం చేసేవారు. అదికూడా వృద్ధులకు ఇచ్చి వివాహాలు జరిపించేవారు. శారీరక, మానసిక ఎదుగుదల లేక పురుషులు పెట్టే బాధలు భరించలేక బాలికలు పడే పాట్లు ఊహించుకుంటేనే కంపరం కలుగుతుంది. ఈ విధంగా ఎందరి జీవితాలు చిన్నాభిన్నమయ్యాయో ఊహించవచ్చు. ఎంతో మంది సంఘ సంస్కర్తలు బాల్యవివాహాలు, సతీసహగమనం, అంటరానితనం రూపుమాపుటకు పోరాటం చేశారని చరిత్రను తిరగేస్తే మనకు తెలుస్తుంది. ఒక మంచి కార్యం నిర్వహిస్తున్న వారిపై విమర్శలు గుప్పించడం గొప్పకాదు. ఒక ముందడుగును గుర్తించి, ఆహ్వానించడం సహేతుకమవుతుంది. ఈనాడు ఎంతో శాస్త్ర పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా మత విశ్వాసాలు, మూఢనమ్మకాలు తగ్గకపోగా రోజురోజుకూ అధికమైపోతున్నాయి. నేడు కూడా వితంతువులు పడే బాధలు వర్ణనాతీతం. కేవలం హిందూమతంలో మాత్రమే వితంతువులకు పునర్వివాహం చాలాకాలం పాటు నిషిద్ధంగా ఉండేది. అది ఇప్పటికీ కొనసాగుతోంది. భారతీయ హిందూ కుటుంబ వ్యవస్థ ఎవరెన్ని చెప్పినా బంధ వ్యవస్థగా ఉంది.

తాళి తెగిపోవడంతో పాటు భర్త చనిపోతే ఆమెను అలంకరణలన్నిటికీ దూరంగా ఉంచి అపశకునంగా భావించి, శుభకార్యాలని చెప్పబడుతున్న పెళ్లిళ్లు, పేరంటాలు తదితర కుటుంబ వేడుకలన్నిటికీ దూరంగా ఉంచుతున్నారు. ఇటువంటి ఆచారాలకు అర్థం తాళితో పాటు గౌరవం వస్తుంది, తాళితో పాటు గౌరవం పోతుందనా? ఇదేనా హిందూ సంప్రదాయం స్త్రీలకు ఇచ్చే గౌరవం? పురుషులకు లేని ఈ రకమైన కట్టుబాట్లు స్త్రీలకు నిర్దేశించారంటే అర్థం పురుషాధిపత్యం కాక మరేమవుతుంది?

పురుషాధిపత్య సమాజంలో స్త్రీలు మార్పు కోరడం సమంజసం కాదంటమా చెప్పండి. స్త్రీలకు స్వేచ్ఛ, సమానత్వం అంటామే కానీ, ఏ మతంలో ఎక్కడ ఉంది సమానత్వం, స్వేచ్ఛ?

పూర్వం పత్రికలంటే సమాజహితం కోరేవి. నిజాలను ప్రచురించేవి. అయితే శాస్త్ర పరిజ్ఞానం పెరిగిన తరువాత ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా చర్చల పేరుతో ఒక సంఘసంస్కరణ కార్యక్రమానికి మసి పూసి మారేడు కాయ చేసేందుకు కుట్రలు చేసింది. ఈ కార్యక్రమంపై వాస్తవాలను సమాజానికి ఉపయోగపడే విధంగా కాకుండా వక్రభాషలో ప్రజలకు వివరించే ప్రయత్నం జరిగింది. 'తాళి - ఎగతాళి' కార్యక్రమం ముగిసిన రెండు రోజులకు ఒక దినపత్రికలో 'నాడు తాళి అందించారు - నేడు తెంచారు' అనే శీర్షికతో రెండు ఫోటోలను ప్రచురించారు. డి.కె.పార్టీ అధినేత డా. వీరమణి తాళి చూపిస్తున్న ఫోటో అది. ఒక్క ఫోటో సంపాదించి ఘనకార్యం సాధించినట్లు అంత మంచి కార్యక్రమాన్ని భ్రష్టుపట్టించే ప్రయత్నం జరిగింది. ఇక ఈ అంశంపై చర్చకు ఫుల్‌స్టాప్ పెట్టినట్లు చేయడం కూడా ఒక కుట్రలో భాగంగానే చూడాలి. వాస్తవం ఏమిటంటే 2011లో చెన్నైలో జరిగిన ఒక మతాంతర, బ్రాహ్మణుడు లేని వివాహానికి వీరమణి హాజరయ్యారు. అక్కడ పెళ్లి కుమార్తె, తల్లిదండ్రులు తన కుమార్తెకు తాళి అందించాలని అభ్యర్థించారు. అయితే తాళి గురించి ఆయన వివరిస్తూ మాట్లాడుతున్న ఫోటో అది. నిజానిజాలు తెలుసుకునే ప్రయత్నం చేయకుండా కేవలం ఒక్క ఫోటో పెట్టి గాలి వార్తలు ప్రసారం చేయడం అత్యంత దుర్మార్గం. పెరియార్ సిద్ధాంతంతో నడుస్తున్న పార్టీ అధ్యక్షులు సామాజిక మార్పు కోరుకునే వారు ఆ రకంగా ఎందుకు చేస్తారన్న ఇంగిత జ్ఞానం ఆ పత్రికకు, వార్త రాసిన వాళ్లకు, ప్రచురించే వాళ్లకు ఉండాలి.

మత ఛాందస వాదులకు, సమాజాన్ని మధ్య యుగాల్లోకి తీసుకు పోవాలని అనుకుంటున్న వాళ్లకు, దొంగ స్వామీజీలకు, రంగురాళ్లకు, ఉంగరాలకు, వాస్తు జ్యోతిష్యాలకు, అన్ని రకాల మూఢవిశ్వాసాలకు ప్రసార సాధనాలు బలాన్నిస్తున్నాయి. సమాజం మారాలి అని తమ పరిధిలో పోరాటం చేస్తున్న ప్రగతిశీల శక్తుల మీద రాళ్లు విసురుతున్నాయి. జ్యోతిరావు పూలే, రాజారామ్‌మోహన్ రాయ్, వీరేశలింగం పంతులు సంఘసంస్కరణోద్యమాలు నడుపుతున్న కాలంలో ఇటువంటి మీడియా లేకపోబట్టి సరిపోయింది. సమాజంలో ప్రగతిశీల భావాలను ప్రచారం చేయడం కోసమే పత్రికలు అవతరించాయి. పెట్టుబడి ప్రసార మాధ్యమాలను ఆక్రమించుకున్నాక వికృతపోకడలు పోతోంది. శ్రీశ్రీ చెప్పిన 'పెట్టుబడికీ కట్టుకథకూ పుట్టిన విషపుత్రికలు' ఇంతింతై అన్నట్లు నేడు అందరి మెదళ్లనూ తొలుచుకుతింటున్నాయి. ఎప్పుడో ఒకప్పుడు మీడియా మీద ప్రజలు తిరగబడే రోజు కూడా వస్తుంది.

(రచయిత ప్రజానాట్య మండలి కళాకారుడు)

ఆయుధాల కుట్ర కేసు

నిజామాబాద్ జిల్లా, మాచారెడ్డి గ్రామంలో మార్చ్ 23న భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ (టఫ్) ఆధ్వర్యంలో బీడీ కార్మికుల సమస్యలపై సభ జరిగింది. ఈ సభకు తెలంగాణ పది జిల్లాల నుంచి టఫ్ కార్యకర్తలు, అరుణోదయ కళాకారులు, ఎఐఎఫ్‌టియు, దాని అనుబంధ బీడి వర్కర్స్ యూనియన్ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సభలో విమలక్క సామ్రాజ్యవాదుల కోసమే ప్రభుత్వం వనరులను తలిస్తున్నదని టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. తరువాతి రోజు పోలీసులు రంగంలోకి దిగి నిజామాబాద్ జిల్లా బీడీ వర్కర్స్ యూనియన్ నేతలైన వెంకటలక్ష్మీ, అనసూయ, లింగయ్యలను అరెస్టు చేశారు. అలాగే మార్చ్ 26న విమలక్క, అమర్, జనశక్తి మాజీ నేత కూర రాజన్నలతో పాటు 17 మందిపై మారణాయుధాలు కలిగి ఉన్నారని కుట్ర కేసు నమోదు చేశారు.

పోలీసుల మృతి

నల్గొండ జిల్లా సూర్యాపేటలో ఏప్రిల్ 2న బస్టాండ్‌లో సోదా చేస్తున్న పోలీసులపై ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరపడంతో ఇద్దరు పోలీసులు అక్కడికక్కడే చనిపోగా, ఒక పోలీసు ఆసుపత్రికి తీసుకుపోతున్న మార్గం మధ్యలో చనిపోయాడు. అలాగే ఏప్రిల్ 4న నల్గొండ జిల్లా మోత్కూర్ మండలం, జానకీపురంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక ఎస్ఐ, ఒక కానిస్టేబుల్, ఇద్దరు సిమీ సభ్యులు మృతి చెందారు.

రైతాంగ నాయకుడు సిద్దప్ప మృతి

తొలితరం విప్లవోద్యమ నేత కొండపల్లి సీతారామయ్య అనుచరులు పసల సిద్దప్ప అలియాస్ శంకరన్న (75) అనారోగ్యంతో బాధపడుతూ ఏప్రిల్ 5న చనిపోయారు. ఆయనది చిత్తూరు జిల్లా, తంబళ్లపల్లె మండలం, చేలూరువారి పల్లె. ఆయన రెండు దశాబ్దాల పాటు రాయలసీమ రైతాంగ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు.

కూలీల కాల్చివేత

చిత్తూరు జిల్లా, చంద్రగిరి మండలం, శ్రీవారి మెట్టు ప్రాంతానికి దగ్గరగా ఉన్న చచ్చినోడిబండ, చీకటీగలకోన అనే ప్రాంతాలలో ఏప్రిల్ 7న ఆంధ్రప్రదేశ్ పోలీసులు 20 మంది ఎర్రచందనం కూలీలను కాల్చి చంపారు. చనిపోయిన మృతులు తమిళనాడుకు చెందినవారు.

ఖైదీల కాల్చివేత

వరంగల్ జిల్లా, కేంద్రకారాగారం నుంచి హైదరాబాద్‌లోని ఏడో మెట్రోపాలిటన్ కోర్టుకు ఏప్రిల్ 7న ఐదు మంది ఖైదీలను తీసుకొస్తుండగా నల్గొండ జిల్లా ఆలేరుకు సమీపంలో వికారుద్దీన్‌తో పాటు అతని అనురులు సయ్యద్ అంజాద్, మహ్మద్ అనీఫ్, మహ్మద్ జకీర్, ఇజార్‌ఖాన్‌లను పోలీసులు కాల్చిచంపారు.

రామలింగరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష

సత్యం కంప్యూటర్స్ కుంభకోణం కేసులో ఆ సంస్థ ఛైర్మన్ బి. రామలింగరాజును ప్రధాన నిందితునిగా పేర్కొంటూ నాంపల్లి సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం జడ్జి బివిఎల్ఎస్ చక్రవర్తి ఏప్రిల్ 9న ఏడేళ్ల జైలు శిక్ష, రు. 5.74 కోట్లు జరిమానా విధించారు. అలాగే ఆయన సోదరుడికి రు. 5.74 కోట్లు జరిమానా విధించింది. ఈ కేసులో కోర్టు మొత్తం రు. 13.87 కోట్ల జరిమానా విధించింది. వీరిద్దరితో పాటు 10 మందికి జైలు శిక్ష విధించింది.

నర్రా రాఘవరెడ్డి మృతి

కమ్యూనిస్టు ఉద్యమకారులు, సిపిఎం సీనియర్ నాయకులు నర్రా రాఘవరెడ్డి (91) ఏప్రిల్ 9న మరణించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తిలో జన్మించిన రాఘవరెడ్డి ఆరవై ఏళ్లకు పైగా పోరాట యోధుడిగా, ముప్పై ఐదేళ్లు ప్రజా ప్రతినిధిగా ఉన్నారు. 1950లో ప్రజా నాట్యమండలి కళాకారుడిగా కమ్యూనిస్టు రాజకీయాలకు పరిచయం అయ్యారు. 1967లో నకిరేకల్ స్థానం నుంచి రాఘవరెడ్డి నెగ్గారు. ఎమర్జెన్సీ కాలంలో అరెస్టు అయి 1977లో విడుదలయ్యారు. అప్పటి నుంచి 1999 వరకూ శాసనసభ్యునిగా గెలుపొందుతూ వచ్చారు. అనారోగ్యం కారణాల వల్ల 1999లో స్వచ్ఛందంగా రాజకీయాల నుంచి విరమించుకున్నారు.

కానూరి వెంకటేశ్వరరావు మృతి

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకులు, న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు కానూరి వెంకటేశ్వరరావు (99) ఏప్రిల్ 10న అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మంలోని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయంలో చనిపోయారు. ఆయన కృష్ణా జిల్లా, గుడివాడ మండలం, కోడూరు గ్రామంలో 1916లో జన్మించారు. ఆయన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ద్వారా రచయితగా, కళాకారునిగా, దర్శకునిగా, ప్రదర్శకునిగా కృషి చేశారు. జార్జిరెడ్డి, శ్రీకాకుళం పోరాటం, విప్లవ సింహం రామనర్సయ్య, నీలం రామచంద్రయ్య హరికథలు, డా. కోట్నిస్, గురజాడ, ఝాన్సీలక్ష్మీ బాయి, భగత్‌సింగ్‌ల బుర్రకథలు రాశారు.

పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు

కర్నూలు జిల్లా, వేంపెంటలో నిర్మిస్తోన్న మూడు మినీ హైడల్ (జలవిద్యుత్) ప్లాంట్లకు వ్యతిరేకంగా మార్చ్ 10 నుంచి ఏప్రిల్ 10 వరకు వేంపెంట గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వేంపెంట చుట్టూ ఎస్ఆర్‌బిసి, ఎస్ఆర్ఎంసి, తెలుగు గంగ కాల్వలున్నాయి. వీటి లోతు 60-70 అడుగుల ఉంటుంది. వీటి నిర్మాణాల కోసం దాదాపు రైతులు 600 ఎకరాల పంట భూములను కోల్పోయారు. ఇప్పుడు పవర్ ప్లాంట్ల నిర్మాణం కోసం చేపట్టే కాల్వల లోతు 50 అడుగులు ఉంటుంది. ఈ నిర్మాణాల వల్ల నీటి నిల్వలు తగ్గిపోయి, వేంపెంట ఎడారిగా మారే ప్రమాదం ఉందని ప్రజలు దీక్షలు చేస్తున్నారు. ఈ దీక్షలో రైతులు, రైతు కూలీలు, మహిళలు, వికలాంగులు పాల్గొన్నారు.

పోర్టు విస్తరణకు వ్యతిరేకంగా పోరాటం

విశాఖపట్నంలో ఏప్రిల్ 10న విశాఖ పోర్టు విస్తరణపై జాయింట్ కలెక్టర్ జె. నివాస్, పోర్టు ఛైర్మన్ ఎం.టి. కృష్ణబాబు, కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ ఇ.ఇ.ఆర్. లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ స్థలానికి అనేక మంది ప్రజలు చేరి ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకించారు.

విమానాశ్రయానికి వ్యతిరేకంగా రాస్తారోకో

అంతర్జాతీయ స్థాయి గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణం పేరిట విజయనగరం జిల్లా, భోగాపురం మండలంలో పంట భూములను లాక్కోవడానికి వ్యతిరేకంగా విజయనగరం పట్టణం చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు ఏప్రిల్ 10న విజయనగరం జిల్లా భోగాపురంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు.

పాత్రికేయులు నాగరాజు మృతి

ప్రముఖ పాత్రికేయులు కొప్పుల నాగరాజు (33) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఏప్రిల్ 12న హైదరాబాద్‌లోని లాలాపేటలో చనిపోయారు. ఆయనది ఖమ్మం జిల్లా, భద్రాచలం మండలం, సారపాక గ్రామం. ఆయన హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వ విద్యాలయంలో ఎం.ఎ. హిస్టరీ చదివి, బెంగళూర్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జర్నలిజంలో జర్నలిస్టు డిప్లొమా పట్టా పొందారు. తెహల్కా డాట్‌కామ్ పత్రికలో క్రియేటివ్ రైటింగ్‌లో డిప్లొమా కోర్సు చేశారు. అలాగే ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఆంధ్రజ్యోతిలో జర్నలిస్టుగా పని చేశారు. వీ

సిపిఐ జాతీయ మహాసభలు

సిపిఐ 22వ జాతీయ మహాసభలు తమిళనాడులోని పుదుచ్చేరిలో మార్చ్ 25 నుంచి 29 వరకు జరిగాయి. ఈ సభల్లో జాతీయ కార్యదర్శిగా సురవరం సుధాకర్‌రెడ్డి మరోసారి ఎన్నికయ్యారు. తొమ్మిది మంది సభ్యులతో పార్టీ సెంట్రల్ సెక్రటేరియట్‌ను, 32 మంది సభ్యులతో జాతీయ కార్యవర్గాన్ని, 124 మంది జాతీయ కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో సెక్యులరిజంని, రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సాంస్కృతిక స్వేచ్ఛను కాపాడుకోవడానికి వామపక్షాలు ఏకం కావాలని అన్నారు.

మావోయిస్టులకు మరణశిక్ష

బీహార్‌లోని శివ్‌పూర్ జిల్లాలో ఐదేళ్ల క్రితం రామన్ గ్రామంలో ఐదుగురిని చంపిన కేసులో నలుగురు మావోయిస్టులకు అదనపు జిల్లా జడ్జ్ సంపూర్ణానంద్ తివారీ మార్చ్ 30న మరణశిక్ష విధించారు. 2011 మే 11న ముకేష్ రాయ్, అతని తండ్రి శియారామ్ రాయ్, శ్రీభగవాన్ రాయ్, మనోహర్ ఠాకూర్, విశ్వత్ ఠాకూర్‌లపై మావోయిస్టులుగా అనుమానిస్తున్న ఉగన్ రామ్ అట్మోనీ, హమీద్ అన్సారీ, సంతోష్ షా, భగీరత్ షాలు దాడిచేసి హతమార్చారని అన్నారు.

ఉగ్రవాద నిరోధక బిల్లుకు ఆమోదం

గుజరాత్ రాష్ట్ర అసెంబ్లీ 'ఉగ్రవాద, వ్యవస్థీకృత నేర నియంత్రణ' బిల్లుకు మార్చ్ 31న ఆమోదం తెలిపింది. ఈ బిల్లును గతంలో ఇద్దరు రాష్ట్రపతులు తిరస్కరించారు. ఈ బిల్లులో టెలిఫోన్ సంభాషణలను రహస్యంగా రికార్డు చేసి కోర్టులో సాక్ష్యంగా ప్రవేశపెట్టవచ్చు. ఎస్‌పి స్థాయి అధికారి ఎదుట నిందితుడు ఇచ్చిన వాంగ్మూలాన్ని కూడా సాక్ష్యాధారంగా న్యాయస్థానంలో సమర్పించవచ్చు. చార్జిషీటు దాఖలు చేయడానికి ముందు దర్యాప్తు చేయడానికి పోలీసులకు ఉన్న 90 రోజుల గడువును ఈ బిల్లు ద్వారా 180 రోజులకు పెంచారు. ఈ కాలంలో నిందితుడు వ్యక్తిగత బాండు మీద బెయిల్ పొందడానికి వీల్లేదు. సామాజిక కార్యకర్త మేధాపాట్కర్ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు.

రచయిత జయకాంతన్ మృతి

ప్రముఖ తమిళ రచయిత, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డి. జయకాంతన్ (81) చెన్నైలో ఏప్రిల్ 8న మరణించారు. ఆయన తమిళనాడులోని వడతారులో 1934లో జన్మించారు. జయకాంతన్ 40 నవలలు, రెండు వందలకు పైగా కథలు రాశారు. సాహితీ రంగంలో ఆయన చేసిన కృషికి సాహిత్య అకాడమీ అవార్డ్ (1972), సోవియెట్ లాండ్ నెహ్రూ పురస్కారం (1978), రాజరామన్ అవార్డ్ (1986), తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం (1986), జ్ఞానపీఠ అవార్డ్ (2002), పద్మభూషణ్ పురస్కారం (2009)లో అందుకున్నారు. ఆయన రచించిన 'ఒరునడిగై వాడకం పార్కిరాళ్' నవల 'కళాణి' పేరుతో ఆంధ్రజ్యోతిలో సీరియల్‌గా ప్రచురితమైంది.

ఛత్తీస్‌గడ్‌లో ఎన్‌కౌంటర్లు

పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఛత్తీస్‌గడ్‌లోని సుక్మా జిల్లా అడవుల్లో ఏప్రిల్ 11న జరిగిన కాల్పుల్లో ఏడుగురు పోలీసులు మరణించగా, పన్నెండు మంది గాయపడ్డారు. సుకుమా జిల్లా చింతగుప్ప పరిధిలోని అటవీ ప్రాంతానికి మావోయిస్టుల గాలింపు కోసం వెళ్లిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగిందని అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ ఆర్‌కె విచ్ తెలిపారు. ఏప్రిల్ 12న కాంకేర్ జిల్లా భర్భాపూర్ ప్రాంతంలో ఐరన్ ఓర్ తవ్వకాలు సాగిస్తున్న నెకో జైస్వాల్ కంపెనీకి చెందిన పద్దెనిమిది వాహనాలకు మావోయిస్టులు నిప్పు పెట్టారు.

ఎన్‌కౌంటర్‌పై ఎన్‌హెచ్‌ఆర్‌సి విచారణ

శేషాచలం ఎన్‌కౌంటర్‌పై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌ఎచ్‌ఆర్‌సి) విచారణ చేపట్టింది. పీపుల్స్‌వాచ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇద్దరు సాక్షులు ఏప్రిల్ 13న న్యూఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్‌సి వద్ద విచారణకు హాజరయ్యారు. ఎన్‌హెచ్‌ఆర్‌సి చైర్మన్ జస్టిస్ బాలక్రిష్ణన్ ఆధ్వర్యంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం వారిద్దరి నుంచి వాగ్మూలం నమోదు చేసింది. ఎన్‌కౌంటర్ సాక్షులకు ఆ ప్రాంత పరిధిలోని గ్రామ సర్పంచ్‌లు రక్షణ కల్పించాలని జాతీయ మానవ హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. సిఆర్‌పిసి 176 ప్రకారం ఎన్‌కౌంటర్‌పై జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌తో విచారణ జరిపించాలని కోరింది. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులు, అటవీ అధికారుల పేర్లను వెల్లడించాలంది.

కొలీజియంకు స్వస్తి

ఉన్నత న్యాయవ్యవస్థలో న్యాయమూర్తులను నియమించే కొలీజియంను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసింది. దాని స్థానంలో నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్ కమిషన్ యాక్ట్ (ఎన్‌జెఎసి) ని అమల్లోకి తెచ్చింది. ఈ మేరకు ఏప్రిల్ 13న నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్‌జెఎసి చట్టాన్ని వ్యతిరేకిస్తూ వచ్చిన పిర్యాదులు ఏప్రిల్ 14న సుప్రీంకోర్టు ధర్మాసనం ముందు విచారణకు రానున్న సమయంలో దానికి రెండు రోజుల ముందే నోటిఫికేషన్ జారీచేయడం వివాదస్పదంగా మారింది. కొలీజియం స్థానంలో వచ్చిన ఎన్‌జెఎసి ప్రకారం న్యాయమూర్తుల బదిలీ, పదోన్నతులను ప్రధానమంత్రి, భారత ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభ ప్రతిపక్ష నేత కలిసి నిర్ణయిస్తారు. కొలీజియం రద్దును న్యాయమూర్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

ద్రావిడర్ కళగం ఆధ్వర్యంలో తాళి తీసివేత

తాళి బానిసత్వానికి చిహ్నమనీ, దాన్ని తొలగించాలనీ తమిళనాడులో హేతువాద సంస్థ ద్రావిడర్ కళగం (డికె) పార్టీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న 'స్వచ్ఛంద తాళితీత' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో 25 మంది మహిళలు స్వచ్ఛందంగా పాల్గొని తమ మెడలోని మంగళసూత్రాలను తీసివేశారు. తాళి తీసివేశాక తనకు ఎంతో ఉపశమనం కలిగినట్లుగా ఉన్నదని, ఇన్నాళ్లుగా దీనిని బానిసత్వానికి చిహ్నంగా చూశానని ఈ సందర్భంగా ఒక మహిళ అన్నారు. అప్పుడే ఈ కార్యక్రమాన్ని నిలిపివేయాల్సిందిగా మద్రాస్ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఆదేశాలను జారీచేసింది. దీంతో కార్యక్రమం నిలిచిపోయినా తమ పోరాటం మాత్రం కొనసాగుతుందని డికె అధ్యక్షుడు వీరమణి ప్రకటించారు. తమిళనాడులోని హిందు మున్నని, హిందు మక్కల్‌నట్చి, హిందు పరిషత్ వంటి సంస్థలు ఈ కార్యక్రమాన్ని వ్యతిరేకించాయి.

సిపిఎం అఖిల భారత మహాసభలు

సిపిఎం 21వ అఖిల భారత మహాసభలు విశాఖపట్నం తీరంలో ఏప్రిల్ 14 నుంచి 19 వరకు జరిగాయి. ఈ సభలకు దేశవ్యాప్తంగా ఉన్న సిపిఎం కార్యకర్తలు, నాయకులు వేలాది మంది హాజరయ్యారు. సిపిఎం ప్రధాన కార్యదర్శిగా సీతారాం ఏచూరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పదహారు మంది పొలిట్‌బ్యూరో సభ్యులు, 91 మందిని కేంద్ర కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ వామపక్ష పార్టీల ఐక్యత ప్రధానమని, వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణమే తమ లక్ష్యమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు, హిందుత్వ శక్తుల మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు తమతో కలిసి రావాలని ప్రజాతంత్ర శక్తులకు పిలుపునిచ్చారు. వీ

యెమెన్‌లో కొనసాగుతున్న దాడులు

యెమెన్‌లో సౌదీ అరేబియా సంకీర్ణసేనలు, తిరుగుబాటు హుతి దళాలకు మధ్య తీవ్ర పోరు నడుస్తోంది. గత నెల రోజులుగా నడుస్తున్న ఈ పోరులో తీవ్ర ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగింది. ఇరువర్గాల దాడుల్లో వేలాదిగా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. మార్చి 27న సనా నగరంలోని మసీదులపై జరిగిన ఆత్మాహుతి దాడులలో దాదాపు 150 మంది మరణించారు. అధ్యక్షుడు అబిద్ రబ్ మన్సూర్ హదీ దేశంవిడిచి సౌదీ అరేబియా పారిపోయారు. రాజధాని ఏడెన్‌లోని అధ్యక్ష భవనాన్ని హుతి తిరుగుబాటు దారులు స్వాధీనం చేసుకున్నారు. సౌదీ సంకీర్ణ సేనలు వైమానిక దాడులు జరుపుతున్నాయి. ఈ దాడుల్లో సుమారు ఐదు వందల మందికి పైగా హుతి తిరుగుబాటుదారులు మరణించారు. ఈ దాడుల్లో తొమ్మిది దేశాలకు చెందిన దాదాపు 1200 యుద్ధ విమానాలు పాల్గొన్నాయని అధికారులు తెలిపారు.

కెన్యాలో విశ్వవిద్యాలయంపై దాడి

కెన్యాలోని గరిస్సా నగరంలో ఏప్రిల్ 2న జరిగిన ఉగ్రవాద దాడిలో దాదాపు 148 మంది విద్యార్థులు మరణించారు. వందలాది మంది విద్యార్థులు గాయపడ్డారు. విశ్వవిద్యాలయంలోకి ఉగ్రవాదులు చొరబడి విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో భారీ ప్రాణ నష్టం జరిగింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు దేశ భద్రతా దళాలు తీవ్రంగా పోరాటం చేశాయి. ఈ క్రమంలో తీవ్రవాదులు, భద్రతా దళాల మధ్య భీకర పోరు జరిగింది. ఈ పోరులో దాడికి పాల్పడ్డ నలుగురు సాయుధులు మరణించారు. సొమాలియాలోని తిరుగుబాటుదారులపై కెన్యా రక్షణ దళాలు జరిపిన దాడులకు వ్యతిరేకంగా ఈ దాడులు జరిపామని అల్ షబాబ్ తిరుగుబాటుదారులు ప్రకటన చేశారు.

కార్టూనిస్టుపై దేశద్రోహం కేసు

మలేషియాకు చెందిన ప్రముఖ రాజకీయ కార్టూనిస్టు జుల్ఫీకర్ అన్వర్ ఉల్-హక్‌పై మలేషియా ప్రభుత్వం తొమ్మిది రకాలతో కూడిన దేశద్రోహ ఆరోపణ మోపింది. జుల్ఫీకర్ 'జూనార్' అనే కలం పేరుతో అధికారంలో ఉన్న నజీబ్ ప్రభుత్వంపై పలు విమర్శనాత్మక కార్టూన్లు వేశారు. ప్రభుత్వంలోని అవినీతి భాగోతాలు, విలాస జీవితాలు 'జూనార్' కార్టూన్లలోని ప్రధానాంశం. ప్రతిపక్ష నేత అన్వర్ అబ్రహంను అక్రమంగా జైలులో నిర్బంధించడంపై 'జూనార్' కార్టూన్ వేశారు. నజీబ్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. దీంతో మలేషియా ప్రభుత్వం అతను గీసిన కార్టూన్లను, పుస్తకాలను నిషేధించింది. ఏప్రిల్ 3న కోర్టుకు హాజరైన తొలి వాయిదాలోనే అతనిపై తొమ్మిది రకాల దేశద్రోహ ఆరోపణలు నమోదు చేసింది. అతని పౌరహక్కుల్ని హరించడానికే ప్రభుత్వం ఇలా చేస్తోందని ప్రతిపక్ష పార్టీలు, పౌరహక్కుల నాయకులు విమర్శించారు.

పనామా అమెరికన్ సదస్సు

క్యూబా-అమెరికా దేశాల మధ్య సరికొత్త సంబంధాలకు మార్గం వేయాలని 'పనామా అమెరికన్' సదస్సులో పాల్గొన్న క్యూబా అధ్యక్షుడు రావుల్ కాస్ట్రో, అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా సంయుక్త నిర్ణయాన్ని ప్రకటించారు. దాదాపు అర్ధశతాబ్ద సుదీర్ఘ కాలం తర్వాత ఇరు దేశాల అధ్యక్షులు ఇలా కలుసుకోవడం మొదటిసారి. ఏప్రిల్ 11న పనామాలో జరిగిన అమెరికన్ సదస్సులో ఇరు దేశాల అధినేతలు పరస్పరం చర్చించుకున్నారు. క్యూబా – అమెరికా దేశాల మధ్య సంబంధాలు మెరుగుపరచుకోవాలనే దిశలో చర్చలు సాగాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 15న తీవ్రవాద దేశాల జాబితా నుంచి క్యూబాను తొలగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని అమెరికా కాంగ్రెస్‌కు కూడా తెలియజేశారు. అంతర్జాతీయ తీవ్రవాద కార్యకలాపాలకు క్యూబాలోని కమ్యూనిస్టు ప్రభుత్వం ఎలాంటి మద్దతు ఇవ్వడం లేదనీ, భవిష్యత్తులో కూడా అలాంటి అవకాశం లేదనీ ఒబామాకు కాంగ్రెస్‌కు పంపిన సందేశంలో తెలిపారు.

అఫ్ఘనిస్తాన్‌లో దాడులు

అఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్ దళాలు ఆత్మాహుతి దాడులకు పాల్పడుతున్నాయి. ఏప్రిల్ 9న మజారీ-ఇ-షరీఫ్ పట్టణంలోని కోర్టు ఆవరణలో జరిపిన దాడిలో దాదాపు ఇరవై మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. తుపాకులతో, గ్రెనెడ్లు విసరడంతో కోర్టు ఆవరణ బీభత్సంగా మారిపోయింది. ఏప్రిల్ 10న వివిధ చోట్ల జరిగిన ఆత్మాహుతి బాంబు దాడులలో పదిహేను మంది చనిపోయారు. ప్రభుత్వ కార్యాలయాలు, విదేశీయులను లక్ష్యంగా చేసుకొని తాలిబాన్ ఈ దాడులకు పాల్పడుతోంది. జలాలాబాద్ నగరంలోని విమానాశ్రయానికి దగ్గర నాటో సైనిక వాహన శ్రేణిపై జరిగిన బాంబుదాడిలో ముగ్గురు పౌరులు మరణించారు. ఏప్రిల్ 18న జరిగిన మరో ఆత్మాహుతి బాంబు దాడిలో 37 మంది మరణించగా, వందలాది మంది గాయపడ్డారు. జలాలాబాద్‌లో ఓ బ్యాంక్ సమీపంలో ప్రభుత్వ ఉద్యోగులు జీతాలు తీసుకుంటున్న సమయంలో ఈ దాడి జరిగింది.

ఇరాక్‌లో బాంబు దాడులు

ఇరాక్ రాజధాని బాగ్దాద్ బాంబు దాడులతో దద్దరిల్లుతోంది. ఏప్రిల్ 14న జరిగిన ఈ దాడులలో ముప్పై మంది వరకు సాధారణ పౌరులు మృతి చెందారు. ఇరాక్, సిరియా దేశాల్లోని మూడొంతుల ప్రాంతం ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఆధీనంలో ఉంది. ఇరాక్‌లో రక్షణ దళాల స్థావరాల్ని లక్ష్యంగా చేసుకొని ఐఎస్ దళాలు దాడులు జరుపుతున్నాయి.

లిబియాలో పడవ ప్రమాదాలు

లిబియా నుంచి యూరప్‌కు వలస వెళ్తున్న ప్రజలతో పోతున్న పడవ ఏప్రిల్ 16న మధ్యధరా సముద్రంలో మునిగిపోయింది. దాదాపు నాలుగు వందలకు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మాతృదేశాల్లో జీవించేందుకు అవకాశాల్లేక వలసబాట పడుతున్నారు. పరిమితికి మించి పడవలో 550 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఓడ సముద్రంలో మునిగిపోయింది. ఏప్రిల్ 19న జరిగిన మరో పడవ ప్రమాదంలో ఎనిమిది వందలకు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. లిబియా నుంచి సముద్ర మార్గంలో యూరప్‌కు అక్రమంగా తరలిస్తున్న వీరి ఓడలో పరిమితికి మించి దాదాపు వెయ్యి మందికిపైగా ఉన్నారు. ఇటలీకి చెందిన లాంపెడుసా దీవికి 193 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిలో ఎక్కువగా మహిళలు, చిన్నపిల్లలు. ఉన్నారు.

జీ జిన్‌పింగ్ పాకిస్తాన్ పర్యటన

చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ పాకిస్తాన్‌లో రెండు రోజుల పర్యటన చేశారు. ఏప్రిల్ 20న ఆయన ఇస్లామాబాద్ వచ్చారు. ఈ పర్యటనలో చైనా – పాకిస్తాన్ మధ్య 46 బిలియన్ డాలర్ల ఆర్థిక రహదారి ఒప్పందం కుదిరింది. ఇరు దేశాల మధ్య ఎకనామిక్ కారిడార్ ఒప్పందానికి రంగం సిద్ధమైంది. ఈ కారిడార్ వల్ల పాకిస్తాన్‌కు చైనా ద్వారా పాశ్చాత్య దేశాలతో వాణిజ్య సంబంధాలను మెరుగు పరుచుకునేందుకు వీలవుతుంది.

నేపాల్‌లో భూకంపం

నేపాల్ చరిత్రలో అతి పెద్ద భూకంపం సంభవించింది. ఏప్రిల్ 24న వచ్చిన భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.9గా నమోదు అయింది. రాజధాని కాఠ్మాండుకు వాయువ్య దిశలో 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న లామ్‌జంగ్ కేంద్రంగా భూకంపం ఉంది. భూకంపం కేంద్రంలో 15 కిలోమీటర్ల దిగువన భూమి కంపించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం దాదాపు నాలుగు వేల మందికి పైగా మరణించారు. వేల సంఖ్యలో గాయపడ్డారు. కాఠ్మాండులోని ప్రసిద్ధ కట్టడాలు నేలమట్టమయ్యాయి. ఇళ్లూ, పాఠశాలలూ, వ్యాపార సముదాయాలూ కుప్పకూలిపోయాయి. ఇంకా ఎన్నో కూలడానికి ఉన్నాయి. అంతర్జాతీయ పర్యాటక స్థలంగా యూనెస్కో గుర్తించిన కాఠ్మాండులోని దర్బార్ స్క్వేర్ పూర్తిగా కుప్పకూలిపోయింది. అనేక ప్రాచీన ఆలయాలు నేలకూలాయి. ✦

అసహజ మరణాల సూచి

సంకలనం : వై.రామచంద్రం, ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(మార్చ్ 1 నుండి మార్చ్ 31, 2015 వరకు తెలంగాణలోని 7 జిల్లాలు (925), ఆంధ్రప్రదేశ్‌లోని 6 జిల్లాలలో (486) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1411)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు స్త్రీ	ఇతరాలు పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	1	-	-	18	17	6	4	5	2	2	1	1	-	-	27	29	-	-	-	3	2
మెదక్	4	6	15	19	9	19	11	-	15	19	14	9	1	9	26	4	-	-	-	4	2
కరీంనగర్	4	3	-	20	17	2	6	-	-	1	1	3	2	4	33	17	-	-	-	-	3
ఖమ్మం	-	-	-	14	15	6	6	1	1	1	-	-	2	4	23	11	-	-	-	-	2
మహబూబ్‌నగర్	-	6	-	11	22	16	7	1	4	6	12	15	15	11	58	5	-	-	-	-	-
రంగారెడ్డి	2	5	-	7	17	6	12	1	3	10	5	6	6	6	42	4	-	-	-	2	
నల్గొండ			వివరాలు అందలేదు																		
నిజామాబాద్	-	-	-	6	13	2	1	-	3	6	5	3	3	2	30	22	-	-	-	-	-
హైదరాబాద్			వివరాలు అందలేదు																		
తెలంగాణ	**11**	**20**	**15**	**95**	**110**	**57**	**47**	**8**	**28**	**45**	**38**	**37**	**29**	**36**	**239**	**92**	**-**	**-**	**-**	**9**	**9**
అనంతపురం	-	10	2	10	10	3	4	3	1	6	3	3	7	5	21	5	-	-	-	-	-
చిత్తూరు	-	-	-	3	6	7	9	-	-	-	1	5	8	-	28	11	-	-	-	-	4
కడప	-	1	-	7	12	-	-	1	-	-	2	5	1	6	30	4	-	-	-	-	2
కర్నూలు			వివరాలు అందలేదు																		
తూర్పు గోదావరి	-	-	-	3	6	1	7	1	-	2	4	2	1	1	33	12	-	-	-	-	-
ప్రకాశం			వివరాలు అందలేదు																		
శ్రీకాకుళం	-	-	1	3	6	4	8	-	2	3	2	2	3	1	32	6	-	-	-	-	-
విశాఖపట్నం	-	-	-	3	10	-	5	-	-	9	3	1	13	1	20	15	-	-	-	13	1
ఆంధ్రప్రదేశ్	**-**	**11**	**3**	**29**	**50**	**15**	**33**	**5**	**3**	**20**	**15**	**18**	**33**	**14**	**164**	**53**	**-**	**-**	**-**	**13**	**7**



శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి



MISSION KAKATIYA

మిషన్ కాకతీయ

తెలంగాణలో చిన్న నీటి పారుదల పునరుద్ధరణ



శ్రీ టి. హరీశ్ రావు
రాష్ట్ర నీటిపారుదల, మార్కెటింగ్ & శాసనసభ వ్యవహారాల శాఖామాత్యులు

మైనర్ ఇరిగేషన్ చెరువులను వాటి వాస్తవ సామర్థ్యానికి పునరుద్ధరించేందుకు మరియు గోదావరి మరియు కృష్ణా బేసిన్ల కింద చిన్న నీటి పారుదల రంగానికి కేటాయించిన 265 టీఎంసీల నీటిని ప్రభావపూరితంగా వినియోగించుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యమివ్వనుంది. చిన్న నీటి వనరుల పునరుద్ధరణ కార్యక్రమం కింద రానున్న 5 ఏళ్ళలో దశలవారీగా 46,531 మైనర్ ఇరిగేషన్, చిన్న చెరువులు, పెర్కొలేషన్ ట్యాంకులు, ప్రైవేటు కుంటలను పునరుద్ధరించనున్నాం.

చెరువుల పూడిక తొలగింపు, పూడిక వినియోగం, ఫీడర్ చానల్ పునరుద్ధరణ, కాలువలు, కట్టలకు మరమ్మతులు వంటివన్నీ కూడా ఈ పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా ఉంటాయి.



పునరుద్ధరణ యొక్క ప్రయోజనాలు

- నీటిని నిలిపి ఉంచుకునే సామర్థ్యంనేలకు పెరిగి తద్వారా సాగుకు అవసరమైన తడుల సంఖ్య తగ్గుతుంది.
- పూడికతీత అటు భూగర్భజలాల రీచార్జ్‌ను మెరుగుపర్చడమే గాకుండా పశువులకు తాగు నీటి సదుపాయాన్ని మెరుగుపరుస్తుంది.
- పూడికతీత నీటిలో ఫ్లోరైడ్ పరిమాణాన్ని గణనీయంగా తగ్గిస్తుంది.
- ఈ పూడికను పోషకం / ఎరువుగా వినియోగించవచ్చు.
- మిరప, పత్తి వంటి పంటల దిగుబడి 20-30 శాతం దాకా పెరుగుతుంది.

తెలంగాణ. సుస్థిర సౌభాగ్యానికి బాట.

జారీ చేసినవారు: సమాచార, పౌర సంబంధాల శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

R.O. No. 4/SOU/Advt./2015-16/95

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 166 - May 2015 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/4/2014 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2014-16


Date of Posting : 29th, 30th

‘వీక్షణం’ను ఆదుకుందాం
‘వీక్షణం’ నాలుగు కాలాల పాటు నిలిచేందుకు చేయూతనిద్దాం

తెలుగులో ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ వంటి పత్రిక ఉండాలనే ఆలోచనతో, సీనియర్ పాత్రికేయులు వి. హనుమంతరావు సంపాదకులుగా 2003లో ప్రారంభమై, 2005 నుంచి ఎన్. వేణుగోపాల్ సంపాదకత్వంలో నడుస్తున్న రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక ‘వీక్షణం’ తెలుగు సమాజానికి అవసరమైన చర్చావేదికగా పనిచేస్తున్నదని, మనందరితో పాటు ఎందరో పాఠకుల ఆదరాభిమానాలు చూరగొన్నదని మనకు తెలుసు. పన్నెండు సంవత్సరాలుగా నిరంతరాయంగా నడుస్తున్న ఈ పత్రిక ఆర్థిక పరిస్థితి ఇప్పటికీ దినదిన గండంగానే ఉంటున్నది. ఎప్పుడు ఆగిపోతుందో తెలియదని దాదాపు ప్రతినెలా పత్రికలో అచ్చవుతున్న ఆందోళనాకరమైన ప్రకటన, ఈ పత్రికను నిలబెట్టడానికి తోడ్పడమనే అభ్యర్థనలు మా ఈ బహిరంగ ప్రకటనకు కారణం. ఇంతకాలంగా నిర్వాహకులు కష్టనష్టాలు భరిస్తూ సాగించిన కృషికి ఇప్పుడు మన సహకారం అవసరమని చెప్పడానికే ఈ ప్రకటన.

‘వీక్షణం’ ఈ పన్నెండు సంవత్సరాలలో మూడువేలకు పైగా వ్యాసాలను ప్రచురించి ప్రాంతీయ, దేశీయ, అంతర్జాతీయ అంశాలెన్నిటి పైననో తెలుగు సమాజానికి అత్యవసరమైన సమాచారాన్నీ, వివరణలనూ, విశ్లేషణలనూ అందించింది. సంపాదకుడి అభిప్రాయాలే వైనప్పటికీ, తెలుగు సమాజంలో ఉన్న ప్రగతిశీల భావాలకూ, ధోరణులకూ అన్నిటికీ ప్రజాస్వామిక స్ఫూర్తితో వేదిక కల్పించింది. ప్రతిష్ఠాత్మకమైన ఐఎస్ఎస్ఎన్ గుర్తింపు సంపాదించి పరిశోధక విద్యార్థులకు, విశ్వవిద్యాలయ అధ్యాపకులకు అవకాశాలు కల్పించింది. ప్రతి సంవత్సరం రచయితల సమావేశాలు, సంభాషణలు ఏర్పాటు చేసి తెలుగు సమాజంలో సామాజిక శాస్త్ర రచనను ప్రోత్సహించింది. వ్యాసరచనా అధ్యయన తరగతులు నిర్వహించి వ్యాసప్రక్రియ ప్రమాణాలు పెంచడానికి తన వంతు కృషి చేసింది. పత్రికలో లబ్ధప్రతిష్ఠుల రచనలు ప్రచురించడంతో పాటు, విషయమే ప్రధానంగా ఐదారు వందలమంది కొత్త వ్యాసకర్తలకు అవకాశం కల్పించింది. ‘ఒక దళారీ పశ్చాత్తాపం’ వంటి విస్తృత ప్రచారం పొందిన పుస్తకంతో సహా దాదాపు డజను పుస్తకాలు ప్రచురించింది.

తెలుగు సమాజానికీ, మేధో ప్రపంచానికీ, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణకూ ఇంత దోహదం చేసిన ‘వీక్షణం’ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు, ఆ దీపం కొడిగట్టిపోకుండా కాపాడడం సమాజం బాధ్యత. ఇతోధిక పాఠకులను తయారు చేయడం, విరివిగా చందాలు చేర్పించడం, వ్యాపార ప్రకటనలు సేకరించిపెట్టడం, విరాళాలు అందించడం మన కనీస కర్తవ్యం. ‘వీక్షణం’ శ్రేయోభిలాషి, చరిత్రకారులు వకుళాభరణం రామకృష్ణ ‘వీక్షణం’ రచయితల సమావేశాల్లో సూచించినట్టుగా ఆర్థిక ఇబ్బందుల నుంచి సుస్థిరమైన పద్ధతిలో గట్టెక్కాలంటే ‘వీక్షణం’కు ఒక మూలనిధి కూడ ఏర్పాటు చేయవలసి ఉంది. మనంతట మనం మన శక్తి మేరకు గాని, విరాళాలు ఇవ్వగలిగిన మిత్రుల ద్వారా గాని ఈ మూలనిధి విరాళాలు సేకరించి మనందరికీ, మొత్తంగా సమాజానికీ అవసరమైన ‘వీక్షణం’ రాజకీయార్థిక, సామాజిక మాసపత్రికను కాపాడుకుందాం. ఈ చైతన్యజ్వాల ఆరిపోకుండా మన రెండు చేతులూ అడ్డుపెట్టి వెలుగు నిరంతరం ప్రసరించనిద్దాం.



Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao